సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 21
శనివారం 13-4-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'


లక్నో జోరుకు బ్రేక్
ఢిల్లీకి రెండో విజయం. మెరిసిన కుల్దీప్, ఫ్రేజర్ - 15లో


రికార్డుల ర్యాలీకి బ్రేక్..
75 వేల దిగువకు సెన్సెక్స్.. నిఫ్టీకి నష్టం 234 పాయింట్లు - 15లో


జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా
జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని, శాసనసభ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. - వివరాలు 6లో


రాష్ట్రపతి పాలనకు కుట్ర: ఆప్
కేంద్రం త్వరలో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించేందుకు కుట్ర పన్నిందని ఆప్ నేత, ఢిల్లీ రాష్ట్ర మహిళా మంత్రి అతిశీ ఆరోపించారు. - వివరాలు 6లో


పోలీసులకు అర్చకుల డ్రెస్..
కాశీ విశ్వనాథ ఆలయంలో విధులు నిర్వర్తించే పోలీసులు దోతీ కుర్తా, మహిళా పోలీసులు సల్వార్ కుర్తాలో కనిపించారు. - వివరాలు 6లో


ఇజ్రాయెల్‌పై దాడికి సిద్ధమైన ఇరాన్!
ఇరాన్ వచ్చే 48 గంటల్లో ఇజ్రాయెల్‌పై దాడికి తెగబడే ప్రమాదం పొంచి ఉంది. ప్రతిదాడికి ఇజ్రాయెల్ సైతం రెడీ అయింది! - వివరాలు 6లో



జాతీయం..


యూపీ.. హస్తినకు గేట్ వే



➤ రాజకీయంగానే కాక జనాభాపరంగా, భౌగోళికంగానూ దేశంలో యూపీది ఎప్పుడూ కీలకపాత్రే. దేశ రాజకీయాలకు గుండెకాయ వంటి యూపీలో సత్తా చాటేందుకు పార్టీలన్నీ అస్త్రాలను రెడీ చేసుకుంటున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల ముంగిట ఇక్కడి రాజకీయ ముఖచిత్రం కూడా కొత్త మలుపులు తిరుగుతోంది. - 7లో

తెలంగాణ

ట్రి'బుల్' ఫైట్..



- తెలంగాణలో ఎక్కువ లోక్‌సభ సీట్లు గెలుచుకోవడంపై ప్రధాన పార్టీల దృష్టి.. - 5లో

ఆంధ్రప్రదేశ్

విప్లవ సారథీ.. విజయీభవ

- జననేత జగన్‌కు జనం దీవెన..
- సుపరిపాలనతో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఏపీ సీఎం వైఎస్ జగన్ - 8లో

ప్రైవేట్ కాలేజీల్లో 50 శాతం పెరిగిన ఇంటర్ ఫీజులు

'ఇంటర్' ద డ్రాగన్..

అడ్డగోలుగా ఫీజులు పెంచేసిన కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీలు

- రూ. 1.25 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వార్షిక ఫీజులు
- హాస్టల్ ఫీజూ కలిపి రూ.3.25 లక్షల దాకా డిమాండ్
- గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏడాదికి రూ. 90 వేలకుపైనే అడుగుతున్న తీరు
- నిర్వహణ ఖర్చులు, ఫ్యాకల్టీ వేతనాలు పెరిగాయనే వాదన
- సుమారు 4 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం
- అంత ఫీజులు ఎలా కట్టగలమని వాపోతున్న తల్లిదండ్రులు
- రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఫీజులు నియంత్రించాలని డిమాండ్
- ప్రస్తుత పరిస్థితుల్లో తామేమీ చేయలేమంటున్న ఇంటర్ బోర్డు
- సర్కారు స్పందించకుంటే ఆందోళన చేస్తామంటున్న విద్యార్థి సంఘాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటర్ ఫీజుల మోత మోగుతోంది. ప్రైవేటు కాలేజీలు అడ్డగోలుగా ఫీజులు పెంచేశాయి. గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 40-50% అదనంగా డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవలే టెన్త్ పరీక్షలు మొదలైన నేపథ్యంలో.. చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటర్మీడియట్‌లో చేర్చేందుకు కాలేజీల్లో ఆరా తీస్తున్నారు. ఇదే అదనుగా కాలేజీల యాజమాన్యాలు ఫీజు దోపిడీకి తెరతీశాయి. నిర్వహణ ఖర్చు, బోధన వ్యయం పెరిగిందని చెప్పుకొస్తున్నాయి. కాలేజీలు చెప్తున్న ఫీజుల మొత్తాన్ని చూసి.. తల్లిదండ్రులు హతాశులవుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని.. ఫీజుల నియంత్రణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కాలేజీల అడ్డగోలు ఫీజు వ్యవహారంపై ఇంటర్ బోర్డు అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు. ఫీజుల కట్టడిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదేశిస్తే తప్ప ప్రస్తుతం తామేమీ చేయలేమని అంటున్నారు.

4 లక్షల మంది విద్యార్థులపై భారం

రాష్ట్రంలో ఏటా 4 లక్షల మంది వరకు విద్యార్థులు టెన్త్ పాసవుతున్నారు. గత ఏడాది గణాంకాలను చూస్తే ఇంటర్ ఫస్టియర్‌లో 3,27,202 మంది చేరారు. రాష్ట్రంలో మొత్తం 3,339 ఇంటర్ జూనియర్ కాలేజీలు ఉండగా.. అందులో ప్రైవేటువి 1,441 ఉన్నాయి. వాటిలో 2,02,903 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోనూ 2 లక్షల మందికిపైగా ప్రైవేటు కాలేజీల్లోనే ఉంటారు. వారంతా కాలేజీల యాజమాన్యాలు చెప్పినంత ఫీజులు కట్టాల్సిన పరిస్థితి. వాస్తవానికి కరోనా మహమ్మారి ఎఫెక్ట్ తర్వాత కాలేజీలు ఏటా 10- 20% మేర ఫీజులు పెంచుతున్నాయి. ఈసారి గరిష్టంగా 50% వరకూ పెంచాయి. అన్ని ఖర్చులు పెరిగాయి కాబట్టి ఫీజులు పెంచుతున్నామని మిగతా 12వ పేజీలో ▶

రైతులను మోసగిస్తే లైసెన్సులు రద్దు..

- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- మిల్లర్లు, వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తే ఉపేక్షించేది లేదు
- మిల్లర్లకు కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి
- సీఎస్ సహా ఉన్నతాధికారులు కొనుగోళ్లు పర్యవేక్షించాలి
- తాగునీటికి ఎక్కడా ఇబ్బంది ఏర్పడకుండా చూడాలి
- సచివాలయంలో సీఎం సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రైతులను మోసం చేసే మిల్లర్లు, వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్‌లో రైతుల నుంచి ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రైతులను గోల్‌మాల్ చేసే మిల్లర్లకు కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర, తాగునీటి సరఫరాపై.. శుక్రవారం సచివాలయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటితో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు.

ధాన్యాన్ని ఆరబెట్టి మంచి ధర పొందాలి

కొన్ని ప్రాంతాల్లో తేమ ఎక్కువగా ఉందని చెప్పి వ్యాపారులు, మిల్లర్లు ధరలో కోత పెడుతున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని, అందువల్ల రైతులు ధాన్యాన్ని మార్కెట్లకు తెచ్చే ముందు ఆరబెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. నేరుగా కళ్లాల నుంచి ధాన్యాన్ని మార్కెట్లకు తరలిస్తే తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, ఒకట్రెండు రోజులు ధాన్యాన్ని ఆరబెట్టి మంచి ధరపొందాలన్నారు. ధాన్యం ఆరబెట్టేందుకు యార్డుల్లోనే ఏర్పాట్లు చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ధాన్యం దొంగతనం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కొనుగోళ్లను అధికారులు పర్యవేక్షించాలి

'అన్ని జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలోని మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలి. కనీస మద్దతు ధర అమలయ్యేలా చూడాలి. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో సీఎస్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఏరోజు కారోజు పర్యవేక్షించాలి. తాగునీటి సరఫరాపై ఉమ్మడి జిల్లాల వారీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారులు, ధాన్యం కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలి. అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలి. ఎన్నికల సమయం కావటంతో కొన్నిచోట్ల రాజకీయ లబ్ధి కోసం, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణకు 8.5 టీఎంసీలు

- వేసవి తాగునీటి అవసరాల కోసం కేటాయింపు
- కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం
- ఏపీకి 5.5 టీఎంసీలు కేటాయించిన కమిటీ
- తదుపరి అవసరాలపై మళ్లీ భేటీ



సాక్షి, హైదరాబాద్: వేసవి తాగునీటి అవసరాలకు తెలంగాణకు 8.5 టీఎంసీలు, ఏపీకి 5.5 టీఎంసీలు కేటాయిస్తూ కృష్ణా బోర్డు ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుంది. కేఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ డీఎం రాయపురే నేతృత్వంలో ఈ ముగ్గురు సభ్యుల కమిటీ శుక్రవారం జలసౌధలో ప్రత్యేకంగా సమావేశమైంది. తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డితో రాయపురే 2 గంటలకు పైగా చర్చించారు. తుదకు శ్రీశైలం రిజర్వాయర్‌లోని నీటి నిల్వలను వినియోగించుకోవద్దని నిర్ణయించారు. సాగర్ రిజర్వాయర్‌లోని నీటి నిల్వలపై చర్చించారు. సాగర్ ఎండీడీఎల్ 510 ఫీట్లు కాగా, గతంలో 505 ఫీట్ల వరకు అందుబాటులో ఉన్న నీటిని లెక్కగట్టి ఆ మేరకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. తాజా సమావేశంలో దీన్ని 500 అడుగులకు తగ్గించారు. సాగర్ ప్రస్తుత నీటిమట్టం 510.53 అడుగులు కాగా, 132.86 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. అందులో 500 అడుగుల ఎండీడీఎల్ మేరకు మొత్తం 17.55 టీఎంసీలు ప్రస్తుతం వినియోగానికి అందుబాటు లో ఉన్నాయి. అందులో 3.55 టీఎంసీలను భవిష్యత్ అవసరాలకు మినహాయించి మిగతా 14 టీఎంసీలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. తదుపరి అవసరాలపై మేలో సమావేశం కావాలని త్రిసభ్య కమిటీ నిర్ణయించింది.

రెండు రాష్ట్రాల విజ్ఞప్తితో..

మే మాసాంతం వరకు ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించిన అంశంపై కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ మిగతా 12వ పేజీలో ▶

బీఆర్ఎస్ వరంగల్ బరిలో సుధీర్‌కుమార్

- ఉద్యమ నేపథ్యం, పార్టీ పట్ల విధేయత మేరకు అవకాశం
- పార్టీ ముఖ్యనేతలతో చర్చ అనంతరం ఖరారు చేసిన కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్ పేరును పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. ప్రస్తుతం హనుమకొండ జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సుధీర్ కుమార్.. 2001 నుంచి తెలంగాణ ఉద్యమకారుడిగా, పార్టీ విధేయుడిగా ఉన్నారు. దీనికితోడు మాదిగ సామాజికవర్గానికి చెందిన నేతకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలన్న నిర్ణయం మేరకు సుధీర్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈ మేరకు కేసీఆర్ నిర్ణయాన్ని ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్టు వరంగల్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలు శుక్రవారం ప్రకటించారు. అభ్యర్థిని ఖరారు చేసిన నేపథ్యంలో పార్టీలో సమన్వయం, ప్రచారంపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

కీలక నేతలతో మంతనాలు: వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఐదుగురు మాజీ ఎమ్మెల్యేలు, మిగతా 5వ పేజీలో ▶

నేడు చేవెళ్లలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ



- లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలి సభ
- హాజరుకానున్న పార్టీ అధినేత కేసీఆర్
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి సబిత తదితరులు
- కేసీఆర్ తదుపరి సభలు, యాత్రలపై త్వరలోనే స్పష్టత - 5లో


శుక్రవారం సాయంత్రం తడిసి ముద్దయిన నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్

నేడు, రేపు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

- రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- సోమవారం నుంచి రాష్ట్రంలో పెరగనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు

- వివరాలు 16లో

ఆమే సూత్రధారి.. పాత్రధారి


- వివరాలు 16లో

- కవిత కస్టడీ పిటిషన్‌లో సీబీఐ ఆరోపణలు
- భూ కొనుగోలు డీల్ ద్వారా ఈ విషయం వెల్లడైంది
- లిక్కర్ స్కామ్‌లో ఆమె బెదిరింపులకు పాల్పడ్డారు
- ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలన్న దర్యాప్తు సంస్థ
- కవితను అన్యాయంగా అరెస్టు చేశారన్న ఆమె న్యాయవాది
- మూడు రోజులు కస్టడీకి అనుమతించిన న్యాయమూర్తి

ఎవరా పెద్ద సారు?

- వేణుమాధవ్ కిడ్నాప్ కేసులో కీలకంగా నిందితుడు కృష్ణారావు
- ఆయన ద్వారానే ఈ వ్యవహారం ఉన్నతాధికారి వద్దకు..
- మనీ లాండరింగ్, ఉగ్రవాదమంటూ బాధితుడికి బెదిరింపులు
- డీజీపీ కార్యాలయాన్ని ఆశ్రయించిన వేణుమాధవ్ స్నేహితుడు
- దీని వెనుక 'హయ్యర్ అప్' ఉన్నారని చెప్పిన రాధాకిషన్‌రావు



సాక్షి, హైదరాబాద్: పోలీసు విభాగంలో డీజీపీ కార్యాలయాన్ని మించిన ఉన్నత విభాగం (టాప్ ఆఫీస్) మరొకటి లేదు. ఆ కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలు ఎవరైనా పాటించాల్సిందే. కానీ గతంలో ఓ ఉన్నతాధికారి (హయ్యర్ అప్) ఇందుకు విరుద్ధంగా వ్యవహరించారా? అంటే.. క్రియ హెల్త్ కేర్ డైరెక్టర్ వేణుమాధవ్ చెన్నుపాటి కిడ్నాప్ కేసును పరిశీలిస్తే అవుననే సమాధానమే మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఇక్కడ మాత్రం ఎప్పుడూ తగ్గే ఉంటున్నారు!

పూత రాలి.. కాయ కుళ్లి

- ముందుగా మురిపించిన మామిడి
- ఆపై పూత, కాయలను దెబ్బ తీసిన 'తేనె మంచు పురుగు'.. మందులు పిచికారీ చేసినా చిక్కిన కాయ అంతంతే
- తగ్గిన దిగుబడి... గిట్టుబాటు కాని ధర


జగిత్యాలలో తేనెమంచు పురుగుతో నల్లగా మారిన చెట్లు

కొల్లాపూర్ /జగిత్యాల అగ్రికల్చర్

ఈ ఏడాది మామిడి పూత చూసి రైతులెంతో మురిసిపోయారు. కానీ వాతావరణంలో తలెత్తిన మార్పులు, తెగుళ్ల కారణంగా పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో రైతుల ఆశలు అడియాసలు కాగా, కౌలు రైతుల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది. దిగుబడి సగానికి సగం తగ్గిపోగా, మార్కెట్‌లో సరైన ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు.

వాతావరణ మార్పులు, తెగుళ్లు

డిసెంబర్‌లో చలి తీవ్రత, తేమ శాతం పెరగడం, అకాల వర్షం కారణంగా పూత పెద్దమొత్తంలో రాలిపోయింది. అదే నెలలో రెండో దశ పూతలు వచ్చాయి. వీటికి బూడిద తెగులు సోకి రాలిపోయాయి. అక్కడక్కడా పంటలో పూత నిలబడినా, గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండటంతో తేనె మంచు పురుగు ఆశించింది. ఈ పురుగులు గుంపులు, గుంపులుగా మామిడి పూత, పిందెపై చేరి, వాటి నుంచి రసాన్ని పీల్చాయి. దీంతో, పూత, పిందె రాలి మాడిపోయాయి. కొన్నిచోట్ల పూత, పిందెలపై నల్లని మసి ఏర్పడింది. ఈ పురుగు వల్ల దాదాపు 20 నుంచి 100 శాతం వరకు నష్టం ఏర్పడుతుంది. మరోవైపు మిగతా 2వ పేజీలో ▶

మోసాలు కావాలా? మంచి కొనసాగాలా?


ధూళిపాళ్ల: అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతూ..

- పాలకుడు మోసగాడు అయితే బతుకులు అంధకారం అవుతాయి
- మీరే నా స్టార్ క్యాంపైనర్లు.. ఏటుకూరు సిద్ధం సభలో సీఎం జగన్
- ప్రతి ఇంటికీ వెళ్లి మంచికి అండగా నిలబడమని కోరాలి
- చంద్రబాబుకు ఓటు వేయడమంటే.. మరోసారి మోసపోవడమే

12లో

క్లుప్తంగా...

15న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రైతు దీక్ష



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈనెల 15న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి రైతుదీక్ష చేయనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, వాగ్దానాలు, గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని చేపడుతున్న దీక్షలో ఆయనతో పాటు పార్టీ నేతలు పాల్గొననున్నారు. అధికారంలోకి వచ్చాక వందరోజుల్లో రైతులకిచ్చిన వాగ్దానాలు అమలుచేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక ఏడాదిలోగా అంటూ కాంగ్రెస్ సర్కార్ వాయిదావేయడాన్ని ఎండగట్టాలని పార్టీ భావిస్తోంది. ఈ దీక్షలో భాగంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతులు, కౌలురైతులకు ప్రయోజనాలు, ఇతర హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేయనున్నారు. రైతన్నల హామీలను నెరవేర్చాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీ పరంగా ఏదైనా కార్యాచరణ చేపట్టడం పైనా నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని పార్టీవర్గాల సమాచారం. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్న కారణంగా ఈ రైతుదీక్షను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా నిర్వహించనున్నట్లు తెలిసింది. ఇటీవలే రైతు సమస్యలపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌లో రైతుదీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేస్తున్న కిషన్‌రెడ్డి ఈనెల 19న నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరు కానున్నట్లు సమాచారం. ఈనెల 18న సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకోనున్న రాజ్‌నాథ్‌సింగ్ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సమావేశంలో పాల్గొననున్నారు.

దళారుల చేతుల్లోకి వ్యవసాయ మార్కెట్లు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్లు దళారుల చేతుల్లోకి వెళ్లాయి..రైతాంగాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు పట్టించుకోవడం లేదని' జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బోనస్ ఇస్తామంటూ ప్రభుత్వం మొహం చాటేసిందని, ధాన్యానికి కనీసం మద్దతు ధర కూడా దక్కని పరిస్థితుల్లో సీఎం, డిప్యూటీ సీఎం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మద్దతు ధర కూడా ఇవ్వడం లేదని..దీంతో రైతులు దళారులకు క్వింటాల్‌కు రూ.1500 చొప్పున ధాన్యం అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ జిల్లాలో 193 కొనుగోలు ఏర్పాటు చేసి కేవలం 440 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని పేర్కొన్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌కు 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా, రూ.1530 చొప్పున మాత్రమే ఇస్తున్నారన్నారు. వ్యాపారులు, దళారులు కుమ్మక్కై మద్దతు ధరతో పోలిస్తే రూ.700 తక్కువకు కొనుగోలు చేస్తున్నారని పల్లా విమర్శించారు.

దీపాదాస్ మున్షీతో మధుయాష్కీ, పొన్నం భేటీ

టీపీసీసీ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంపై చర్చ



సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీతో టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలతో పాటు ఇంకా మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు ప్రకటించాల్సిన అభ్యర్థుల ఎంపిక గురించి కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. టీపీసీసీ ప్రచార కమిటీ తరఫున రాష్ట్రంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, మేనిఫెస్టోపై కూడా చర్చించినట్లు తెలుస్తోంది.

జిల్లా, మండల, గ్రామాల వారీగా సామాజిక సమ్మేళనాలు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఓబీసీ మోర్చా తీర్మానం

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా సామాజిక సమ్మేళనాలు నిర్వహించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర విభాగం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఓబీసీ మోర్చాకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఈ సమ్మేళనాల్లో పాల్గొనాలని నిర్దేశించింది. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర బీసీ కులాల నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడికక్కడ కులసంఘాల నాయకులతో సమావేశమై వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని నిర్ణయించారు. మూడోసారి మోదీని ప్రధానిగా చేసేందుకు రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తీర్మానించారు.

పూత రాలి.. కాయ కుళ్లి



సాలూర మండలం మందర్నలో పూత రాలిపోవడంతో కాయలు లేని మామిడిచెట్లు

▶ మొదటి పేజీ తరువాయి

బంక తెగులు సోకి కాయలు నేలరాలాయి. తేనె మంచు పురుగు కట్టడికి రైతులు విపరీతంగా రసాయన మందులు పిచికారీ చేశారు. ఇప్పటికే ఒక్కో రైతు ఒక్క ఎకరానికి దాదాపు రూ.20వేల వరకు ఖర్చు చేశారు. రెండుమూడు నుంచి ఏడుసార్ల వరకూ మందులు పిచికారీ చేసిన రైతులు ఉన్నారు.

ధరలు సైతం నేలచూపులే

ఏటా సీజన్ ప్రారంభంలో మామిడి కాయల ధర టన్నుకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకు పలికేది. కానీ, ఈసారి ఫిబ్రవరి రెండో వారంలో టన్ను ధర రూ.1.20 లక్షల వరకు పలికింది. నెలాఖరులో టన్ను ధర రూ.80 వేలకు పడిపోయి.. ప్రస్తుతం రూ.50–60 వేల వరకు పలుకుతోంది. వ్యాపారుల సిండికేట్‌తోనూ ధరలు తగ్గాయి. కొల్లాపూర్, పెద్దకొత్తపల్లిలో హైదరాబాద్, ముంబైకి చెందిన వ్యాపారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి నెలాఖరులో రూ.60– 75 వేల వరకు టన్ను మామిడి కాయలను కొనుగోలు చేసి.. ఇప్పుడు తగ్గించేశారు. జగిత్యాల మామిడి మార్కెట్‌లో మొన్నటి వరకు కిలో రూ.65 వరకు ఉన్న బంగినపల్లి రకం ధర ప్రస్తుతం రూ.45–55 మధ్య పలుకుతోంది. దశేరి రకం కిలో రూ.75 వరకు పలకగా, ప్రస్తుతం రూ.50–65 మధ్య పలుకుతోంది. హిమాయత్ రకం కిలో రూ.130 వరకు పలకగా, ఇప్పుడు రూ.100గా కొనసాగుతోంది.

ఉమ్మడి మహబూబ్‌నగర్..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 57,344 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. వీటిలో 70% మేర తోటలు కాపు కాసేవి ఉన్నాయి. సాగు చేస్తున్న తోటల లెక్కల ప్రకారం ఈ ఏడాది 1,38, 848 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. అందులో 50% కూడా వచ్చే పరిస్థితి లేదు.

జగిత్యాల జిల్లా..

జగిత్యాల జిల్లాలో 40 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఇప్పటికే 70% మామిడి తోటల్లో పురుగు ఆశించి 100% పంటనష్టం జరిగింది. మామిడికాయ మార్కెట్‌కు వస్తోంది. దిగుబడి నాలుగైదు టన్నులకే పరిమితమైంది. పూతకు ముందే తోటలు లీజుకు తీసుకున్నవారు ప్రస్తుతం ఆ తోటలను చూసి తమ అడ్వాన్సులు తిరిగి ఇవ్వమంటూ రైతులను కోరుతున్నారు.

నిజామాబాద్ జిల్లా..

బోధన్‌రూరల్(బోధన్): నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని మందర్న, హున్స గ్రామాలు మామిడి తోటల సాగులో ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఇక్కడ 80 నుంచి 100 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. పూత రాలిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది.

రెండు సార్లు మందులు కొట్టాను



పూత ప్రారంభానికి ముందు, పూత వచ్చిన తర్వాత మందులు పిచికారీ చేశాను. ఎకరానికి రూ.30 వేల వరకు ఖర్చు చేశాను. అయినా పూత సరిగ్గా నిలువ లేదు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, వెంకట్రావుపేట, మేడిపల్లి

ఆదుకోవాలి..



నేను 40 ఎకరాల తోటలను రూ.42 లక్షలకు కౌలుకు తీసుకున్నా. సొంత తోటలు కూడా ఉన్నాయి. సాగు పనులకు రూ.15 లక్షలకు పైగా ఖర్చు చేశా. ఇప్పటి వరకు 20 టన్నుల కాయలు మాత్రమే అమ్మాను. సాగు, కౌలు కోసం ఖర్చు చేసిన డబ్బులు ఇంకా రాలేదు. రెండో విడత పూత కొంత మేరకు నిలబడింది. ఆ కాయలు వచ్చే నెలలో కోతకు వస్తాయి. వాటి మీదే ఆశలు పెట్టుకున్నా.

– పెద్దూరి లక్ష్మయ్య, మామిడి రైతు, కొల్లాపూర్

పూత నిలబడలేదు



వాతావరణంలో మార్పులు, తెగుళ్ల కారణంగా ఈసారి మామిడి దిగుబడి బాగా తగ్గింది. పంటనష్టం వివరాలు ఇంకా అంచనా వేయలేదు. పూతలు బాగానే వచ్చినా, తేనె మంచు పురుగు, నల్లి, బూడిద తెగుళ్ల కారణంగా పూత నిలవలేదు.

– లక్ష్మణ్, ఉద్యానశాఖ అధికారి, కొల్లాపూర్

కాండానికి మామిడి కాయలు



మహబూబాబాద్ రూరల్: సాధారణంగా మామిడి చెట్ల కొమ్మలకు కాయలు చూస్తుంటాం. అయితే.. మహబూబాబాద్ జిల్లా మల్యాల గ్రామంలోని మద్రి వేణు అనే రైతుకు చెందిన మామిడి తోటలో చెట్ల కాండానికి మామిడి కాయలు కాశాయి. తోటలో వంద మామిడి చెట్లు ఉండగా.. 25 చెట్ల కాండాలకు ఇలా కాయలు కాశాయి. ఒక్కో కాండానికి 30 వరకు కాయలు ఉన్నాయి. మూడేళ్లుగా ఇలా కాస్తున్నాయని, కొమ్మ కత్తిరింపులతో కాండాలకు మామిడి కాయలు కాస్తున్నాయని రైతు తెలిపారు.

14న కరీంనగర్‌లో దీక్ష చేస్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

- బీజేపీ, బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తాం
- 17 లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ దీక్షలు చేస్తాం



సాక్షి, హైదరాబాద్: గత పదేళ్లుగా బీఆర్‌ఎస్, బీజేపీ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ ఈనెల 14న కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో దీక్ష చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అదేవిధంగా రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాల పరిధిలో దీక్షలు చేస్తామని మంత్రి తెలిపారు. గాంధీభవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి కోట శ్రీనివాస్‌లతో కలిసి మంత్రి పొన్నం మాట్లాడారు. గత పదేళ్లలో తెలంగాణకు ఏమీ చేయకుండా విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ఏ మొహం పెట్టుకుని బీజేపీ నేతలు లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లడుగుతారని వారు ప్రశ్నించారు. దేశంలోని నవరత్నాల కంపెనీలను అమ్మేస్తున్న బీజేపీకి ఒక ఎజెండా లేదని, కేవలం రాముడుపేరిట అక్షింతలు, కుంకుమలను ప్రజలకిచ్చి ఓట్లడుగుతున్నారని మండిపడ్డారు. దళితులు, బీసీలు, మైనార్టీలకు బీజేపీ వ్యతిరేకమని చెప్పారు. తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమంలో యువత బలిదానాలను బీజేపీ అవహేళన చేసిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని రైతుల ఆత్మహత్యలకు బీజేపీనే కారణమని విమర్శించారు. కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి ఎవరన్నది ఏఐసీసీ నిర్ణయిస్తుందని వెల్లడించారు.

ఎవరా పెద్ద సారు?

▶ మొదటి పేజీ తరువాయి

లభిస్తోంది. అదే సమయంలో ఎవరా ఉన్నతాధికారి? అనే సందేహం కలుగుతోంది.

కృష్ణారావు ద్వారా హయ్యర్ అప్ వద్దకు..

హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో రిజిస్టర్ అయిన ఈ కేసులో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) పి.రాధాకిషన్‌రావు, ఇన్‌స్పెక్టర్లు బి.గట్టుమల్లు, ఎస్.మల్లికార్జున్ తదితరులు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కిడ్నాప్ కేసులో ఐదో నిందితుడిగా ఉన్న కృష్ణారావు అలియాస్ కృష్ణ పాత్ర కీలకమని తెలుస్తోంది. ఈయన గతంలో ఓ మీడియా చానల్‌లో కీలక స్థానంలో పని చేశారు. అప్పట్లోనే పలువురు పోలీసు ఉన్నతాధికారులతో పరిచయాలు ఏర్పడ్డాయి. అలాంటి వారిలో ఈ 'హయ్యర్ అప్'కూడా ఒకరని సమాచారం. వేణుమాధవ్‌ను కిడ్నాప్ చేసి, తీవ్ర స్థాయిలో బెదిరించి, పత్రాలపై సంతకాలు చేయించుకుని క్రియా హెల్త్ కేర్ సంస్థను చేజిక్కించుకోవాలని దాని పార్ట్‌టైమ్ డైరెక్టర్లు గోపాల్, రాజ్ తలసిల, నవీన్, రవి... గోల్డ్ ఫిష్ అబోడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ వేగేతో కలిసి కుట్ర పన్నారు. కృష్ణారావు అనేక మంది పోలీసు ఉన్నతాధికారులకు సన్నిహితుడని తెలిసిన చంద్రశేఖర్ ఆయన్ను సంప్రదించాడని, కృష్ణారావు ద్వారానే హయ్యర్ అప్ వరకు ఈ వ్యవహారం వెళ్లిందని సమాచారం. కాగా విషయం సెటిల్ చేయడానికి రూ.10 కోట్లకు డీల్ మాట్లాడుకున్న ఆ పెద్ద సారు.. పని పూర్తి చేసే బాధ్యతల్ని రాధాకిషన్‌రావు, గట్టు మల్లులకు అప్పగించినట్లు, దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

గట్టు మల్లుకు డీజీపీ కార్యాలయం ఫోన్

సిట్ సమాచారం మేరకు.. 2018 నవంబర్ 22న ఉదయం 5.30 గంటలకు అప్పట్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సైగా పని చేస్తున్న మల్లికార్జున్.. వేణుమాధవ్‌ను తన బృందంతో కిడ్నాప్ చేసి సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించాడు. అక్కడ రాధాకిషన్‌రావు ప్రోద్బలంతో అప్పటి వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గట్టు మల్లు తీవ్రస్థాయిలో వేణును బెదిరించాడు. అతి కష్టంమీద తన ఫోన్ దక్కించుకున్న వేణుమాధవ్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయం నుంచే తొలుత తన న్యాయవాది శ్రీనివాస్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఆయన కోర్టులో తేల్చుకుందాం అన్నారు. తర్వాత తన స్నేహితుడైన లహరి రిసార్ట్స్ యజమాని సంజయ్‌ను వేణు సంప్రదించారు. దీంతో డీజీపీ కార్యాలయానికి వెళ్లిన సంజయ్ అక్కడ నుంచి గట్టు మల్లుకు ఫోన్ చేయించారు. ఆ కాల్ అందుకున్న రాధాకిషన్ రావు మాటాడుతూ.. ఇది ఉన్నతాధికారే అప్పగించిన విషయని చెప్పడంతో డీజీపీ కార్యాలయం చేతులెత్తేసింది. దీంతో రాధాకిషన్‌రావు, గట్టు మల్లు, మల్లికార్జున్ తదితరులు వేణుమాధవ్‌తో పత్రాలపై సంతకాలు చేయించి క్రియా హెల్త్‌కేర్‌లో షేర్లు, ఆయన యాజమాన్యం మార్పించేశారు.

ఆ నలుగురి వాంగ్మూలాలు కీలకమే..

వేణును తీవ్రస్థాయిలో భయపెట్టడానికి ఉగ్రవాదం, మనీలాండరింగ్ కేసులు నమోదు చేస్తామంటూ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బెదిరించారు. ఇందుకు సంబంధించి రాధాకిషన్‌రావు సహా తొమ్మిది మందిపై కేసు నమోదైంది. వేణు మాధవ్ తన నలుగురు పార్ట్‌టైమ్ డైరెక్టర్ల వేధింపులపై 2018 అక్టోబర్ 3న జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదే నెల 12 నుంచి నలుగురి నుంచి వేణుకు వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. ఈ ఫిర్యాదును పోలీసులు పట్టించుకోకపోవడంతో అప్పటి బంజారాహిల్స్ ఏసీపీని కలిసి న్యాయం చేయమని కోరినా ఫలితం దక్కలేదు. ఈ ఫిర్యాదు విషయంలో పోలీసుల ఉదాసీన వైఖరికి కారణం తెలియాలంటే నాటి బంజారాహిల్స్ ఏసీపీని పిలిచి విచారించాల్సి ఉంది. ముఖ్యంగా డీజీపీ కార్యాలయం, హయ్యర్ అప్‌తో పాటు న్యాయవాది శ్రీనివాస్, లహరి రిసార్ట్స్ యజమాని సంజయ్‌ల నుంచీ వాంగ్మూలాలు సేకరించాలి. అయితే డీజీపీ కార్యాలయం, 'హయ్యర్ అప్' విషయంలో సిట్ అధికారులు ఏ విధంగా ముందుకు వెళ్తారన్నది వేచి చూడాల్సి ఉంది.

సిట్ అదుపులో ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్

రాధాకిషన్‌రావు ఇప్పటికే అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టై, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. దీంతో ఆయన్ను కిడ్నాప్ కేసులో పీటీ వారెంట్‌పై అరెస్టు చేసి, కోర్టు అనుమతితో పోలీసు కస్టడీలోకి తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీసులు, సిట్ అధికారులు నిర్ణయించారు. మరోపక్క ఇదే కేసులో నిందితుడిగా ఉన్న నాటి టాస్క్‌ఫోర్స్ ఎస్సై, ప్రస్తుతం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో (ఎస్ఐబీ) ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మల్లికార్జున్‌ను సిట్ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

కరువు వస్తే ఆదుకునే బాధ్యత కేంద్రానికి లేదా?

ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరువు పరిస్థితులున్నప్పుడు ఆదుకునే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, మొన్నటివరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌లు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నాయన్నారు. కరువులో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకునే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డికి లేదా? అని ప్రశ్నించారు. కరువు పరిస్థితులను అధిగమించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కేంద్రానికి నివేదిక పంపారని, ఈ నివేదిక ఆధారంగా కేంద్రం కరువు సాయం విషయంలో ఒక విధా నాన్ని తీసుకుందని గుర్తు చేశారు. రాజకీయాల కతీతంగా అన్ని పార్టీలు కేంద్రాన్ని నిలదీయాలని కోరారు.

రేవంత్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడాలి

మందకృష్ణ మాదిగ పిలుపు



పంజగుట్ట (హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్ పాలనలో ఎస్సీల అవకాశాలను మాలలకు, జనరల్ అవకాశాలను రెడ్డి సామాజిక వర్గానికి దోచిపెడుతున్నారని ఈ పాలనకు చమరగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కాంగ్రెస్‌పాలనపై ధ్వజమెత్తారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మోత్కుపల్లి నర్సింహులులాంటి సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ మాదిగలకు అన్యాయం జరుగుతుందని తాను ఊహించలేదన్నారు. ఈ నెల 16 లేదా 17వ తేదీ లోపు ఎస్సీ రిజర్వుడు మూడు స్థానాల్లో రెండు, కంటోన్మెంట్ స్థానం మాదిగలకు కేటాయించకపోతే 'గో బ్యాక్ కాంగ్రెస్' నినాదంతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీసీలు కూడా ఈ నినాదాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

గాంధీభవన్, తెలంగాణ భవన్ వద్ద మంత్రి పొన్నం దీక్ష చేయాలి

- రాష్ట్రంలో కాంగ్రెస్ మాట తప్పింది.. కేసీఆర్ పదేళ్లు ప్రజలను అరిగోస పెట్టిండు
- ప్రశ్నిస్తే నాపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు
- మంత్రి పొన్నం ప్రభాకర్ తీరుపై ఎంపీ బండి సంజయ్ ధ్వజం



కథలాపూర్ (వేములవాడ/వేములవాడ అర్బన్): వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసినందుకు గాంధీభవన్ వద్ద, కేసీఆర్ పదేళ్లు ప్రజలను అరిగోస పెట్టినందుకు మంత్రి పొన్నం తెలంగాణ భవన్ వద్ద దీక్ష చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ సవాల్ విసిరారు. శుక్రవారం కథలాపూర్ మండల కేంద్రంలో బండి సంజయ్ మాట్లాడారు. అంతకుముందు రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం సంకెపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం రైతులను కలిసి వారు పడుతున్న కష్టాలు తెలుసుకున్నారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు పనికిమాలిన మాటలు మానుకుని ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పొన్నం దీక్ష ఎందుకోసమో చెప్పాలి

పొన్నం దీక్ష చేసేది కరోనా సమయంలో ప్రధాని మోదీ ప్రజలందరికీ ఉచితంగా వ్యాక్సిన్ ఇచ్చినందుకా? లేక కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి రూ.12 వేల కోట్ల నిధులిచ్చినందుకా? లేదా కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేసినందుకా అని బండి సంజయ్ ప్రశ్నించారు. కరీంనగర్‌లో కాంగ్రెస్‌కు ఎంపీ అభ్యర్థి కరువయ్యారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తే తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు సత్యనారాయణరావు, ప్రతాప రామకృష్ణ, వేములవాడ నియోజకవర్గ బాధ్యులు చెన్నమనేని వికాశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్ మార్చితే.. నిధులు నేనే తెస్తా

- పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుపై బీజేపీ నేత డీకే అరుణ
- రేవంత్ సీఎంలా కాదు.. ఎంపీటీసీలా మాట్లాడుతున్నారని విమర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి. చిత్రంలో డీకే అరుణ తదితరులు

పాలమూరు: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు జూరాల నుంచి నీళ్లు తీసుకొచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి డీపీఆర్ మార్చితే.. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ప్రకటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాకు ఏం చేశాడో చెప్పాలని నిలదీశారు. రేవంత్‌రెడ్డి ఒక ముఖ్యమంత్రిగా కాకుండా ఎంపీటీసీగానే మాట్లాడుతున్నారని విమర్శించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకతతో కాంగ్రెస్ వైపు ఓటర్లు ఆసక్తి చూపారే తప్ప అది రేవంత్‌రెడ్డి గొప్పతనం ఏమాత్రం కాదన్నారు. ఆనాడు కేసీఆర్ కాంగ్రెస్ వాళ్లను కొనుగోలు చేస్తున్నాడని ఆరోపించిన రేవంత్ ఇప్పుడు ఇతర పార్టీల వారిని ఎందుకు చేర్చుకుంటున్నారో చెప్పాలన్నారు. సీఎం రేవంత్ ఇంకా జెడ్పీటీసీ స్థాయిలోనే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇద్దరు సీఎం అభ్యర్థులపై తాను విజయం సాధించానంటే బీజేపీ కార్యకర్తల వల్లేనని చెప్పారు.

సీఎం రేవంత్‌రెడ్డికి అభద్రతాభావం పెరిగింది

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడటంతో సీఎం రేవంత్‌రెడ్డికి అభద్రతాభావం పెరిగి మాటలు తడబడుతున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ అన్నారు. గ్రామాల్లోని వృద్ధులు కూడా ఈసారి ప్రధాని మోదీకే ఓటేస్తామని చెబుతుంటే కాంగ్రెస్‌పార్టీకి భయపట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు తనపై కుట్ర.. అంటూ రేవంత్ కొత్త నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నేతలు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఒప్పుకోవడం లేదన్నారు. ఈ ప్రభుత్వం కూలిపోవాలని తాము కోరుకోవడం లేదని చెప్పారు. శుక్రవారం పార్టీ కార్యా లయంలో లక్ష్మణ్ సమక్షంలో బీఆర్‌ఎస్ రాష్ట్రకార్యదర్శి వడ్ల నందు, వికారాబాద్ జిల్లా నుంచి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలుత వందరోజుల తమ పాలనను రెఫరెండం అని చెప్పిన కాంగ్రెస్ నేతలు మాట మార్చి రాహుల్ గాంధీ ప్రధాని అయితే అన్ని గ్యారంటీలు అమలవుతాయి అని చెబుతున్నారని విమర్శించారు. బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పట్టిస్తుండటంతో అక్కడ ఆ పార్టీ గెలిచే అవకాశం లేక అసదుద్దీన్‌ను గెలిపించేందుకు సిద్ధమైందన్నారు.

బీజేపీని అడ్డుకోడానికి 3 పార్టీల మధ్య చీకటి ఒప్పందం

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపును అడ్డుకోడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎంల మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో 10 కాంగ్రెస్, 1 ఎంఐఎం, 6 బీఆర్‌ఎస్ పంచుకున్నట్లు స్పష్టంగా కనపడుతోందన్నారు. అందుకే ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు ప్రచారంలో పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అయితే ఈ పార్టీలు ఎన్ని నాటకాలాడినా బీజేపీ గెలుపును అడ్డుకోలేవని ఆయన స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ టూర్, లిక్కర్ స్కాం, కాళేశ్వరం స్కాం, ఫోన్ ట్యాపింగ్ తరువాత తెలంగాణలో మార్పులు కనిపిస్తున్నాయన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతీయస్థాయిలో బీజేపీ గెలుపును ఆపలేమని తెలిపోవడంతో రకరకాల నాటకాలకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ అంశం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను కలిపి నడిపిస్తోందని అన్నారు. గతంలో బీఆర్‌ఎస్‌లో సీఎల్పీ విలీనమైతే, ఇప్పుడు కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ ఎల్పీ విలీనమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. పదేళ్ల వరకు రేవంత్‌రెడ్డే సీఎం అని కాంగ్రెస్ నేతలు ప్రకటించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తరచుగా ముఖ్యమంత్రులను మార్చడం ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ సంప్రదాయంగా కొనసాగుతున్న విషయాన్ని వారు మరిచినట్టు ఉన్నారని అన్నారు.

రైతుల్ని మోసగిస్తే లైసెన్స్ రద్దు

▶ మొదటి పేజీ తరువాయి

తప్పుడు ఫిర్యాదులు, ఉద్దేశ పూర్వక కథనాలు వస్తున్నాయి. అటువంటి వాటిపై వెంటనే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలి..'అని సీఎం సూచించారు.

వచ్చే రెండు నెలలు కీలకం

'రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాలకు సరిపోవటం లేదు. భూగర్భ జల మట్టం పడిపోవటంతో ప్రజలు కేవలం నల్లా నీటిపైనే ఆధారపడటంతో ఈ పరిస్థితి తలెత్తింది. అయినప్పటికీ తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే రెండు నెలలు కీలకం. ఫిర్యాదు వచ్చిన వెంటనే తాగునీటి సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలి. ఏ రోజుకారోజు సీఎస్ సారథ్యంలో మిషన్ భగీరథ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్తు శాఖ అధికారులు తాగునీటి సరఫరాపై సమీక్ష జరపాలి. జిల్లాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమితులైన సీనియర్ ఐఏఎస్‌లు తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలకు వెళ్లి పరిశీలించాలి. జీహెచ్ఎంసీ పరిధిలో తాగునీటి సరఫరాకు ఢోకా లేకుండా, డిమాండ్ మరింత పెరిగినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి. అవసరమైతే నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని హైదరాబాద్‌కు తెచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. సింగూరు నుంచి నీటి సరఫరా చేసేందుకు సన్నద్ధంగా ఉండాలి. కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత లేనందున ఎగువన నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తాగునీటిని తెచ్చుకునేలా కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి..' అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేవారిపై చర్యలు

హైదరాబాద్‌లో ఇటీవల సిబ్బంది అత్యుత్సాహంతో ఒకచోట తాగునీటి సరఫరా నిలిచిపోయిన అంశం దృష్టికి రాగా సీఎం వెంటనే స్పందించారు. విచారణ జరిపించి ఉద్దేశపూర్వకంగా తాగునీటి సరఫరాకు ఆటంకం కల్పించిన వారిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అటువంటి ఉద్యోగులపై ఉదాసీనంగా వ్యవహరిస్తే అధికారులపై కూడా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఏడాది చివర్లోనే!

తొలుత జాప్యం.. తర్వాత ఎన్నికల కోడ్

- కొత్త ప్రభుత్వం ఏర్పడగానే దరఖాస్తుల స్వీకరణ
- 66 లక్షల దరఖాస్తులు వచ్చినట్టుగా నమోదు
- వెంటనే పరిశీలన, లబ్ధిదారుల గుర్తింపు చేపట్టకుండా పెండింగ్
- పథకాన్ని అధికారికంగా ప్రారంభించిన నాలుగు రోజులకే నియమావళి
- కోడ్ ముగిసిన తర్వాత ప్రారంభించినా నాలుగైదు నెలల సమయం పట్టవచ్చని అంచనా

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరుకు ప్రారంభమైనా.. వాటి నిర్మాణం మాత్రం ఇప్పట్లో మొదలయ్యే అవకాశం లేకుండా పోయింది. ఇళ్ల నిర్మాణం కోసం కనీసం మరో ఐదు నెలల పాటు వారు ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆరు గ్యారంటీల్లో ఒకటిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి 11న అట్టహాసంగా ప్రారంభించింది. భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించగా పలువురు మంత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ వంద రోజుల్లోనే పథకాన్ని ప్రారంభించినట్టు మంత్రులు పలు సందర్భాల్లో పేర్కొన్నారు. సాధారణంగా ఇలాంటి పథకాలను లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వటమో, తొలి విడత ఆర్థిక సాయం కింద చెక్కు జారీ చేయడంతోనో ప్రారంభిస్తారు. కానీ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కేవలం ప్రారంభిస్తున్నట్టు పేర్కొనటమే తప్ప ఇలాంటివేవీ లేకుండా, లబ్ధిదారుల ప్రస్తావనే లేకుండా సాగింది. వాస్తవానికి ఇప్పటివరకు లబ్ధిదారులను గుర్తించనేలేదు.

దరఖాస్తులు స్వీకరించినా..

ప్రభుత్వం కొలువుదీరిన డిసెంబర్ నెలలోనే ప్రజా పాలన పేరుతో పేదల నుంచి వివిధ పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించింది. వీటిల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చినవే ఎక్కువగా ఉన్నాయి. 80 లక్షలకు పైగా దరఖాస్తులు రాగా, వాటిల్లో గతంలోనే ఇందిరమ్మ ఇళ్లను పొందిన దాదాపు 14 లక్షల మందికి సంబంధించిన దరఖాస్తులు కూడా ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. వెరసి 66 లక్షల దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చినట్టుగా రికార్డు చేశారు. వాటిని స్క్రూటినీ చేసి



ఇతర కారణాలతో అనర్హమైనవి ఉంటే తొలగించాల్సి ఉంది. ఆ తర్వాత అసలు దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంది. ఈ కార్యక్రమాన్ని అప్పట్లో నిర్వహించకుండా పెండింగులో పెట్టారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హడావుడిగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత నాలుగు రోజులకే కోడ్ అమల్లోకి రావటంతో మొత్తం ప్రక్రియ నిలిచిపోయింది.

కోడ్ ముగిసినా..

జూన్ నాలుగో తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఆ తర్వాత ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఆ తర్వాత దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించినా, అన్ని రకాల దరఖాస్తులు కలిపితే కోటికి పైగా ఉండటంతో ఆ ప్రక్రియ అంత తొందరగా జరిగే అవకాశం లేదు. ఇక ఇందిరమ్మ ఇళ్ల విషయానికొస్తే ప్రజల సమక్షంలో (గ్రామసభలు) లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంది. ఆ ప్రక్రియ కూడా అంత వేగంగా జరిగేది కాదు. ఇవన్నీ పూర్తి కావాలంటే కనీసం మరో ఐదు నెలల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. అప్పుడు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇస్తే ఇళ్ల నిర్మాణం మొదలవుతుంది. మొత్తం మీద ఈ ఏడాది ముగిసే నాటికి గానీ ఈ పథకం ఊపందుకునే అవకాశం కన్పించటం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

క్లుప్తంగా...

ఐదేళ్లైనా ఇళ్లు ఇవ్వలేదు

- కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద బైఠాయించిన లబ్ధిదారులు



కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద లబ్ధిదారులు

మర్కూక్ (గజ్వేల్): డబుల్ బెడ్రూం లబ్ధిదారులు సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను శుక్రవారం ముట్టడించారు. ఎంపిక చేసి ఐదేళ్లవుతున్నా ఇవ్వడంలో తాత్సారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆఫీసుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మధ్యాహ్నం ఎండ సమయంలో పెద్దసంఖ్యలో లబ్ధిదా రులు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు చేరుకుని సుమారు 2 గంటల పాటు రోడ్డుపైనే బైఠాయించారు. ఇళ్లు ఇచ్చే వరకు కదిలేది లేదంటూ భీష్మించుకొని కూర్చున్నారు. ఈ సందర్భంగా బాధి తులు మాట్లాడుతూ "గజ్వేల్‌లో 1100 ఇళ్లు నిర్మించి ఎన్నికల కోసం ఆర్భాటంగా లాటరీ పద్ధతి ద్వారా మాకు కేటాయించారు. తీరా మల్లన్న సాగర్ భూ నిర్వాసితులను అందులో ఉంచి మాకు ఇళ్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి వచ్చి నచ్చజెప్పడంతో ఎట్టకేలకు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సెల్‌ఫోన్ అడిగినందుకు తండ్రిని చంపిన కొడుకు

- మంచిర్యాల జిల్లాలో దారుణం



రాయమల్లు

రామకృష్ణాపూర్: సెల్‌ఫోన్ కోసం తండ్రినే చంపేశాడో కొడుకు. తన ఫోన్‌ను తనకు ఇవ్వాలని పట్టుబడిన తండ్రిని రోకలిబండతో బాది చంపాడు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకున్న ఈ దారుణ ఘటన వివరాలిలా.. స్థానిక తారకరామ కాలనీలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడు బామండ్లపల్లి రాయమల్లు(60) నివాసముంటున్నాడు. రెండో భార్య కుమారుడు రాకేశ్ కొన్ని రోజులుగా జులాయిగా తిరుగుతున్నాడు. చెడు అలవాట్లతోపాటు మద్యానికి బానిసయ్యాడు. తండ్రి రాయమల్లు సెల్‌ఫోన్‌ను కొన్ని రోజులుగా రాకేశ్ వాడుతున్నాడు. గురువారం రాత్రి ఇద్దరూ మద్యం మత్తులో ఉన్నారు. ఇదే సమయంలో సెల్‌ఫోన్ విషయంలో తండ్రీ కొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. తన ఫోన్ తనకు ఇవ్వాలని రాయమల్లు పట్టుబట్టాడు. దీంతో కోపోద్రిక్తుడైన రాకేశ్ రోకలిబండతో తండ్రిపై దాడి చేశాడు. అపస్మారక స్థితికి చేరిన అతడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే చనిపోయాడని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

తోటికోడళ్ల ఉసురుతీసిన విద్యుత్ షాక్

- అక్కను కాపాడబోయి చెల్లెలు మృతి

తాడూరు: విద్యుత్ షాక్ తగిలి తల్లడిల్లుతున్న తోటికోడలిని కాపాడబోయిన మరో మహిళ విద్యుదాఘాతానికి గురై ఇద్దరూ మృత్యువాత పడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్‌లో ఈ విషాదకర ఘటన జరిగింది. గ్రామానికి చెందిన యూసుఫ్ ఇంట్లోనే హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం యూసుఫ్ పొలం పనులకు వెళ్లాడు. దీంతో ఆయన భార్య తస్లీమాబేగం (48) షాపులోని సామగ్రిని సరిచేసే క్రమంలో వైరు తగిలి షాక్‌కు గురైంది. ఆమె కేకలు విని సమీపంలో ఉన్న తోటికోడలు హాలియాబేగం (40) అక్కను రక్షించడానికి వెళ్లి ఆమె కూడా షాక్‌కు గురైంది. అప్పటికే వచ్చిన చుట్టుపక్కల వారు వెంటనే ఇద్దరినీ నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వారు మృతిచెందినట్లు నిర్ధారించారు. తస్లీమాబేగంకు భర్తతోపాటు ఇద్దరు కొడుకులు, హాలియా బేగంకు భర్త, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందిందని పోలీసులు తెలిపారు.

ఆదిభట్ల 'ఛైర్‌పర్సన్'కు రూ.లక్ష జరిమానా

- నాలుగు వారాల్లో చెల్లించాలని హైకోర్టు ఆదేశం



ఆర్తిక

సాక్షి, హైదరాబాద్: కేసులో వాస్తవాలను తెలియజేయకుండా కోర్టును తప్పుదోవ పట్టించాలని చూశారని, విలువైన సమయాన్ని వృథా చేశారని, అధికారులపై నిరాధా ర ఆరోపణలు చేశారంటూ హైకోర్టు ఆదిభట్ల మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కె.ఆర్తికకు రూ.లక్ష జరిమానా విధించింది. ఎటువంటి ఆధారం లేకుండా, పనికి మాలిన పిటిషన్‌ను వేశారని, దీనికి ఆమెనే బాధ్యత వహించాలని వ్యాఖ్యానించింది. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. జరిమానా సొమ్ము రూ.లక్షను నాలుగు వారాల్లోగా లీగల్ సర్వీసెస్ అథారిటీకి జమ చేయాలని ఆదేశించింది. ఆదిభట్ల మున్సిపాలిటీ 4వ వార్డు నుంచి ఆర్తిక విజయం సాధించి.. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఫిబ్రవరి 9న జరిగిన అవిశ్వాస ప్రక్రియ నెగ్గడంతో ఆమె పదవి కోల్పోయారు. అయితే కొత్త ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక కోసం మార్చి 30న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. కాగా, ఈ నోటీసులను సవాల్ చేస్తూ ఆర్తిక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నోటీసులు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16, 21ని ఉల్లంఘించినట్లేనని పేర్కొన్నారు. కలెక్టర్ జారీ చేసిన నోటీసులను కొట్టివేయడంతో పాటు ఆదిభట్ల కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి స్థిర, చర ఆస్తులపై విచారణ చేపట్టేలా, తన విధులకు అడ్డురాకుండా.. కలెక్టర్‌ను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషన్ చట్టవిరుద్ధమని ప్రభుత్వ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. హైకోర్టు ఆదేశాల మేరకే ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు ఎన్నికల సంఘం ఓకే చెప్పిందని, ఆ మేరకే కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వాస్తవాలను వెల్లడించకుండా కోర్టు సమయాన్ని వృథా చేశారంటూ పిటిషనర్‌కు జరిమానా విధించారు.

గృహజ్యోతిని ఎందుకు నిలిపేశారు?

- బీజేపీ అధికార ప్రతినిధి రచనారెడ్డి




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి కింద దరఖాస్తు స్వీకరణను నిలిపివేసిందని బీజేపీ అధికార ప్రతినిధి రచనారెడ్డి మండిపడ్డారు. ఎన్నికలు అయిపోయేదాక ఈ పథకాన్ని ఆపేస్తున్నామని చెప్తున్న కాంగ్రెస్ నాయకులు, అసలు దీన్ని ఎప్పుడు ప్రారంభించారో చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ పథకం కింద ఎంతమంది అర్హులను గుర్తించారన్న దానిపై స్పష్టత నివ్వాలన్నారు. 'ఇప్పటికే ప్రారంభించిన పథకాలకు ఎన్నికల కోడ్ అడ్డుకాదని కాంగ్రెస్ నాయకులకు తెలియదా? అసలు ఎందుకు ప్రారంభించారు? ఎందుకోసం ఆపేశారో చెప్పాలి' అని నిలదీశారు. ఈ పథకం కింద లబ్ధి కోసం మహిళలు ఎక్కడ నుంచి నమోదు చేసుకోవాలో చెప్పాలన్నారు. తమ గ్యారంటీలు, వారంటీల గురించి కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పలేక ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ముందుకు తెచ్చారని రచనారెడ్డి ఆరోపించారు. పథకాల అమలుపై ప్రజలు అడుగుతుంటే.. కేంద్రం పైసలు ఇవ్వడం లేదని, గత బీఆర్‌ఎస్ మొత్తం అప్పుల్లో ముంచిందని దాటవేసే ధోరణితో చెప్పడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఐదేళ్లు సక్రమంగా ఉండాలంటే కాంగ్రెస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేయాలని హితవు పలికారు.

భూ యాజమాన్య హక్కులను నిర్ధారణ చేయలేవు

సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టివేసిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ కనెక్షన్ కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌లో భూ యాజమాన్య హక్కులను కోర్టు నిర్ధారించలేదని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ గతంలో సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామంలోని శంకర్‌హిల్స్ లేఅవుట్‌లోని తన ప్లాట్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం గత సెప్టెంబర్‌లో దరఖాస్తు చేసుకున్నా భూ యాజమాన్య విషయానికి సంబంధించి వివాదం ఉందంటూ టీఎస్‌స్పీడీసీఎల్ అధికారులు నిరాకరిస్తున్నారని సికింద్రాబాద్ సీతాఫల్‌మండికి చెందిన వృద్ధురాలు గోపు నాగమణి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. పిటిషనర్ ప్లాట్‌కు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని ఆదేశించారు. ఇదే లేఔట్‌లో ప్లాట్‌లు కొనుగోలు చేసిన జైహింద్ గ్రీన్‌ఫీల్డ్స్, ఎల్ఎల్‌పీ అభ్యర్థనను తిరస్కరించారు. వారికి హక్కులు లేవన్నారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ జైహింద్ గ్రీన్‌ఫీల్డ్స్ అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. విద్యుత్ కనెక్షన్ వివాదంపై దాఖలైన పిటిషన్‌లో నిబంధనలను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదని అభిప్రాయపడింది. రిట్ పిటిషన్లలో భూ హక్కులను నిర్ధారించే పరిధి కోర్టుకు లేదని స్పష్టం చేస్తూ.. సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టివేసింది. నిబంధనల మేరకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని టీఎస్‌స్పీడీసీఎల్‌ను ఆదేశించింది.

సమ్మక్క సాగర్ బ్యారేజీ గేట్లు మూసివేత



కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం జీపీ పరిధిలో గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ గేట్లను శుక్రవారం మూసివేశారు. బ్యారేజీలో 59 గేట్లు ఉండగా అందులో 58 గేట్లను పూర్తిగా మూసి వేసినట్లు బ్యారేజీ ఏఈ సాయిరాం తెలిపారు. ప్రస్తుతం బ్యారేజీలో 6.94 టీఎంసీలకు బదులు 1.37 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. ఎగువ నుంచి బ్యారేజీలోకి 500 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలుస్తోంది.

కేటీపీపీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం (కేటీపీపీ)లోని మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి గురువారం అర్ధరాత్రి నుంచి పూర్తిగా నిలిచి పోయింది. ప్రధాన ప్లాంటులోని బాయిలర్ ట్యూబ్ లీకేజీతో ఉత్పత్తి ఆగిపోయింది. శుక్రవారం ఉదయం నుంచే అధికారులు మరమ్మతు పనులు ప్రారంభించారు. విద్యుత్ ఉత్పత్తి తిరిగి పునరుద్ధరించడానికి మరో రెండ్రోజులు పట్టవచ్చని అధికార వర్గాలు తెలిపాయి.

విందుకు వెళుతూ.. మృత్యుఒడిలోకి

- ఓవర్‌టేక్ చేయబోయి డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- ముగ్గురు యువకులు మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- సూర్యాపేట శివారులో జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం



రాకేశ్



నిఖిల్‌రెడ్డి



నవీద్

సూర్యాపేట: రంజాన్ పండుగ సందర్భంగా మిత్రుడు ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యేందుకు వెళుతూ జాతీయరహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందారు. సూర్యాపేట పట్టణానికి చెందిన మహ్మద్ నవీద్, వెన్న నిఖిల్‌రెడ్డి, గుండగాని రాకేష్ అలియాస్ సన్ని, సోమగాని ఆదిత్య అలియాస్ చందు ప్రాణస్నేహితులు. పట్టణంలోని పీఎస్సార్ సెంటర్‌కు చెందిన మహ్మద్ నవీద్ రంజాన్ సందర్భంగా తన నివాసంలో స్నేహితులకు విందు ఏర్పాటు చేశాడు. ముందుగా నవీద్ తన స్నేహితులైన గుండగాని రాకేశ్, సోమగాని ఆదిత్యను తీసుకొని కృష్ణా కాలనీలో ఉండే మరో మిత్రుడు వెన్న నిఖిల్‌రెడ్డి నివాసానికి చేరుకుని అతడి కారులో కలిసి పీఎస్సార్ సెంటర్‌కు బయలుదేరారు. కృష్ణాకాలనీ నుంచి నేరుగా హైటెక్ బస్టాండ్ ముందుగా జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ పైనుంచి వెళ్తుండగా ఖమ్మం క్రాస్ రోడ్డు సమీపానికి రాగానే హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళుతున్న డీసీఎంను ఓవర్‌టేక్ చేసే క్రమంలో వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో నిఖిల్‌రెడ్డి (24), గుండగాని రాకేశ్ (24), నవీద్ (25) అక్కడికక్కడే మృతిచెందారు. సూర్యాపేటలోని జమ్మిగడ్డకు చెందిన సోమగాని ఆదిత్యకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా జమీన్‌అలీ తన కుమారుడు నవీద్‌కు అప్పటికే రెండుమార్లు ఫోన్ చేశాడు. ఇంటికే స్నేహితులతో కలిసి వస్తున్నానని చెప్పడంతో విందు ఏర్పాట్లు చేశారు. ఫోన్ చేసిన 20 నిమిషాల అనంతరం ప్రమాదం జరిగిన విషయం తెలిసిందని నవీద్ తండ్రి రోదిస్తూ చెప్పాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీసి ప్రభుత్వ జనరల్ అస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆదిత్యకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌కు తరలించారు.

అస్థిపంజరాలైన ఆ తల్లిదండ్రులు

- నెలక్రితం పిల్లలకు విషమిచ్చి చంపి పరారైన భార్యాభర్తలు
- అటవీ ప్రాంతంలో గుట్టపై చెట్టుకు ఉరివేసుకొని మృతి
- మృతదేహాలను జంతువులు తినడంతో మిగిలిన అస్థిపంజరాలు
- మరణాలకు కారణం ఇంకా మిస్టరీగానే



అనిల్‌కుమార్, దేవి(ఫైల్)

గార్ల: నెల రోజుల క్రితం పిల్లలకు పాలల్లో విషం ఇచ్చి చంపి పరారైన తల్లిదండ్రులు అడవిలో అస్థిపంజరాలయ్యారు. భార్యాభర్తలు ఒకే చెట్టుకు ఉరి వేసుకున్నారు. భర్త మృతదేహం అస్థిపంజరమై చెట్టుకు వేలాడుతుండగా, భార్య మృతదేహాన్ని అడవి జంతువులు పీక్కుతిన్నాయి. దీంతో కేవలం ఆమె పుర్రె మాత్రమే మిగిలింది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం నగరం గ్రామ సమీపంలో శుక్రవారం ఈ అస్థిపంజరాలు వెలుగు చూశాయి. గార్ల బయ్యారం సీఐ బి.రవికుమార్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం అంకన్నగూడెంకు చెందిన పెండకట్ల అనిల్‌కుమార్, దేవి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. ఈ ఏడాది మార్చి 10న ఇద్దరు చిన్నపిల్లలకు పాలల్లో విషం ఇచ్చి చంపిన తలిదండ్రులు బైక్‌పై పరార య్యారు. నాటి నుంచి పోలీసులు భార్యాభ ర్తల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. నగరం గ్రామ సమీప అటవీ ప్రాంతంలోని పొదల్లో బైక్ ఉండటాన్ని ఓ వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో భార్యాభర్తలు ఇదే ప్రాంతంలో ఉంటారని భావించి బైక్ దొరికిన ప్రాంతంలో పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నగరం గ్రామ సమీ పం గుట్టమీద నుంచి దుర్వాసన రావడంతో దగ్గరికి వెళ్లి చూడగా చెట్టుకు ఓ మృతదే హం వేలాడుతూ కని పించింది. పోలీసులు వెంటనే అనిల్‌కుమార్ తండ్రి వెంకన్నను ఘటనా స్థలానికి తీసుకొచ్చి మృతదేహాన్ని చూపించగా ఇది తన కొడుకుదేనని చెప్పాడు. దేవి మృతదేహం కోసం వెతుకగా పక్కనే పుర్రె, ఎముకలు, చీర లభించాయి. అడవి జంతువులు మృతదేహాన్ని తిని ఉంటాయని పోలీసులు భావించారు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు గుట్టపైకి డాక్టర్‌ను తీసుకొచ్చి అస్థిపంజరాలకు అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. గుట్టపైనే కుటుంబసభ్యులు అంత్య క్రియలు నిర్వహించారు. కాగా, భార్యాభర్తలు ఎందుకు పిల్లలకు విషమిచ్చి చంపారు.. అసలు వాళ్లు ఎందుకు బలవన్మరణానికి పాల్పడ్డారనే కారణాలు ఇప్పటివరకు తెలియలేదు. పోలీసులు కూడా ఇదొక మిస్టరీలా ఉందని, ఇంకా కారణాలు తెలియలేదని చెబుతున్నారు.

జల్దీ జర్నీ!

సాఫీగా రైలు ప్రయాణం

- లాలాగూడ- సీతాఫల్‌మండి మధ్య కొత్తగా కార్డ్‌లైన్
- దూరప్రాంతాల రైళ్లకు తగ్గనున్న ప్రయాణ సమయం
- కాజీపేట్, నిజామాబాద్ మీదుగా కాచిగూడకు నిర్మాణ పనులు చేపట్టిన దక్షిణమధ్య రైల్వే



సాక్షి, సిటీబ్యూరో: కాజీపేట్ నుంచి కాచిగూడ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లు కాజీపేట్ నుంచి 123 కిలోమీటర్ల దూరంలో ఉన్న మౌలాలీ బైపాస్ వరకు కేవలం 85 నిమిషాల్లో చేరుకుంటాయి. కానీ.. అక్కడి నుంచి మరో 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాచిగూడకు చేరుకొనేందుకు సుమారు 50 నిమిషాల సమయం పడుతోంది. అంటే.. కాచిగూడ నుంచి మౌలాలీ వరకు ఎలాంటి ఆటంకాలు ఉండవు. కానీ.. అక్కడి నుంచి మల్కాజిగిరి మీదుగా కాచిగూడకు వెళ్లేందుకే ఎక్కువ సమయం పడుతోంది. దీంతో నగరానికి చేరుకున్నప్పటికీ ప్రయాణికులు కనీసం 50 నిమిషాలు అదనంగా ప్రయాణం చేయాల్సివస్తోంది. రైళ్ల రాకపోకల్లో ఈ జాప్యాన్ని నివారించేందుకు లాలాగూడ నుంచి సీతాఫల్‌మండి వరకు 4 కిలోమీటర్ల కార్డ్‌లైన్ నిర్మించేందుకు దక్షిణమధ్య రైల్వే పనులు ప్రారంభించింది. ఈ కార్డ్‌లైన్ వల్ల మౌలాలీ నుంచి కాచిగూడకు చేరుకొనే సమయం గణనీయంగా తగ్గుముఖం పట్టనుంది. ప్రస్తుతం కాజీపేట నుంచి వచ్చే రైళ్లు మల్కాజిగిరి నుంచి సీతాఫల్‌మండి మీదుగా కాకుండా లాలాగూడ స్టేషన్ నుంచి ఎడమ వైపునకు మళ్లి నేరుగా సీతాఫల్‌మండి మీదుగా కాచిగూడకు చేరుకుంటాయి. దీంతో ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది.

ఆర్‌యూబీ బ్లాక్...

కార్డ్‌లైన్ నిర్మాణ పనుల కోసం ప్రస్తుతం ఆలుగడ్డ బావి వద్ద వాహనాల రాకపోకలను నియంత్రించారు. రైల్‌నిలయం నుంచి తార్నాక వైపు వెళ్లే మార్గంలో ఆలుగడ్డబావి వద్ద ఉన్న ఆర్‌యూబీని బ్లాక్ చేశారు. ప్రస్తుతం ఈ ఆర్‌యూబీపైన కార్డ్‌లైన్ పనులను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. సకాలంలో పనులను పూర్తి చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. రానున్న మూడు నెలల కాలంలో లాలాగూడ–సీతాఫల్‌మండి కార్డ్‌లైన్ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇది పూర్తయితే కాజీపేట్, నిజామాబాద్ వైపు నుంచి కాచిగూడ మీదుగా వెళ్లే రైళ్లకు ఎంతో ఊరట లభించనుంది. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి రాకపోకలు సాగించే కొన్ని రైళ్లను కూడా కాచిగూడకు మళ్లించే అవకాశం ఉన్నట్లు ఒక అధికారి తెలిపారు. కార్డ్‌లైన్ వల్ల ప్రయాణ సమయం 30 నిమిషాలకు తగ్గనున్నట్లు చెప్పారు.

ప్రయాణికులకు ఎంతో ఊరట..



మల్కాజిగిరి నుంచి సీతాఫల్‌మండి వరకు చేపట్టిన డబ్లింగ్ పనుల్లో భాగంగానే లాలాగూడ- సీతాఫల్‌మండి మధ్య కార్డ్‌లైన్ నిర్మాణం జరుగుతోంది. ఇది అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనుంది. ఇటీవలే మౌలాలీ బైపాస్–సనత్‌నగర్ రైల్వే స్టేషన్ల మధ్య 29 కిలోమీటర్ల డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. ఆ రూట్‌లో ఎంఎంటీఎస్‌లు అందుబాటులోకి వచ్చాయి. కార్డ్‌లైన్ కూడా పూర్తయితే దూర ప్రాంతాల రైళ్లకు ఎంతో ప్రయోజనం. సికింద్రాబాద్‌పై ఒత్తిడి తగ్గుతుంది. – ఫణి, రైల్వేఫోరం సభ్యుడు

'మేడిగడ్డ, అన్నారం వివరాలు అఖిలపక్షంలో తెలపాలి'



జూలకంటి

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ, అన్నారం బ్యారేజీ సమస్యలపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచనలు, నిపుణుల అభిప్రాయాలు, ప్రభుత్వ నిర్ణయాలను అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి తెలియజేయాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మరో వైపు రాష్ట్రంలో పంటలు, తాగు నీటిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్య తీవ్రతరం కాకముందే ప్రభుత్వం మేల్కొనాలని జూలకంటి కోరారు.

'మా కులానికీ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయండి'

సాక్షి, హైదరాబాద్: తమ కులానికీ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నాయీ బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం నేతలు కలిసి వినతిపత్రం అందించారు. ఫెడరేషన్‌ను ఏర్పాటు చేస్తే తమ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సీఎంతో మాట్లాడి ఫెడరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారని సంఘం నేతలు తెలిపారు.

ఎఫ్‌ఎంసీజీ అమ్మకాల్లో పట్టణాలను మించిన పల్లెలు

- గత మూడేళ్లలో తొలిసారిగా పెరిగిన అమ్మకాలతో రూరల్ మార్కెట్‌లో జోష్
- నీల్సన్ ఐక్యూ పరిశీలన ఆధారంగా విశ్లేషిస్తున్న మార్కెటింగ్ సంస్థలు

సాక్షి, హైదరాబాద్: వేగంగా అమ్ముడయ్యే వినిమయ వస్తువుల (ఎఫ్‌ఎంసీజీ) అమ్మకాల్లో పట్టణాలను పల్లెలు అధిగమించాయి. గత మూడేళ్లలో తొలిసారిగా పల్లెసీమల్లో పెరిగిన అమ్మకాలతో రూరల్ మార్కెట్‌లో జోష్ నెలకొంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మార్కెట్‌లకు సంబంధించి నీల్సన్ ఐక్యూ తాజాగా నిర్వహించిన పరిశీలనలో వెల్లడైన వివరాలను మార్కెట్ వర్గాలు విశ్లేషించి ఈ మేరకు నిర్ధారణకు వచ్చాయి. ఈ సర్వే గణాంకాల ప్రకారం 2023 డిసెంబర్/2024 జనవరి మధ్య గ్రామాల్లో 6.5 శాతం మేర పెరిగిన ఎఫ్‌ఎంసీజీ మార్కెట్ ఈ ఏడాది ఫిబ్రవరిలో 11.1 శాతం పెరిగింది. గతేడాది నవంబర్ దాకా ఈ వస్తువులకు గ్రామీణ మార్కెట్లలో పెద్దగా డిమాండ్ లేక తక్కువ విక్రయాలు నమోదవగా ఆ తర్వాత క్రమంగా పరిస్థితులు సానుకూలంగా మారడం శుభపరిణామమని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశంపై కరోనా ప్రభావం పడే ముందు వరకు పట్టణప్రాంతాల కంటే గ్రామాల్లో ఈ వస్తువుల డిమాండ్ రెండింతల స్థాయి వరకు పెరుగుతున్న సూచనలు ఉండేవని గుర్తుచేసుకుంటున్నారు. కొన్ని రాష్ట్రాల్లో మంచి వర్షపాతం నమోదుతో పంటలు బాగా పండటంతోపాటు చాలా కంపెనీలు ఆయా వస్తువుల ధరలను తగ్గించడం తదితర కారణాలు కూడా పల్లెల్లో ఎఫ్‌ఎంసీజీ వస్తువుల డిమాండ్‌పై ప్రభావం చూపాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా చూస్తే ఎఫ్‌ఎంసీజీ మార్కెట్‌లో గ్రామీణ ప్రాంతాలు దాదాపు 40 శాతం ఉండగా... పట్టణ, గ్రామీణ ప్రాంతాల మార్కెట్ల మధ్య ఉన్న అంతరం క్రమంగా 4–6 శాతం నుంచి ఒక్క శాతానికి తగ్గినట్లు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్‌కు నూతన కార్యవర్గం

సుల్తాన్‌బజార్: తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్‌కు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు రావడాన్ని స్వాగతిస్తున్నామని టీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భాస్కర్ అన్నారు. శుక్రవారం రామ్‌కోఠిలోని వెస్లీ సెంటినరీ చర్చిలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ 4వ వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమంలో వివిధ జిల్లాల ప్రధాన చర్చిలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కార్యవర్గం ఎన్నిక

తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఛైర్మన్‌గా బిషప్ పద్మారావు, వైస్ ఛైర్మన్‌గా ఎంఏ డానియేల్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ టి.భాస్కర్, కోశాధికారిగా రాబర్ట్ సూర్యప్రకాష్‌లతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ బోర్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి.భాస్కర్ మాట్లాడుతూ టీసీసీ కేఎన్‌సీసీఐ గుర్తింపు రావడం తమకు ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రూబన్ మార్క్, ఫిలిప్‌రాజ్, జ్యోతి సుందర్, విజయ పద్మారావు, స్టీవెన్, జాన్ రవీందర్, తిమోతి, వివిధ జిల్లాలకు చెందిన చర్చిల ప్రతినిధులు పాల్గొన్నారు.

దక్షిణం, ఉత్తరం, పడమట, పై లోకాలు, కింది లోకాల కన్నిటికీ వెలుగులందిస్తూ; సర్వప్రాణుల్నీ, సమస్త విశ్వాన్నీ తన కిరణాలతో ఉత్తేజితం చేస్తూ, సూర్యుడు ప్రాణశక్తికి ఆలవాలమై ఉన్నాడు.

– ప్రశ్నోపనిషత్తు (హిందూ ధర్మం)

సాక్షి

శనివారం, 13 ఏప్రిల్ 2024

ప్రశాంత కశ్మీర్‌కు మార్గం

జమ్మూ, కశ్మీర్‌లో ఉగ్రవాదం, రాళ్లదాడులు, హర్తాళ్లు, సరిహద్దుల్లో అలజడి వగైరాలు లేకుండా ఈసారి లోక్‌సభ ఎన్నికలు జరగబోతున్నాయని శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ ఉధమ్‌పూర్ ర్యాలీలో ఎంతో ఆత్మవిశ్వాసంతో చేసిన ప్రకటనను బహుశా విపక్షాలు కూడా స్వాగతిస్తాయి. 2019 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పుల్వామాలో సైనికులపై ఉగ్రవాద దాడి, ఆ వెనువెంటనే పాక్ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలపై మన సైన్యం సాగించిన సర్జికల్ దాడులు విపక్షాలకు దేశంలో అప్పటివరకూ కొద్దో గొప్పో ఉందనుకున్న అనుకూలతలను ఆవిరిచేశాయి. బీజేపీకి భారీ మెజారిటీని అందించాయి. కనుక ఈసారి అంతా సవ్యంగా ముగియాలని అవి కోరుకోవటంలో ఆశ్చర్యం లేదు. ఆ మాటెలావున్నా మోదీ చెప్పిన స్థాయిలో ఉగ్రవాదం బెడద సమసిపోయిందనుకోలేము. ఆ ఉదంతాల సంఖ్య గణనీయంగా తగ్గిన మాట వాస్తవమే అయినా అడపా దడపా వారి ఆగడాలు చోటుచేసుకుంటూనే వున్నాయి. నిరుడు డిసెంబర్‌లో పూంఛ్‌లో ఉగ్రవాదులు విరుచుకుపడిన ఉదంతంలో నలుగురు జవాన్లు మరణించటమైనా, మరుసటి నెలలో అదే ప్రాంతంలో సైనికులపై జరిగిన దాడి యత్నమైనా, శ్రీనగర్‌లో ఫిబ్రవరిలో ఒక పంజాబీ పౌరుణ్ణి కాల్చిచంపటమైనా మరింత అప్రమత్తత అవసరమన్న సంకేతాలిస్తున్నాయి.

జమ్మూ కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తినిచ్చే రాజ్యాంగంలోని 370 అధికరణను రద్దు చేయటమైనా, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించటమైనా అక్కడి రాజకీయ ముఖచిత్రాన్ని మార్చాయన్నది వాస్తవం. ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక ఇది మరింత ప్రస్ఫుటమవుతుంది. లోక్‌సభ ఎన్నికలకంటే అసెంబ్లీ ఎన్నికలకే జమ్మూ, కశ్మీర్‌లో ఎప్పుడూ అధిక ప్రాధాన్యత వుండేది. అయితే మారిన పరిస్థితుల్లో లోక్‌సభ నియోజకవర్గాల్లో పట్టు సంపాదిస్తేనే భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటడం సాధ్యమవుతుందని ప్రాంతీయ పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, కొత్తగా రంగంలోకొచ్చిన గులాంనబీ పార్టీ డీపీఏపీ భావిస్తున్నాయి. ఇక బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ పార్లమెంటులో తమ సంఖ్యను పెంచుకోవటానికి ఎంతో కొంత దోహదపడుతుందన్న దృష్టితో వున్నాయి. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ది విషాద స్థితి. అంతక్రితం గెల్చుకున్న జమ్మూ, లద్దాఖ్‌లు రెండూ ఆ సార్వత్రిక ఎన్నికల్లో చేజారాయి. ఆ రెండూ బీజేపీ పరమయ్యాయి. కానీ మారిన పరిణామాలు లద్దాఖ్‌లో ఆ పార్టీకి ఆశలు పుట్టిస్తున్నాయి. ఉపాధి లేమి, హిల్ కౌన్సిళ్లను నీరుగార్చటం, పర్యావరణాన్ని దెబ్బతీసేలా సాగుతున్న కార్పొరేట్ సంస్థల భూదాహం లద్దాఖ్ ప్రజానీకానికి ఆగ్రహం కలిగించాయి. దానికితోడు చైనానుంచి ముప్పు వుండొచ్చన్న ఆందోళనతో రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో లద్దాఖ్‌ను చేరుస్తామన్న హామీ నుంచి బీజేపీ వెనక్కి తగ్గింది. అలా చేరిస్తే ఆదివాసీ ప్రాంతాలకు కార్యనిర్వాహక, శాసన, న్యాయ, ఆర్థిక రంగాల్లో స్వయం నిర్ణయాధికారం లభిస్తుంది. తమ ప్రాంతాల్లోని అడవులు, నదులు, వ్యవసాయం, గ్రామపాలన, వారసత్వ ఆస్తి, వివాహం, విడాకులు, సంప్రదాయాలు తదితర అంశాల్లో చట్టాలు చేసుకునే అధికారం వుంటుంది. పొరుగున చైనా వున్న నేపథ్యంలో ఇది సమస్యాత్మకం కావొచ్చని ఆలస్యంగా గ్రహించటంతో బీజేపీకి ఎటూ పాలుబోవటం లేదన్నది వాస్తవం. అక్కడి ఉద్యమాల పర్యవసానంగా లే ప్రాంతంలో ఆధిపత్యంవున్న బుద్ధిస్టులకూ, కార్గిల్‌లో పైచేయిగా వున్న ముస్లింవర్గాలకూ మధ్య సంప్రదాయ సరిహద్దులు చెరిగిపోయాయి. ఫలితంగా ఇటీవల జరిగిన 26 స్థానాల హిల్ కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీకి రెండు మాత్రమే దక్కాయి. కనుక బీజేపీ సంకల్పం నెరవేరటం అంత సులభం కాదు. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలు విడివిడిగా పోటీచేస్తున్నాయి. ఇటీవల సమష్టిగా అడుగులేసినట్టు కనబడిన ఈ రెండు పార్టీలూ ఎన్నికలు వచ్చేసరికి దూరం జరిగాయి. గతంలో ఒప్పందాలకు కట్టుబడి వుండటం అలవాటులేని పీడీపీతో పొత్తు అసాధ్యమన్నది నేషనల్ కాన్ఫరెన్స్ వాదన. చిత్రమేమంటే ఎప్పుడూ 'మరింత స్వయంప్రతిపత్తి', జమ్మూ, కశ్మీర్‌లో శాంతి స్థాపన చర్చలు ప్రధాన ఎజెండాగా చేసుకునే ఆ పార్టీలకు మారిన పరిస్థితుల్లో ఆ అంశాల ప్రస్తావనకే అవకాశం లేకుండా పోయింది. డీపీఏపీ ఎత్తుగడలే ఈ పార్టీలను కలవరపరుస్తున్నాయి. ఆజాద్ తాను బలంగావున్న ఉదంపూర్–దోడా నియోజకవర్గాన్ని వదిలి అనంత్‌నాగ్–రాజౌరికి ఆయన వలస రావటం వెనక ముస్లింల ఓట్లు చీల్చి బీజేపీకి మేలు చేయాలన్న వ్యూహం వున్నదని వాటి అనుమానం.

ఉన్న ఆరు లోక్‌సభ స్థానాలకూ అయిదు దశల్లో పోలింగ్ నిర్వహించటం జమ్మూ, కశ్మీర్ వర్తమాన స్థితికి అద్దం పడుతుంది. అయిదేళ్లుగా నిద్రాణమైనట్టున్న ఈ ప్రాంతంలో లోక్‌సభ ఎన్నికల ప్రకటన తర్వాత కదలిక వచ్చింది. ఇప్పుడు లభించే ఓట్ల శాతాన్నిబట్టి భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన స్థానం ఏమిటన్నది తేలిపోతుందని బీజేపీ గట్టిగా భావిస్తోంది. మిలిటెంట్ల స్వరం ఈసారి మూగబోయిందన్నది వాస్తవం. అయితే రాష్ట్రంలో హిందూ సీఎం వుండాలన్న బీజేపీ ఆశ నెరవేరాలంటే ఉగ్రవాదాన్ని అణిచేయటం ఒక్కటే చాలదు. అందుకు అభివృద్ధికి బాటలు పరిచి యువతకు ఉపాధి అవకాశాలు పెంచటం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవటం, మానవహక్కులకు ప్రాధాన్యతనీయటం తప్పనిసరి. సరిహద్దు ఆవల పాకిస్తాన్, చైనాలు వున్నాయన్న స్పృహతో మెలిగి, సున్నితంగా వ్యవహరించటం నేర్చుకుంటే ఆ ప్రాంత ప్రజల హృదయాలు గెల్చుకోవటం సులభమవుతుంది.

ఎవరు గెలిస్తే ఇండియాకు మేలు?

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

భారతదేశ వ్యూహాత్మక అవసరాలు తీరేందుకు జో బైడెన్ అమెరికా అధ్యక్ష స్థానంలో ఉండటం అవసరం. అయితే డెమోక్రాట్లకు బీజేపీ అంటే అసలు పడటం లేదు. ట్రంప్‌కు బీజేపీ రాజకీయాలంటే పట్టింపేమీ లేదు కానీ.. ఎప్పుడెలా స్పందిస్తారో తెలియదు! అయితే, ట్రంప్ అధికారంలో ఉండగా ఇతర దేశాల కంటే చాలా తక్కువ నష్టం భారత్‌కు జరిగిన విషయం కూడా ఇక్కడ చెప్పుకోవాలి. చైనాతో ట్రంప్ తెగదెంపులు చేసుకోవడం వల్లనే ట్రంప్ ప్రభుత్వం పుల్వామా, గల్వాన్ ఘటనల్లో భారత్‌కు మద్దతుగా నిలిచింది. అయితే రెండోసారి అధికారం చేపడితే ట్రంప్ వ్యవహారశైలి ఎలా ఉంటుందో ఇప్పుడే ఊహించలేము. అలాంటి నేపథ్యంలో భారతీయ దౌత్యం అవసరం మరింత ఎక్కువవుతుంది.

అమెరికా రాజకీయాలు... భారత్‌లో వాటి ప్రభావం అన్న అంశాన్ని తీసుకుంటే నాలుగు అంశాలు పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. మొదటగా చెప్పుకోవాల్సింది చైనాను నియంత్రించే విషయంలో బైడెన్ ఇండో పసిఫిక్ ప్రాంతంలో తీసుకున్న చర్యలు. ఈ చర్యలన్నీ బాధ్యతాయుతమైనవే కాదు, ఒక పద్ధతి ప్రకారం చేసినవి కూడా. కాకపోతే ఉక్రెయిన్, గాజా యుద్ధాల కారణంగా చైనాపై శ్రద్ధ కొంత తగ్గిందనడం కూడా సత్యదూరమేమీ కాదు.

బైడెన్ నేతృత్వంలో క్వాడ్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. జపాన్ తన మిలిటరీ ఆధునికీకరణ చేపట్టింది. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా భద్రతాంశాలపై త్రైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అలాగే జపాన్, ఫిలిప్పీన్స్, అమెరికా మధ్య కూడా ఒక ఒప్పందం కుదిరింది. ఫిలిప్పీన్స్‌లో అమెరికా ఉనికి మరింత పెరిగింది. 'ఆకస్'(ఆస్ట్రేలియా, యూకే, యూఎస్) ప్రకటన జరిగింది. దక్షిణ పసిఫిక్ దీవుల ప్రాముఖ్యతనూ అమెరికా గుర్తించడం గమనార్హం. ఆసియాన్ నేతలకు వైట్‌హౌస్ ఆతిథ్యమిచ్చింది. తైవాన్‌లో ఎన్నికల నిర్వహణ సజావుగా సాగింది. వియత్నాంతో అమెరికా బంధం మరింత దృఢపడింది. అలాగే చైనాపై అమెరికా కఠినమైన టెక్ నిషేధాలు కూడా విధించింది. ఇదే సమయంలో ఘర్షణ మరింత ముదరకుండా వ్యూహాత్మకంగా ఒకవైపు చైనాతో చర్చలు కొనసాగిస్తూనే మరోవైపు ఆ దేశంతో తన పోటీతత్వానికి మరింత పదును పెట్టింది.

అమెరికా ఆలోచనల్లో భారత్ కనీసం నాలుగు విధాలుగా ఎక్కువ ప్రయోజనాలు చేకూరుస్తుంది. ప్రపంచస్థాయి చర్చల్లో భారత్ కీలకమైన భాగస్వామి అని బైడెన్ ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. ఈ కారణంగానే భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 సమావేశాలకు పూర్తిస్థాయిలో అమెరికా మద్దతిచ్చింది. ఐఎంఈసీ, ఐ2యూ2, క్వాడ్, ఐపీఈఎఫ్, మినరల్ సెక్యూరిటీ పార్ట్‌నర్‌షిప్, ఆర్టిమిస్ అకార్డ్స్ వంటి వేర్వేరు వ్యవస్థల్లో భారత్‌ను కీలకంగా మార్చింది. ఇంధనం నుంచి ఆహార భద్రత, వాతావరణ మార్పులు మొదలుకొని కోవిడ్ వంటి మహమ్మారుల నిర్వహణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన వంటి అన్ని ప్రపంచస్థాయి సమస్యల పరిష్కారంలో భారత్ భూమిక తప్పదన్న విషయం కూడా అమెరికా గుర్తించింది. భారత్ సామర్థ్యాన్ని పెంచడం ప్రపంచ సమస్యల పరిష్కార బాధ్యతను పంచుకోవడం అవుతుందని అమెరికా భావిస్తోంది. దీనివల్ల అటు చైనాను నియంత్రించడం, దక్షిణాసియా ప్రాంతంలో భద్రతను కాపాడటం కూడా సాధ్యమన్నది అమెరికా అంచనా. అలాగే సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి తగిన వ్యవస్థలను ఏర్పాటు చేయడం, కలిసికట్టుగా తయారీ చేపట్టడం, రక్షణ రంగంలో సహకారం, అమెరికాలోని పెద్ద పెద్ద కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెడుతూండటం భారత్‌పై పెరుగుతున్న



అమెరికా విశ్వాసానికి నిదర్శనాలుగా చెప్పుకోవచ్చు. భారత్ భౌగోళిక స్వరూపం, ఇరుగు పొరుగు, చరిత్ర వంటి అనేక అంశాల ఆధారంగా బైడెన్ యంత్రాంగం ఈ దేశం తన ప్రయోజనాలు సాధించుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తోంది. కొన్నిసార్లు విభేదించినా భూ దక్షిణార్ధగోళం మొత్తమ్మీద భారత్ పరపతి చైనా కంటే ఎంతో మెరుగని అమెరికా భావిస్తోంది.

ఇక రెండో విషయానికి వద్దాం. డెమోక్రాట్లు ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీతో అంత సౌకర్యంగా ఏమీ లేరు. ఇందుకు మూడు కారణాలు కనిపిస్తాయి. ప్రజాస్వామ్యం విషయంలో పార్టీ ధోరణి మారిపోవడం ఇందులో ఇకటి. యూఎస్ కాంగ్రెస్‌లోని ఐదుగురు దేశీ ప్రతినిధులు డెమోక్రాట్లే కావడం గమనార్హం. ఆధిపత్య ధోరణులకు దూరంగా ఉండాలన్న కాంక్ష, మైనారిటీలకు గుర్తింపు ఉండాలన్న భావనలు వీరిని డెమోక్రాట్ పార్టీ వైపు మళ్లించాయి. జాతి ఆధారిత నేషనలిజమ్‌పై కూడా వీరికి నమ్మకం లేదు. బీజేపీ ఇప్పుడు ఈ విలువలన్నింటికీ దూరమన్న అంచనా డెమోక్రాట్లలో బలపడుతోంది. రెండో కారణం అమెరికన్ ముస్లింల ప్రభావం. డెమోక్రాట్లలో భారతీయ అమెరికన్ ముస్లింల ప్రభావం కూడా క్రమేపీ ఎక్కువ అవుతోంది. బైడెన్ గాజా విషయంలో ఇప్పటికే వీరి నుంచి కొంత వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. మిషిగన్ వంటి స్వింగ్‌స్టేట్‌లో దీని ప్రభావమూ కనిపించింది. మూడో కారణం... డెమోక్రాట్లు ట్రంప్ రాజకీయాలను వ్యతిరేకిస్తారు. ట్రంప్ ప్రజాస్వామ్యానికి ఎలా వ్యతిరేకం అన్న విషయంపై ఈ రాజకీయాలు మొత్తం ఆధారపడి ఉంటాయి. ఫలితంగా వీరు మానవహక్కుల వంటి విషయాలకు అనుకూలంగా ఉండాల్సి ఉంటుంది.

పౌరసత్వ (సవరణ) చట్టం విషయంలో ఇటీవలి కాలంలో భారత్, అమెరికా మాటా మాటా అనుకున్న విషయం ఒకసారి గుర్తు చేసుకుందాం. అయితే ఈ విషయాలన్నింటినీ తప్పుకొని మరీ పని చేసేందుకు బైడెన్ యంత్రాంగం ఒక మార్గాన్ని గుర్తించింది. అంశాలను బహిరంగంగా కాకుండా, ప్రైవేట్‌గా ప్రస్తావించడం. అడపాదడపా ఎవరైనా అడిగితే నర్మగర్భంగా బహిరంగ వ్యాఖ్యలు చేయడం. అమెరికాలో భారత్‌పై ఆందోళన చెందుతున్న బీజేపీయేతర పార్టీలకు సంఘీభావ సంకేతం పంపేందుకు ఇలా చేస్తుందన్నమాట. ఉన్నతాధికారులు, నేతలకు మాత్రం విషయం సుస్పష్టం.

మూడో అంశం... డోనాల్డ్ ట్రంప్ హ్రస్వదృష్టి. ఇందులో మైనారిటీలు, మతపరమైన అంశాలు, ఎన్నికల వ్యవస్థ చేతనావస్థ వంటి వాటికి చోటు లేదు. బహుశా క్రైస్తవుల హక్కుల గురించి ట్రంప్ కొంత ఆందోళన వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఎందుకంటే సువార్తికులకు ఈయన కొంచెం తలొగ్గుతూంటారు.

అధ్యక్ష ఎన్నికల్లో కొంచెం ముందున్న ట్రంప్ భారత్ ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటాడని అనుకోలేము. అయితే, ట్రంప్ అధికారంలో ఉండగా ఇతర దేశాల కంటే చాలా తక్కువ నష్టం భారత్‌కు జరిగిన విషయం కూడా ఇక్కడ చెప్పుకోవాలి. చైనాతో ట్రంప్ తెగదెంపులు చేసుకోవడం వల్లనే ట్రంప్ ప్రభుత్వం పుల్వామా, గల్వాన్ ఘటనల్లో భారత్‌కు మద్దతుగా నిలిచింది. అయితే రెండోసారి అధికారం చేపడితే ట్రంప్ వ్యవహారశైలి ఎలా ఉంటుందో ఇప్పుడే ఊహించలేము. అమెరికాలో రాజకీయపరమైన అస్థిరత, విభజన ఉండటం ఉక్రెయిన్, యూరప్ దేశాల నిరుత్సాహానికి తద్వారా అమెరికా ప్రత్యర్థులకు బలాన్ని ఇస్తుంది. అందుకే అమెరికా ప్రత్యర్థులు... డెమోక్రాట్లు అంటే ఇష్టం లేని కొందరు అమెరికా స్నేహితులు కూడా ట్రంప్ విజయాన్ని కోరుకుంటున్నారు.

ఒక ఉదాహరణ తీసుకుందాం. బీజింగ్ ఇప్పటికే అమెరికా వ్యవహారాన్ని తిరిగి మొదలుపెట్టింది. ట్రంప్‌కు సాయపడేలా ఎన్నికల్లో తప్పుడు ప్రచారాన్ని కూడా మొదలుపెట్టిందన్న వార్తలూ ఉన్నాయి. తన ప్రయోజనాలు కాపాడేలా చేస్తే వాణిజ్య పునరుద్ధరణ సాధ్యమే అని చైనా ట్రంప్‌కు సంకేతాలిచ్చినా ఆశ్చర్యం లేదు. టిక్‌టాక్ విషయంలో ట్రంప్ తన మునుపటి వైఖరిని మార్చుకున్న విషయం ఇక్కడ చెప్పుకోవాలి. అమెరికన్ రాజ్యాంగంపై పోరు చేస్తామన్న ట్రంప్ వ్యాఖ్య, వ్యాపార వాణిజ్య వ్యవహారాల్లో దుందుడుకుతనం, ఆసియా, యూరప్‌లలోని కొన్ని మిత్రదేశాలతోనూ దురుసుగా వ్యవహరించడం వంటివి చూస్తే ట్రంప్ మరోసారి అధికారంలోకి వస్తే ప్రపంచం మరోసారి గందరగోళంలో పడుతుందనేది మాత్రం వాస్తవం. అలాంటి నేపథ్యంలో భారతీయ దౌత్యం అవసరం మరింత ఎక్కువవుతుంది. ఈ విషయంలో భారత్ ఎంతో కొంత ఆందోళన చెందాల్సిన అవసరమైతే కనిపిస్తోంది.

వ్యాసకర్త జర్నలిస్ట్ మరియు కాలమిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వాళ్లకిది వినోదం



న్యూయార్క్‌లోని ఒక ప్రసిద్ధ ప్రొఫెసర్ ఒక కాలమ్ రాశారు. పౌరులను చంపడం ఎంత గొప్పగా ఉండిందో, 10/7 (ఇజ్రాయెల్ మీద హమాస్ దాడి చేసిన రోజు) తనకు ఎంత ఉత్సాహం కలిగించిందో ఆమె రాశారు. ఇంకేమిటి ఇప్పుడు? ఈ బోరుతో చచ్చే జనాలకు మా మధ్య ప్రాచ్య జనాలం కేవలం వారి స్వైరకల్పనల ఆటబొమ్మలం అంతే!

– అరశ్ అజీజీ, రచయిత


నాలుకతో కష్టం...



ఒక వయసుకొచ్చాక మనం ఇండియాలో తాగుతూ పెరిగింది నిజమైన కాఫీ కాదని అర్థమవుతుంది. పాలు, చక్కెరకు కాఫీ వాసన అద్దిన తియ్యటి సిరప్ మాత్రమే అది. ఇప్పుడు నేను కోస్టా రికా నుంచి అరేబికా కాఫీ గింజలు కొంటున్నా, జపనీస్ హారియో గ్రైండర్‌లో గ్రైండ్ చేస్తున్నా, ఫ్రెంచ్ ప్రెస్‌లో బ్రూ చేస్తున్నా, ఐ లవ్ దిస్ కాఫీ. కానీ కొన్నిసార్లు నా పాత తియ్యటి సిరప్‌ను మిస్ అవుతున్నా.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

పోయినవన్నీ...



వైరుధ్యాలతో, నిష్ఫలమైన కోరికలతో, చెదిరిన కలలతో, పోగొట్టుకున్న స్నేహాలతో జీవితం నిండిపోయి ఉండవచ్చు. అయినప్పటికీ, జీసస్ పునరుత్థానం అనేది అన్నింటినీ తిరిగి పొందవచ్చునని నమ్మేట్టు చేస్తుంది(ఈస్టర్ సీజన్).

– పోప్ ఫ్రాన్సిస్,
క్రైస్తవ మతగురువు

అదే పాటా?



ఒక పేదవాడు ప్రధానమంత్రి అయితే, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రతిపక్షం అంటోందని ప్రధాని మోదీ అంటున్నారు. ఆయన 'పేదరికానికి' ఎక్స్‌పైరీ తేదీ ఏమైనా ఉంటుందా? పదేళ్లవుతోందిగా!

– ప్రేమ్ పణిక్కర్, కాలమిస్ట్

తక్కువే ప్రభావవంతం



ఒక ఎనభై ఏళ్ల గ్రామీణ వృద్ధుడిని చూశాను. 13 రకాల మందులు ఆయనకు రాశారు. వాటిని కేవలం 4కి కుదించాను. చాలాసార్లు తక్కువే ఎక్కువ, ప్రత్యేకించి వృద్ధాప్యంలో.

– ఎస్.పి. కాలంత్రి, ఫిజిషియన్

ఇన్ బాక్స్

వాస్తవాలను తెలియచెప్పడమే నివాళి

విప్లవ విద్యార్థి హిమ శిఖరం, సమానత్వ రాజ్య స్వప్న రణ కిరణం కామ్రేడ్ జార్జిరెడ్డి. అన్నిటికంటే మించి ఆయన మానవతావాది. పేదల బాధలు చూసి చలించేవాడు. ఇతరుల కష్టాలను తన కష్టాలుగా భావించి ఎవరితోనైనా పోరాటం చేసేవాడు. ఎదురొడ్డేవాడు. అలాంటి లక్షణాలు ఉన్నవాడిని సమాజం కానీ, చుట్టూ ఉన్న వ్యవస్థలు కానీ చూస్తూ ఊరుకుంటాయా? లొంగదీసుకోవడానికో లేదా చంపెయ్యడానికో సిద్ధమవుతాయి. అదే జరిగింది జార్జిరెడ్డి విషయంలో. మతోన్మాద కాషాయమూకలు కుట్రలు పన్ని, 25 యేళ్ళ విద్యార్థి నాయకుడిపై 32 మంది ప్రొఫెషనల్ గుండాలను ఉపయోగించి పక్కా ప్రణాళికతో హత్య చేయించారు.



జార్జిరెడ్డి

విద్యార్థి ఉద్యమంలో ప్రగతిశీల ఆలోచనలతో, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం, గళం ఎత్తి వారితో మమేకమై ఉస్మానియా విశ్వవిద్యాలయ కేంద్రంగా విద్యారంగ సమస్యలపై, విద్యార్థి హక్కులకై, విద్యార్థులపై చేస్తున్న మూకదాడులపై తిరుగుబాటు చేసిన ధీర యోధుడు కామ్రేడ్ జార్జిరెడ్డి. జార్జి రెడ్డి ఏ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాడో వారే నేడు పాలకులుగా మారి 10 ఏళ్లు అరాచక పాలన చేసి దేశాన్ని విధ్వంసం చేసే విధంగా సంస్కరణలు చేస్తున్నారు. మరో దఫా అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కులాల పేరిట, మతాల పేరిట చిచ్చులు పెడుతూ, దేశభక్తి పేరుతో యువతను పెడదోవ పట్టించే విధంగా పాకిస్తాన్, చైనా బూచి చూపి ఉద్వేగాలు రెచ్చగొడుతూ ఓట్లు దండుకునే కుయుక్తులు పన్నుతున్నారు.

దేశంలోని విద్యారంగాన్ని విధ్వంసం చేయాలని నూతన జాతీయ విద్యా విధానం ద్వారా శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయకుండా అడ్డుకుంటున్నారు. భారతం, రామాయణం, భాగవతాలను చరిత్ర పుస్తకాల్లో పాఠ్యాంశాలుగా చేర్చుతున్నారు. సైన్స్ వాస్తవాలు వెల్లడించే జీవ పరిణామ సిద్ధాంతం లాంటి పాఠ్యాంశాలను విద్యార్థులకు చెప్పకుండా తొలగిస్తున్నారు. విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయకుండా వారి భావజాల వ్యాప్తి కోసం మాత్రమే విద్యాలయాల్లో 'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్' పేరుతో ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారిని డైరెక్ట్‌గా నియామకాలు చేస్తున్నారు. పాఠశాలలో కౌన్సిలర్ల పేరుతో నియామకాలు చేసుకుంటున్నారు.

జార్జి రెడ్డి వారసులుగా మోదీ – ఆర్ఎస్ఎస్ ఉన్మాద చర్యలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. మోదీ ప్రభుత్వం చేసిన వాగ్దానాలూ, ప్రజలకు అందించిన పథకాలకు సంబంధించి వాస్తవాలనూ తెలియజేయాల్సిన బాధ్యత ఉంది. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, మతోన్మాదుల అరాచక పాలనకు చరమగీతం పాడాల్సి ఉంది.

– ఎస్. ఆజాద్, పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
(ఏప్రిల్ 14న జార్జిరెడ్డి 52వ వర్ధంతి)

యుద్ధరంగంలో సాంకేతికత – కొన్ని ప్రశ్నలు

యుద్ధం వల్ల సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతుందా? ఆ యా దేశాలు తమకు అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సరికొత్త ఆవిష్కరణలకు సిద్ధం కావటం అనేది ప్రయోజనకరమైన అంశమా? లేదా అది యుద్ధనీతిని తప్పటం, అనైతికతను ప్రోత్సహించటం అవుతుందా అన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ప్రవేశించని రంగం అంటూ లేదు. యుద్ధరంగంలోకి అది తన బాహువులను చాస్తోంది. ఇజ్రాయెల్ రణక్షేత్రంలోకి ఏఐ ప్రవేశించటం తాజాగా చర్చనీయాంశంగా మారింది. ఇజ్రాయెల్ సైన్యం గాజాలో బాంబింగ్ చేపట్టటానికి ఇంతవరకూ పరిచయం లేని కృత్రిమమేధ ఆధారిత వ్యవస్థను ఉపయోగించింది. హమాస్‌కు సంబంధించి దాదాపు 37 వేలకు పైగా లక్ష్యాలను గుర్తించటానికి దీనిని ఉపయోగించారు. అలాగే దీని ఆధారంగానే పాలస్తీనియన్ పౌరులను కొందరిని గుర్తించి హతమార్చారు.

'మిషన్ లెర్నింగ్' విధానాల ద్వారా యుద్ధ వ్యూహాలను అమలు చేశారు. ఇజ్రాయెల్ ఉపయోగించిన కృత్రిమమేధ వ్యవస్థకు 'లావెండర్' అని పేరు పెట్టారు. ఇక్కడ మనిషి పాత్ర పరిమితం. దానిని అమలు చేయాలా వద్దా అని నిర్ణయం తీసుకోవటమే. 'ఊ' అనుకున్న తర్వాత కొన్ని సెకండ్లలో పని పూర్తయిపోతుంది. ఇజ్రాయెల్ జర్నలిస్టు ఒకరు బాహ్య ప్రపంచానికి ఈ విషయాన్ని వెల్లడించారు. ఆపరేషన్లో ఆరుగురు ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ అధికారులు పాల్గొన్నారని ప్రకటించారు.

అక్టోబర్ 7న దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులకు నిరసనగా ఇజ్రాయెల్ మిలిటరీ ఆపరేషన్‌లో ఇంత వరకు 33 వేలమందికి పైగా పాలస్తీనియన్లు మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కి యుద్ధ సహాయాన్ని నిలిపివేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ప్రధానంగా ఇజ్రాయెల్‌కు సహకారం అందిస్తున్న యూఎస్, బ్రిటన్‌లపై ఒత్తిడి పెరుగుతోంది. పాలస్తీనా పౌరుల మరణాల పట్ల సానుభూతిని ప్రకటిస్తూనే, బిలియన్ డాలర్ల విలువైన బాంబులు, ఫైటర్ జెట్ల అందచేతను యూఎస్ సమర్థించుకుంటోంది. మరో వైపు బ్రిటిష్ ప్రధాని రుషి సునాక్ రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇజ్రాయెల్ చేపట్టిన దాడిలో ఛారిటీ వరల్డ్ కిచెన్ సెంటర్లో ఏడుగురు బ్రిటిష్ పనివాళ్లు చనిపోవటంతో ఈఅంశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

మరోవైపు రష్యా – ఉక్రెయిన్‌ల యుద్ధంలో ఉక్రెయిన్ కూడా ఏఐ ఆధారిత డ్రోన్లను ఉపయోగిస్తోంది. ఇవి మానవ ప్రమేయం లేకుండా వాటంతటికవే లక్ష్యాలను గుర్తించటం, దాడులు చేయటం వంటివి చేస్తాయి. కృత్రిమ మేధ ద్వారా శాటిలైట్ చిత్రాలను, డ్రోన్ వీడియో ఫీడ్‌లను పొందటం వల్ల యుద్ధ



భూమిలో ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. చకచకా నిర్ణయాలు తీసుకోవటానికి వీలవుతుంది. శత్రువును వేగంగా, కచ్చితంగా ఎదుర్కోవటానికి వీలవుతుంది.

పూర్తిగా స్వయంచాలిత ఆయుధాలను వినియోగించటం అనే అంశంపైన చర్చలు సాగుతూనే ఉన్నాయి. ఒకరు ఒకరకమైన సాంకేతికత ఉపయోగిస్తే, దానిని ఎదుర్కోవటానికి మరో సాంకేతికత ముందుకొస్తుంది. ఇప్పుడు కొత్తగా 'ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్' వస్తున్నాయి. ఇవి డ్రోన్ ఆపరేటర్ పైన దాడులకు ఉపయోగపడతాయి. ఇది మరీ కొత్తది అని కూడా చెప్పలేం. ఐసిస్ కొన్నేళ్ల క్రితం అధునాతమైన డ్రోన్ సైన్యాన్ని వినియోగించేది. ఇరాకీ బృందాలపై దాడులు నిర్వహించింది. ఒక ఎయిర్‌క్రాఫ్ట్‌ను కొన్నట్టు ఏఐని కొనటం సాధ్యం కాదు. స్వయం చాలిత ఆయుధాలతో యుద్ధనియమాలు అంటిపెట్టుకుని యుద్ధాలు చేయాలి. అమెరికా, రష్యాతో పాటు దాదాపు 30 దేశాలు ఇదే అభిప్రాయంతో ఉన్నాయి.

యుద్ధాల విషయానికొస్తే, మొదటి ప్రపంచ యుద్ధం (1914–1918)లో మెషిన్ గన్‌లు, గ్రెనేడ్లు ఇతర ఆయుధాలు... సబ్ మెరైన్లు, పాయిజనస్ గ్యాస్, వార్ ప్లేన్లు, ట్యాంకులు ఉపయోగించారు. రెండో ప్రపంచ యుద్ధం (1939–1945) వచ్చేనాటికి రాడార్ టెక్నాలజీ ప్రవేశించింది. కొంత మంది చరిత్రకారులు ఈ సాంకేతికతే అణుబాంబు కంటే విజయానికి కీలకపాత్ర పోషించేదని వ్యాఖ్యానించారు. రెండో ప్రపంచ యుద్ధానికి తెరవేయటానికి తొలి అణుబాంబును అభివృద్ధి చేశారు.

రెండు దశాబ్దాల తర్వాత చూస్తే ప్రపంచం మొత్తాన్ని సర్వనాశనం చేయటానికి అవసరమైనన్ని బాంబులు సిద్ధమైపోయాయి. యుద్ధంలో అణుబాంబును ఉపయోగిస్తే వచ్చే నష్టాన్ని అంచనా వేసుకుని ఏ దేశానికి ఆ దేశం దానిని ఉపయోగించటానికి వెనకడుగు వేసేలా తయారయ్యింది పరిస్థితి. మీరు శత్రు దేశం పైన అణుబాంబు వేసి సర్వనాశనం చేస్తే, మరో నిమిషం అవతల దేశం కూడా అదే పని చేస్తుంది. అందుకే తర్వాత రోజుల్లో చిన్నవి, తక్కువ శక్తిమంతమైన బాంబులను తయారుచేయటం మొదలు పెట్టారు. అణుబాంబు రూపొందించటంలో కీలక భూమిక పోషించిన భౌతిక శాస్త్రవేత్త రాబర్ట్ హైమర్ తర్వాత రోజుల్లో తాను చేసిన పనికి పశ్చాత్తాపానికి లోనయ్యాడు. ఇవన్నీ పక్కన పెడితే ప్రపంచంలో ఏ కొత్త ఆవిష్కరణ వచ్చినా, ముందుగా మిలిటరీలోనే దానికి బీజాలు పడ్డాయనేది చారిత్రక సత్యం.

– డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్ I 99088 92065

ముక్తి మార్గం

ఒక పని సఫలం కావడం అనేది మానవ ప్రయత్నం, దైవ సహకారం రెండూ తోడైనప్పుడే జరుగుతుంది కాబట్టి ఆ రెండింటిలో ఎక్కువ తక్కువలనేది లేదు. నిప్పు రవ్వంతైనప్పటికీ గాలితోడుతో పెరిగి పెద్దదైనట్లుగా, మంచి పని చేయడం ఎంత చిన్నదిగా మొదలైనా దైవానుకూలతతో పెరిగి పెద్దదై మనిషికి ఎనలేని మేలును కలగజేస్తుంది. తైలం అయిపోయిన వెంటనే దీపం ఆరిపోయే విధంగా, చేసే కర్మలో పవిత్రత ఎప్పుడైతే లోపిస్తుందో అప్పటినుండి దైవానుకూలత తగ్గిపోవడం ప్రారంభమౌతుందని పెద్దలు చెబుతారు.

కాలానుగుణంగా ఎలాగైతే చెట్లకు ఆకులు, పూవులు, కాయలు కలుగుతాయో అలాగే మనిషి చేసే మంచి చెడు పనులకు అనుగుణంగా, ఆ యా కాలాలలో సరిపోల్చదగిన



మంచి, చెడు ఫలితాలు కలుగుతాయి. ప్రకృతిలో మార్పులను తెచ్చే ఋతువులు మనిషి చేసే మంచి చెడు పనులను చూస్తూనే వుంటాయి. కాబట్టి ఎవ్వరికీ కనపడ కుండా ఏదో రహస్య కార్యం చేస్తున్నాను అని మనిషి అనుకోవడం వెర్రితనమే అనిపించుకుంటుంది. మానవుడు నలుగురికి మేలు చేసే మంచిపనులను చేయడంలో నిమగ్నుడైతే దాని ఫలితం ఈ లోకంలోనే కాక పరలోకంలో కూడా అనుభవిస్తాడని, ఆంధ్రమహా భారతంలోని తిక్కన పద్యం చెప్పింది.

మేలు రెండు లోకంబుల మేల తెచ్చు;
గీడు సేసిన దప్పదు కీడ యగుట
కాన పురుషవర్తనమున కానుకూల్య
శీలమగు దైవ మది ఫలసిద్ధి జేయు.

ఈ లోకంలో తోటివారికి మేలును కలగజేసే పని చేస్తే అది రెండు లోకాలకూ–అనగా ఇహ పరలోకాలు అనబడే రెండు లోకాలకూ–పుణ్యఫలాన్ని సమకూర్చే మేలే అవుతుంది. అలాగే, అకారణంగా తోటి మనిషికి కష్టం కలగజేసే పని ఇహ పరాలు రెండింటిలోనూ నష్టాన్ని కలిగించి బాధించేదిగా పరిణమిస్తుంది. ఈలోకంలో మనిషి చేసే మంచి చెడు పనులకు అనుగుణంగానే దైవం సమకూర్చే పుణ్యపాప ఫలాలు ఆధార పడి ఉంటాయి కాబట్టి, మనిషి ఈ సత్యాన్ని గ్రహించి ఎప్పుడూ మంచి పనులను చేయడంపైనే దృష్టి పెట్టి జీవనం సాగించాలని, ఫలసిద్ధికి, అనగా ముక్తికి అది సుఖమైన మార్గమని ఆ పద్యంలో సారాంశంగా చెప్పబడింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: శు.పంచమి సా.4.14 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: మృగశిర తె.4.50 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి ఆరుద్ర, వర్జ్యం: ఉ.10.24 నుండి 12.01 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.48 నుండి 7.26 వరకు, అమృతఘడియలు: రా.8.02 నుండి 9.43 వరకు, శ్రీ పంచమి; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: వ.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.10.

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతం తీరు..

- కాంగ్రెస్ 39.40%
- బీఆర్ఎస్ 37.35%
- బీజేపీ 13.90%
- ఎంఐఎం 2.22%
- బీఎస్పీ 1.37%



శ్రీగిరి విజయ్‌కుమార్‌రెడ్డి, సాక్షి ప్రత్యేక ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఏ పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళి అదే తరహాలో లోక్‌సభ ఎన్నికల్లో కొనసాగితే.. కాంగ్రెస్‌కు తొమ్మిది, బీఆర్‌ఎస్‌కు ఏడు, ఎంఐఎంకు ఒక స్థానం దక్కాలి. కానీ రాజకీయాల్లో ఎప్పుడూ నిన్న ఉన్నది నేడు ఉండదు. ఎప్పుడేదైనా జరగొచ్చు. బండ్లు ఓడలు కావచ్చు.. ఓడలు బండ్లు కావచ్చు! అందుకే శాసనసభ ఎన్నికల్లో గెలిచిన పార్టీ తన బలాన్ని మరింత పెంచుకోవటంపై ఫోకస్ చేస్తే.. ఓడిన ప్రధాన పార్టీలు తమ శక్తినంతా కూడదీసుకుని పుంజుకునేందుకు ప్రయత్నిస్తాయి. గౌరవప్రదమైన సంఖ్యలో లోక్‌సభ సీట్లు సాధిస్తేనే తెలంగాణ యవనికపై తమ ప్రయాణాన్ని సాగించే పరిస్థితి ఉంటుందని భావిస్తుంటాయి. ఆ దిశగానే తెలంగాణపై తమ ఆధిపత్యాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుంటే.. కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతోంది. జాతీయ స్థాయిలోనే కాదు రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయమంటూ బీజేపీ ముందుకు వస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్ల కోసం పోటీ పడుతున్న ఈ మూడు పార్టీల్లో.. ఫలితాల అనంతరం రెండే పార్టీలు మిగులుతాయన్న ప్రచారముంది. దీంతో తెలంగాణ లోక్‌సభ ఫలితాలు దేశంలోనే ఉత్కంఠకు తెరలేపుతున్నాయి.

కాంగ్రెస్: మరింత బలపడే లక్ష్యంతో అడుగులు

బీఆర్‌ఎస్: కోల్పోయిన ప్రాభవాన్ని నిలుపుకొనే యత్నం

బీజేపీ: సిట్టింగ్‌ల గెలుపు, అదనంగా సీట్లు సాధించడంపై ఫోకస్

అందరికీ కీలకమే..

శాసనసభ ఎన్నికల్లో బొటాబొటీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. తన ముందున్న సవాళ్లను అధిగమించాలంటే బలాన్ని మరింత పెంచుకోవటం అత్యవసరం. సంక్షేమ పథకాల అమలు సగంలోనే ఉండటం, వలస నేతలకు టికెట్లు వంటి ఇబ్బందులున్నా.. తమకు బలంలేని ప్రాంతాల్లో విస్తరించి పది స్థానాలకుపైగా గెలుచుకుంటేనే ఆ పార్టీ ప్రయాణం సాఫీగా సాగే అవకాశం ఉంది.

ఇక బీఆర్‌ఎస్ పార్టీ గత ఇరవై ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఇప్పుడు సవాళ్లు ఎదుర్కొంటోంది. గతంలో ప్రత్యర్థి ఎవరైనా, ఎలా వచ్చినా తెలంగాణ సెంటిమెంట్‌తో నిలువరించిన బీఆర్‌ఎస్‌కు.. లోక్‌సభ ఎన్నికల కోసం ఇంకా సరైన నినాదమే దొరకలేదు. బలమైన కేడర్, నాయకులున్న బీఆర్‌ఎస్ ఈ ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలు గెలుచుకుంటేనే తమ 'కారు' సాఫీ ప్రయాణానికి అడ్డంకులు తొలగే అవకాశం ఉంది.

మరోవైపు 2019 లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలుచుకున్న బీజేపీ.. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే సరికి డీలా పడింది. తనకు బలమున్న ప్రాంతాల్లోనూ ఓటమి పాలైంది. ఈ క్రమంలో ప్రధాని మోదీ చరిష్మాతో సిట్టింగ్ ఎంపీ స్థానాలతోపాటు కొత్త ప్రాంతాల్లో పాగా వేస్తేనే తెలంగాణలో కమల వికాసం సాధ్యమన్న భావన వ్యక్తమవుతోంది.

అసెంబ్లీ తర్వాత మారిన సీన్

ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి, జహీరాబాద్ లోక్‌సభ సీట్ల పరిధిలోని శాసనసభ స్థానాల్లో స్పష్టమైన ఆధిక్యత కనబరిచింది. బీఆర్‌ఎస్ కరీంనగర్, నిజామాబాద్, మెదక్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్ల లోక్‌సభ స్థానాల పరిధిలో మెజారిటీలు సాధించింది. ఇక బీజేపీ ఆదిలాబాద్, హైదరాబాద్ స్థానాల పరిధిలో మాత్రమే రెండో స్థానంలో నిలిచింది. కానీ లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి.. చాలాచోట్ల ప్రధాన పోటీదారుగా మారుతోంది. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ లోక్‌సభ స్థానాల్లో మూడు పార్టీల మధ్య.. మిగతా చోట్ల ముఖాముఖి పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

ఇంటి నుంచే ఓటింగ్

85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల ఓటర్లకు అవకాశం

తెలంగాణలో 1.93 లక్షలు, ఏపీలో 2.11 లక్షల మంది 85+ ఏళ్ల ఓటర్లు

దేశవ్యాప్తంగా ఇంటి నుంచి ఓటుహక్కు వినియోగించుకోనున్న 1.7 కోట్ల ఓటర్లు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల్లో వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్ద ఓటు వేసే సౌకర్యాన్ని కల్పించింది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న 1.7 కోట్లకు పైగా 85 ఏళ్లు పైబడిన ఓటర్లు, 40% బెంచ్‌మార్క్ వైకల్యం ఉన్న వికలాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే మొదటి, రెండవ దశ పోలింగ్ కోసం 85+ ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులు తమ ఇంటి వద్ద నుంచే ఓటు వేయడం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 81.11 లక్షల మంది 85+ వయస్సు గల ఓటర్లు, 90.07 లక్షల దివ్యాంగుల ఓటర్లు నమోదు చేసుకున్నారు. 85+ ఏళ్ల ఓటర్లలో తెలంగాణలో 79,150 మంది పురుషులు, 1,14,416 మంది మహిళలు, ఆరుగురు థర్డ్ జెండర్ వారు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 84,155 మంది పురుషులు, 1,26,927 మంది మహిళలు, ఆరుగురు థర్డ్ జెండర్ ఓటర్లు 85+ ఏళ్ల వారు ఉన్నారు. అంతేకాకుండా తెలంగాణలో 5,26,709 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 5,18,193 మంది దివ్యాంగులైన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం నమోదు చేసుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. కాగా పారదర్శకత కోసం ఇంటి వద్ద ఓటింగ్ వేసే పూర్తి ప్రక్రియ వీడియోగ్రాఫ్ చేయనున్నట్లు ఈసీ పేర్కొంది.

అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ స్థానాల వారీగా పార్టీలకు పోలైన ఓట్లు

ప్రాంతం	లోక్‌సభ స్థానం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ	ఎంఐఎం
ఉత్తర తెలంగాణ పరిధిలో..	ఆదిలాబాద్	2,52,290	4,65,492	4,48,965	
	పెద్దపల్లి	6,82,033	3,74,363	79,418	
	కరీంనగర్	5,12,352	5,17,601	2,50,400	
	నిజామాబాద్	4,08,135	4,17,045	3,65,374	
సెంట్రల్ తెలంగాణ పరిధిలో..	వరంగల్	6,63,556	5,03,298	1,56,638	
	జహీరాబాద్	5,49,143	5,30,499	1,72,766	
	మెదక్	4,20,881	6,68,955	2,11,626	
	మహబూబాబాద్	6,85,897	4,43,910	32,500	
	ఖమ్మం	6,52,957	4,83,873	17,805	
దక్షిణ తెలంగాణ పరిధిలో..	హైదరాబాద్	1,01,014	1,71,497	2,21,954	4,23,676
	సికింద్రాబాద్	2,80,607	4,63,740	2,16,410	
	నల్లగొండ	7,66,069	4,78,631	87,524	
	భువనగిరి	8,17,279	5,60,002	74,782	
	మహబూబ్‌నగర్	6,11,514	5,11,077	1,13,080	
	నాగర్‌కర్నూల్	6,39,628	5,34,401	1,23,825	
	చేవెళ్ల	6,09,561	7,07,470	3,31,422	
	మల్కాజిగిరి	5,82,917	9,38,066	3,86,880	



నేడు చేవెళ్లలో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలి సభ

హాజరుకానున్న పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పార్టీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ కేంద్రంలో శనివారం తొలి బహిరంగ సభను నిర్వహిస్తోంది. ప్రజా ఆశీర్వాద సభ పేరిట నిర్వహిస్తున్న ఈ సభలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలోని ఫరా ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో శనివారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ తదితరులు శుక్రవారం పరిశీలించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత నల్లగొండ, కరీంనగర్‌లలో బీఆర్‌ఎస్ బహిరంగ సభలు నిర్వహించింది. అయితే ఈ రెండు సభలూ రైతాంగ సమస్యలపై ప్రభుత్వ తీరును ఎండగట్టడమే లక్ష్యంగా జరిగాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్లలో బీఆర్‌ఎస్ తొలి సభ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఒక్కో పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రెండు లేదా మూడు బహిరంగ సభలు నిర్వహించాలా.. లేక కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టాలా అనే అంశంపై ఇంకా కసరత్తు కొనసాగుతోంది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో సుమారు 20 రోజుల పాటు కేసీఆర్ పాల్గొనే సభలు, బస్సు యాత్ర షెడ్యూలుపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని పార్టీ వర్గాలు చెపుతున్నాయి. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శుక్రవారం సోషల్ మీడియా సమన్వయకర్తలను ప్రకటించారు. నాగర్‌కర్నూలు లోక్‌సభ స్థానానికి అభిలాశ్‌రావు రంగినేని, మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి ఆశప్రియ ముదిరాజ్ సమన్వయకర్తలుగా పనిచేస్తారు.

బీజేపీ, కాంగ్రెస్‌ల చీకటి ఒప్పందం

- బీజేపీని గెలిపించేందుకు చాలా చోట్ల కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులు
- అబద్ధాల్లో బీజేపీ బడేమియా.. కాంగ్రెస్ చోటేమియా
- సీఎం రేవంత్ చెడ్డీగ్యాంగ్ సభ్యుడా
- సమైక్యవాదుల అడుగులకు మడుగులొత్తడం మానుకో
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



కరీంనగర్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో వినోద్‌కుమార్

కరీంనగర్, సాక్షి, సిద్దిపేట: ఉద్దెరమాటల కాంగ్రెస్, మోసపూరిత వాగ్దానాల బీజేపీలు రాష్ట్రంలో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాయని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు దోహదపడే విధంగా కాంగ్రెస్ బలహీనమైన, డమ్మీ అభ్యర్థులను నిలబెడుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. శుక్రవారం కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడూ జై తెలంగాణ అనలేదని, ఉద్యమ సందర్భంలో రేవంత్ కరీంనగర్‌కు తుపాకీ పట్టుకొని బయలుదేరిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాకుంటే రేవంత్ సీఎం అయ్యేవారా అని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై రేవంత్ దిగజారుడు మాటలు మాట్లాడటం మానుకోవాలని, విమర్శలకు జవాబు ఇవ్వాల్సిన సీఎం మాజీ సీఎం కేసీఆర్‌ను చెడ్డీ విప్పుతానని మాట్లాడటం ఏమిటని నిలదీశారు.

రేవంత్ ఏమైనా చెడ్డీ గ్యాంగ్ సభ్యుడా అంటూ ఫైర్ అయ్యారు. కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్ చేసిన అభివృద్ధి చెప్పమంటే క్యాలెండర్లు, చిత్రపటాలు చూపుతూ ఓట్లు అడగటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. సమైక్యవాదుల అడుగులకు మడుగులొత్తే కాంగ్రెస్, బీజేపీలతో పెనుప్రమాదం పొంచి ఉందని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కి అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, మేయర్ వై.సునీల్‌రావు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లోనే కాంగ్రెస్‌లో లుకలుకలు

సీఎం రేవంత్ రెడ్డి దగ్గర సరుకు లేదని.. అందుకే లీకులు, ఫేకు వార్తలతో కాలం గడుపుతున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సిద్దిపేట పట్టణ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంలో లుకలుకలు మొదలయ్యాయన్నారు. అబద్ధాల్లో బీజేపీ బడేమియా అయితే.. కాంగ్రెస్ చోటేమియా అని విమర్శించారు. మెదక్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్‌తో పాటు మరికొన్ని చోట్ల బీజేపీని గెలిపించేందుకు కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను పెట్టిందన్నారు. ఉప ఎన్నికల్లో అబద్ధాలతో గెలిచి మాట తప్పిన రఘునందన్ రావుకు అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక ప్రజలు బుద్ధి చెప్పారని, దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్‌లో ఎట్లా చెల్లుతుందని ప్రశ్నించారు. కాగా, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తామంటూ చేసిన ఏకగ్రీవ తీర్మానం కాపీని హరీశ్‌రావుకు అందించారు.

కేంద్రంలో ఏ పార్టీకీ స్పష్టమైన మెజార్టీ రాదు

దేశవ్యాప్తంగా బీజేపీ, కాంగ్రెస్ బయట పడే పరిస్థితి లేదు

10 నుంచి 12 ఎంపీ సీట్లు గెలిస్తే మనమే చక్రం తిప్పొచ్చు

మగాడివైతే హామీలు అమలు చేయాలని రేవంత్‌కు సవాల్

- మేం తెచ్చిన కంపెనీలన్నీ వెళ్లిపోతున్నాయి
- రియల్ ఎస్టేట్ పడిపోయింది
- యాదాద్రిని రాజకీయాల కోసం వాడుకోలేదు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు



బొంగ్లూర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు బయటపడే పరిస్థితి లేదని, కేంద్రంలో ఆ రెండు పార్టీలకు స్పష్టమైన మెజార్టీ రాదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అంచనా వేశారు. మన తెలంగాణ నుంచి బీఆర్‌ఎస్‌కు 10నుంచి 12 ఎంపీ సీట్లు వస్తే మనమే చక్రం తిప్పొచ్చని ఆయన వ్యాఖ్యానించారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సీఎం గుంపు మేస్త్రీ అని.. పీఎం తాపీ మేస్త్రీ అని.. వీరిద్దరూ కలిసి బీఆర్‌ఎస్‌ను ఖతం చేసేందుకు చూస్తున్నారనీ, కానీ అది వారి తరం కాదన్నారు.

రేవంత్ మైక్ వీరుడు

డిసెంబర్ 9న సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తానని చెప్పిన రేవంత్ ఆలస్యమైతే కుర్చీ పోతుందనే భయంతో రెండు రోజులు ముందుగానే ప్రమాణ స్వీకారం చేశాడన్నారు. ఎప్పుడూ.. మగాడివైతే నాపై గెలువు అనే సీఎంను తన మాటల్లోనే అడుగుతున్నానని.. మగాడివైతే రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, మగాడివైతే ఆడబిడ్డలకు రూ.2,500 ఇచ్చాకే ఓటు అడగాలని, మగాడివైతే ముసలోళ్లకు రూ.4 వేలు ఇచ్చి మాట్లాడాలని, మగాడివైతే రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేవంత్ మైక్ వీరుడేనని ఎద్దేవా చేశారు.

పూలే, అంబేద్కర్ వారసుడు కేసీఆరే..

పూలే, అంబేద్కర్‌కు నిజమైన వారసుడు కేసీఆర్ మాత్రమేనని కేటీఆర్ అన్నారు. పూలే చెప్పినట్లు విద్యతోనే వికాసం వస్తుందని నమ్మి ఒకేసారి 1,008 గురుకుల పాఠశాలలు పెట్టి ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.లక్షా ఇరవై వేలు ఖర్చు పెట్టింది ఆయననేనని గుర్తు చేశారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, అంబేద్కర్ సచివాలయం, దళితబంధు కేసీఆర్‌కే సాధ్యమయ్యాయన్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, ప్రస్తుతం జరుగుతున్న ఎంపీ ఎన్నికల్లో యాభై శాతానికి పైగా సీట్లను బీసీలకు ఇచ్చిన ఘనత అధినేత కేసీఆర్‌దేనని కొనియాడారు. రాముడు అందరివాడని, ఆయన పేరుతో రాజకీయాలు సరికాదని బీజేపీకి కేటీఆర్ హితవు పలికారు. తాము కూడా యాదాద్రిని అద్భుతంగా అభివృద్ధి చేశామని, కానీ ఏనాడూ రాజకీయం కోసం వాడుకోలేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎంపీ అభ్యర్థి మల్లేశ్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ పడిపోయింది

రియల్ ఎస్టేట్ అంటే రేవంత్‌రెడ్డి అని చెప్పాడని.. ఇప్పుడు రంగారెడ్డి, ఇబ్రహీంపట్నంలో రియల్ ఎస్టేట్ పరిస్థితి ఎట్లుందని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వానికి తెలివి లేక రియల్ ఎస్టేట్ పడిపోయిందని విమర్శించారు. ప్రపంచ దిగ్గజ కంపెనీ ఫాక్స్‌కాన్, రూ.3,500 కోట్లతో మరో కంపెనీ కేన్స్‌ను తీసుకొస్తే కొత్త ప్రభుత్వం రావడంతో గుజరాత్‌కు తరలిపోయాయని ఆరోపించారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ఫార్మాసిటీ ఏర్పాటుకు భూమి కేటాయించి, వసతులు కల్పించామని, దాన్ని నడుపుకొనే చేతకాని అసమర్థ నాయకులు కాంగ్రెస్ వాళ్లని మండిపడ్డారు. పరిశ్రమలు వస్తే రియల్ ఎస్టేట్ వస్తుందన్న అవగాహన కూడా ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ పార్టీకి ఆర్‌పీఐ మద్దతు: జన్ను సాంబయ్య



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి మద్దతు తెలుపుతున్న జన్ను సాంబయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): రాష్ట్రంలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) తెలంగాణ పార్టీ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎన్నికల ఇన్‌ఛార్జి సి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి మద్దతు తెలిపామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగ ఫలాలు బహుజన వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. పేదల పక్షపాతి అయిన కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్రవ్యాప్తంగా తమవంతుగా కృషి చేస్తామన్నారు.

బీఆర్‌ఎస్ వరంగల్ బరిలో సుధీర్‌కుమార్

▶ మొదటి పేజీ తరువాయి

నలుగురు ఎమ్మెల్సీలతోపాటు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కేసీఆర్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం సుదీర్ఘంగా భేటీ అయ్యారు. బీఆర్‌ఎస్ తరఫున బరిలోకి దింపాలని నిర్ణయించిన కడియం కావ్య.. పార్టీని వీడటంతో ప్రత్యామ్నాయ అభ్యర్థి కోసం కొనసాగిన వేటపై ఈ సమావేశంలో చర్చించారు. ఇటీవల జిల్లాకు చెందిన నేతలు సిఫార్సు చేసిన నలుగురి పేర్లపై చర్చించి.. చివరికి సుధీర్‌కుమార్ పేరును ఖరారు చేశారు. తొలుత స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పేరును కూడా పరిశీలించినా.. ఆయనకు స్టేషన్ ఘన్‌పూర్ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చేందుకే కేసీఆర్ సుముఖత వ్యక్తం చేశారు. అయితే ఎంపీ టికెట్ ఇవ్వకపోవడంతో రాజయ్య తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరేదీ, లేనిదీ స్పష్టత రావాల్సి ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

సానుకూల సంకేతాలు పంపేందుకే!

అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, తర్వాత పార్టీని వీడినవారికి కాకుండా.. ఇకపై పార్టీని అంటిపెట్టుకుని ఉండే వారికే అవకాశాలు వస్తాయన్న సంకేతాలు ఇచ్చేందుకే సుధీర్‌కుమార్‌ను అభ్యర్థిగా ఎంపిక చేసినట్టు బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. వరంగల్ ఎంపీ టికెట్ ఆశించిన వంగపల్లి శ్రీనివాస్, సుందర్ రాజు, డాక్టర్ నిరంజన్, స్వప్న తదితరులకు భవిష్యత్తులో గుర్తింపు దక్కుతుందని హామీ ఇచ్చినట్టు వివరిస్తున్నాయి. కేసీఆర్‌తో శుక్రవారం జరిగిన భేటీలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, వినయ్ భాస్కర్, నరేందర్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, బండ ప్రకాశ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బసవరాజు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో లేనివాళ్లే మమ్మల్ని విమర్శిస్తారా?

తెలంగాణకు ఏం చేశారని బీజేపీకి ఓట్లేయాలి

టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోకు దేశవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తుంటే బీజేపీ నేతలు విమర్శించడం సిగ్గుచేటని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రజల ముందుకు మేనిఫెస్టోతో రాలేని వాళ్లు, అసలు మేనిఫెస్టోనే లేని వాళ్లు తమను విమర్శిస్తారా అని మండిపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం టీపీసీసీ అధికార ప్రతినిధులు చనగాని దయాకర్, కోట శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ...రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని బీజేపీ ప్రభుత్వం గుజరాత్‌కు తీసుకెళ్తే ఆ పార్టీ నేతలు ఒక్కరు కూడా మాట్లాడలేదని గుర్తు చేశారు. అసలు ఈ పదేళ్లలో బీజేపీ తెలంగాణకు ఏం చేసిందని ఆ పార్టీకి ఓట్లేయాలని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రచారాన్ని అక్కడి ప్రజలు అడ్డుకుంటున్నారని, తెలంగాణలో కూడా ఎన్నికల ప్రచారానికి వస్తున్న ఆ పార్టీ నేతలను ప్రజలు నిలదీయాలని కోరారు.

ఆ మూడ్ స్వింగ్ ఎటో!

కీలకంగా మారిన బిహార్, బెంగాల్, మహారాష్ట్ర ● ఎవరికీ అందని ఓటర్ల నాడి ● ఎన్నికల ఫలితాలనే ప్రభావితం చేసే చాన్స్

దేశంలో మోదీ మేనియా ఏమాత్రం తగ్గలేదని, ఫలితంగా వరుసగా మూడో ఘన విజయంతో బీజేపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని పలు సర్వేలు చెబుతున్నాయి. అయితే కీలక రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్రల్లో మాత్రం ఓటరు నాడి ఎవరికీ అందడం లేదు. దాంతో వాటిని ఈసారి ఎన్నికల ఫలితాలను నిర్దేశించగల స్వింగ్ స్టేట్లుగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎందుకంటే ఆ మూడు రాష్ట్రాలూ కలిపి ఏకంగా నాలుగో వంతు ఎంపీలను లోక్సభకు పంపుతున్నాయి! వాటిని నిర్ణాయక రాష్ట్రాలుగా మారుస్తున్న కారకాలేమిటి? అక్కడ ఫలితాలను ఊహించడం ఎందుకింత కష్టసాధ్యంగా మారింది...?

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికాలో 7 రాష్ట్రాలను స్వింగ్ స్టేట్స్గా పేర్కొంటారు. అధ్యక్ష ఎన్నికల ఫలితాలను ప్రతిసారీ అవే నిర్ణయిస్తుంటాయి. ఎన్డీఏ 400 సీట్లు దాటాలన్న లక్ష్యాన్ని దాటుతుందో లేదో బెంగాల్, బిహార్, మహారాష్ట్ర ఫలితాలు నిర్ణయించనున్నాయి. బెంగాల్లో టీఎంసీ,బీజేపీ మధ్య పోరు నెలకొంది. బిహార్లో రాజకీయ పునరేకీకరణతో సమీకరణాలు మారాయి. మహారాష్ట్రలో రెండు పెద్ద పార్టీలు నిలువునా చీలి రెండో ఎన్డీఏలో, మరో రెండు విపక్ష ఇండియా కూటముల్లో చేరి ఎదురెదురుగా మోహరించాయి. దాంతో 130 ఎంపీ సీట్లున్న ఈ 3 రాష్ట్రాల్లో ఎవరికెన్ని సీట్లు వస్తాయన్నది ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు.

బెంగాల్లో బీజేపీ పాచిక పారేనా...?



2019 లోక్సభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్లో బీజేపీ పాగా వేసిన తీరు ఆసక్తికరం. మోదీ మేనియాకు పౌరసత్వ అంశం తదితరాలు తోడవడంతో 42 లోక్సభ స్థానాల్లో ఏకంగా 18 సీట్లను బీజేపీ తన ఖాతాలో వేసుకోగలిగింది. 2014లో 17 శాతమున్న ఓటు శాతాన్ని 40 శాతానికి పెంచుకోగలిగింది. ఈసారి పరిస్థితి ఎలా ఉండనుందన్నది అంచనాలకు అందడం లేదు. కాకపోతే ప్రతి స్థానంలోనూ హోరాహోరీ పోరు ఖాయంగా కన్పిస్తోంది. ప్రధాని మోదీ ఇంకా రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టలేదు. ఆయన ఏయే అంశాలను ప్రచారాస్త్రాలుగా సంధిస్తారన్నది కూడా ఆసక్తికరం. వాటిని బట్టి రాష్ట్రంలో ఓటర్ల మూడ్ మారిపోయే ఆస్కారముంది. అయితే బెంగాల్లో ఈసారి బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ చెబుతుండటం ఆసక్తికరం. మిగతా విశ్లేషకులు మాత్రం బీజేపీకి ఈసారి ఓట్లశాతం మరింత పెరగవచ్చంటూనే, అది సీట్ల సంఖ్యలో ప్రతిఫలిస్తుందో లేదో చూడాలని చెబుతుండటం విశేషం. పౌరసత్వ సవరణ చట్టం అమల్లోకి రావడం తదితరాల నేపథ్యంలో రాష్ట్రంలో భారీగా ఉన్న ముస్లింల ఓట్లు పూర్తిగా టీఎంసీ వైపు మళ్లినట్టేనని వారంటున్నారు. ఇది మా పార్టీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీకి అతి పెద్ద సానుకూలాంశంగా కన్పిస్తోంది. ''దీనికి తోడు యూపీ వంటి రాష్ట్రాల మాదిరిగా బెంగాల్లో బీజేపీకి పటిష్టమైన సంస్థాగత నిర్మాణం లేదు. పైగా రాష్ట్ర పార్టీలో సువేందు అధికారి, దిలీప్ ఘోష్, సుకాంతో మజుందార్ మధ్య ఆధిపత్య పోరు పుట్టి ముంచేలా కన్పిస్తోంది'' అని సీనియర్ జర్నలిస్టు జయంత ఘోషా అభిప్రాయపడ్డారు. తృణమూల్ తన 22 స్థానాలను నిలుపుకుంటుందని, బీజేపీకి ఒక సీటు పెరుగుతుందని, కాంగ్రెస్ ఒక్క స్థానానికి పడిపోతుందని ఇండియాటుడే సర్వే పేర్కొంది.

రసకందాయంలో బిహార్



2019లో ఎన్డీఏ క్లీన్స్వీప్ చేసిన రాష్ట్రాల్లో బిహార్ ముఖ్యమైనది. 40కి ఏకంగా 39 స్థానాలు అధికార కూటమి వశమయ్యాయి. కానీ ఇక్కడ ఎన్నికల ఫలితాలను అంచనా వేయడం ఎప్పుడూ కత్తిమీద సామే. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు నల్లేరుపై నడకేనని అంతా భావించారు. తీరా చూస్తే ఆ అంచనాలన్నీ తప్పి జేడీ(ఎస్), ఆర్జేడీల మహాఘట్బంధన్ ఘనవిజయం సాధించింది. కానీ పల్టూ రామ్గా పేరుపడ్డ జేడీ(యూ) సారథి, సీఎం నితీశ్కుమార్ 2020 అసెంబ్లీ ఎన్నికల నుంచి వేస్తున్న పిల్లిమొగ్గలతో ఓటర్లలో తీవ్ర అయోమయం నెలకొన్నట్టు కన్పిస్తోందని పట్నాకు చెందిన సీనియర్ జర్నలిస్టు రోహిత్సింగ్ అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో జట్టు కట్టిన నితీశ్ 2022లో దానికి కటీఫ్ చెప్పి ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమితో స్నేహం చేశారు. తాజాగా గత జనవరిలో మళ్లీ ఎన్డీఏ గూటికి చేరారు. దీన్ని జనం జీర్ణించుకోలేకపోతున్నారన్నది రోహిత్ విశ్లేషణ. అయితే కుల సమీకణాల కోణంలో బీజేపీ-జేడీ(యూ) భాగస్వామ్యం బలమైన జోడీగా కన్పిస్తుండటం విశేషం. కుర్మీ సామాజికవర్గానికి చెందిన నితీశ్కు రాష్ట్రంలో ఏకంగా 36 శాతమున్న అత్యంత వెనకబడ్డ వర్గాల్లో విశేష ఆదరణ ఉంది. పైగా గతేడాది బిహార్లో జరిపించిన కులగణన ఆయనకు మరిన్ని ఓట్లు కురిపించేలా కన్పిస్తోంది. 2005, 2010 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీ(యూ) జోడీ సూపర్హిట్టయింది. 2019 లోక్సభ ఎన్నికల్లోనూ ఏకంగా 39 సీట్లు కొల్లగొట్టింది. దీనికి తోడు ఎన్నికల వేళ ఇంటి పోరు ఆర్జేడీకి పెద్ద తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో మోదీ-నితీశ్ జోడీ దూకుడును తేజస్వీ యాదవ్ ఏ మేరకు నిలువరిస్తారన్నది ఆసక్తికరం.

'మహా' గందరగోళం...



48 సీట్లున్న మహారాష్ట్ర యూపీ తర్వాత లోక్సభకు అత్యధిక ఎంపీలను పంపుతోంది. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీఏ గెలుపు నల్లేరుపై నడకలా సాగింది. 2019లోనైతే బీజేపీ, శివసేన సంయుక్తంగా ఏకంగా 41 స్థానాలు ఒడిసిపట్టాయి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. గత ఐదేళ్లలో రాష్ట్రంలో రాజకీయాలతో పాటు ఏకంగా పార్టీలే మారిపోయాయి! తర్వాత ఏక్నాథ్ షిండే సారథ్యంలో శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలో మరో కీలక పార్టీ ఎన్సీపీ నిలువునా చీలిపోయాయి. చీలిక వర్గాలే అసలైన పార్టీలుగా గుర్తింపు పొందాయి. ఎన్డీఏలో చేరి బీజేపీతో జట్టు కట్టి ఎన్నికల బరిలో దిగాయి. దీన్ని ప్రజలు పెద్దగా జీర్ణించుకోలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దాంతో ఈసారి కాంగ్రెస్, ఉద్ధవ్ శివసేన, శరద్ పవార్ ఎన్సీపీలతో కూడిన విపక్ష ఇండియా కూటమిదే పైచేయి కావచ్చంటున్నారు. సర్వేలు కూడా ఇండియా కూటమి ఏకంగా 26 స్థానాలు గెలుస్తుందంటున్నాయి. అదే నిజమైతే రాష్ట్రంలో ఎన్డీఏ కూటమికి 20 సీట్లకు పైగా గండి పడుతుంది! అదే సమయంలో ఎన్నికల వేళ ఎంఎన్ఎస్ నేత రాజ్ ఠాక్రే మద్దతు ఎన్డీఏకు కాస్త కలిసొచ్చేలా కన్పిస్తోంది. మరాఠా రిజర్వేషన్లది కూడా ఈసారి రాష్ట్రంలో కీలక పాత్ర కానుంది. విద్య, ఉద్యోగాల్లో వారికి అదనంగా 10 శాతం కోటా కల్పిస్తూ శివసేన చీఫ్, సీఎం ఏక్నాథ్ షిండే ఇటీవలే అసెంబ్లీలో బిల్లు పెట్టారు. సాంప్రదాయికంగా బీజేపీ ఓటర్లయిన ఇతర వెనకబడ్డ వర్గాలు దీనిపై గుర్రుగా ఉన్నారు. మరాఠా కోటా తమ వాటాకే ఎసరు పెడుతుందన్న భయం వారిలో పెరుగుతోంది. ఇన్ని సమీకరణాల మధ్య మహారాష్ట్రలో ఎవరికెన్ని సీట్లొస్తాయో అంచనా వేయడం కష్టంగా మారింది.



పక్కా లోకల్

ఎన్నికల వి-చిత్రం

లోకల్ రైలులో తిరుగుతూ ప్రజలను ఓట్లు వేయమని అభ్యర్థిస్తున్న ఈమె పేరు లాకెట్ చటర్జీ. పశ్చిమ బెంగాల్లో హుగ్లీ లోక్సభ స్థానం నుంచి బీజేపీ టికెట్పై పోటీ చేస్తున్నారు

ఎలక్షన్ బీట్

బారాముల్లా బరిలో ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా వచ్చే లోక్సభ ఎన్నికల్లో బారాముల్లా స్థానం నుంచి పోటీ చేస్తారని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) శుక్రవారం ప్రకటించింది. అదేవిధంగా, ఎన్సీ కంచుకోటగా ఉన్న శ్రీనగర్ నియోజకవర్గం నుంచి షియా నేత ఆగా సయ్యద్ రుహుల్లా మెహ్దీ పోటీ చేస్తారని పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా వెల్లడించారు. మొత్తం 18 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించిన ఉన్న బారాముల్లా లోక్సభ స్థానంపైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఇక్కడి మెజారిటీ షియా ముస్లిం ఓట్లపైనే ఒమర్ ఆశలు పెట్టుకున్నారు. ఇక్కడ ఒమర్కు పీపుల్స్ కాన్ఫరెన్స్ నేత సజాద్ గనీ లోన్ నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు ముందు 1957 తర్వాత బారాముల్లా సీటును ఎన్సీ పది పర్యాయాలు దక్కించుకోగా కాంగ్రెస్ నాలుగుసార్లు, పీడీపీ ఒక పర్యాయం గెలుచుకుంది.

ప్రచారానికి బెయిల్ ఇవ్వండి: సిసోడియా

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ తరఫున ప్రచారంలో పాల్గొనేందుకుగాను తనకు మధ్యంతర బెయిల్ మంజూరుచేయాలంటూ ఆప్ నేత మనీశ్ సిసోడియా శుక్రవారం ఢిల్లీలో సీబీఐ, ఈడీ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకల కేసులో సిసోడియాను సీబీఐ గత ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన అరెస్ట్చేయడం తెల్సిందే. ఆ తర్వాత ఇదే కేసులో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తూ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ సైతం ఆ తర్వాతి నెలలో సిసోడియాను అరెస్ట్చేసి విచారించింది. కొద్దిరోజులు ఈడీ కస్టడీ తర్వాత కోర్టు ఆయనను జ్యుడీషియల్ కస్టడీకి తరలించింది. అప్పటి నుంచి ఆయన జైలులోనే ఉన్నారు.

అమేథీని నిర్లక్ష్యం చేశారు: స్మృతి ఇరానీ

అమేథీ(యూపీ): అమేథీ ఎంపీగా 15 ఏళ్లపాటు కొనసాగిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నియోజకవర్గం అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని కేంద్ర మంత్రి, బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ ఆరోపించారు. 'అప్పట్లో ఆయన తల్లి సోనియా గాంధీ ప్రభుత్వమే కేంద్రంలో ఉండేది. యూపీ ప్రజలు వారికే మద్దతిచ్చారు. కానీ, రాహుల్ గాంధీ అమేథీ అభివృద్ధిని గురించి పట్టించుకోలేదు'అని మంత్రి విమర్శించారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి చూస్తే అమేథీ గతంలో ఎంత నిర్లక్ష్యానికి గురైందో అర్థమవుతుందని చెప్పారు. శుక్రవారం అమేథీలోని తన నివాసంలో ఆమె మాట్లాడారు. వయనాడ్ నుంచి ఎందుకు పోటీ చేస్తున్నారంటూ కర్ణాటక మంత్రి ఒకరు గతంలో ప్రశ్నించగా అక్కడి ప్రజలు మరింత విధేయులుగా ఉంటారని రాహుల్ బదులిచ్చారని ఆమె పేర్కొన్నారు. అంటే 15 ఏళ్లపాటు ఎంపీగా ఉన్న నియోజకవర్గం ప్రజలు విధేయులు కారా? ద్రోహులా? అని స్మృతి ఇరానీ నిలదీశారు.

విభజించేందుకే కులగణన: జేపీ నడ్డా

ఛింద్వారా: దేశవ్యాప్త కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ చీఫ్ జేపీ నడ్డా స్పష్టంచేశారు. కులగణన పేరిట సమాజాన్ని విభజించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. శుక్రవారం మధ్యప్రదేశ్లోని ఛింద్వారాలో జరిగిన బీజేపీ ప్రచారసభలో నడ్డా ప్రసంగించారు. '' గరీబ్(జీ), యువ(వై), అన్నదాత-కిసాన్(ఏ), నారీశక్తి(ఎన్).. జ్ఞాన(జీవైఏఎన్) సాధికారతపై మోదీ ప్రభుత్వం ప్రధానంగా దృష్టిపెట్టింది. దేశాభివృద్ధికి ఆ జ్ఞానమే మూలాధారం. జనాన్ని కులాల పేరిట విడగొట్టేందుకే కాంగ్రెస్ కులగణన డిమాండ్ను ముందుకు తెచ్చింది' అని నడ్డా అన్నారు.

ఇక కాంగ్రెస్ అంతర్థానమే: రాజ్నాథ్

కాశీపూర్: రాక్షస బల్లుల తరహాలోనే కాంగ్రెస్ పార్టీ మరికొన్నేళ్లలో అంతరించిపోతుందని రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ చెప్పారు. కాంగ్రెసా.. అంటే ఏమిటి? అని చిన్నపిల్లలు అడిగే పరిస్థితి వస్తుందన్నారు. కాంగ్రెస్లో కొనసాగుతున్న అంతర్గత పోరాటం బిగ్బాస్ షోలాగా ఉందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ నుంచి నేతలు బయటకు వెళ్లిపోతున్నారని, ఒకరి తర్వాత ఒకరు బీజేపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం ఉత్తరాఖండ్లోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార ర్యాలీలో రాజ్నాథ్ సింగ్ మాట్లాడారు.

నియమావళిని బీజేపీ ఉల్లంఘిస్తోంది

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కూచ్ బిహార్/అలీపూర్దువార్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బీజేపీ ఉల్లంఘిస్తోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. రాజకీయ స్వలాభం కోసం బీజేపీ కేంద్ర విభాగాలను దుర్వినియోగం చేస్తోందన్నారు. అన్ని పార్టీలను సమదృష్టితో చూడాలని ఆమె ఎన్నికల సంఘాన్ని కోరారు. సీఎం మమత శుక్రవారం కూచ్ బెహార్, అలీపూర్దువార్లలో జరిగిన ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించారు. జల్పాయ్గురిలో ఇటీవలి తుపాను కారణంగా ధ్వంసమైన ఇళ్లను పునర్నిర్మించేందుకు ఎన్నికల సంఘం అనుమతులు ఇవ్వడం లేదని చెప్పారు.

మేమొస్తే 30 లక్షల ఉద్యోగాలు: రాహుల్

సాక్షి, చెన్నై/తిరునల్వేలి: కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. గ్రాడ్యుయేట్లకు, డిప్లొమా పూర్తిచేసిన వారికి లబ్ధి చేకూర్చడానికి పార్లమెంట్లో అప్రెంటీస్షిప్ హక్కు చట్టం తీసుకొస్తామన్నారు. జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)తో పేద విద్యార్థులు ఇబ్బందులు ఎర్కొంటున్నారని చెప్పారు. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే నీట్ నిర్వహణపై నిర్ణయాన్ని రాష్ట్రాలకే వదిలేస్తామన్నారు. తమిళనాడులోని తిరునల్వేలి, కోయంబత్తూరు లోక్సభ నియోజకవర్గాల్లో రాహుల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రచారంలో తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా పాల్గొన్నారు.

రాష్ట్రపతి పాలనకు కుట్ర

కేజ్రీవాల్ సర్కార్ను అస్థిరపరిచే యత్నం: మంత్రి అతిశి

సాక్షి, న్యూఢిల్లీ: వరసబెట్టి మంత్రులుసహా ఏకంగా ముఖ్యమంత్రినే జైలుపాలుజేసిన కేంద్రప్రభుత్వం త్వరలో ఢిల్లీ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించేందుకు కుట్ర పన్నిందని ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ రాష్ట్ర మహిళా మంత్రి అతిశి శుక్రవారం తీవ్రమైన ఆరోపణలు చేశారు. విశ్వసనీయ వర్గాల ద్వారా తమకు ఈ సమాచారం అందిందన్నారు. ఢిల్లీలో ఆప్ మంత్రి అతిశి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ''కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచి పడగొట్టేందుకు పెద్ద రాజకీయ కుట్ర జరుగుతోందని మాకు విశ్వసనీయ సమాచారం అందింది. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం చట్టవిరుద్ధం. ఎన్నికల్లో ప్రజాతీర్పుకు ఇది పూర్తిగా వ్యతిరేకం. కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే రాష్ట్రపతి పాలన విధించే కుట్ర మొదలైందన్న బలమైన సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొంతకాలంగా సీనియర్ ఐఏఎస్ అధికారులుసహా ఖాళీగా ఉన్న పోస్టులను ఢిల్లీలో భర్తీ చేయలేదు. మంత్రులు ఆదేశించినా సరే సీనియర్ ప్రభుత్వాధికారులు సమావేశాలకు రావట్లేరు. ప్రభుత్వాన్ని ఎలా పాలించాలంటూ పదేపదే కేంద్ర హోం శాఖకు లెఫ్టినెంట్ గవర్నర్ లేఖలు రాస్తున్నారు. చాలా ఏళ్ల క్రితం నాటి కేసును తిరగదోడి కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శిని ఉద్దేశపూర్వకంగా ఇప్పుడు తొలగించారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా ఎక్సయిజ్ కేసులో సీఎంను అరెస్టు చేశారు'' అని అతిశి అన్నారు. ''ఢిల్లీలో రాజ్యాంగ సంక్షోభం తలెత్తిందని తరచూ బీజేపీనేతలు, లెఫ్టినెంట్ గవర్నర్ వ్యాఖ్యలు చేస్తున్నారు. 2014లో రాష్ట్రపతి పాలన పెడితే సుప్రీంకోర్టుకెళ్లాం. దాంతో ఎన్నికలొచ్చాయి. 2015, 2020లో రెండుసార్లు బీజేపీ మట్టికరిచింది ఆప్ గెలిచింది. ఈసారీ ఆప్ గెలుస్తుంది. మళ్లీ రాష్ట్రపతి పాలన విధిస్తే ప్రజలే బీజేపీకి బుద్ధిచెబుతారు'' అని మీడియా సమావేశంలో ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ హెచ్చరించారు. ఇటీవల మంత్రిగా రాజీనామా చేసిన ఆప్ నేత రాజ్కుమార్ ఆనంద్ ఇంటి వద్ద ఆప్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు.



ఈసీ తీరుపై సీఐసీ విస్మయం

న్యూఢిల్లీ: సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద ఈవీఎం, వీవీప్యాట్ల పనితీరు, విశ్వసనీయతను ప్రశ్నిస్తూ అడిగిన సమాచారాన్ని ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కేంద్ర ఎన్నికల సంఘాన్ని కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) తీవ్రంగా తప్పుబట్టింది. చట్టాన్ని ఉల్లంఘించినందుకు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఈసీని సీఐసీ ఆదేశించింది. ఈవీఎంల పనితీరు, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై తాము లేవనెత్తిన అనుమానాలను నివృత్తిచేసేలా సమాచారం ఇవ్వాలని మాజీ ఐఏఎస్ అధికారి ఎంజీ దేవసహాయం సహా ప్రముఖ సాంకేతికవిద్యా నిపుణులు, ఐఐటీ, ఐఐఎంలలోని విద్యావేత్తలు, మాజీ ప్రభుత్వ ఉన్నతాధికారులు 2022 మే రెండో తేదీన ఈసీకి ఆర్టీఐ చట్టంకింద దరఖాస్తు పెట్టుకోవడం తెల్సిందే. తమ ఆర్టీఐ దరఖాస్తుపై ఈసీ ఏ మేరకు చర్యలు తీసుకుందని 2022 నవంబర్ 22న దేవసహాయం మరోసారి ఆర్టీఐ కింద సమాచారం అడిగారు. 30 రోజుల్లోపు సమాధానం ఇవ్వాల్సి ఉన్నా ఈసీ సమాధానం ఇవ్వలేదు. దీంతో ఆయన సీఐసీను ఆశ్రయించారు. దేవసహాయానికి ఎందుకు మీ స్పందన తెలపలేదు? అని ఈసీలోని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్కు చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ హీరాలాల్ సమరియా అడగ్గా ఆయన సమాధానం ఇవ్వలేదు. ''ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం ఇవ్వకుండా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్(పీఐఓ) వ్యవహరించిన తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోంది. దీనిపై 30 రోజుల్లోగా పాయింట్లవారీగా వివరణ ఇవ్వండి' అని ఈసీని సీఐసీ ఆదేశించింది.

జమ్మూకశ్మీర్కు త్వరలో రాష్ట్ర హోదా

శాసనసభ ఎన్నికలు నిర్వహిస్తాం

- ప్రజలు తమ సమస్యలు ఎమ్మెల్యేలకు, మంత్రులకు చెప్పుకోవచ్చు
- జమ్మూలో ఎన్నికల బహిష్కరణ పిలుపులు చరిత్రలో కలిసిపోయాయి
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత అభివృద్ధి వేగం పుంజుకుంది
- జమ్మూకశ్మీర్, రాజస్తాన్ ఎన్నికల ప్రచారంలో మోదీ

ఉద్ధంపూర్/జైపూర్: జమ్మూకశ్మీర్లో అసెంబ్లీ ఎన్నికలు ఇక ఎంతోదూరంలో లేవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని, శాసన సభ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేలతో, మంత్రులతో చెప్పుకోవచ్చని తెలియజేశారు. గతంలో జమ్మూకశ్మీర్లో వేర్పాటువాదుల నుంచి ఎన్నికల బహిష్కరణ పిలుపులు వినిపించేవని, ప్రస్తుతం అవన్నీ చరిత్రలో కలిసిపోయాయని పేర్కొన్నారు. సీమాంతర ఉగ్రవాదం, బాంబు దాడులు, రాళ్ల దాడులు, కాల్పులు, ఘర్షణలు, భయాందోళనల ప్రసక్తి లేకుండా ఇక్కడ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరుగబోతున్నాయని చెప్పారు. శుక్రవారం జమ్మూకశ్మీర్లోని ఉద్ధంపూర్లో, రాజస్తాన్లోని బార్మర్లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. రాజస్తాన్ రాష్ట్రం దౌసాలో రోడ్షోలో పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని తెలిపారు.



ఆ అడ్డుగోడ కూల్చేశాం.. శకలాలు సమాధి చేశాం

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్లో అభివృద్ధి వేగవంతమైందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరిగిందని అన్నారు. గతంలో వైష్ణోదేవి, అమర్నాథ్ భక్తుల భద్రతకు ముప్పు ఉండేదని, ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని వెల్లడించారు. గతంలో కుటుంబ పార్టీల నిర్వాకం వల్ల జమ్మూకశ్మీర్ ఎంతో నష్టపోయిందన్నారు. ఆర్టికల్ 370 అనే అడ్డుగోడను సృష్టించింది కుటుంబ పార్టీలేనని మండిపడ్డారు. ఈ ఆర్టికల్ వల్ల ప్రజలకు రక్షణ లభిస్తుందన్న భ్రమను కుటుంబ పార్టీలు కల్పించాయని ధ్వజమెత్తారు. ప్రజల అండతో ఈ అడ్డుగోడను కూల్చివేశామని, దాని శకలాలను సైతం సమాధి చేశామని వ్యాఖ్యానించారు.


ఓ వర్గం ఓట్ల కోసమే మాంసాహార వీడియోలు

విపక్ష 'ఇండియా' కూటమిది మొఘల్ రాజుల మైండ్సెట్ అని ప్రధానమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయోధ్యలో రామ మందిరం బీజేపీ ఎన్నికల ఎత్తుగడ అంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. రామాలయం కోట్లాది మంది ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశమని అన్నారు. రామజన్మభూమి అంశానికి 500 ఏళ్ల చరిత్ర ఉందని, అప్పట్లో ఎన్నికలు లేవని చెప్పారు. మొఘల్ పాలకులు ఆలయాలను కూల్చివేసి, మెజార్టీ ప్రజల మనోభావాలను గాయపర్చి ఆనందిస్తూ ఉండేవారని తెలిపారు. అదే ఆలోచనాధోరణితో విపక్షాలు వ్యవహరిస్తున్నాయని తప్పుపట్టారు. కాంగ్రెస్తోపాటు ప్రతిపక్ష నాయకులు ఓ వర్గం ప్రజలను సంతృప్తిపర్చి ఓట్లు దండుకోవడానికి పవిత్ర మాసాల్లో, నవరాత్రుల్లో మాంసాహారం తింటూ, ఆ వీడియోలను ఉద్దేశపూర్వకంగా ప్రచారంలోకి తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు.

దేశాన్ని శక్తిహీనంగా మారుస్తారా?

భారత రాజ్యాంగాన్ని బీజేపీ ఎంతగానో గౌరవిస్తోందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారంటూ విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఇప్పుడొచ్చినా రాజ్యాంగాన్ని రద్దు చేయలేరని అన్నారు. ప్రభుత్వానికి రాజ్యాంగం భగవద్గీత, రామాయణం, మహాభారతం, బైబిల్, ఖురాన్ లాంటిందని అన్నారు. తమకు రాజ్యాంగమే సమస్తం అని వివరించారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశంలో అణ్వాయుధాలను పూర్తిగా నిర్మూలిస్తామని విపక్ష ఇండియా కూటమిలోని భాగస్వామ్యపక్షాలు చెబుతున్నాయని మోదీ తప్పుపట్టారు. మనకు ఇరువైపులా అణ్వాయుధ సంపత్తి కలిగిన దేశాలున్నాయని చెప్పారు. మనకు అణ్వాయుధాలు లేకపోతే ఏం జరుగుతుందో తెలియదా? అని నిలదీశారు. మీరు ఎవరు ఆదేశాలతో పని చేస్తున్నారో చెప్పాలని ఇండియా కూటమిని నిలదీశారు. దేశాన్ని శక్తిహీనంగా మార్చడమే ఇండియా కూటమి లక్ష్యమా? అని ప్రధానమంత్రి మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

వారణాసి ఆలయంలో పోలీసులకు అర్చకుల డ్రెస్



అర్చకుల మాదిరి డ్రెస్లో మహిళా, పురుష పోలీసులు

లక్నో: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలోని ప్రఖ్యాత కాశీ విశ్వనాథ ఆలయంలో విధులు నిర్వర్తించే పోలీసులు దోతీ కుర్తా ధరించారు. మహిళా పోలీసులు సల్వార్ కుర్తాలో కనిపించారు. వారికి దోతీ కుర్తా, సల్వార్ కుర్తాలను ఉన్నతాధికారులు డ్రెస్కోడ్గా నిర్ణయించినట్లు తెలిసింది. అయితే, దీనిపై సమాజ్వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న పోలీసులు తమ యూనిఫాం కాకుండా ఇతర దుస్తులు ధరించడం ఏమిటని ప్రశ్నించారు. దీనివల్ల భద్రతకు ముప్పు కలుగుందని చెప్పారు. పోలీసులు పూజారుల వేషం వేయడం సరైంది కాదన్నారు. నేరగాళ్లు కూడా ఇలాంటి దుస్తులు ధరించి ప్రజలను మోసం చేసే అవకాశం ఉందన్నారు. ఆలయంలో పోలీసులు పూజారుల దుస్తులు ధరించాలంటూ ఆదేశాలు ఇచ్చినవారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, విశ్వనాథ ఆలయంలో పోలీసుల డ్రెస్కోడ్ను వారణాసి పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ సమర్థించారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆలయాల్లో పోలీసుల విధులు భిన్నంగా ఉంటాయని అన్నారు. రద్దీగా ఉన్నప్పుడు పోలీసులు నెట్టివేస్తే భక్తులు ఆగ్రహిస్తారని తెలిపారు. అర్చకుల వేషధారణలో ఉన్నవారు నెట్టివేస్తే పెద్దగా సమస్యలు రాబోవన్నారు.

ఇజ్రాయెల్పై దాడికి సిద్ధమైన ఇరాన్!

- వచ్చే 48 గంటల్లో ఏ క్షణంలోనైనా దాడి
- వాల్స్ట్రీట్ జర్నల్ కథనం

వాషింగ్టన్: సిరియా రాజధాని డమాస్కస్లోని తమ రాయబారి కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడితో పట్టరాని ఆవేశంతో ఊగిపోతున్న ఇరాన్ వచ్చే 48 గంటల్లో ఇజ్రాయెల్పై దాడికి తెగబడే ప్రమాదం పొంచి ఉంది. ఎంబసీపై దాడిలో ఆర్మీ జనరళ్లు, సైన్యాధికారుల మరణానికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఇరాన్ సిద్ధమవుతోందని వాల్స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. దాడి చేస్తే రాజకీయ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయాతొల్లా అలీ ఖమేనీ చెబుతున్నాసరే ఆ దేశం తన నిర్ణయంపై వెనకడుగు వేసే పరిస్థితి లేదని కథనం వెల్లడించింది. నిజంగా దాడి జరిగితే పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఊహించనంతగా ఎగసిపడటం ఖాయంగా కనిపిస్తోంది. ఇరాన్ దాడి చేస్తే ప్రతిదాడికి ఇజ్రాయెల్ ఇప్పటికే రెడీ అయిపోయిందని తెలుస్తోంది. యుద్ధ సంసిద్ధతపై వార్ కేబినెట్, రక్షణ శాఖ అధికారులతో ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ శుక్రవారం సమావేశం నిర్వహించారు. హమాస్తో ఇప్పట్లో ఆగని యుద్ధంలో తలమునకలైన ఇజ్రాయెల్.. ఇరాన్తోనూ కయ్యానికి కాలు దువ్వడంపై పశ్చిమదేశాలు ఆందోళన చెందుతున్నాయి. డమాస్కస్పై దాడి ఇజ్రాయెల్ పనేనని ఇరాన్ చెబుతుండగా ఇంతవరకూ ఈ విషయంలో ఇజ్రాయెల్ ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఏప్రిల్ ఒకటోతేదీ నాటి ఆ దాడిలో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ ఇద్దరు సైనిక జనరళ్లు సహా ఏడుగురు అధికారుల మరణమే ఈ ఉద్రిక్తతలకు ఆజ్యం పోసింది. యుద్ధవాతావరణం నెలకొనడంతో ఇజ్రాయెల్, ఇరాన్, లెబనాన్కు వెళ్లొద్దని తమ పౌరులకు అమెరికా, ఫ్రాన్స్ దేశాలు హెచ్చరికలు జారీచేశాయి. ఉద్రిక్తతను మరింత పెంచొద్దని ఇరాన్కు నచ్చజెప్పాలని టర్కీ, చైనా, సౌదీ అరేబియా విదేశాంగ మంత్రులతో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఫోన్సంభాషణలో కోరారు. ఇరాన్ విషయంలో మీకు పూర్తి మద్దతు ఇస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యావ్ గాలంట్తో అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ చెప్పారు.

ఇజ్రాయెల్, ఇరాన్లకు వెళ్లకండి

పౌరులకు భారత సర్కార్ ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: తాము చెప్పే వరకూ ఇజ్రాయెల్, ఇరాన్లకు ప్రయాణాల పెట్టుకోవద్దని పౌరులకు భారత విదేశాంగ శాఖ సూచించింది. ఈ మేరకు శుక్రవారం అడ్వైజరీని విడుదలచేసింది. ఇప్పటికే ఆ దేశాల్లో ఉంటే భారతీయ ఎంబసీల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించింది. నిర్మాణరంగంలో కార్మికులుగా భారత్ నుంచి ఇకపై ఎవరినీ ఇజ్రాయెల్కు పంపబోమని భారత్ శుక్రవారం స్పష్టంచేసింది.

కేఫ్ పేలుడు సూత్రధారి అరెస్ట్

న్యూఢిల్లీ/బనశంకరి: బెంగళూరులోని రామేశ్వరం కేఫ్లో పేలుడు ఘటన దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కీలక పురోగతి సాధించింది. పేలుడు సూత్రధారి అబ్దుల్ మతీన్ అహ్మద్ తాహా, కేఫ్లో ఐఈడీని అమర్చిన ముసవ్విర్ హుస్సేన్ షాజిబ్లను శుక్రవారం పట్టుకుంది. వీరిద్దరూ పూర్వమేదినీపూర్ జిల్లా కాంతిలో మారుపేర్లతో దాక్కుని ఉన్నట్లు ఎన్ఐఏ తెలిపింది. బెంగాల్, తెలంగాణ, కర్ణాటక, కేరళ పోలీసులు, కేంద్ర నిఘా విభాగాల సహకారంతో వీరిని గుర్తించడం సాధ్యమైందని వివరించింది. ఇద్దరూ కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన వారు. మార్చి ఒకటో తేదీన కేఫ్లో సంభవించిన పేలుడులో సిబ్బంది కొందరు తీవ్రంగా గాయపడ్డారు. కేఫ్ భవనం దెబ్బతింది.పేలుడు ఘటనకు సూత్రధారి అబ్దుల్ మతీన్ తాహా 'అల్ హింద్'ఉగ్ర సంస్థలో చురుగ్గా వ్యవహరిస్తున్నట్లు ఎన్ఐఏ గుర్తించినట్లు తెలిసింది.

దేశమంతటా ఐదేళ్లకోసారి జరిగే ప్రజాస్వామిక పండుగకు మరోసారి రంగం సిద్ధమైంది. 18వ లోక్‌సభ ఎన్నికల వేడి పరాకాష్టకు చేరింది. హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి అన్ని అస్త్రాలకూ పదును పెట్టుకుంటోంది. మోదీ మేజిక్‌కు ఈసారైనా అడ్డుకట్ట వేయాలని విపక్షాలన్నీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమి పేరుతో ఎన్డీఏను ఢీకొట్టేందుకు సిద్ధమయ్యాయి. ఇరు కూటముల మధ్య నెలన్నరకు పైగా హోరాహోరీ యుద్ధం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో ఆయా పార్టీల వ్యూహాలు, ప్రతివ్యూహాలు, ప్రచారాలు, నేతల ప్రసంగాలు, ఎన్నికల పదనిసలు, గత ఎన్నికల తీరుతెన్నులు, ఫలితాలు తదితరాలతో కూడిన లోక్‌సభ ఎన్నికల

సమగ్ర కవరేజీ... నేటి నుంచే...

స్టేట్ స్కాన్

యూపీ... హస్తినకు గేట్‌వే

ఉత్తరప్రదేశ్. లోక్‌సభ ఎన్నికలనగానే అందరి మదిలో మెదిలే రాష్ట్రం. రాజకీయంగానే కాక జనాభాపరంగా, భౌగోళికంగానూ దేశంలో యూపీది ఎప్పుడూ కీలక పాత్రే. 2024 లోక్‌సభ ఎన్నికల ముంగిట ఇక్కడి రాజకీయ ముఖచిత్రం కూడా కొత్త మలుపులు తిరుగుతోంది. అయోధ్య రామమందిరం కల సాకారం చేసి హిందువుల మనసుల్లో గుడి కట్టుకున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి మరింత దూకుడు పెంచగా, విపక్ష ఇండియా కూటమి కూడా వ్యూహాలకు పదును పెడుతోంది. యూపీ కుంభస్థలాన్ని కొట్టిన పార్టీ హస్తినలో పాగా వేసినట్లేనన్నది నానుడి.

దేశ రాజకీయాలకు గుండెకాయ వంటి యూపీలో సత్తా చాటేందుకు పార్టీలన్నీ అస్త్రాలను రెడీ చేసుకుంటున్నాయి. దేశంలోనే అత్యధికంగా ఏకంగా 80 లోక్‌సభ స్థానాలున్న రాష్ట్రం యూపీ. దేశాన్నేలే నాయకులను తీర్చిదిద్దడంలోనూ ఈ రాష్ట్రానిది ఘన చరిత్రే. ఏకంగా 8 మంది ప్రధానులను అందించింది యూపీ. ఈ రికార్డుకు మరే రాష్ట్రమూ దరిదాపుల్లో కూడా లేదు...

ఈ ఎన్నికలు అత్యంత కీలకం...

ఒకప్పుడు కాంగ్రెస్, సమాజ్‌వాదీ, బహుజన సమాజ్ పార్టీ వంటి పార్టీలకు కంచుకోటగా ఉన్న యూపీలో 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పూర్తిస్థాయిలో పాగా వేసింది. అనంతరం అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రత్యర్థులను మట్టి కరిపించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలుచుకుని తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. యూపీలో క్లీన్ స్వీప్ ద్వారానే బీజేపీ వరుసగా రెండుసార్లు బంపర్ మెజారిటీతో హస్తిన పీఠాన్ని చేజిక్కించుకోగలిగింది. కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఒంటరి పోరు చేసి కకావికలమైంది. మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ, అఖిలేశ్ యాదవ్ సారథ్యంలోని ఎస్పీ కలిసి పోటీ చేసినా ప్రభావం చూపలేకపోయాయి. బీజేపీ హవాలో చిన్నాచితకా పార్టీలు సోదిలో కూడా లేకుండా పోయాయి. ఈసారి కూడా యూపీలో సత్తా చాటాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. ఎన్నికల షెడ్యూలైనా రాకుండానే తొలి విడతలో అభ్యర్థులను ప్రకటించిన 195 సీట్లలో ఏకంగా 51 స్థానాలు యూపీ నుంచే ఉండటం విశేషం! ఎస్పీ ఈసారి విపక్ష ఇండియా కూటమి భాగస్వామిగా కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తోంది. 2014లో యూపీలో ఏకంగా 71 సీట్లు గెలిచిన బీజేపీ 2019లోనూ 62 స్థానాలు నెగ్గింది. ఎన్డీఏ భాగస్వామి అప్నాదళ్(ఎస్) 2 సీట్లు గెలిచింది. బీఎస్పీ, ఎస్పీ, రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్‌ఎల్‌డీ)తో కూడిన మహాకూటమి 15 సీట్లకే పరిమితమైంది. బీఎస్పీ 38 స్థానాల్లో పోటీ చేసి 10 సీట్లలో విజయం సాధించగా, ఎస్పీ 37 సీట్లలో పోటీ చేసి ఐదే నెగ్గింది. ఆర్‌ఎల్‌డీ 3 సీట్లలోనూ మట్టికరిచింది. 67 సీట్లలో పోటీ చేసిన కాంగ్రెస్ ఒకే ఒక్క స్థానంతో ఘోర పరాజయం మూటగట్టుకుంది. కేవలం సోనియాగాంధీ మాత్రమే రాయ్‌బరేలీలో నెగ్గారు. అతి పెద్ద రాష్ట్రం కావడంతో యూపీలో ఈసారి మొత్తం ఏడు దశల్లోనూ పోలింగ్ జరుగుతోంది.

దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు

యూపీని కొల్లగొట్టే పార్టీదే అధికారం


2014, 2019ల్లో పూర్తిగా బీజేపీ హవాయే

కలిసొస్తున్న మోదీ, యోగి 'డబుల్ ఇంజన్'

ముస్లిం ఓట్లపైనే ఇండియా కూటమి ఆశలు

పూర్తయిన కాంగ్రెస్, ఎస్పీ సీట్ల పంపకం







\- సాక్షి, నేషనల్ డెస్క్

అయోధ్య.. బీజేపీ బ్రహ్మాస్త్రం

ఈసారి 400 పైగా లోక్‌సభ స్థానాలే **లక్ష్యంగా** బీజేపీ ముందునుంచే చకచకా **పావు**లు కదిపింది. అయోధ్య రామమందిర కలను సాకారం చేయడం హిందువుల ఓట్లను కొల్లగొట్టడం ఖాయమని నమ్ముతోంది. ప్రధాని మోదీ మరోసారి వారణాసి నుంచి పోటీ చేయడం ఎప్పట్లాగే మరింతగా కలిసొస్తుందని భావిస్తోంది. రాష్ట్రంలోనూ బీజేపీ సర్కారే ఉండటం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసి, వేలాది కోట్లతో భారీ ఎత్తున అభివృద్ధి కార్యకలాపాలను చేపడుతుండటమూ బీజేపీకి కలిసొచ్చేదే. యూపీలో రెండుసార్లు బీజేపీ జెండా రెపరెపలాడించిన సీఎం యోగి ఆదిత్యనాథ్ పార్టీకి అదనపు బలం. జాట్ల మద్దతు దండిగా ఉన్న మాజీ ప్రధాని చౌధరి చరణ్ సింగ్ మనుమడు జయంత్ నేతృత్వంలోని ఆర్‌ఎల్‌డీ ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పి ఎన్డీఏలో చేరడం కాషాయదళంలో కొత్త జోష్ నింపింది. చరణ్ సింగ్‌కు భారతరత్న ప్రకటనతో జాట్ల ఓట్లు ఎన్డీఏకేనని బీజేపీ భావిస్తోంది. మరో భాగస్వామి అప్నాదళ్ (ఎస్)కూ యూపీలో మంచి పట్టుంది. ప్రధాని మోదీ ఇప్పటికే రాష్ట్రంలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఆయనకు తోడు రాజ్‌నాథ్‌సింగ్, సీఎం యోగితో సహా పలువురు కేంద్ర మంత్రులు కూడా కలియ దిరుగుతున్నారు.

'ఇండియా' కూటమి పోటీనిచ్చేనా?


విపక్ష 'ఇండియా' కూటమి యూపీలో ఇంకా కాలూచేయీ కూడదీసుకునే పనిలోనే ఉంది. కూటమి భాగస్వాముల్లో ఎస్పీ 63 సీట్లలో, కాంగ్రెస్ 17 సీట్లలో పోటీ చేసేలా ఒప్పందం కుదిరింది. సోనియా రాజ్యసభకు వెళ్లడంతో రాయ్‌బరేలీ నుండి ప్రియాంక పోటీ చేసే అవకాశం కన్పిస్తోంది. 2019 పరాజయం నేపథ్యంలో అమేథీలో రాహుల్ గాంధీ ఈసారి బరిలో దిగుతారో, లేదో చూడాలి. ఈ రెండు తప్ప మిగతా 15 స్థానాలకూ కాంగ్రెస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. వెనకబడ్డ, దళిత, మైనారిటీ వర్గాలపై అఖిలేశ్ బాగా దృష్టి పెట్టారు. కానీ గత ఎన్నికల సరళిని బట్టి చూస్తే, యాదవేతర ఓబీసీలు, జాతవేతర దళిత ఓటర్లను బీజేపీ తనవైపు తిప్పుకునేలా కనిపిస్తోంది. ఇక ఆర్‌ఎల్‌డీ గుడ్‌బై చెప్పడం ఇండియా కూటమికి ఎదురుదెబ్బే. బీఎస్పీ ఈసారి ఒంటరి పోరుకు సిద్ధమైంది. ఇవన్నీ బీజేపీకి మరింత కలిసొచ్చే అవకాశముందని విశ్లేషకుల అంచనా.

సర్వేలు ఏమంటున్నాయి...?

యూపీలో ఎన్డీఏ కూటమికి ఏకంగా 70 నుంచి 72 సీట్లు రావచ్చని పలు ఒపీనియన్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. ఇండియా కూటమి ఆరేడు స్థానాలకు మించకపోవచ్చని చెబుతున్నాయి.

ముస్లింల రూటెటు?

యూపీ జనాభాలో 19% ఉన్న ముస్లింల ఓట్లపై విపక్షాలు ప్రధానంగా గురి పెడుతున్నాయి. 24 లోక్‌సభ సీట్లలో వీరు 20 నుంచి ఏకంగా 50 శాతం దాకా ఉన్నారు. దాంతో ఆ స్థానాల్లో వారు కీలకం కానున్నారు. ఈసారి ఎస్పీ, కాంగ్రెస్ జట్టు కట్టేందుకు ముస్లిం ఫ్యాక్టర్ కూడా ప్రధాన కారణమే. 2014, 2019ల్లో అవి విడిగా పోటీ చేయడంతో ముస్లిం ప్రాబల్య స్థానాల్లో బీజేపీ బాగా లాభపడింది. 2019లో ఎస్పీ, బీఎస్పీ నెగ్గిన స్థానాల్లో ముస్లింల ప్రాబల్యమున్నవే ఎక్కువ! రాహుల్ భారత్ జోడో యాత్ర, అఖిలేశ్ పీడీఏ (వెనుకబడిన, దళిత, మైనారిటీ) యాత్రలు యూపీలో ముస్లిం ప్రాబల్య జిల్లాల్లోనే సాగాయి.



పరిచయం

రాజకీయ కవయిత్రి

కనిమొళి బహుముఖ ప్రజ్ఞాశాలి



కనిమొళి కరుణానిధి.. బహుముఖ ప్రతిభావంతురాలైన రాజకీయవేత్త, కవి, పాత్రికేయురాలు, ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) సభ్యురాలు. తూత్తుక్కుడి నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు.

చురుకైన విద్యార్థి...

కనిమొళి చిన్నప్పటి నుంచే చురుకైన విద్యార్థి. బాల్యంలో తండ్రితో పెద్దగా గడపలేకపోయినా.. ఆయనకు మాత్రం ప్రియమైన కూతురే. కనిమొళి పుట్టిన తరువాతే ముఖ్యమంత్రి పదవి దక్కడంతో అది ఆమె తెచ్చిన అదృష్టమేనని కరుణానిధి భావించేవారు. తండ్రి తన దగ్గరలేని బాధను కనిమొళి కవిత్వంగా మలిచారు. అది చదివి ఆయన కదిలిపోయారు. అలా తండ్రీకూతుళ్లను సాహిత్యం మరింత దగ్గర చేసింది. కనిమొళి క్రియాశీల రాజకీయాలకు దూరంగా పెరిగారు. 2001లో జయలలిత హయాంలో కరుణానిధిని అరెస్టు చేసినప్పుడు తండ్రి పక్కన నిలబడి తొలిసారి ప్రముఖంగా బయటకు కనిపించారు. నాటినుంచీ ఆయన గళంగా మారిపోయారు. తండ్రి బహుముఖ ప్రజ్ఞకు కనిమొళి అప్రకటిత వారసురాలు. దానికి తోడు ఇంగ్లిష్ బాగా మాట్లాడతారు. దాంతో కరుణానిధి ఢిల్లీలో పెద్దలెవరినీ కలిసినా వెంట కనిమొళి ఉండేవారు. కనిమొళి ఢిల్లీ రాజకీయాల్లో, స్టాలిన్ రాష్ట్ర రాజకీయాల్లో చురుగ్గా ఉండేలా కరుణానిధి ముందుచూపుతో వ్యవహరించారు. 1982లో జయలలిత క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన వేదికపైనే 2008 జూన్‌లో కనిమొళితో డీఎంకే తొలి మహిళా సమ్మేళనం నిర్వహించారు. అలా ఆమెను అగ్రనాయకురాలిగా నిలబెట్టే ప్రయత్నాలు చేశారు. కనిమొళిని జయలలితకు కౌంటర్‌గా కరుణానిధి చూశారు. వారిద్దరికీ సారూప్యమూ ఉంది. ఇద్దరూ ఒకే పాఠశాలలో చదువుకున్నారు. జర్నలిస్టులుగా పనిచేశారు. రాజ్యసభ సభ్యులుగానే రాజకీయ జీవితం ప్రారంభించారు.

రాజకీయాల్లో...

కనిమొళి 2007లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ, విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి కమిటీ, హోమ్ వ్యవహారాల వంటి పలు కమిటీల్లో చురుగ్గా పనిచేసి ఆకట్టుకున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ జనరల్ అసెంబ్లీ సభ్యురాలిగా చేశారు. 2013లో రెండోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2018లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకున్నారు. 2019లో తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. తూత్తుక్కుడి నుంచి బీజేపీ అభ్యర్థి తమిళిసై సౌందరరాజన్‌పై ఏకంగా 3,47,209 ఓట్ల మెజారిటీతో గెలిచారు.

సక్సెస్‌ఫుల్ జర్నలిస్టు..

కనిమొళి సక్సెస్‌ఫుల్ జర్నలిస్టు కూడా. ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా చేశారు. తమిళ వారపత్రిక 'కుంగుమం' సంపాదకురాలిగా వ్యవహరించారు. సింగపూర్‌కు చెందిన 'తమిళ మురసు' వార్తాపత్రికకూ ఫీచర్స్ ఎడిటర్‌గా సేవలందించారు. తమిళంలో కవిత్వం రాశారు. తమిళ కవిత్వాన్ని ఇంగ్లిష్‌లోకి అనువదించారు. ఆమె రచనలు ఇంగ్లిష్, మలయాళం, కన్నడ, తెలుగు భాషల్లోకి అనువాదమయ్యాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఎన్నికలు.. విశేషాలు

- 1993లో మొదటిసారి ఓటర్ ఐడీని ప్రవేశపెట్టారు.
- ఈవీఎం మెషిన్లపై అభ్యర్థుల ఫొటోలను 2015 బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి మొదలు పెట్టారు.
- నోటా (నన్ ఆఫ్ ద ఎబోవ్/పైన ఎవరూ కాదు) ఆప్షన్‌ను తొలిసారి 2013లో నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నుంచి (ఛత్తీస్‌గఢ్, మిజోరాం, రాజస్తాన్, మధ్యప్రదేశ్) అమల్లోకి తీసుకొచ్చారు. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా నోటా అమలుకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎవరికీ ఓటు వేయడం ఇష్టం లేకపోతే నోటాను ఎంపిక చేసుకోవచ్చు.
- దేశ తొలి మహిళా చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఎస్. రమాదేవి 1990 నవంబర్ 26 నుంచి 1990 డిసెంబర్ 11 వరకు పనిచేశారు.
- ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం దేశంలో 7 జాతీయ పార్టీలు, 27 రాష్ట్ర పార్టీలు, 2,301 నమోదు చేసుకున్న గుర్తింపు లేని పార్టీలు ఉన్నాయి.
- 31,83,325 ఓటర్లతో దేశంలోనే అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గంగా మాల్కాజ్‌గిరి ఉంది. 46,909 మంది ఓటర్లతో లక్షద్వీప్ అతి చిన్న లోక్‌సభ స్థానంగా ఉంది.
- విస్తీర్ణపరంగా 1,73,266 చదరపు కిలోమీటర్లతో లద్దాఖ్ అతిపెద్ద లోక్‌సభ స్థానం. 10 కి.మీ. విస్తీర్ణంతో చాందినీ చౌక్ అతి చిన్న నియోజకవర్గంగా ఉంది.
- లోక్‌సభకు యూపీ అత్యధికంగా 80 మంది ఎంపీలను పంపుతోంది. అంతేగాక దేశానికి ఎనిమిది మంది ప్రధానులను కూడా అందించింది.
- 2009లో బిహార్లోని హాజీపూర్ లోక్‌సభ స్థానం నుంచి జేడీ (యూ)కు చెందిన రాంసుందర్ దాస్ 88 ఏళ్ల వయసులో గెలిచారు. లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గిన అతి పెద్ద వయస్కునిగా రికార్డు సృష్టించారు.
- 2014లో లోక్‌సభ సభ్యునిగా నెగ్గిన అతి పిన్న వయస్కునిగా (26 ఏళ్లు) దుష్యంత్ చౌతాలా రికార్డులకెక్కారు. హరియాణాలోని హిసార్ నుంచి ఆయన ఎంపీగా గెలిచారు.



గతం

ఆరంభం అదిరింది

1952లో భారత్‌లో తొలి సాధారణ ఎన్నికలు

పెను సవాళ్లను అధిగమిస్తూ దిగ్విజయంగా నిర్వహణ

స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి ఐదేళ్లు కూడా దాటలేదు. దేశాన్ని కుదిపేసిన విభజన తాలూకు గాయాల పచ్చి ఇంకా ఆరనే లేదు. ఎటు చూసినా ఇంకా బాలారిష్టాలే. పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న అనేకానేక సమస్యలే. వయోజనుల్లో చదవను, రాయను వచ్చిన వారి సంఖ్య చూస్తే అతి స్వల్పం. ఇలా... ఒకటా, రెండా! 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికలకు ఎటు చూసినా సవాళ్లే. ఇన్ని పెను సవాళ్లనూ విజయవంతంగా అధిగమిస్తూ ఆ ఎన్నికలు సూపర్‌హిట్‌గా నిలిచాయి. దాంతో... ఇది అయ్యేదా, పొయ్యేదా అంటూ పెదవి విరిచిన ఎంతోమంది పాశ్చాత్య విమర్శకుల నోళ్లు మూతలు పడ్డాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

తొలి ఎన్నికల ఫలితాలొచ్చేదాకా భారత్ రాజ్యాంగబద్ధ రాచరిక దేశంగానే కొనసాగింది! లార్డ్ మౌంట్‌బాటెన్ గవర్నర్ జనరల్‌గా కొనసాగారు. నెహ్రూ సారథ్యంలోని రాజ్యాంగ సభే మధ్యంతర పార్లమెంటుగా వ్యవహరించింది. ఎందుకంటే స్వాతంత్ర్యం సిద్ధించిన కొన్నేళ్ల దాకా ఎన్నికలు ఎలా నిర్వహించాలన్న దానిపై ఓ స్పష్టతంటూ లేదు. నియమ నిబంధనలు గానీ విధివిధానాలు గానీ లేవు. అంబేడ్కర్ సారథ్యంలోని డ్రాఫ్టింగ్ కమిటీ రూపొందించిన రాజ్యాంగం 1949లో ఆమోదం పొంది 1950 జనవరి 26న అమల్లోకి వచ్చాకే ప్రజా ప్రాతినిధ్య చట్టం ద్వారా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓ స్పష్టత ఏర్పడింది. ఆ వెంటనే తొలి ఎన్నికల నిర్వహణకు సుదీర్ఘ కసరత్తు మొదలైంది. ఆ క్రమంలో ఎన్నో సమస్యలు. మరెన్నో సవాళ్లు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు పోలింగ్ సిబ్బందిని, సామగ్రిని చేర్చడమైతే పెద్ద యజ్ఞాన్నే తలపించింది. ఇలాంటి అనేకానేక సవాళ్లను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది.

పార్టీలు, అభ్యర్థులకు గుర్తులు

పార్టీలకు గుర్తులు కేటాయించాలని తొలి సార్వత్రిక ఎన్నికలప్పుడే ఈసీ నిర్ణయించింది. ఆలయం, ఆవు, జాతీయ పతాకం, రాట్నం వంటి సున్నితమైన గుర్తులు కాకుండా సులభంగా గుర్తించే ఇతర గుర్తుల వైపు మొగ్గు చూపింది. కాంగ్రెస్ అనగానే గుర్తుకొచ్చే హస్తం గుర్తు ఆ పార్టీకి 1980లో వచ్చింది. 1952లో కాంగ్రెస్ కాడెద్దుల గుర్తుపై పోటీ చేసింది. విడిపోయిన వేళ్లతో కూడిన హస్తం గుర్తు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (రుయ్‌కార్ గ్రూప్)కు దక్కడం విశేషం! సోషలిస్టు పార్టీకి చెట్టు, కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీకి గుడిసె, అఖిల భారతీయ రామరాజ్య పరిషత్‌కు ఉదయించే సూర్యుడు వంటి గుర్తులు దక్కాయి.

ఫలితాలిలా...

భారత జాతీయ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)తో పాటు సోషలిస్టు పార్టీ, కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ, అఖిల భారతీయ హిందూ మహాసభ వంటి మొత్తం 53 పార్టీలు తొలి ఎన్నికల్లో పోటీ చేశాయి. అయితే అనూహ్యమేమీ జరగలేదు. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలోని కాంగ్రెసే విజయం సాధించింది. 45 శాతానికి పైగా ఓట్లతో 489 స్థానాలకు గాను ఏకంగా 364 చోట్ల నెగ్గింది. దేశ తొలి ఎన్నికైన ప్రధానిగా కూడా నెహ్రూయే నిలిచారు. కమ్యూనిస్టు పార్టీ 16 స్థానాలు నెగ్గి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది.



తాను ఓటేయ్యాల్సిన అభ్యర్థి తాలూకు బ్యాలెట్ బాక్సును వెతుక్కుంటున్న ఓటర్

అంబేడ్కర్‌కు ఓటమి

రాజ్యాంగ రూపశిల్పి బీఆర్ అంబేడ్కర్‌కు తొలి ఎన్నికలు చేదు అనుభవమే మిగిల్చాయి. నార్త్ సెంట్రల్ బోంబే స్థానం నుంచి షెడ్యూల్ క్యాస్ట్ ఫెడరేషన్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన తన సహాయకుడే అయిన కాంగ్రెస్ అభ్యర్థి నారాయణసబోద కజ్రోల్కర్ చేతిలో 15,000 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు! సోషలిస్ట్ పార్టీ మద్దతున్నా సీపీఐ అభ్యర్థి డంగే అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా బలంగా ప్రచారం చేశారు. దీనికి నెహ్రూ గాలి తోడవడంతో కజ్రోల్కర్ నెగ్గారు. 1954లో బండారా లోక్‌సభ స్థానం ఉప ఎన్నికల్లోనూ మరోసారి కాంగ్రెస్ చేతిలో ఓటమి పాలయ్యారు. చివరికి జన్‌సంఘ్ సాయంతో అంబేడ్కర్ రాజ్యసభలో అడుగుపెట్టారు.

1952 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు	
మొత్తం లోక్‌సభ స్థానాలు 489	
పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	364
సీపీఐ	16
సోషలిస్ట్ పార్టీ	12
కిసాన్ మజ్దూర్ పార్టీ	9
పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్	7
ఇతరులు	44
స్వతంత్రులు	37

- దేశ తొలి ఎన్నికల ప్రక్రియ 1951 అక్టోబర్ 25న మొదలైంది. 1952 ఫిబ్రవరి 21 దాకా ఏకంగా నాలుగు నెలల పాటు కొనసాగింది.
- అప్పట్లో మొత్తం 489 లోక్‌సభ స్థానాలుండేవి.
- 17.3 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు.
- 53 పార్టీల తరఫున 1,874 మంది బరిలో నిలిచారు.
- అప్పట్లో భారత్‌లో అక్షరాస్యత కేవలం 16.6 శాతమే!
- దేశవ్యాప్తంగా 1,32,560 పోలింగ్ స్టేషన్లు, 1,96,084 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.
- ముందుగా హిమాచల్‌ప్రదేశ్‌లో తొలి దశలో పోలింగ్ జరిగింది.
- మొత్తమ్మీద 51 శాతం పోలింగ్ నమోదైంది. 8,86,12,171 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- అప్పట్లో ఓటరుగా నమోదయ్యేందుకు కనీస వయో పరిమితి 21 ఏళ్లుగా ఉండేది.
- అప్పటికి ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఓటింగ్ ప్రక్రియ 1952 ఎన్నికలు రికార్డులకెక్కాయి. నాటినుంచి నేటిదాకా ఈ రికార్డు భారత్‌పేరిటే కొనసాగుతూ వస్తోంది.

ఒకే ఒక్కడు...



తొలి ఎన్నికల క్రతువు దిగ్విజయంగా సాగిందంటే అందుకు ప్రధాన కారకుడు దేశ తొలి ప్రధాన ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్. ఇండియన్ సివిల్ సర్వీస్ అధికారి అయిన ఆయన 1950లో సీఈసీగా బాధ్యతలు చేపట్టారు. అనేక ప్రతికూలతలను అధిగమిస్తూ దేశాన్ని ఎన్నికలకు సన్నద్ధం చేశారు. ఏకంగా 36 కోట్ల జనాభా, 17 కోట్ల పైచిలుకు అర్హులైన ఓటర్లు! వారందరికీ ఓటరు కార్డుల జారీ, ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్ల వంటి అనేకానేక సవాళ్లను సేన్ విజయవంతంగా ఎదుర్కొన్నారు. 84 శాతానికి పైగా ప్రజలు నిరక్షరాస్యులే కావడంతో వారిని గుర్తించి, ఓటర్లుగా నమోదు చేయించడమే ఓ భారీ యజ్ఞాన్ని తలపించింది. 1951 జనగణన ఆధారంగా లోక్‌సభ స్థానాలను ఖరారు చేశారు. రాజస్తాన్‌లోని జైసల్మేర్, జోధ్‌పూర్ వంటి ప్రాంతాలకైతే ఎన్నికల సామగ్రి తరలింపునకు ఒంటెలను వాడాల్సి వచ్చింది!

డాటరాఫ్, వైఫాఫ్...!

ఓటర్ల నమోదు సందర్భంగా ఓ సన్నివేశం అప్పట్లో పరిపాటిగా మారింది. ఎన్నికల సిబ్బందికి తమ పేరు చెప్పేందుకు మహిళలు ససేమిరా అనేవారు. అపరిచితులకు తమ పేర్లను చెప్పేందుకు వారు వెనుకాడేవారు. ఫలానా వారి భార్య అనో, కూతురు అనో మాత్రమే చెప్పేవారు. దాంతో విధిలేక ఓటర్ లిస్టులో వారి పేర్లను కూడా అలాగే నమోదు చేయాల్సి వచ్చింది. కానీ ఇలా పేర్లు లేకుండా ఓటరు కార్డులు జారీ చేసేందుకు ఈసీ నిరాకరించింది. అసలు పేర్లతో ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. నాడు 8 కోట్ల మహిళా ఓటర్లు ఉంటే, 20–80 లక్షల మంది తమ అసలు పేర్లను వెల్లడించేందుకు అంగీకరించలేదు. దాంతో వాటిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని ఈసీ నిర్ణయించింది. నాడు తీసుకున్న నిర్ణయం కఠినమైనదే అయినా, ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని, పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొంటున్నట్టు ఢిల్లీ మాజీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ చంద్రభూషణ్ కుమార్ పేర్కొనడం గమనార్హం.

అభ్యర్థికో బ్యాలెట్ బాక్సు...!



84 శాతం మంది నిరక్షరాస్యులే. దాంతో ఓటేయాల్సిన అభ్యర్థిని వారు గుర్తించడమెలా అన్నది పెద్ద సమస్యగా నిలిచింది. ఒక్కో అభ్యర్థికీ ఒక్కో రంగు బ్యాలెట్ బాక్సు కేటాయించడం ద్వారా దీన్ని అధిగమించారు. ఆ రంగు పైనే సదరు అభ్యర్థి పేరు, గుర్తు ముద్రించారు. ప్రచార సమయంలో ప్రతి అభ్యర్థీ తన బ్యాలెట్ బాక్సు రంగు ఫలానా అంటూ ప్రముఖంగా ప్రస్తావించేవాడు!

జైత్రయాత్ర 2024

విప్లవ సారథీ.. విజయీభవ

జననేత జగన్‌కు జనం దీవెన

58 నెలల్లో సమపాళ్లలో అటు సంక్షేమం... ఇటు అభివృద్ధి

సుపరిపాలనతో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

గత ఎన్నికల్లో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం

- తొలి కేబినెట్‌లోనే ఆవిష్కృతమైన సామాజిక విప్లవం
- మేనిఫెస్టోయే దిక్సూచిగా పాలన.. 99 శాతం హామీల అమలు
- నామినేటెడ్ పదవులు, పనుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50% రిజర్వేషన్
- వివక్ష, లంచాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాల వర్తింపు
- డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో నేరుగా రూ.2.70 లక్షల కోట్లు జమ
- ప్రభుత్వ పథకాల ద్వారా 11.77 నుంచి 4.19 శాతానికి తగ్గిన పేదరికం
- సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు
- ఇంటివద్దే పింఛన్, రేషన్ పంపిణీ చేసిన ఏకైక రాష్ట్రంగా ఏపీకి గుర్తింపు
- గత 58 నెలల్లో 2.32 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు
- నాడు–నేడుతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ బోధన
- నాడు–నేడుతో ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ



సిద్ధం.. సిద్ధం..
అంటూ ఊరూరా సీఎం జగన్‌కు బ్రహ్మారథం

ప్రజాస్వామ్యమంటే ప్రజల చేత.. ప్రజల కోసం.. ప్రజలే పాలకులను ఎన్నుకోవడం. ప్రజలకు మంచి చేయాలన్నచిత్తశుద్ధి, నిబద్ధత, జవాబుదారీతనం పాలకుడికి ఉంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అలాంటి నాయకుడు ముఖ్యమంత్రి అయితే విప్లవాత్మక మార్పులతో రాష్ట్రం ప్రగతిపథంలో ఎలా దూసుకెళ్లగలదో గత 58 నెలల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. సుపరిపాలనతో ప్రతి నియోజకవర్గం.. ప్రతి గ్రామం.. ప్రతి ఇంటా.. విప్లవాత్మక మార్పు కనిపిస్తోంది. ఈ మార్పు కొనసాగాలని బలంగా కోరుకుంటున్న జనం 'మేమంతా సిద్ధం' అంటూ బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్‌కు నీరాజనాలు పలుకుతున్నారు. ఈ యాత్రలో జననేతను చూసేందుకు.. మాట కలిపేందుకు.. కరచాలనం చేసేందుకు.. వీలైతే ఫొటో దిగేందుకు స్కూలు పిల్లల నుంచి వృద్ధుల వరకు మండుటెండైనా.. అర్ధరాత్రయినా పోటీ పడుతుండటం ఊరూరా కనిపిస్తోంది. ఈ పరిణామంతో మరో చారిత్రక విజయం ఖాయమైందని రాజకీయ పరిశీలకులతో పాటు జాతీయ స్థాయి సర్వే సంస్థలు అభిప్రాయపడుతున్నాయి.

సాక్షి, అమరావతి:

దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత 58 నెలలుగా విప్లవాత్మక మార్పులతో సుపరిపాలన అందిస్తున్నారు. గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు సాధించి 151 శాసనసభ (86.28 శాతం), 22 లోక్‌సభ (88 శాతం) స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చరిత్రాత్మక విజయం సాధించిన సంగతి తెలిసిందే. 2019 మే 30న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపై నుంచే సుపరిపాలనకు ఆయన శ్రీకారం చుట్టారు. గత పాలకులకు భిన్నంగా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 99 శాతం అమలు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాపన, జిల్లాల పునర్‌వ్యవస్థీకరణ ద్వారా పరిపాలనను వికేంద్రీకరించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు భారీ ఎత్తున ఉద్యోగుల నియామకాలు చేపట్టారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా రాష్ట్రంలో నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే.. కేవలం 58 నెలల్లోనే 2.32 లక్షల మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించడం గమనార్హం. ఒకే నోటిఫికేషన్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.34 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి రికార్డు సృష్టించారు. దేశ చరిత్రలోనే ఇంత భారీ ఎత్తున ఉద్యోగులను నియమించడం ఇదే ప్రథమం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకూ.. పట్టణాల్లో 75 నుంచి వంద ఇళ్లకు ఒకరి వంతున 2.65 లక్షల మంది వలంటీర్లను నియమించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. మరో అడుగు ముందుకేసి వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే పెన్షన్ పంపిణీ చేసి చరిత్ర సృష్టించారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం ద్వారా పేదరిక నిర్మూలనకు విశేషంగా కృషి చేశారు. వివక్ష, లంచాలకు తావు లేకుండా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను 87 శాతం కుటుంబాలకు అందించారు. డీబీటీ రూపంలో రూ.2.70 లక్షల కోట్లను పేదల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి.. దేశం మొత్తాన్ని మన వైపు చూసేలా చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపి రూ.4.49 లక్షల కోట్ల లబ్ధి చేకూర్చారు. సంక్షేమాభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకున్న ప్రజలు వాటి ద్వారా జీవనోపాధులను మెరుగుపర్చుకున్నారు. రాష్ట్రంలో పేదరికం టీడీపీ సర్కార్ హయాంలో 2015–16లో 11.77 శాతం ఉంటే.. 2022–23 నాటికి అది 4.19 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం.

ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ

సర్కారు దవాఖానాల్లో నాణ్యమైన వైద్యం అందించేందుకు అనువుగా నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. అందులో 53,466 ఉద్యోగాలను భర్తీ చేశారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతోపాటు.. చికిత్స విధానాలను 1059 నుంచి 3,257కు పెంచారు. ఇప్పటిదాకా 44.78 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.13 వేల కోట్ల విలువైన చికిత్సలు చేయించారు.

- ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కొత్తగా 17 కాలేజీలకు శ్రీకారం చుట్టి, ఈ విద్యా సంవత్సరంలో 5 కాలేజీలు ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరో 5 ప్రారంభం కానున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటా జల్లెడ పడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు.

సాగుకు సాయం

- ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా విత్తనం నుంచి విక్రయం దాకా రైతులకు సీఎం జగన్ దన్నుగా నిలిచారు. ఫలితంగా దేశంలో స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో వ్యవసాయ రంగం వాటా 17 నుంచి 18 శాతం ఉంటే.. గత నాలుగేళ్లలో దేశ జీడీపీలో మన రాష్ట్ర వ్యవసాయ రంగ వాటా 36 శాతంపైగా ఉండటం విశేషం.
- విప్లవాత్మక సంస్కరణలతో అన్ని రంగాల్లో రాష్ట్రం దూసుకెళ్తోంది. 2021–22లో 11.23 శాతం వృద్ధి రేటుతో దేశంలో ఏపీ అ గ్రగామిగా నిలవడమే అందుకు నిదర్శనం.

సామాజిక న్యాయంలో టార్చ్ బేరర్

కేబినెట్‌లో 70 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్.. ఐదుగురు డిప్యూటీ సీఎం పదవుల్లో నాలుగు వర్గాలకే ఇచ్చారు. హోంశాఖ మంత్రిగా ఎస్సీ మహిళను నియమించారు. సామాజిక న్యాయం నినాదంతో అధికారంలోకి వచ్చిన మాయవతి, బీసీ వర్గానికి చెందిన అఖిలేష్ యాదవ్ అధికారంలో ఉన్నప్పుడు, ప్రస్తుతం తమిళనాడులో అధికారంలో ఉన్న స్టాలిన్ కూడా ఆ వర్గాలకు కేబినెట్‌లో ఇంతగా ప్రాధాన్యం ఇవ్వలేదని సామాజిక వేత్తలు చెబుతున్నారు. రాజ్యసభ, శాసన మండలి సభ్యులుగా అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే అవకాశం ఇచ్చారు. స్థానిక సంస్థల్లోనూ ఆ వర్గాలకే పెద్దపీట వేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా నామినేటెడ్ పనుల్లో, పదవుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు.. మహిళలకు రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ ఆ వర్గాలకు పదవులు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలు వెరసి మొత్తం 200 స్థానాలకుగాను వంద స్థానాల్లో అంటే సగం స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులనే సీఎం జగన్ బరిలోకి దించారు.

ఇదే పాలన కోరుకుంటున్న జనం

ప్రతి ఇంట్లో వైఎస్ జగన్ మార్కు పాలన కనిపిస్తోంది. ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా పెరగాలంటే.. రాష్ట్రం ప్రగతి పథంలో మరింతగా దూసుకెళ్లాలంటే విప్లవాత్మక పరిపాలన కొనసాగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలు.. ప్రస్తుతం మేమంతా సిద్ధం పేరుతో నిర్వహిస్తున్న బస్సు యాత్రలో సీఎం జగన్‌కు జనం నీరాజనాలు పలకడం ద్వారా తమ తీర్పును ముందే వెల్లడిస్తున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇది వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయానికి బాటలు వేస్తుందని స్పష్టం చేస్తున్నారు. టైమ్స్‌నౌ–ఈటీజీ, జీన్యూస్ వంటి దిగ్గజ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లోనూ వైఎస్సార్‌సీపీ సునామీ సృష్టించడం ఖాయమని వెల్లడైంది.

పారిశ్రామికాభివృద్ధికి ఊతం

- పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చేలా పారదర్శక విధానాన్ని సీఎం వైఎస్ జగన్ అమల్లోకి తెచ్చారు. సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో ప్రతి ఏటారాష్ట్రం దేశంలో అగ్రగామిగా నిలవడమే అందుకు తార్కాణం.
- పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే క్రమంలో.. కొత్తగా నాలుగు పోర్టులతోపాటు పది ఫిషింగ్ హార్బర్‌లు, మూడు ఇండస్ట్రియల్ కారిడార్‌లు, పది ఇండస్ట్రియల్ నోడ్స్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దాంతో రాష్ట్రంలో భారీ ఎత్తున పెట్టుబడి పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఉత్సాహం చూపుతున్నారు.
- టీడీపీ హయాంలో రూ.32,803 కోట్లు పెట్టుబడులు వస్తే.. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.1.03 లక్షల కోట్ల పెట్టుబడులు రావడమే అందుకు నిదర్శనం. పారిశ్రామికాభివృద్ధిలో రాష్ట్రం టీడీపీ సర్కార్ హయాంలో 2018–19లో 22వ స్థానంలో స్తే.. ఇప్పుడు మూడో స్థానం నిలిచింది. పారిశ్రామికాభివృ ఉద్యోగ అవకాశాలు పుష్క పెరిగాయి.

ప్రగతి పథంలో ఏపీ పయనం

- అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులతో మన పిల్లలు పోటీ పడేలా విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు ఇంగ్లిష్ మీడియంలో బోధనను ప్రవేశపెట్టారు. సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తూనే.. రానున్న రోజుల్లో ఐబీ సిలబస్‌ను అమల్లోకి తెచ్చేందుకు నడుం బిగించారు.
- అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నికర నమోదు నిష్పత్తి రేటు 98.73 శాతానికి పెరిగింది.
- జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనతో నాణ్యమైన ఉన్నత విద్యనందిస్తూ.. నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇస్తున్నారు. తద్వారా 2022–23లో 1.2 లక్షల మంది క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు పొందారు. నైపుణ్యాలను మరింతగా పెంచేందుకు ఇప్పుడు ఎడెక్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. విద్యా రంగంపై ఉద్యోగుల జీతభత్యాలు కాకుండా రూ.74 వేల కోట్లు ఖర్చు చేశారు.



దొరికాడు దొంగ

'స్కిల్' బెడిసికొట్టి కటకటాల్లోకి..



సీమెన్స్ కంపెనీ ముసుగులో భారీ దోపిడీ

కుట్రదారు, లబ్ధిదారు చంద్రబాబే

అవినీతి నెట్‌వర్క్ ద్వారా చంద్రబాబు బంగ్లాకు రూ.**241**కోట్లు

సీఐడీ దర్యాప్తుల్లో ఆధారాలతోసహా వెల్లడి

A1 చంద్రబాబు అరెస్ట్... రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో **52** రోజులు

బాబు చీకటి పాలన

17ఏ కింద చంద్రబాబుకు రక్షణ లభించదన్న సుప్రీంకోర్టు

షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ఖాతాల్లోకి రూ.65.86 కోట్లు

కేజ్రీవాల్ అరెస్ట్ తరహాలోనే చంద్రబాబుపై ఈడీ కన్ను

ఇదీ చంద్రబాబు అవినీతి 'స్కిల్'

సాక్షి, అమరావతి: 'స్కిల్' స్కామ్... చంద్రబాబుకు ఎప్పటికీ వెంటాడే పీడకల...40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ యథేచ్ఛగా అవినీతికి పాల్పడిన ట్రాక్ రికార్డు ఉన్న చంద్రబాబును ఖైదీ నంబర్ 7691గా 52 రోజులపాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఊచలు లెక్కించేలా చేసింది ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం. యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణ పేరుతో ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ కేసులో సీఐడీ చంద్రబాబుతో పాటు 8 మందిని అరెస్ట్ చేసింది. చంద్రబాబును ఏ1గా పేర్కొంటూ ఆయనపై ఐపీసీ సెక్షన్లు 120(బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఏ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37లతోపాటు అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు 13(2) రెడ్‌విత్ 13(1) (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేశారు. ఈ కేసులో కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షెల్ కంపెనీల ప్రతినిధులు నలుగురిని అరెస్ట్ చేసింది. డిజైన్ టెక్‌కు చెందిన రూ.31.20 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఈడీ జప్తు చేసింది. రాజ్యాంగబద్ధ సంస్థ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని నిర్ధారించింది. చంద్రబాబు 17ఏ చట్టం కింద ఈ కేసు నుంచి తప్పించుకోలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇదే తరహాలో షెల్ కంపెనీల ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీకి నిధులు పొందిన కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడం సరైన చర్యేనని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. మరి అదే తరహాలో స్కిల్‌స్కామ్‌కు పాల్పడి షెల్‌కంపెనీల ద్వారా టీడీపీ ఖాతాల్లోకి నిధులు మళ్లించిన చంద్రబాబుపై ఈడీ కత్తి వేలాడుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. చంద్రబాబు స్కిల్డ్ క్రిమినల్ అని నిర్ధారిస్తూ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కుంభకోణం కథ కమామిషు ఇలా ఉంది...

370 కోట్ల నుంచి 3,300 కోట్ల రూపాయలకు పెంచేసి..

2014లో అధికారంలోకి రాగానే ప్రజాధనాన్ని కొల్లగొట్టడాన్నే చంద్రబాబు లక్ష్యంగా చేసుకున్నారు. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ ముసుగులో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అనంతరం తన బినామీ సంస్థ డిజైన్ టెక్‌ను రంగంలోకి దింపి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. ఈ ప్రాజెక్ట్‌లో చంద్రబాబు బినామీలు, సన్నిహితులైన అప్పటి ఏపీఎస్ఎస్‌డీసీకి డైరెక్టర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె. లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు కీలకంగా వ్యవహరించారు. ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.370 కోట్లుగా ఉన్న ప్రాజెక్ట్ వ్యయాన్ని రూ.3,300 కోట్లకు పెంచేశారు. ప్రభుత్వం పది శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ 90 శాతం నిధులు పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు 2015 జూన్ 30న ఉత్తర్వులు జారీ చేశారు. ఒప్పందంలో చెబుతున్నట్లుగా సీమెన్స్ డిజైన్ టెక్ కంపెనీలు తమ వాటా 90 శాతంలో ఒక్కరూపాయి కూడా ఇవ్వనేలేదు. ఏపీఎస్ఎస్‌డీసీ మాత్రం తన వాటా కింద జీఎస్టీ కలిపి డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు విడుదల చేసేసింది. అప్పటి ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల అభ్యంతరాలను చంద్రబాబు బేఖాతరు చేస్తూ రూ.371 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. అందుకోసం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నోట్ ఫైళ్లపై 13 చోట్ల చంద్రబాబు సంతకాలు చేశారు.

షెల్ కంపెనీల ద్వారా బాబు బంగ్లాకు...
డిజైన్ టెక్‌కు చెల్లించిన రూ.371 కోట్లను షెల్ కంపెనీల ద్వారా బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి వివిధ దశల్లో అక్రమంగా తరలించారు. ప్రతిదశలోనూ షెల్ కంపెనీల సృష్టికర్తలు, దళారుల కమీషన్లు పోనూ చంద్రబాబుకు రూ.241 కోట్లు చేర్చారు.

చంద్రబాబు అవినీతి నెట్‌వర్క్ ఇదీ..

- టీడీపీ ప్రభుత్వం పుణెకు చెందిన డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు చెల్లించింది.
- డిజైన్ టెక్ కంపెనీ నుంచి పుణెలోని పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి రూ.238.29 కోట్లు, ఢిల్లీలోని ఏసీఐ కంపెనీకి రూ.2.71 కోట్లు అంటే మొత్తం రూ.241 కోట్లు తరలించారు.
- పీవీఎస్‌పీ కంపెనీ నుంచి మళ్లీ ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్‌లో ఉన్న వివిధ షెల్ కంపెనీలతోపాటు దుబాయ్, సింగపూర్‌లోని కంపెనీలకు నిధుల తరలింపు ఇలా సాగింది...
- ఏసీఐ: రూ.56 కోట్లు
- నాలెడ్జ్ పోడియమ్: రూ.45.28 కోట్లు
- ఈటా: రూ.14.1 కోట్లు
- పాట్రిక్స్: రూ.3.13 కోట్లు
- ఐటీ స్మిత్: రూ.3.13 కోట్లు
- భారతీయ గ్లోబల్: రూ.3.13 కోట్లు
- ఇన్‌వెబ్: రూ.1.56 కోట్లు
- పోలారీస్: రూ.2.2 కోట్లు
- కాడెన్స్ పార్ట్‌నర్స్: రూ.12 కోట్లు
- మొత్తం రూ.140.53 కోట్లను ఆ కంపెనీల బ్యాంకు ఖాతాల నుంచి యోగేశ్ గుప్తా డ్రా చేసి మనోజ్ వాసుదేవ్ పార్థసానికి అందించారు. మనోజ్ పార్థసాని ఆ నగదు మొత్తాన్ని చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో ముట్టజెప్పారు. అంటే ఆ రూ.140.53 కోట్లను చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- ఇక మిగిలిన రూ.100.47 కోట్లను పీవీఎస్‌పీ కంపెనీ దుబాయి, సింగపూర్‌లోని కంపెనీలకు మళ్లించింది. ఆ నిధులను మళ్లీ హవాలా మార్గంలో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ మనోజ్ పార్థసాని ద్వారా చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించారు. అనంతరం చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- ఏపీఎస్ఎస్‌డీసీకి చెందిన రూ.241 కోట్లు అవినీతి నెట్‌వర్క్ ద్వారా ఇలా గుట్టు చప్పుడు కాకుండా చంద్రబాబు బంగ్లాకు వచ్చి చేరాయి.


ఫైళ్లు మాయం చేసిన కుంభకోణం గుట్టు రట్టు

2017లోనే కేంద్ర జీఎస్టీ అధికారులు పుణేలోని పలు షెల్ కంపెనీల్లో నిర్వహించిన సోదాల్లో ఏపీఎస్ఎస్‌డీసీకి సరఫరా చేసిన నకిలీ ఇన్వాయిస్‌లను గుర్తించి ఏపీ ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చారు. దీనిపై విచారణ చేయకుండా ఏసీబీని చంద్రబాబు అడ్డుకున్నారు. ఆ వెంటనే ఏపీఎస్ఎస్‌డీసీ ఆఫీసులో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫైళ్లను మాయం చేశారు. 2019లో పుణెకి చెందిన ఓ సామాజిక కార్యకర్త ఈ కుంభకోణం గురించి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో సిట్ నియమించింది. సిట్ దర్యాప్తులో చంద్రబాబు అవినీతి బాగోతం అంతా బట్టబయలైంది. సీఐడీ అధికారులు జర్మనీలోని సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు తమకు ఆ ప్రాజెక్టు గురించే తెలియదని స్పష్టం చేసింది. డిజైన్ టెక్, ఇతర షెల్ కంపెనీల ద్వారా సాగించిన కుంభకోణాన్ని కూడా సిట్ అధికారులు ఛేదించారు. స్కిల్ కుంభకోణానికి కర్త కర్మ క్రియ అంతా చంద్రబాబే అన్నది నిర్ధారణ అయింది.

చంద్రబాబుకు 17ఏ కింద రక్షణ లభించదన్న సుప్రీంకోర్టు

స్కిల్ స్కామ్ కేసులో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిన మాజీ సీఎం చంద్రబాబు 'సెక్షన్ 17ఏ'ను సాకుగా చూపిస్తూ విచారణను అడ్డుకునేందుకు పన్నిన పన్నాగం బెడిసికొట్టింది. సెక్షన్ 17ఏను తనకు వర్తింపజేస్తూ తనపై స్కిల్ స్కామ్‌లో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసును కేంద్ర జీఎస్టీ విజిలెన్స్ విభాగం 2017లోనే నమోదు చేసింది కాబట్టి 2018 నవంబరు నుంచి అమలులోకి సెక్షన్ 17ఏ చంద్రబాబుకు వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో చంద్రబాబుకు హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణలో ఉంది.

సీఐడీ చార్జ్‌షీట్‌లో పేర్కొన్న నిందితులు



ఏ1: చంద్రబాబు, టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి

ఏ2: కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రి

ఏ3: గంటా సుబ్బారావు, టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ–సీఈవో

ఏ4: కె.లక్ష్మీనారాయణ, టీడీపీ ప్రభుత్వంలో ఏపీ ఎస్ఎస్‌డీసీ డైరెక్టర్

ఏ5: సీమెన్స్, డిజైన్‌టెక్, పీవీఎస్‌పీ స్కిల్లర్ తదితర కంపెనీల అధికారులు



స్కిల్ స్కామ్ ద్వారా టీడీపీ ఖాతాల్లోకి రూ.65.86 కోట్లు.. చంద్రబాబుపై ఈడీ కన్ను

మద్యం కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర సీఎం కేజ్రీవాల్ అరెస్ట్‌ను సమర్థిస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టిస్తోంది. షెల్ కంపెనీల ద్వారా ఏ రాజకీయ పార్టీ అయినా అక్రమ నిధులు పొందితే అందుకు ఆ పార్టీ అధ్యక్షుడే బాధ్యత వహించాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ స్కామ్‌కు కూడా ఇది వర్తిస్తుందని ఈడీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఎందుకంటే షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ఖాతాల్లోకి రూ.65.86 కోట్లు మళ్లించినట్టు సీఐడీ ఆధారాలతోసహా నిర్ధారించింది. హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని నాలుగు బ్యాంకుల్లో టీడీపీ పేరిట ఉన్న నాలుగు బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ.65,86,47,510 మళ్లించారు. జూబ్లీ హిల్స్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిలో టీడీపీకి మూడు ఖాతాలు ఉన్నాయి. ఆ మూడు ఖాతాల్లో వరుసగా రూ.4,81,60,587, రూ.25,31,31,352, 2,26,28,500 జమ చేశారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని యూనియన్ బ్యాంక్ ఖాతాలో రూ.33,47,27,071 డిపాజిట్ చేశారు. 2016 నవంబరు నుంచి 2017 జనవరి మధ్యలో రూ.500, రూ.వేయినోట్ల కట్ల రూపంలో తీసుకువచ్చి మరీ జమ చేశారు. ఆ నిధులు తమకు ఎలా వచ్చాయన్నది టీడీపీ వెల్లడించలేదు. కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దును 2016, నవంబరులో ప్రకటించింది. ప్రజలు, సంస్థల దగ్గర ఉన్న పెద్ద నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు అనుమతించింది. భారీ డిపాజిట్లకు ఆదాయ మార్గాలు వెల్లడించాలని పేర్కొంది. కానీ ఆదాయ మార్గాలను వెల్లడించకుండానే టీడీపీ ఖాతాల్లోకి ఏకంగా రూ.65.86కోట్లు జమ చేయడం గమనార్హం. ఢిల్లీ హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్కిల్‌స్కామ్‌లో చంద్రబాబును ఈడీ అరెస్ట్ చేసే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు చెబుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

సాక్షి
కరీంనగర్
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



భక్తుల పుణ్యస్నానం

ధర్మపురి: ధర్మపురిలోని పవిత్ర గోదావరినదిలో శుక్రవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి గంగమ్మ, గౌరమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.



హనుమాన్ దీక్ష స్వీకరణ

కొండగట్టు: అంజన్న సన్నిధిలో ఈనెల 23న హనుమాన్ చిన్న జయంతోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి హనుమాన్ దీక్ష స్వీకరిస్తున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/25.0

వాతావరణం ఎండగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి. తీవ్ర ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రానైట్ ఫ్యాక్టరీల అభివృద్ధికి కృషి



కొత్తపల్లి(కరీంనగర్): జిల్లాలో గ్రానైట్ ఫ్యాక్టరీల అభివృద్ధికి గత పదేళ్లుగా శాయశక్తులా కృషి చేశానని జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శంకర్ స్పష్టం చేశారు. కొత్తపల్లి మండలం ఎలగందుల పంచాయతీ పరిధిలోని జిల్లా అసోసియేషన్ భవనంలో శుక్రవారం జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన ప్రగతి నివేదిక వెల్లడించారు. 2014లో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు 82 గ్రానైట్ ఫ్యాక్టరీలతో శ్వేతకాంప్లెక్స్‌లోని అద్దె భవనంలో అసోసియేషన్ కార్యకలాపాలు ప్రారంభించామని అన్నారు. 2014 నుంచి 2019 వరకు 425ఫ్యాక్టరీలకు పెరగగా, నిధులు సమీకరించి ఎకరం 20 గుంటల స్థలం కొనుగోలు చేసి 26,000 చదరపు అడుగుల్లో అధునాతన భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు. 18 శాతం జీఎస్టీ తగ్గింపునకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిరాహార దీక్ష ద్వారా సాధించామని స్పష్టం చేశారు. అసోసియేషన్ ఫండ్ వివరాలను పారదర్శకంగా సభ్యులందరికీ అందజేశామన్నారు. ఎన్నికల అధికారిని నియమించి మూడు నెలల్లో బైలాస్ ప్రకారం జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. కొంతమంది వ్యక్తులు చేసిన నిరాధార ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగుల ప్రదీప్, కోశాధికారి జిల్లా అశోక్, ఉపాధ్యక్షుడు చిట్టుమల్ల కిరణ్, సంయుక్త కార్యదర్శులు కడారి శ్రీనివాస్, వేణుగోపాల్, కాల్వ శ్రీనివాస్ పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

న్యాయం కోసం మండుటెండలో..



కరీంనగర్ అర్బన్: న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారీ వృద్ధులు. మండుటెండలో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కనిపించిన వారికల్లా తమ బాధను వ్యక్తం చేస్తున్నారు.కలెక్టర్‌ను కలిసేందుకు శుక్రవారం కలెక్టరేట్‌కు రాగా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని బోకురిపల్లె కాలనీకి చెందిన కత్తూరి బాపురెడ్డి, బోకూరి పతి తమ ఇంటి స్థలాన్ని కొంత భాగం కూల్చివేసి మురికి కాలువ నిర్మాణం చేశారని ఇదెక్కడి అన్యాయమని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గమే అన్యాయం చేస్తే తమకు దిక్కెవరని గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విచారణకు వచ్చిన అధికారులు మొక్కుబడిగా వ్యవహరించారు. న్యాయం జరగకపోవడంతో తహసీల్దార్, పంచాయతీరాజ్ కార్యాలయాల చుట్టూ తిరిగారు. ఫలితం లేకపోవడంతో కలెక్టర్‌ను కలిసేందుకు రాగా ఆమె అందుబాటులో లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

పోస్టర్ ఆవిష్కరణ



విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లాజిస్టిక్స్ విభాగం ద్వారా ఈనెల 17న భద్రాచలంలో జరిగే సీతారామచంద్ర స్వామి కల్యాణ ఉత్సవాల తలంబ్రాల పంపిణీకి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ సమేలా సత్పతి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తలంబ్రాలు బుక్ చేసుకోగా.. దీనికి సంబంధించిన రసీదు ఆర్టీసీ లాజిస్టిక్స్ మేనేజర్ ఎస్.సదాశివ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు అవినాశ్, జగన్ పాల్గొన్నారు.

- రామగుండం- మణుగూరు నూతన రైల్వేలైన్
- బసంత్‌నగర్ విమానాశ్రయంపై కొత్త ఆశలు
- నవోదయ, కేంద్రీయ విద్యాలయాల పెంపు
- సింగరేణి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు
- తెరపైకి సుల్తానాబాద్‌లో డ్రైపోర్టు
- కాంగ్రెస్ మేనిఫెస్టోలో పాతజిల్లా ప్రాజెక్టులకు పెద్దపీట



హామీలపై అభయహస్తం!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టో విడుదల చేసింది. 2024 పార్లమెంటు ఎన్నికల కోసం రాష్ట్రంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ రూపొందించిన ఈ మేనిఫెస్టో ఉమ్మడి జిల్లా ప్రజలను ఆలోచింపజేస్తోంది. ఇందులో చాలా డిమాండ్లు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటూ వస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే మేనిఫెస్టోను అమలు చేస్తామని, తద్వారా ఉమ్మడి జిల్లా వసతులు, ఉపాధి, విద్య, రవాణా, పారిశ్రామిక, వాయు, రైల్వేరంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని హస్తం నేతలు స్పష్టం చేస్తున్నారు. ఆరుగ్యారంటీల తరహాలో తాము చెప్పింది అమలు చేస్తామని పునరుద్ఘాటిస్తున్నారు.

బసంత్‌నగర్ విమానాశ్రయం

ఉమ్మడి జిల్లా ముఖచిత్రాన్నిమార్చే సత్తా ఉన్న ప్రాజెక్టు బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు. ఉడాన్ 5.0 ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రం నుంచి వరంగల్, బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టులు ఎంపికయ్యాయి. గతంలో బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టుకు సంబంధించిన సర్వే పూర్తయి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపినా ఎలాంటి స్పందన లేదు. తాజాగా కాంగ్రెస్ కొత్త విమానాశ్రయాల ఏర్పాటు తమ మేనిఫెస్టోలో పెట్టేసరికి తిరిగి ఈ ప్రాజెక్టుపై ఆశలు చిగురించాయి. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే.. జగిత్యాల, సిరిసిల్ల, కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాలకు ఎయిర్‌కనెక్టివిటీ సాధ్యపడుతుంది. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల, కాళేశ్వరం, రామగిరిఖిల్లా వంటి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల్లో అనూహ్య అభివృద్ధి జరుగుతుంది.

నేడు కరీంనగర్ ఎంపీ అభ్యర్థి ఖరారు

ఉమ్మడి జిల్లాలో జీవన్‌రెడ్డి- నిజామాబాద్, గడ్డం వంశీ- పెద్దపల్లి పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులుగా ప్రకటించిన కాంగ్రెస్ ఇంకా కరీంనగర్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత అసెంబ్లీ తరహాలోనే పారాచూట్ లీడర్లనే రంగంలోకి దించబోతున్నారని సమాచారం. మొదటి నుంచి టికెట్ రేసులో మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ముందుండగా.. తరువాత వెలిచాల రాజేందర్‌రావు, తీన్మార్ మల్లన్న పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. వీరిలో అధిష్టానం ఎవరి వైపు మొగ్గుతుందో నేడు(శనివారం) తేలనున్నట్లు సమాచారం.

రామగుండం- మణుగూరు కొత్త రైల్వేలైన్

రామగుండం- మణుగూరు రైల్వేలైన్‌కు పెద్దపీట వేస్తామని తెలిపింది. వాస్తవానికి ఇది కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్. దీనికి తాజా బీజేపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 200 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ ప్రాజెక్టుకు బడ్జెట్ అంచనాలు రూ.2వేల కోట్ల పైమాటే. బెల్లంపల్లి నుంచి కొత్తగూడెం వరకు అన్ని సింగరేణి భూగర్భ గనులు, ఓపెన్‌కాస్టులు, థర్మల్ పవర ప్రాజెక్టులను అనుసంధానం చేస్తూ కోల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని బీజేపీ ప్రకటించింది. వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టుకు కాంగ్రెస్ కూడా తన మేనిఫెస్టోలో చోటు కల్పించింది.

సుల్తానాబాద్ డ్రైపోర్టు

తెలంగాణలో డ్రైపోర్టుల ఏర్పాటు ఉమ్మడి రాష్ట్రం నుంచే ఉంది. ఈ మేరకు గత బీఆర్‌ఎస్, అంతకు ముందు కాంగ్రెస్ హయాంలోనూ ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. రైల్వే కనెక్టివిటీ, సరిపడినంత భూమి ఉండటంతో ఉమ్మడి జిల్లాలో సుల్తానాబాద్‌లో డ్రైపోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని అధికారులు సూచించారు. తాజాగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో డ్రైపోర్టుల ఏర్పాటుకు చోటు కల్పించడంతో సుల్తానాబాద్ డ్రైపోర్టుపై ఆశలు చిగురిస్తున్నాయి.

నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు

ఉమ్మడి జిల్లాలో కేంద్రీయ విద్యాలయాలు కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్లలోనే ఉన్నాయి. జగిత్యాలలో ఇంతవరకూ ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి జిల్లాలో చొప్పదండి మినహా మరే ప్రాంతంలో నవోదయా విద్యాలయాలు లేవు. కొత్త జిల్లాలు ఏర్పాటు అయ్యాక జిల్లాకో నవోదయా విద్యాలయాలు రావాల్సి ఉన్నా.. ఇంతవరకూ ఆ డిమాండ్ అమలు కాలేదు. తాజాగా కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే నవోదయా, కేంద్రీయ విద్యాలయాల సంఖ్య పెంచుతామని పేర్కొనడం విశేషం.

సింగరేణి పారిశ్రామిక కారిడార్

బెల్లంపల్లి నుంచి కొత్తగూడెం వరకు పలు గనులు, ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులను సింగరేణి కలిగి ఉంది. ఈ ప్రాంతంలో సింగరేణి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తే.. కొత్త గనులు, పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు దక్కే సూచనలు మెండుగా ఉంటాయి. మేనిఫెస్టోలోని ఈ హామీ ద్వారా సింగరేణి ప్రస్తుత, విశ్రాంత కార్మికులతో పాటు, నిరుద్యోగులు, యువతను ఆకట్టుకునే యత్నం చేసింది.

కాంగ్రెస్, బీజేపీతో ఒరిగేదేమీలేదు



మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో వినోద్ కుమార్, ఎమ్మెల్యే గంగుల, మేయర్ సునీల్‌రావు

- ప్రశ్నించే గొంతుక 'బోయినపల్లి'
- బీఆర్‌ఎస్‌ను గెలిపించండి
- హామీల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీయండి
- పదేళ్లల్లో బీజేపీ చేసిందేమిటో ప్రశ్నించండి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



హాజరైన ప్రజలు

కరీంనగర్: అడ్డగోలు హామీలు, అబద్ధపు ప్రచారంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, మోసపూరిత పాలనతో దేశాన్ని అధోగతిపాలు చేస్తున్న బీజేపీతో ఒరిగేదేమి లేదని, ఆ రెండు పార్టీలను రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా మంకమ్మతోట లేబర్ అడ్డా నుంచి రాంనగర్ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించి, కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడారు. పదేళ్లల్లో బీజేపీ, ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్‌కు చేసింది శూన్యమని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ చేతులెత్తేసిందని పేర్కొన్నారు. పదేళ్లల్లో కరీంనగర్ అగ్రగామిగా అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలోనే రెండో నగరంగా నిలవడం వెనుక మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ చొరవ ఎంతో ఉందని అన్నారు. అర్హత లేకున్నా కేంద్రాన్ని ఒప్పించి స్మార్ట్‌సిటీ సాధించిన ఘనత వినోద్‌దేనని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక అవసరమని, అభివృద్ధి కోసం వినోద్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్‌ను విద్యాకేంద్రంగా మార్చడమే తన లక్ష్యమని అన్నారు. కరీంనగర్‌కు ట్రిపుల్‌ఐటీ మంజూరు చేయిస్తే ఎంపీ సంజయ్ నిర్లక్ష్యం వల్ల తరలిపోయిందని పేర్కొన్నారు. ప్రజలు ఆశీర్వదించి తనను పార్లమెంట్‌కు పంపిస్తే కరీంనగర్‌ను మరింత అభివృద్ధి చేస్తా అన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ... పదేళ్లల్లో బీఆర్‌ఎస్‌హయంలో వేలకోట్లతో అభివృద్ధి చేసుకున్న జిల్లాలో నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో రైతులకు నీళ్లగోస మొదలైందని పేర్కొన్నారు. మేయర్ వై.సునీల్‌రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి హరిశంకర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, చల్మెడ లక్ష్మీనర్సింహారావు, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వీర్ల వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



వైభవం.. వెంకన్న కల్యాణం

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో శుక్రవారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామ పరిధిలోని గుట్టవద్ద ఉన్న ఆలయం కల్యాణ మండపంలో శ్రీ లక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరిపించారు. పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి వేడుకలో పాల్గొన్నారు.

ఆరని మంటలు

- డంప్‌యార్డ్‌లో రాజుకుంటున్న నిప్పు
- తీవ్రత తగ్గినా కమ్మేస్తున్న పొగ
- ఫైర్‌ఇంజన్లతో కొనసాగుతున్న చర్యలు



డంప్‌యార్డ్ నుంచి వెలువడుతున్న పొగ

కరీంనగర్ కార్పొరేషన్ : నగర శివారులోని డంప్‌యార్డ్‌లో మొదలైన చిచ్చు ఆరడం లేదు. గత నాలుగు రోజులుగా చెలరేగుతున్న నిప్పును ఆర్పేందుకు నగరపాలకసంస్థ అధికారుల చర్యలు కొనసాగుతున్నా పూర్తిశాతం నియంత్రణలోకి రావడం లేదు. గతంతో పోల్చితే తీవ్రత తగ్గినా ఆ ప్రాంతాన్ని పొగ కమ్మేస్తోంది. దీంతో బయోమైనింగ్ కూడా మొదలు కావడం లేదు.

పెరిగిన వేడి.. వీస్తున్న గాలులు

డంప్‌యార్డ్‌లో గత నాలుగు రోజుల క్రితం మొదలైన చిచ్చు కొనసాగుతోంది. వేసవి కారణంగా వేడి పెరగడం, కొద్దిరోజులుగా వీస్తున్న గాలులకు తోడు మంటలు చల్లారడం లేదు. వర్షాకాలం మినహా ఈ మంటలు కొనసాగుతుండడం ఇక్కడ సర్వసాధారణం. అందులో వేసవిలో ఈ సమస్య అధికంగా ఉంటుంది. ఈ క్రమంలోనే గత నాలుగు రోజుల క్రితం పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో, డంప్‌యార్డ్ పరిసర ప్రాంతాలతో పాటు కోతిరాంపూర్, ఆటోనగర్, అలకాపురికాలనీ, కట్టరాంపూర్, లక్ష్మీనగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ తదితర ప్రాంతాలను పొగ కమ్మేయడం తెలిసిందే. దీంతో నగరపాలకసంస్థ అధికారులు మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టారు. ఫైర్ ఇంజన్‌లు, వాటర్ ట్యాంకర్ల ద్వారా నిత్యం నీళ్లు చల్లుతున్నారు. మంటలు కాస్త అదుపులోకి వచ్చినా, సమస్య పూర్తిగా తొలగిపోవడం లేదు. చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో నీళ్లు కింది వరకు వెళ్లడం లేదు. ఫలితంగా వాగు వైపు ఉన్న చెత్త గుట్టల నుంచి గాలుల కారణంగా మంటలు పుడుతూనే ఉన్నాయి. భారీ వర్షం పడితే తప్ప చెత్త గుట్టల్లోని నిప్పు పూర్తిగా ఆరిపోయే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం మంటలు, పొగ వ్యాపిస్తుండడంతో బయోమైనింగ్ కూడా ప్రారంభం కావడం లేదు. ఫలితంగా పాత చెత్తగుట్టలు అలానే ఉండగా, కొత్త చెత్త వచ్చి చేరుతోంది. కాగా నగరాన్ని వాయి కాలుష్యం వైపు నెడుతున్న డంప్‌యార్డ్ సమస్యకు తాత్కాలిక ఉపశమనం కాకుండా, శాశ్వత పరిష్కారం దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అయ్యో.. అన్నదాత

- ఓ వైపు సాగునీటి లేమి
- మరోవైపు కోతల దోపిడీ
- మొగులు సాకుతో ఇష్టారీతిగా ధరలు
- బోనస్ ఉన్నట్టా.. లేనట్టా?



పొలంలో దీనంగా కూర్చున్న ఈ రైతు పేరు గుజ్జుల సత్యనారాయణరెడ్డి. కరీంనగర్ రూరల్ మండలం చర్లబూత్కూర్. బావిలో నీళ్లున్నాయనే ఆశతో మూడెకరాల్లో వరి సాగు చేశాడు. వరి పొట్టకొచ్చే దశలో నీళ్లు సరిపోకపోవడంతో రూ.55 వేలుపెట్టి మూడు సైడ్ బోర్లు వేయించాడు. ఫలితం లేకపోగా పొలమంతా ఎండిపోయింది.

కరీంనగర్ అర్బన్: నీళ్లు అందక, అసలే పంట సరిగా పంటక అన్నదాత కలవరపడుతుంటే 'కోత'ల దోపిడీ ఆందోళన రేపుతోంది. నాలుగు రోజులపాటు వర్షాలుంటాయనే వాతావరణశాఖ హెచ్చరికల క్రమంలో వరికోత కోయాలనుకున్న రైతు అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్నారు హార్వెస్టర్ యజమానులు. మొగులు సాకుతో ఇష్టారీతి ధరలతో నిలువునా దోచుకుంటున్నారు. గత యాసంగిలో అకాల వర్షాలు వెంటాడగా, వీలైనంత త్వరగా కోతలు పూర్తి చేయాలని భావిస్తున్నారు.

కోతల దోపిడీ షురూ

జిల్లాలో 2.66లక్షల ఎకరాల్లో వరిసాగవగా 5.50లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుంది. కరీంనగర్ అర్బన్ మినహా దాదాపు అన్ని మండలాల్లో వరి సాగవగా హార్వెస్టర్లు గ్రామాలకు చేరాయి. గత యాసంగిలో గంటకు రూ.1500 తీసుకోగా ప్రస్తుతం రూ.1800వరకు వసూలు చేస్తున్నారు.

యాసంగి సీజన్‌లో వర్షం కురిసిన రోజులిలా

నెల	వర్షం పడిన రోజులు		
		జనవరి	3
		ఫిబ్రవరి	0
నవంబర్	4	మార్చి	1
డిసెంబర్	3	ఏప్రిల్	0

హార్వెస్టర్‌తో ఎకరం కోయాలంటే రెండు గంటల సమయం పడుతుంది. అదనపు వసూలుతో రైతులపై రూ.కోట్లలో భారం పడుతోంది. ఇక ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2203 కాగా వ్యాపారులు కల్లాల వద్దే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అకాల వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రూ.1800 నుంచి రూ.1900 వరకు మాత్రమే ఖరీదు చేస్తూ రైతుశ్రమను దోచుకుంటున్నారు.

బోనస్ ఉన్నట్టా లేనట్టా

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వరి పంటకు బోనస్ రూ.500లు ఇస్తామని ప్రకటించింది. ఆచరణలో సదరు బోనస్‌పై ఎలాంటి మార్గదర్శకాలు లేకపోవడంతో అధికారులు సమాధానం చెప్పలేని పరిస్థితి. ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటడంతో వరి సుమారు 20వేల ఎకరాల వరకు ఎండిపోగా ప్రతి రైతుకు దిగుబడి తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన బోనసే కొండంత అండ. బోనస్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరముంది.

వట్టిపోయిన బోర్లు

భూగర్భజలాలు అడుగంటడంతో పలుచోట్ల బోర్లు వట్టిపోయాయి. మానకొండూరు, సైదాపూర్, రామడుగు, గంగాధర, వీణవంక, ఇల్లందకుంట, గన్నేరువరం ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. పంటను కాపాడుకునేందుకు రైతులెన్ని బోర్లు వేసిన ఫలితం శూన్యం. పంటను కాపాడుకునేందుకు చేసిన భగీరథ ప్రయత్నాలు ఫలించలేదు. డ్రైస్పెల్, వర్షాలు లేకపోవడం వంటి కారణాల క్రమంలో భూగర్భజలాలు పాతాళానికి పడిపోయాయి. ఈ క్రమంలో ఎంత లోతు బోరువేసినా నీరు రాకపోవడంతో రైతులు పంటను కళ్లెదుటే వదిలేసుకున్నారు.

కొంప ముంచిన డ్రైస్పెల్స్

యాసంగిలో వర్షలేమి ప్రస్తుత దుస్థితి కారణం. వానాకాలం సీజన్‌లోనూ వర్షాలు అంతంతమాత్రమే కురియగా ప్రాజెక్టుల్లో నీళ్ల ఆశించినస్థాయిలో లేవు. ఖరీఫ్‌లో పడిన వానలే యాసంగి పంటలకు భరోసా. కాలువలు, చెరువుల ద్వారా నీళ్లందగా బోర్లు, బావులు కూడా నీటితో ఉండేవి. వానాకాలంలో 45 రోజులు మాత్రమే వర్షం పడగా డ్రైస్పెల్స్(వర్ష వర్షానికి విరామం ఎక్కువగా ఉండటం) తీరని నష్టం కలిగించాయి. ఇక యాసంగిలో వర్షాలు నామమాత్రమే. 15 రోజులు మాత్రమే వర్షం కురియగా డ్రైస్పెల్స్ ఎక్కువ. దీంతో పంట దిగుబడి గణనీయంగా పడిపోయింది.



వరి కోస్తున్న హార్వెస్టర్

ఇప్పటి నుంచి చర్యలుండాలే



వరి కోతలు మొదలవుతున్నాయి. ఇప్పటికే హార్వేస్టర్లు వచ్చినయి. గత యాసంగి, వానాకాలం సీజన్‌లో ఇష్టారీతిగా దోచుకున్నరు. ఇప్పుడిప్పుడే కోతలవుతున్నందున జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– రాజయ్య, రైతు, గన్నేరువరం

నియంత్రణ ఉండాలి



హార్వేస్టరు యజమానులు ఒక తీరు, అద్దెకు తెచ్చుకున్నవారు ఒకతీరు డబ్బులు వసూలు చేస్తున్నారు. డీజిల్ ధర, వారికయ్యే ఖర్చు అన్నింటిని బేరీజు వేసి ధరను నిర్ణయించాలి. అట్లయితేనే రైతులకు మేలు జరుగుతుంది.

– మల్లేశం, రైతు, మానకొండూరు

పకడ్బందీగా ఎన్నికల నియమావళి

- పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని సీపీ అభిషేక్ మహంతి పేర్కొన్నారు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం కమిషనరేట్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, ఎస్‌హెచ్‌వోలతో నేర సమీక్ష, రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. చెక్‌పోస్టుల పనితీరుపై దృష్టి సారించాలన్నారు. ప్రతీవాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. సంఘ విద్రోహ వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే బైండోవర్ కాబడి గడువు ముగిసిన వారిని తిరిగి బైండోవర్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సంబంధిత స్టేషన్ల అధికారులు స్వయంగా పరిశీలించాలన్నారు. సీసీసీ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి క్వాలిటీ డిస్పోస్ చేయాలన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

కమిషనరేట్‌వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, అందుకు కారణాలను తెలుసుకున్నారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారెంట్లను, ముఖ్యంగా భౌతికనేరాలకు సంబంధించినవి అమలయ్యేలా చూడాలన్నారు. అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్, నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్‌జీ, మాధవి, విజయ్‌కుమార్, వేణుగోపాల్, కాశయ్య, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

క్లుప్తంగా

లింగాపూర్‌లో యువకుడి ఆత్మహత్య

మానకొండూర్: మండలంలోని లింగాపూర్‌కు చెందిన బట్టూరి సంపత్(34) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. సంపత్‌కు 14 ఏళ్ల క్రితం శారదతో వివాహమైంది. అతను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, తమకు సంతానం కలగడం లేదని నిత్యం బాధ పడేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై, అప్పులపాలయ్యాడు. ఈ నెల 10న (బుధవారం) రాత్రి ఇంట్లోనే నిద్రించిన సంపత్ గురువారం ఉదయం తన గది నుంచి బయటకు రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. మృతదేహానికి అదేరోజు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, సంపత్‌ది అసహజ మరణం అని తెలియక అంత్యక్రియలు చేశామని శుక్రవారం అతని తండ్రి రాజేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంపత్ మృతదేహాన్ని గుంతలో నుంచి బయటకు తీయించి, పోస్టుమార్టం చేయించినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిన్నకల్వలలో వివాహిత..


ప్రేమల (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వలకు చెందిన ఏరుకొండ ప్రేమల (55) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ప్రేమల బ్రెస్ట్ కేన్సర్‌తో బాధ పడుతోంది. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కీమోథెరపీ చేయించుకుంటోంది. ఈ క్రమంలో శనివారం మళ్లీ కీమోథెరపీ ఉండటంతో ఇక తనకు ఎప్పటికైనా మరణం తప్పదని మనస్తాపానికి గురైంది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కాసేపటికి గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గోదావరినదిలో దూకి యువతి..

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరినదిలో దూకి ఓ యువతి ఆత్మహత్య చేసుకుందని ఖని టూటౌన్ సీఐ రవీందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గోదావరిఖని హనుమాన్ నగర్‌కు చెందిన అర్షియా(22) డిగ్రీ చదువుతోంది. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది, శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చింది. గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకొని, నదిలో దూకింది. అక్కడే చేపలు పడుతున్న జాలర్లు ఆమెను కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అర్షియా నీటమునిగి చనిపోయింది.

బావిలో దూకి వృద్ధురాలు..

ముత్తారం(మంథని): ఓడేడ్‌కు చెందిన గుర్రాల రాజమ్మ(93) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజమ్మ ఛాతిలో నొప్పితో బాధ పడుతోంది. మందులు వాడినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. శుక్రవారం తన ఇంటి ఆవరణలోని బావిలో దూకింది. మృతురాలి కూతురు ఉజ్జెత్తుల బొందమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకొని కోరుట్లవాసి..

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన మోటం సాయిలు(58) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సాయిలు నిత్యం అతిగా మద్యం సేవించి, ఇంటికి వస్తున్నాడు. గురువారం రాత్రి కూడా అలాగే రావడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై, ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్త

- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి
- వసతులు పరిశీలించి, అనుమతి పత్రాలు అడగండి
- లేకపోతే ఇబ్బందులే..



కరీంనగర్‌లో ముందస్తు అడ్మిషన్లు, కోచింగ్‌ల పేరిట వెలసిన ప్రైవేట్ విద్యాసంస్థల బోర్డులు

కరీంనగర్: జిల్లా కేంద్రంతోపాటు వివిధ పట్టణాల్లోని పలు పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్ల హడావుడి మొదలైంది. విద్యాసంవత్సరం ప్రారంభం కావడానికి మరో రెండు నెలల సమయం ఉన్నా జిల్లాలోని సీబీఎస్‌ఈ స్కూళ్లు, సాధారణ స్కూళ్లలో ఇప్పుడు అడ్మిషన్ల కోలాహలం నడుస్తోంది. ఎల్‌కేజీ, యూకేజీ, ఫస్ట్ క్లాస్‌లకు ప్రవేశాలు తీసుకుంటున్నారు. ఈ తరగతులనే మరికొంత మంది పీపీ–1, పీపీ–2, ఫస్ట్ స్టాండర్డ్ అని పిలుస్తున్నారు. కరీంనగర్ నగరంలో టాలెంట్, కాన్సెప్ట్, ఇంటర్నేషనల్, ఒలింపియాడ్, వరల్డ్ లెవల్, నేషనల్ తదితర ట్యాగ్‌లైన్లతో పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో కొన్నింటికి ప్రభుత్వ అనుమతులు ఉండగా, మరికొన్నింటిని బ్రాంచిల పేరుతో నిర్వహిస్తున్నారు. ఇంకొన్నింటికి అనుమతులే లేవు. ఇదిలా ఉండగా తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్లలో చేర్పించేందుకు సిద్ధమవుతున్నారు. అడ్మిషన్లు, ఇంటర్వ్యూలు, రిటెన్ టెస్ట్‌లు, డొనేషన్లు అంటూ ఆయా పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులను తమ చుట్టూ తిప్పుకుంటున్నాయి.

రిజిస్ట్రేషన్, రికగ్నిజేషన్ వేర్వేరు..

ప్రతీ పాఠశాల ప్రభుత్వం నుంచి కచ్చితంగా రికగ్నిజేషన్ పొందాలి. ఇది నిబంధన. అయితే, చాలా స్కూళ్ల బోర్డులు, ప్రకటనలు చూస్తే గవర్నమెంట్ రిజిస్టర్డ్ అని రాస్తుంటారు. రిజిస్టర్ ఎవరైనా చేసుకోవచ్చు. కానీ, విద్యాశాఖ నుంచి రికగ్నిజేషన్ తీసుకున్న స్కూల్లోనే పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకున్నా కొందరు నిర్వాహకులు ఇతర పాఠశాలల తరఫున విద్యార్థులను పరీక్షల్లో కూర్చోబెడతారు. ఇలా పరీక్ష రాసిన వారిని ప్రభుత్వం ప్రైవేట్ విద్యార్థిగానే పరిగణిస్తుంది. ఇక, బ్రాంచిల పేరుతో పాఠశాలలు నడిపేవారు సదరు బ్రాంచికు విద్యాశాఖ అనుమతి ఉందా.. లేదా చూసుకోవాలి. లేదంటే వారు ఆ బ్రాంచి విద్యార్థులను ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచి నుంచి పరీక్షలు రాయిస్తుంటారు. ఈ విషయంలో తల్లిదండ్రులు మొహమాటానికి వెళ్లకుండా కచ్చితంగా అనుమతి పత్రాలు అడిగి తెలుసుకుంటే మంచిది. సీబీఎస్‌ఈ అనుమతి ఉందన్నవారు కూడా తమ అనుమతి పత్రాలను నోటీసు బోర్డులో ఉంచాల్సిన అవసరం ఉంది.

ఆకట్టుకునేందుకు ఎక్కువ ప్రచారం..

పాఠశాలల నిర్వాహకులు అడ్మిషన్లు పెంచుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునేలా వీలైనంత ఎక్కువ ప్రచారం చేస్తుంటారు. తమ స్కూల్లో ఫలానా సౌకర్యాలు ఉన్నాయని, ప్రత్యేక శిక్షణ ఇస్తామని, ప్లే గ్రౌండ్ ఉందని, ఇతరత్రా చెబుతుంటారు. ఈ విషయాల్లో చాలా కచ్చితంగా ఉండాలి. క్రీడా మైదానాలు లేని, అపార్ట్‌మెంట్ భవనాల్లో, ఇరుకు సందుల్లో ఉన్న పాఠశాలలకు వెళ్లకుండా ఉంటే మంచిది. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు క్రీడలు ఎంతగానో తోడ్పడుతాయి. క్రీడా మైదానాలు లేని స్కూళ్లను ఎంచుకోవద్దు. ఇరుకు గదులు, సందుల్లో ఉండే పాఠశాలల్లో ఎలాంటి ప్రమాదాలు జరిగినా భారీ నష్టం జరుగుతుంది. ఇటువంటి స్కూళ్లకు అగ్నిమాపక శాఖ అనుమతి కూడా ఉండదు. రక్షణ చర్యలు తీసుకున్నారా.. లేదా పరిశీలించండి. టాయిలెట్స్ కూడా సరిగా లేని ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి.

క్వాలిఫైడ్ టీచర్లేనా?

క్వాలిఫైడ్ టీచర్లు లేకున్నా కొన్ని పాఠశాలలను నడిపిస్తుంటారు. ఉన్నత తరగతి విద్యార్థులకు కూడా డిగ్రీ, ఇంటర్ ఫెయిలైన వారితో చదువు చెప్పిస్తుంటారు. విద్యాబోధనకు బీఈడీ, పీజీ చేసినవారు ఉండాలి. ఇది నిబంధన కూడా. ఈ విషయంలో కొన్ని స్కూళ్లు నిబంధనలు పాటిస్తుండగా మరికొన్ని పట్టించుకోవడం లేదు. అడ్మిషన్ సమయంలో ఈ వివరాలు అడగాల్సిందే.

తనిఖీలు చేపట్టాలి



ప్రైవేట్ పాఠశాలల అడ్మిషన్ల దందాపై విద్యాశాఖ అధికారులు దృష్టిసారించాలి. అనుమతులు ఉన్న, లేని స్కూళ్ల వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. ఫీజులతోపాటు మౌలిక వసతులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి. విద్యాబోధన చేసేవారి వివరాలను ఎప్పటికప్పుడు సేకరించి, తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయాలి. ఆమ్యామ్యాలకు అలవాటుపడి, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు.

– చిక్కుల్ల కిరణ్, ఏబీవీపీ జిల్లా నాయకుడు, కరీంనగర్

- మైనార్టీ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం
- 'సాక్షి'తో రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ



వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే కర్తవ్యం

గంభీరావుపేట(సిరిసిల్ల): వక్ఫ్‌భూములు, ఆస్తుల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం.. మైనార్టీ యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానని రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ పేర్కొన్నారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా స్వగ్రామం గంభీరావుపేట మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన మాటల్లోనే పలు వివరాలు..

సేవలను గుర్తించి..

కాంగ్రెస్ పార్టీలో పాతికేళ్లుగా పనిచేస్తున్నాను. నా సేవలను పార్టీ గుర్తించి రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ పదవిని ఇచ్చింది. ఈ పదవి రావడం ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులకు ఇదే ప్రథమం. సిరిసిల్ల నుంచి కేబినెట్ హోదాలో గతంలో పాటిరాజం పనిచేశారు. రెండోసారి కేబినెట్ హోదాలో నేను పనిచేయడం గర్వంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలుత నా పదవినే ప్రకటించింది. గతంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఏఐసీసీలో పలు పదవులు నిర్వర్తించాను.

వక్ఫ్ ఆస్తులను కాపాడుతాను

రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన తర్వాత పకడ్బందీ ప్రణాళికతో ముందుకుసాగుతున్నాను. రాష్ట్రంలో 70 శాతం వక్ఫ్ భూములు, ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయి. మరో 10శాతం కోర్టుల పరిధిలో ఉన్నాయి. వాటిని తిరిగి పొందేలా, మిగిలిన 20 శాతం వక్ఫ్ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా కాపాడడమే ధ్యేయంగా పనిచేస్తాను. మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తాను.

ఉపాధి అవకాశాలు

నా సొంత ప్రాంతం సిరిసిల్లకు చేయాల్సింది చాలా ఉంది. ముఖ్యంగా గ్రామాల్లోని మైనార్టీ యువతకు ఉపాధి మార్గాలు చూపేలా కృషి చేస్తాను. భవిష్యత్‌లో నాకు గుర్తింపు ఉండేలా జిల్లా కోసం పనులు చేస్తాను.

డిక్లరేషన్ అమలుకు కృషి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు 10 అంశాలతో కూడిన మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించింది. మైనార్టీలకు ప్రయోజనం చేకూరేలా డిక్లరేషన్ అంశాలను అమలయ్యే విధంగా కృషి చేస్తాను. మైనార్టీల సంక్షేమానికి పాటుపడుతా. మైనార్టీల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా పనిచేస్తాను.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారిపై ఇద్దరు, మల్లాపూర్ మండలంలోని రాఘవపేటలో యువరైతు, యైటింక్లయిన్ కాలనీ సంతోష్ నగర్‌కు చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరు..

కోరుట్ల/మెట్‌పల్లిరూరల్: కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొని, ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణానికి చెందిన తొగిటి వెంకటేశ్(28) తన స్నేహితుడు ఇందూరి శ్రీనివాస్(27)తో కలిసి బంగారు ఆభరణాల పని మీద శుక్రవారం బైక్‌పై మెట్‌పల్లికి వెళ్లి, రాత్రి 10 గంటలకు తిరిగివస్తున్నారు. అదే సమయంలో మెట్‌పల్లికి చెందిన మీర్జా ఖాజాబేగ్(45) తన ఇద్దరు కూతుళ్లు ఆయేషా, అనుఫాతిమాలతో కలిసి బైక్‌పై కోరుట్ల నుంచి మెట్‌పల్లి వెళ్తున్నాడు. వీరి వాహనాలు కోరుట్ల–మెట్‌పల్లి మధ్యలోని పెద్ద గుండు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనాలు నడుపుతున్న వెంకటేశ్, మీర్జాఖాజా బేగ్‌లు అక్కడికక్కడే మృతిచెందారు. మీర్జా ఖాజా బేగ్ కూతుళ్లు, శ్రీనివాస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జ్యూస్ తాగిద్దామని తీసుకువచ్చి..

మెట్‌పల్లికి చెందిన మీర్జా ఖాజా బేగ్ గురువారం రంజాన్ పండుగ జరుపుకున్నాడు. కోరుట్లలో పేరొందిన ఫలుదా జ్యూస్‌ను తన కూతుళ్లకు తాగిద్దామని కోరుట్లకు తీసుకువచ్చినట్లు సమాచారం. తిరిగి మెట్‌పల్లి వెళ్తుండగా ప్రమాదం జరిగి, అతను ప్రాణాలు వదలడం అందరినీ కంటతడి పెట్టించింది.


వెంకటేశ్ (ఫైల్)


ఖాజా బేగ్ (ఫైల్)

ఒక్కగానొక్క కొడుకు..

కోరుట్లలోని అయిలాపూర్ రోడ్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద నివాసముండే తొగిటి రమేశ్–జల దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు వెంకటేశ్. ఇతను బంగారు ఆభరణాల వ్యాపారంలో ఉన్నాడు. ఆభరణాల్లో వజ్రపు రాళ్లు తాపడం చేయించడం కోసం మెట్‌పల్లి వెళ్లి వస్తుంటా డు. ఈ క్రమంలోనే అతను మృతిచెందాడు. వెంకటేశ్‌కు రెండేళ్ల క్రితం హారికతో వివాహం జరిగింది. వీరికి 11 నెలలు బాబు ఉన్నాడు. ఈ మధ్యనే ఆ చిన్నారికి పుట్టు వెంట్రుకలు తీయించినట్లు బంధువులు తెలిపారు. చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలను, మోటార్ సైకిళ్లను తొలగించేందుకు కోరుట్ల, మెట్‌పల్లి ఎస్సైలు కిరణ్, చిరంజీవిలు అవసరమైన చర్యలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు.

మీర్జా గది పక్కనే అద్దెకున్న వ్యక్తికీ ప్రమాదం..

మీర్జా ఖాజా బేగ్ అద్దెకున్న ఇంట్లోనే అద్దెకున్న వహీద్ ఇబ్రహీంపట్నం మండలం సత్తక్కపల్లి బ్రిడ్జి సమీపంలో శుక్రవారం రాత్రి బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలపాలయ్యాయి. మెట్‌పల్లి పోలీసులు వహీద్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యైటింక్లయిన్‌కాలనీ సంతోష్‌నగర్‌వాసి..


ప్రశాంత్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్/యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ 17వ డివిజన్ సంతోష్‌నగర్‌కు చెందిన బొజ్జ పోషమల్లు(పోచం)–వసంత దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. పోషమల్లు లారీ డ్రైవర్. వీరి కుమారుడు ప్రశాంత్(25) హైదరాబాద్‌లో పని చేస్తుంటాడు. శుక్రవారం బైక్‌ను పెద్దపల్లిలో ఉంచి, హైదరాబాద్ వెళ్తానని ఇంట్లో చెప్పి, బయలుదేరాడు. మార్గమధ్యలో పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ శివారులో ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు విగతజీవిగా కనిపించడంతో ప్రశాంత్ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటన సంతోష్‌నగర్‌లో విషాదం నింపింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాఘవపేటలో యువ రైతు..


గంగాధర్ (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో ఓ యువరైతు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని రాఘవపేటకు చెందిన మాదం గంగాధర్(32)కు భార్య సౌమ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతను వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పనిమీద బైక్‌పై వెళ్తుండగా గ్రామంలోని మసీదు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు.

బావి వద్ద నిద్రించి.. అందులోనే పడి

- యువకుడి మృతి
- నిద్ర మత్తు వల్లే ప్రమాదం
- సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు
- మర్రిపల్లిలో విషాదం

వేములవాడరూరల్: రాత్రి సమయంలో ప్రయాణం వద్దు కొడుకా అని తల్లి చెప్పినప్పటికీ వినలేదు.. ఏం కాదమ్మా తెల్లవారేసరికి హైదరాబాద్‌లో ఉంటా.. అంటూ బైక్‌పై వెళ్లిన ఓ యువకుడు దారిలో బావి వద్ద నిద్రించి, ప్రమాదవశాత్తు అందులోనే పడి మృతిచెందాడు.. ఈ ఘటన వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లిలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపల్లికి చెందిన రాచర్ల మల్లేశం–లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు కౌశిక్(23) హైదరాబాద్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చి, తిరిగి గురువారం రాత్రి 8 గంటలకు బైక్‌పై హైదరాబాద్ బయల్దేరాడు. తల్లి వద్దని చెప్పినా వినిపించుకోకుండా తెల్లవారేసరికి అక్కడుంటానంటూ వెళ్లాడు.


కౌశిక్ (ఫైల్)

సిద్దిపేట జిల్లా ఇమాంబాద్ వద్ద ప్రధాన రోడ్డు పక్కన వాహనాన్ని ఆపాడు. హెల్మెట్, బ్యాగు అక్కడే పెట్టి బావి పక్కన ర్యాంప్‌పై నిద్రించాడు. నిద్ర మత్తులో ప్రమాదవశాత్తు బావిలో పడి, చనిపోయాడు. ఉదయం గమనించిన స్థానికులు బైక్ నంబర్ ఆధారంగా వివరాలు తెలుసుకొని, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా బావిలో శవమై తేలాడు. కుమారుడి మృతితో ఆ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు. విషయం తెలుసుకున్న అక్కడి పోలీసులు కౌశిక్ మృతికి గల కారణాలపై విచారణ చేపట్టారు. అతను వాహనాన్ని ఆపడం, ర్యాంప్‌పై నిద్రించడం వంటి దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయినట్లు గుర్తించారు. అనంతరం పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కౌశిక్ మరణ వార్త విన్న అతని స్నేహితులు, గ్రామస్తులు విషాదంలో మునిగారు.

రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

- బియ్యం స్టాక్‌లో తేడా గుర్తింపు
- ముగ్గురు డీలర్లపై కేసు


జమ్మికుంటలో తనిఖీలు చేస్తున్న అధికారులు

హుజూరాబాద్/జమ్మికుంట: హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లోని పలు రేషన్ దుకాణాల్లో జిల్లా సివిల్ సప్లై అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. జమ్మికుంటలోని హౌసింగ్‌బోర్డు కాలనీ డీలర్ రేవెల్లి సుప్రియ షాపులో 10 క్వింటాళ్ల 20 కిలోల రేషన్ బియ్యం అదనంగా ఉన్నట్లుగా గుర్తించారు. దయాకర్‌కు చెందిన దుకాణంలో 7 క్వింటాళ్ల 57 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఇద్దరిపై కేసు నమోదు చేసి, షాపుల ఇన్‌చార్జి బాధ్యతలను ఇతర డీలర్లను అప్పగించినట్లు తెలిపారు. అలాగే, హుజూరాబాద్ పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. అంజన్నకుమార్ షాపులోని బియ్యం స్టాక్‌లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి, అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఆ దుకాణ ఇన్‌చార్జి బాధ్యతను మరో డీలర్ మహేందర్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. హుజూరాబాద్, కరీంనగర్, తిమ్మాపూర్ డీటీసీఎస్‌లు వసంతరావు, సురేందర్, వేణుగోపాల్, హుజూరాబాద్, గంగాధర, తిమ్మాపూర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు వినోద్‌కుమార్, శ్రీనివాస్, కమలేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్లలో నకిలీ నియామక పత్రంపై చర్చ

- ఓ యువతి వద్ద రూ.30 వేలు తీసుకొని, ఇచ్చినట్లు సమాచారం

కోరుట్ల: స్థానిక అల్లమయ్యగుట్ట బస్తీ దవాఖానాలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు నిమిత్తం ఓ యువతికి నకిలీ నియామక పత్రం ఇచ్చారన్న అంశం కోరుట్లలో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణంలోని బిలాల్‌పురకు చెందిన యువతి అల్లమయ్యగుట్ట బస్తీ దవాఖానాలో కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఇప్పించాలని కథలాపూర్‌కు చెందిన ఓ వ్యక్తిని సంప్రదించింది. అతను రూ.30 వేలు తీసుకొని, ఆమెకు నకిలీ నియామక పత్రం ఇచ్చినట్లు తెలిసింది. బాధితురాలు దాన్ని తీసుకొని శుక్రవారం సదరు ఆస్పత్రికి వెళ్లగా అక్కడ ఇదివరకే ల్యాబ్ టెక్నీషియన్ ఉండటం, మరో పోస్టు ఖాళీ లేకున్నా నియామక ఉత్తర్వులు ఎలా వచ్చాయని వైద్య సిబ్బంది ఆశ్చర్యపోయారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకెళ్లగా తాము ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని అధికారులు బదులిచ్చారు. దీంతో వైద్య సిబ్బంది పోలీసులకు చెప్పడంతో ఆ యువతిని అదుపులోకి తీసుకొని, నకిలీ నియామక పత్రం ఎక్కడి నుంచి వచ్చిందని విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

బాలుడిని కబళించిన కేన్సర్

- బహ్రెయిన్‌లో తండ్రి
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు


మనుదీప్ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): కేన్సర్‌తో ఓ బాలుడు మృతిచెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మ్యాకల శ్యామల–శంకరయ్య దంపతులకు ఇద్దరు ఆడపిల్లల తర్వాత మూడో సంతానంగా మనుదీప్(11) జన్మించాడు. ఈ బాలుడు కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నాడు. వైద్యం చేయించేందుకు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వచ్చే వరకు అంత్యక్రియలు చేయొద్దన్న తండ్రి

మనుదీప్ తండ్రి శంకరయ్య జీవనోపాధి నిమిత్తం బహ్రెయిన్ వెళ్లాడు. కుమారుడి మరణ వార్త తెలిసి, తాను వచ్చే వరకు అంత్యక్రియలు చేయొద్దని బంధువులను ఫోన్‌లో కోరాడు. శంకరయ్య శనివారం స్వగ్రామం చేరుకుంటాడని కుటుంబసభ్యులు తెలిపారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో 'అల్ఫోర్స్'కు పతకాలు


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌కు చెందిన పోటీ పరీక్షల సంస్థ సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. హారన్, కె.ఆరాధ్య (నాలుగో తరగతి), మహమ్మద్ హన్నన్, ఎస్.సింగిరెడ్డి(ఐదోతరగతి), సి.హానిష్ (ఏడోతరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ మేరకు పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ పీటీఎస్ సెక్యూరిటీగార్డు మృతి

- మృతుడి స్వస్థలం ప్రకాశం జిల్లా గిద్దలూరు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో పని చేసే సెక్యూరిటీగార్డు ఎం.రంగనాయకులు(50) మృతిచెందాడు. పీటీఎస్‌లోని ఎ–4/57 క్వార్టర్‌లో ఉంటున్న ఆయన శుక్రవారం ఉదయం విధులకు రాకపోవడంతో సిబ్బంది అతని గదికి వెళ్లి, పరిశీలించారు. లోపల అచేతనంగా పడి ఉండటంతో ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన వాడని, విషయాన్ని అతని కుటుంబసభ్యులకు తెలియజేశామన్నారు. వారి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రంగనాయకులు మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి మార్చురీకి తరలిస్తామన్నారు.

జూనియర్ అసిస్టెంట్, ఆమె భర్తపై ఫోర్జరీ కేసు

తిమ్మాపూర్(మానకొండూర్): ఎల్ఎండీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి.తిరుమల, ఆమె భర్త రాజ్‌కుమార్‌లపై ఫోర్జరీ కేసు నమోదైంది. ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమల, రాజ్‌కుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజభాను చంద్రప్రకాశ్ సంతకాలు ఫోర్జరీ చేశారు. తప్పుడు బిల్లులు సృష్టించి, ట్రెజరీకి సమర్పించి అకౌంట్లు మార్చారు. ఉపాధ్యాయుల వేతనాల నుంచి అధిక చెల్లింపులు రికవరీ పేరిట హెచ్ఎంకు తెలియకుండా డబ్బులు వసూలు చేశారు. దీంతో ఆయన శుక్రవారం ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ దంపతులపై ఫోర్జరీ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగిసిన నగేశ్ కస్టడీ..

సంతకాలు ఫోర్జరీ చేసి, తప్పుడు భూ పత్రాలు సృష్టించిన కరీంనగర్ పాతబజార్‌కు చెందిన నగేశ్‌ను ఇటీవల ఎల్ఎండీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ భూ వ్యవహారంలో కంది జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతన్ని అరెస్టు చేసి, జైలుకు తరలించారు. విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకోగా శుక్రవారం ముగియడంతో తిరిగి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట(హుజూరాబాద్): మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో మండ ఎల్లయ్యకు చెందిన బెల్టు షాపులో శుక్రవారం తనిఖీలు చేపట్టామని సీఐ రవి తెలిపారు. రూ.2,720 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

హరీశ్‌రావుకు చిన జీయర్‌స్వామి ఆశీస్సులు



ఆశీర్వాదం తీసుకుంటున్న హరీశ్‌రావు

కరీంనగర్: నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీరామాయణ ప్రవచనాల కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శుక్రవారం హాజరై చిన జీయర్‌స్వామి ఆశీస్సులు అందుకున్నారు. హరీశ్‌రావు వెంట కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ , హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, తదితరులున్నారు.

రిటైర్‌మెంట్ వయస్సుపై స్పష్టత ఇవ్వాలి

కరీంనగర్: ఉద్యోగుల వయస్సు 61 ఏళ్లు లేదా 33 ఏళ్ల సర్వీసు పూర్తయితే రిటైర్‌మెంట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కొన్ని పత్రికలకు, టీవీ చానల్స్‌లో వైరల్ అవుతున్న కథనాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎఫ్ జావెద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటువంటి కథనాలను ప్రచారంలో పెట్టి ఉద్యోగులను గందరగోళంలోకి నెట్టడం సరైంది కాదన్నారు. సర్వీసును 33 ఏళ్లకు పరిమితం చేయటం సమంజసం కాదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై వివరణ ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం

కరీంనగర్ కార్పొరేషన్: లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, వారిని ఓడిస్తారన్నారు.

విజయ సంకల్ప అభియాన్‌ను విజయవంతం చేయండి

కరీంనగర్‌టౌన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాలు గెలుపే లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం పనిచేస్తోందని, అందులో భాగంగా ప్రతీ పార్లమెంట్ పరిధిలో శనివారం చేపడుతున్న బూత్ విజయ సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఒక ప్రకటనలో కోరారు. కరీంనగర్‌లోని రాజశ్రీ గార్డెన్‌లో ఉదయం జరిగే కార్యక్రమంలో పోలింగ్ బూత్ బాధ్యులందరూ పాల్గొనాలన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశ నిర్దేశం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి నేషనల్ (ఆర్గనైజింగ్) జనరల్ సెక్రెటరీ శివప్రకాష్ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఓర్వలేకనే 'పొన్నం'పై విమర్శలు

కరీంనగర్‌కార్పొరేషన్: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పొన్నంపై బీజేపీ నాయకురాలు రాణిరుద్రమదేవి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి రుద్రమదేవికి లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంపీగా పార్లమెంట్‌లో పోరాటం చేసిన ఘనత పొన్నం ప్రభాకర్ సొంతమన్నారు. ఎంపీ బండి సంజయ్ రూ.12 వేల కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు చెబుతున్నారని, ధైర్యం ఉంటే అభివృద్ధిపై చర్చకు రావాలని అన్నారు. ఎంపీగా ఉన్న సమయంలో పొన్నం ప్రభాకర్ చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికీ సజీవంగా దర్శనమిస్తున్నాయని తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

హుజూరాబాద్: మండలంలోని శాలపల్లి ఇందిరానగర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొడిగుటి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కూలీలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు భగవద్గీతా ప్రవచనం

జమ్మికుంట: పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిరంలో చిత్తూరు జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమం పీఠాధిపతులు శ్రీపరిపూర్ణానందస్వామి సమక్షంలో శని, ఆదివారం గీతోపదేశం కార్యక్రమం ఉంటుందని భగవద్గీత మందిరం ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం, ఆదివారం ఉదయం ప్రవచనం ఉంటుందని పట్టణ ప్రజలు, భక్త సమాజం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు



శ్రీనిలయంలో మహాలక్ష్మీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని తిరుమలనగర్‌లో గల శ్రీనిలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. మయూరగిరి పీఠాధిపతులు నమిలకొండ రమణాచార్య ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీ అమ్మవారికి, రామచంద్రస్వామికి ఫలపంచామృత అభిషేకాలు నిర్వహించారు. శ్రీయాగం మహాలక్ష్మీ హోమం జరిపారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పండితులు రామకృష్ణమాచార్యులు, వేణుగోపాలాచార్యులు, గోపీశర్మ, శివరామకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..

వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని హెలీప్యాడ్ గ్రౌండ్ ప్రక్కన గల ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలోని యాగశాలలో నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. మేయర్ సునీల్‌రావు దర్శించుకొని పూజలు జరిపారు. కార్యక్రమంలో ఉపేందర్, వెంకటరావు, ప్రవీణ్, నాగరాజు, ప్రభాకర్, ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

కళాత్మకంగా ఐరేను కుండలు!

- పెళ్లి వేడుకల్లో వాటికి ప్రాధాన్యం
- ట్రెండ్‌కు అనుగుణంగా మార్పులు
- నచ్చినట్లుగా తయారు చేసి ఇస్తున్న విక్రేతలు

విద్యానగర్(కరీంనగర్): తెలుగింటి పెళ్లి వేడుకల్లో ఐరేను కుండలు, గరికె ముంతలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. వీటిని పూజించడం ద్వారా అమ్మవారిని పూజించినట్లు భావిస్తారు. ద్రౌపది తన పెళ్లి సమయంలోని ఆనందావేశంతో పక్కనున్న కలశాన్ని నెత్తిన పెట్టుకుని చిందులేసినట్లుగా పురాణ కథనం కాగా కాలక్రమంలో ఇది సంప్రదాయంగా మారి పవిత్రతను పొందింది. పెళ్లికి ముందు రోజు కుమ్మరి ఇంటికి భజభజంత్రీలతో వెళ్లి కుమ్మరికి కానుకలు ఇచ్చి ఇంటి ఆడపడుచులు, వారి భర్తలు ఇంటికి తీసుకువచ్చి గదిలో ఉండి దీపారాధన చేసి పూజిస్తారు. పెళ్లి సమయంలో గరికె ముంతలను పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు ముందు ఉంచి పూజ చేసి పెళ్లితంతు పూర్తి చేస్తారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ఐరేను కుండలు, గరికె ముంతలు కూడా కళాత్మకంగా తీర్చిదితున్నారు.



ఐరేను కుండలు

వివిధ ఆకృతుల్లో..

ఐరేను కుండలను వివిధ డిజైన్లలో అందంగా తీర్చిదిద్దుతున్నారు. వెండి, బంగారం రంగులు, ఆకర్షణీయమైన రంగులు, పూసలు, అద్దాలు, స్పటికాలు, కుందన్‌లు, అనేక రకాలైన విభిన్నమైన డిజైన్‌లలో ఐరేను కుండలు, గరికె ముంతలు లభిస్తున్నాయి.



అందమైన డిజైన్లలో..

పెళ్లి వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ఐరేను కుండలు, గరికె ముంతలను కూడా కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటి వారి అభిరుచులు, పెళ్లి వేడుకలకు అనుగుణంగా వివిధ డిజైన్లు, రంగుల్లో ఐరేను కుండలను అలంకరిస్తున్నాం. మేమే అందంగా అలంకరించి అమ్ముతుండడం వల్ల మా వద్ద తక్కువ ధరల్లో లభిస్తాయి.

– ఠాకూర్ ఆశా, ఐరేండ్లు తయారుదారు, మార్కెట్ రోడ్, కరీంనగర్

తరతరాలుగా వస్తున్న ఆచారం



పెళ్లి వేడుకల్లో తరతరాలుగా వస్తున్న ఆచారం ఇది. పెళ్లికి ముందు రోజు ఇంటి ఆడపడుచులు, వారి భర్తలు మేళతాళాలతో కుమ్మరి వారింటికెళ్లి ఐరేను కుండలు, గరికె ముంతలు తేవడం తెస్తారు. ఐరేను కుండల ను ఇంట్లో పెట్టి పూజిస్తారు. అదేవిధంగా గరికెముంతలను కూడా ఐరేను కుండలతో తీసుకొచ్చి పూజలు ని ర్వహిస్తారు. ఇవి పెళ్లి సమయంలో ప్రత్యేక స్థానం ఆక్రమిస్తాయి. గౌరీదేవి గా వీటిని భావించి పూజలు చేస్తారు.

– బాశెట్టి రత్నమాల, గృహిణి, కరీంనగర్

తెలుగింటి సంప్రదాయం



పెళ్లిళ్లలో ఐరేను కుండలు, గరికె ముంతలను గౌరీమాతకు ప్రతీకగా పూజించడం తెలుగింటి సంప్రదాయం, పెళ్లి తంతుపూర్తి అయ్యేవరకు గరికె ముంత ఎంతో ప్రాముఖ్యత వహిస్తుంది. పెళ్లి కూతురు అత్తగారింటికి వెళ్లే ముందు ఆమెతో పంపిస్తారు, పెళ్లి తర్వాత కూడా కురాడును పవిత్రంగా చూస్తారు.

– రమణాచార్యులు, మయూరగిరి పీఠాధిపతులు, తిరుమలనగర్, కరీంనగర్

నేటినుంచి శ్రీకోదండ రామాలయంలో బ్రహ్మోత్సవాలు

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లిలోని శ్రీకోదండ రామాలయంలో బ్రహ్మోత్సవాలను శనివారం నుంచి ఈనెల 17వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు విశ్వక్సేన విధి, వాసుదేవ పుణ్యహవచనం, అంకురారోపణం, రక్షబంధనం, నంద దీపస్థాపన, బడవాచనం, అగ్నిప్రతిష్ట, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు ధ్వజరోహణం, గరుడబలి, నిత్యహోమం, బలిహరణ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తారు. 14న ఉదయం 9 గంటలకు విశ్వక్సేన విధి, చతుస్థానార్చన వీధి, అరిష్టాక్షయహోమం, బలిహరణ, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు నిత్యహోమం, నిత్యబలి హరణ, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. 15న ఉదయం 9గంటలకు విశ్వక్సేన వీధి, నిత్య హోమం, బలిహరణ, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 6గంటలకు వైకుంఠ పార్షకహోమం, నిత్య బలిహరణ, తీర్థప్రసాద వితరణ, 16న ఉదయం 9 గంటలకు విశ్వక్సేన వీధి, సుదర్శన పెరుమాళ్ హోమం, నిత్యబలిహరణ, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 6గంటలకు కోదండ రామస్వామి మూలమంత్ర హరణం, నిత్య బలిహరణ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తారు. 17న ఉదయం 11.55గంటలకు శ్రీకోదండ రామస్వామి కల్యాణం, సాయంత్రం 6గంటలకు పూర్ణాహుతి, సహస్ర దీపాలంకరణ, పుష్పయాగం, నాగవెల్లి, ఏకాంతసేవ, ధ్వజవరోహణం, గ్రామబలి, కర్రలకు మంగళశాసనములు కార్యక్రమాలను నిర్వహిస్తారని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కమిటీ సభ్యులు కోరారు.



తీగలగుట్టపల్లిలోని కోదండ రామాలయం

'కేంద్రం కరీంనగర్‌కు చేసిందేమీలేదు'

విద్యానగర్(కరీంనగర్): కేంద్రానికి పన్నుల రూపంలో కరీంనగర్ నియోజక వర్గ ప్రజలు రూ.48,000 కోట్లు చెల్లిస్తే కేంద్రం కరీంనగర్‌కు చేసింది ఏమి లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, డీసీసీ బీసీ సెల్ అధ్యక్షుడు పులి అంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీవీ యాంకర్‌గా సమాజానికి పరిచయమైన రాణీ రుద్రమకు రాజకీయాలపై అవగాహన లేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం లాంటిదని ఆయన చేసిన అభివృద్ధిని నియోజక వర్గంలో ఎవరిని అడిగినా చెప్పుతారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఆయన పోరాటం గురించి నాటి ప్రతిపక్ష నేతలు సైతం కొనియాడిన సందర్భాలు ఉన్నాయన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తమ పార్టీ అభ్యర్థి ఎంపిక అధిష్టానం చూసుకుంటుందని, అభ్యర్థి ఎవరైనా కరీంనగర్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రామిడి రాజిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే. సిరాజ్ హుస్సేన్, నాయకులు సిరికొండ శివప్రసాద్, కనకరెడ్డి, హైమద్ అలీ, చింతల ఎల్లా రెడ్డి, జూపాక సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా భూమయ్య



భూమయ్య

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్ పడిశెట్టి (టేల) భూమయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఈ సందర్భంగా భూమయ్య కృతజ్ఞతలు తెలిపారు.

హుజూరాబాద్‌లో స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్: హుజూరాబాద్ కేంద్రంగా అంబేద్కర్ స్టడీ సెంటర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల విజయ్ కుమార్ శుక్రవారం ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలో స్టడీ సెంటర్ ఉండటం మూలంగా మండలాల నుంచి వెళ్లే యువతకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని హుజూరాబాద్ కేంద్రంగా స్టడీ సెంటర్ ఉంటే ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఈ మేరకు స్టడీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు.

కాలం గడిచినా మారనిది సనాతన ధర్మం



మంగళశాసనాలు అందజేస్తున్న చిన జీయర్ స్వామి

కరీంనగర్‌కల్చరల్: కాలం గడిచినా విలువలు మారనిది సనాతన ధర్మం, భూమి, నీరు, గాలి, అగ్ని, ఆకాశం సనాతమైనదని అంటే ఎప్పుటికీ మారనిది అని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి అన్నారు. జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం ఉదయం, సాయంత్రం ప్రవచనం చేశారు. వైవస్వత మనువు కాలంలో అయోధ్య నిర్మాణం జరిగిందన్నారు. రామాయణ పారాయణం, శ్రవణం ఇహలోక, పరలోక సుఖాలను కలిగిస్తుందని తెలిపారు. రాముని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సకల సద్గుణ స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. మానవులు మంచి అలవాట్లను కలిగి ఉండాలని, మంచి ఆహారం స్వీకరించాలని, శరీరారోగ్యం, కుటుంబసమత పాటించాలని, ప్రకృతి, ప్రాణులను పరిరక్షించాలని సూచించారు. కాగా ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్ఠి, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహరావు, వీర్ల ప్రభాకర్‌రావు, కలకొండ గౌతమరావు, బీవీ రావు, కిషన్, భూపతిరావు, వెంకటేశం, వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

రాముడు లోకానికి ఆదర్శ ప్రాయుడు

కరీంనగర్‌కల్చరల్: రాముడు మానవ లోకానికి ఆదర్శ ప్రాయుడని కాలమిస్తు, రచయిత డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శివాజీనగర్‌లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన రామోత్సవం కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరై రాముడు, భరతమాత చిత్రపటాల ఎదుట జ్యోతిప్రకాశనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాముడు తన జీవన విధానం ద్వారా ఎన్నో సామాజిక, రాజకీయ, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక మూల్యాలను అందించారని అన్నారు. అందుకే ఆయన కథ రామయణం లోకం ఉన్నంత కాలం ఉంటుందని తెలిపారు. రామాయణాన్ని చదవాలని, వినాలని అందులోని లోతైన విలువైన అంశాలను గ్రహించి ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎనగంటి మధుసూదన్‌రావు, ప్రాంత సేవా ప్రముక్ కోమళ్ల రాజేందర్‌రెడ్డి, జిల్లా సేవా ప్రముఖ్ బొమ్మకటి కిషన్, జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, నగర సహకార్యదర్శి తోట రాజనేందర్, తోట రాజేందర్, మెండె లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుర్ర మధుసూదన్‌రెడ్డి

మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాలి

కరీంనగర్ టౌన్: దేశాన్ని విశ్వ గురువుగా మార్చేందుకు కృషి చేస్తున్న నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాని చేసేందుకు బీజేపీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ 18వ డివిజన్ రేకుర్తిలో నిర్వహించిన బూత్ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు. బూత్‌స్థాయిలో బూత్ అధ్యక్షులు ఇంటింటికీ వెళ్లి మోదీ చేపట్టి సంక్షేమ పథకాల గురించి వివరించాలని సూచించారు. ప్రపంచంలో భారతదేశాన్ని మూడో బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగే విధంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. కమలం పువ్వుపై ఓటు వేసి బీజేపీనీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైపాల్‌రెడ్డి, నాంపల్లి శంకర్, దుర్గం మోహన్, గంట్ల నరసింహారెడ్డి, కీచర విష్ణు ప్రసాద్‌రావు, గోదారి నరేశ్, లక్ష్మీరాజం , రజిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీందర్ రెడ్డి, బాల్‌రెడ్డి

ముందస్తుగా వరికోతలు

- వర్షాల భయంతో అన్నదాతల ఆందోళన
- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. వేయని తూకం

కరీంనగర్‌రూరల్: అకాల వర్షాల భయంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది యాసంగిలో ఈదురుగాలులతో కూడిన వడగళ్లు కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాలుగైదు రోజుల నుంచి వాతావరణంలో వచ్చిన మార్పులతో మళ్లీ ఎక్కడ వడగళ్లు పడుతాయోనని ఆందోళనకు గురవుతున్నారు. కోత దశలో ఉన్న వరిపంట వర్షాలు పడితే చేతికి రాదనే భయంతో కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు ముందస్తుగానే హార్వెస్టర్లతో వరికోతలు చేపడుతున్నారు.

13 వేల ఎకరాల్లో వరి సాగు

కరీంనగర్ మండలంలోని 17గ్రామాల పరిధిలో యాసంగిలో 13వేల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. అయితే ఎస్సారెస్పీ నీళ్ల ఆయకట్టు చివరి గ్రామాలకు అందకపోవడంతో పాటు బావుల్లో నీరు అడుగంటడంతో సుమారు 4 వేల ఎకరాల వరకు పంట ఎండిపోయింది. యాసంగిలో ఎండ తీవ్రతకు సాధారణ హార్వెస్టర్‌తోనే రైతులు వరి కోయిస్తారు. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు పొలాలు తడిగా ఉన్నప్పటికీ ట్రాక్టర్ కిషన్, ఫోర్‌వీలర్ హార్వెస్టర్లతో వరికోతలు చేపడుతున్నారు.



చెర్లభూత్కూర్‌లో పచ్చివరిని కోస్తున్న ఫోర్‌వీలర్ హార్వెస్టర్

కేంద్రాలు ప్రారంభించినా కాంటా పెడుతలేరు

దుర్శేడ్ సింగిల్ విండో ఆధ్వర్యంలో 6, కరీంనగర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో 11, ఐకేపీ ఆధ్వర్యంలో బహదూర్‌ఖాన్‌పేట, ఎలబోతారం, చామనపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు ఈ కేంద్రాల్లో ధాన్యం తూకం వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైస్‌మిల్లుల కేటాయింపు, ఐరిష్ కొత్త విధానంతో ధాన్యం కొనుగోళ్లు, హమాలీలు, గన్నీసంచులు తదితర సమస్యలతో అధికారులు ధాన్యం కొనుగోళ్లు చేపట్టడం లేదు. ఆకాశంలో మబ్బులు పడుతుండటంతో కేంద్రాల్లోని ధాన్యం ఎక్కడా తడిసిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొద్దంతా ధాన్యం ఆరపెట్టడం, రాత్రయితే కుప్ప చేసేందుకు పడరానీపాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మొగ్ధుంపూర్ కేంద్రంలో ఆరపోసిన ధాన్యం

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లోని 132 కేవీ వాటర్ వర్క్స్ సబ్‌స్టేషన్, 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లలో నెలవారి విద్యుత్ మరమ్మతు పనులతో పాటు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11కేవీ బ్యాంక్ కాలనీ, వావిలాలపల్లి, అంబేద్కర్‌నగర్, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల, సప్తగిరికాలనీ, భగత్‌నగర్, ఉజ్వల పార్కు, వాటర్ వర్క్స్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

కొత్తపల్లి, రూరల్ పరిధిలో..

విద్యుత్ సబ్‌స్టేషన్లలో నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కేవీ కొత్తపల్లి, రేకుర్తి, బొమ్మకల్, నగునూర్, శాతవాహన యూనివర్సిటీ, చెర్లభూత్కూర్, మొగ్ధుంపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల, వాగొడ్డురామన్నపల్లి గ్రామాల శివారులో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో మర్రిపెల్లిగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమతి లేకుండా రూ. 9,700 విలువైన మద్యం, అలాగే వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి రూ.5,020 మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకు న్నామని, ఇరువురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. అక్రమంగా మద్యం సరఫరా చేసేవారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోసాలు కావాలా? మంచి కొనసాగాలా?

పాలకుడు మోసగాడు అయితే బతుకులు అంధకారం అవుతాయి

మీరే నా స్టార్ క్యాంపైనర్లు.. ఏటుకూరు సిద్ధం సభలో సీఎం జగన్



సభలో మాట్లాడుతున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'మోసాల చంద్రబాబు నుంచి మన రాష్ట్రం, పేదల భవిష్యత్తును కాపాడుకునేందుకు జరుగుతున్న ఈ యుద్ధంలో మీరంతా ప్రతి ఇంటికి వెళ్లి గత 58 నెలలుగా జరిగిన మంచిని వివరించాలి. ప్రతి ఇంటికి వెళ్లి వాస్తవాలు వివరించి స్టార్ క్యాంపైనర్లుగా చేయాలి. ఈ మంచి కొనసాగాలంటే మీ బిడ్డ మళ్లీ రావాలి.. మోసపోకూడదంటే మీ బిడ్డకే ఓటు పడాలి అని ప్రతి గడపకూ చెప్పాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి గుంటూరు శివారు ఏటుకూరు వద్ద నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అందరి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ..

ఈరోజు గుంటూరులో కనిపిస్తున్న ఈ మహా జన సముద్రం చరిత్రలో ఎప్పటికి నిలిచిపోతుంది. మనందరి ప్రభుత్వానికి మద్దతుగా ఇప్పుడు జరుగుతున్న మంచిని కాపాడుకునేందుకు, ఆ మంచిని కొనసాగించేందుకు ఇక్కడి కి వచ్చిన ప్రతి అవ్వాతాత, సోదరులు, స్నేహితులకు చేతు లు జోడించి కృతజ్ఞతలు తెలియచేస్తున్నా. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రతి గ్రామానికి పౌర సేవలు, విద్య, వైద్యం, రైతన్నలకు భరోసా, అక్క చెల్లెమ్మ లకు సాధికారత, అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సేవలు అందించిన మన ప్రభుత్వానికి మద్దతు పలకడానికి మీరంతా సిద్ధమేనా? గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఏకంగా రూ.2.70 లక్షల కోట్లను ఒక్క రూపాయి కూడా లంచం, వివక్షకు తావు లేకుండా 130 సార్లు బటన్ నొక్కి పారదర్శకంగా నేరుగా అందించిన ఈ ప్రభుత్వానికి, మీ జగన్‌కు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కేందుకు, మరో వంద మందికి చెప్పి నొక్కించడానికి మీరంతా సిద్ధమేనా?

రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు..

ఈ ఎన్నికల యుద్ధం కేవలం చంద్రబాబుకు, జగన్‌కు మధ్య జరుగుతున్నది కాదు. ఈ యుద్ధం చంద్రబాబు మోసాలకు, ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది ఇంటింటికి పెన్షన్ అందించిన ప్రభుత్వానికి, వాటిని ఆపిన బాబు దుర్మార్గాలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది వారి మోసాలకు, మన విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఆ అబద్ధాల బాబుకు ఇద్దరు వంత పాడుతున్నారు. ఒకరు దత్తపుత్రుడు, మరొకరు ఆయన వదినమ్మ. ఈ ముగ్గురు కలిసి రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు చెబుతున్నారు. 2014 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసగించిన చంద్రబాబు ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ నమ్మబలుకుతున్నారు.

మంచి కొనసాగాలో వద్దో ఆలోచించండి..

ఈ రోజు మీరంతా ఇంటికి వెళ్లాక కుటుంబ సభ్యులతో కలసి ఒక్క అంశంపై ఆలోచన చేయమని కోరుతున్నా. మీ బిడ్డకు ఓటు వేయడం అంటే గత 58 నెలలుగా జరుగుతున్న మంచిని మీరందరూ కొనసాగించేందుకే ఓటు వేసినట్లే. మీ బిడ్డకు కాకుండా చంద్రబాబుకు ఓటు వేయడం అంటే దాని అర్థం.. ఈ 58 నెలలుగా మీకు జరుగుతున్న మంచిని మీ అంతట మీరే మీకు వద్దని చెప్పినట్లేనని గుర్తుంచుకోవాలని కోరుతున్నా. 58 నెలల క్రితం మీ బిడ్డ మీ అందరి ముందు నిలబడి ఫలానాది చేస్తానని ఎన్నికల మేనిఫెస్టో తీసుకొచ్చాడు. మేనిఫెస్టోను బైబిల్, భగవద్గీత, ఖురాన్ మాదిరిగా భావించి 99 శాతం హామీలను అమలు చేసి మీ ముందుకు వచ్చి మరోసారి ఆశీస్సులు కోరుతున్నాడు.

2014 ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే..

ఒక్కసారి 2014 ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే.. నాడు కూడా ఇదే కూటమి! మేనిఫెస్టో అంటూ రంగు రంగుల కాగితాలతో ప్రజల జీవితాలతో చెలగాటమాడారు. ఇదే చంద్రబాబు సంతకం చేసి దత్తపుత్రుడు, ప్రధాని మోదీ ఫొటోలతో పాంప్లెట్లు ముద్రించి ప్రతి ఇంటికి పంపారు. మీరు మర్చిపోతారేమోననే భయంతో టీవీలలో, పేపర్లలో ఊదరగొట్టారు. చంద్రబాబు నాటి మోసాల్లో ఒక్కసారి ముఖ్యమైన వాటిని మీకు గుర్తు చేస్తా.

- రైతులకు రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ అయ్యాయా?
- పొదుపు సంఘాల రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేస్తామని చెప్పి కనీసం ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా?
- ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద బ్యాంకులో రూ.25 వేలు డిపాజిట్ చేస్తామన్నాడు. మీకుగానీ, మీ ఇంటి చుట్టుపక్కల వారికిగానీ ఎవరికైనా ఒక్క రూపాయి డిపాజిట్ చేశారా?
- ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లలో అంటే 60 నెలల పాటు నెలకు రూ.రెండు వేలు చొప్పున ప్రతి ఇంటికి రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- అర్హులైన వారందరికి మూడు సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు ఇస్తామన్నారు. ఏ పేదవాడికైనా ఒక్కటంటే ఒక్క సెంటు స్థలం ఇచ్చాడా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అన్నాడు. చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. మరి జరిగిందా?
- మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మరి చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు.. మరి జరిగిందా?
- ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి గుంటూరులో ఏమైనా కనిపిస్తోందా?

సెల్‌ఫోన్ లైట్లతో సంఘీభావం..

వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్ బాగుండాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు లేని పాలన కొనసాగాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా, మన వ్యవసాయం, మన ఆస్పత్రులు బాగుండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలి. 175కి 175 అసెంబ్లీ సీట్లు, 25కి 25 పార్లమెంట్ సీట్లలో ఏ ఒక్కటీ తగ్గకుండా గెలిపించేందుకు మీరు సిద్ధమేనా? పేదల భవిష్యత్తు బాగుండాలని చేస్తున్న ఈ యుద్ధానికి మీరంతా సెల్‌ఫోన్లలో టార్చిలైట్లు వెలిగించి సంఘీభావం తెలియచేయాలి.

పాలకుడు మోసగాడైతే...

ఎలాంటి వారు రాజకీయ నాయకుడిగా ఉండాలి? ఎలాంటి వారిని మనం ముఖ్యమంత్రిగా తెచ్చుకోవాలన్న విషయంపై ప్రతి ఇంట్లో చర్చ జరగాలి. ఎందుకంటే మనం వేసే ఓటు ద్వారా రాబోయే ఐదేళ్ల జీవితం ఆ పాలకుడి చేతుల్లో పెడుతున్నాం. ఆ పాలకుడికి మంచి మనసు ఉండి మంచి చేస్తే మన జీవితాలు బాగుపడతాయి. ఆ పాలకుడు మోసగాడు అయితే మన బతుకులు అంధకారం అవుతాయి. పిల్లల జీవితాలు అస్తవ్యస్తం అవుతాయి. అక్కచెల్లెమ్మల బతుకులు అతలాకుతలం అవుతాయి. రైతన్నల జీవితాలు మోసపోయి ఆత్మహత్యల పాలవుతాయి. అవ్వాతాతల సంక్షేమం అడుగంటిపోతుంది. అందుకే ఈ వాస్తవాలపై ప్రతి ఇంట్లోనూ చర్చ జరగాలని కోరుతున్నా. గుంటూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న కిలారు రోశయ్య, అసెంబ్లీ అభ్యర్థులు నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్, మురుగుడు లావణ్య, మేకతోటి సుచరిత, అన్నాబత్తుని శివకుమార్, విడదల రజని, అంబటి మురళీకృష్ణ, మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నందిగం సురేష్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, మద్దాళి గిరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, పార్టీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మండపాటి శేషగిరిరావు, బత్తుల దేవానంద్ తదితరులు ఏటుకూరు సిద్ధం సభలో పాల్గొన్నారు.

తెలంగాణకు 8.5 టీఎంసీలు

▶ మొదటి పేజీ తరువాయి

గత అక్టోబర్‌లో చివరి సారిగా సమావేశమైంది. శ్రీశైలం ప్రాజెక్టు కనీస మట్టం (ఎండీడీఎల్)ను 805 ఫీట్లు, సాగర్ ఎండీడీఎల్‌ను 505 ఫీట్లకు నిర్ణయించి, వేసవి ఆవిరి నష్టాలను కూడా లెక్కగట్టి రెండు జలాశయాల్లో 92.78 టీఎంసీలు అందుబాటులో ఉన్నట్టు నిర్ధారించింది. అయినప్పటికీ మే మాసాంతం వరకు మొత్తంగా రెండు ప్రాజెక్టుల్లో 82.78 టీఎంసీలనే వినియోగించాలని అప్పట్లో కమిటీ నిర్ణయించింది. అందులో 2.78 టీఎంసీలను జూన్, జూలై తాగునీటి అవసరాల కోసమని రిజర్వ్ చేసింది. మిగిలిన 80 టీఎంసీల్లో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి కేటాయించిన విషయం విదితమే. కాగా కమిటీ నిర్ణయించిన కోటాకు మించి తెలంగాణ ఇప్పటికే 11 టీఎంసీలను వినియోగించుకుంది. ఏపీ కోటా మేరకు వినియోగించుకుంది. అయితే ఇరు రాష్ట్రాలు తాగునీటి అవసరాలకు అదనంగా జలాలను విడుదల చేయాలని బోర్డుకు విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలోనే కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంది. సమావేశంలో సాగర్ సీఈ అజయ్‌కుమార్, ఈఈ విజయ్‌భాస్కర్, కృష్ణా బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సల్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మంచినీటి కొరత ఎక్కువగా ఉంది: ఈఎన్సీ

త్రిసభ్య కమిటీ సమావేశంలో కేవలం తాగునీటి అంశంపైనే చర్చించామని ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి సమావేశానంతరం చెప్పారు. 2 రాష్ట్రాల అంగీకారంతో నీటి వాటాల పంపిణీ జరిగిందని తెలిపారు. ఏపీలో మంచినీటి కొరత కొంత ఎక్కువగా ఉందని వివరించారు.

'ఇంటర్' ద డ్రాగన్..

▶ మొదటి పేజీ తరువాయి



యాజమాన్యాలు చెప్తున్నాయి. కోవిడ్ సమయంలో కాలేజీల్లో పనిచేసే అధ్యాపకులు ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారని, కొరత కారణంగా ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తోందని అంటున్నాయి. నిర్వహణ భారం పెరిగిందని చెప్పుకొస్తున్నాయి.

అఫిలియేషన్ ఫీజు పెంచకున్నా..

రాష్ట్రంలోని ఇంటర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు మూడు కేటగిరీల కింద అనుబంధ గుర్తింపు (అఫిలియేషన్) ఇస్తుంది. ప్రతీ విద్యాసంస్థలో గరిష్టంగా 960 మందిని చేర్చుకునేందుకు అనుమతిస్తారు. అఫిలియేషన్ ఫీజు కింద ఏటా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలేజీల నుంచి రూ.1.20 లక్షలు, మున్సిపాలిటీల పరిధిలోని కాలేజీల నుంచి రూ.60 వేలు, గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేస్తారు. రెండేళ్లకోసారి ఈ ఫీజులను సమీక్షించి పెంచాల్సి ఉన్నా.. ఇంటర్ బోర్డు కొన్నేళ్లుగా పెంచలేదు.

50 శాతం దాకా పెంపు..

సాధారణ జూనియర్ కాలేజీల్లో గత ఏడాది వరకూ గరిష్టంగా రూ.60 వేల ఫీజు ఉంటే.. ఈసారి రూ.90 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు చెప్తున్నారు. కార్పొరేట్ కాలేజీలు రూ.1.25 లక్షల నుంచి రూ. 2 లక్షలకుపైగా (కాలేజీని బట్టి) డిమాండ్ చేస్తున్నాయని.. అదే హాస్టల్‌నూ కలిపితే ఏకంగా రూ.3.25 లక్షల వరకు చెప్తున్నారని వాపోతున్నారు. కార్పొరేట్ కాలేజీలు ఫీజులు పెంచడాన్ని చూసి.. సాధారణ కాలేజీలు కూ డా పెంచుతున్నాయని చెప్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల పరిధిలోనూ వార్షిక ఫీజులను రూ.75 వేల కు తక్కువ వసూలు చేయడం లేదని అంటున్నారు. మరో వైపు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కుల ధరలు కూడా గత ఏడా దితో పోల్చితే 20శాతం మేర పెరిగాయని.. ప్రైవేటు కాలేజీల రవాణా, ఆటో చార్జీలు కూడా 30శాతం వరకూ పెంచారని తల్లిదండ్రులు చెప్తున్నారు. దీంతో ఇంటర్మీడియట్ విద్య కోసమే రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఇంటర్ ఫీజుల తీరు ఇలా.. (రూ.లలో)

కాలేజీల తరహా	గత ఏడాది	ఈ సంవత్సరం
కార్పొరేట్ కాలేజీలు (డే స్కాలర్)	1.25 లక్షలు	2.25 లక్షలు
కార్పొరేట్ కాలేజీలు (విత్ హాస్టల్)	2.25 లక్షలు	3 నుంచి 3.25 లక్షలు
హైదరాబాద్‌లోని సాధారణ కాలేజీలు	75 వేలు	1.25 నుంచి 1.50 లక్షలు
సాధారణ కాలేజీలు (విత్ హాస్టల్)	1.25 లక్షలు	1.50 నుంచి 1.75 లక్షలు
మున్సిపాలిటీల్లో కాలేజీలు	60 వేలు	90 వేలు
మున్సిపాలిటీల్లో (విత్ హాస్టల్)	90 వేలు	1.25 లక్షలు
గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలు	40 వేలు	60 నుంచి 70 వేలు

అంత ఫీజు ఎలా కట్టగలం?

ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన మా అబ్బాయిని చేర్పించాలంటూ ఓ ప్రైవేటు కాలేజీ సిబ్బంది వెంటపడ్డారు. అడ్మిషన్ కోసం వెళ్తే ఏటా రూ.2.25 లక్షల ఫీజు అని చెప్పారు. కావాలంటే ఓ రూ.25 వేలు రాయితీ ఇస్తామన్నారు. అంత ఫీజేమిటని అడిగితే ఈ ఏడాది ఖర్చులు పెరిగాయని, అందుకే ఫీజులు పెంచామని చెప్పారు. రెండేళ్లకు రూ.4 లక్షల ఫీజు ఎలా కట్టగలం. వేరే కాలేజీల్లో ఆరా తీసినా అడ్డగోలుగా పెంచారు. ప్రభుత్వం నియంత్రణ చేపడితే పేదలకు ఊరటగా ఉంటుంది.
– సుచిత్ర, ఇంటర్ విద్యార్థి తల్లి, హైదరాబాద్

ఫీజుల నియంత్రణ అవసరం

కొన్ని కార్పొరేట్ కాలేజీలు ఇష్టానుసారం ఫీజులు పెంచడం వల్ల అన్ని కాలేజీలూ ఆ నింద మోయాల్సి వస్తోంది. ప్రభుత్వమే కాలేజీలను కేటగిరీలుగా విభజించి, ఫీజుల నిర్ణయం చేయాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. పేదలకు ఇంటర్ విద్యను అందుబాటులోకి తేవడానికి ఫీజుల కట్టడి చట్టాలు అవసరం.
– గౌరీ సతీశ్, తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు

కార్పొరేట్ ఆగడాలను అడ్డుకోరా?

అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తవకుండానే ప్రైవేటు ఇంటర్ కాలేజీలు అడ్మిషన్లు చేపట్టడం చట్ట విరుద్ధం. దీనికితోడు పేదలు ఏమాత్రం భరించలేని విధంగా ఫీజులు పెంచడం దుర్మార్గం. పాలక వర్గాలు దీన్ని అడ్డుకోవడంలో విఫలమవుతున్నాయి. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి.. కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల ఫీజు దోపిడీని అడ్డుకోవాలి.
– చింతకాయల ఝాన్సీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

దోపిడీని నియంత్రించకుంటే ఆందోళన

ప్రైవేటు కాలేజీల ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. సర్కారు నుంచి ఏ విధమైన ఆదేశాలూ లేకపోవడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. పేదలు భరించలేని విధంగా కాలేజీలు ఫీజులు పెంచుతున్నాయి. తక్షణమే నియంత్రణ చేపట్టాలి. లేని పక్షంలో ఆందోళనలు చేపడతాం.
– టి.నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి

ఫిర్యాదులు వస్తున్నాయి.. పరిశీలిస్తున్నాం

ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల పెంపుపై అన్ని వర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. నియంత్రణ కోసం ఏం చేయాలనేది పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఇంటర్ బోర్డ్ సిద్ధంగా ఉంది.
– జయప్రదాబాయి, ఇంటర్ బోర్డ్ సీనియర్ అధికారి

విస్తరిస్తున్న సైబర్ మాఫియా

- ఖాతాలు ఖాళీ చేస్తున్న నేరస్తులు
- ఏటా పెరుగుతున్న సైబర్ నేరాలు
- కట్టడికి రామగుండం సీపీ కార్యాలయంలో సైబర్ క్రైం ఠాణా



రామగుండం కమిషనరేట్ ఆవరణలో ఏర్పాటైన సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్

సైబర్ నేరాలు	ఏడాది	2020	2021	2022	2023	2024
	నేరాలు	202	683	1,468	1,905	883

మంచిర్యాలకు చెందిన విద్యార్థిని వాట్సప్, ఫేస్‌బుక్‌లో ఉద్యోగాల కల్పనపై వచ్చిన లింక్‌పై క్లిక్‌చేసింది. ఆ వెంటనే ఎదుటి వ్యక్తులు డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో విద్యార్థిని రూ.2.15లక్షలు చెల్లించింది. ఆ తర్వాత ఆసైట్, ఫోన్‌నంబర్ అదృశ్యమయ్యాయి. ఆందోళన చెందిన బాధితురాలు వెంటనే సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఆన్‌లైన్ బిజినెస్, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట మంచిర్యాలకు చెందిన ఓ గృహిణి ఆన్‌లైన్‌లో ఓ సంస్థను సంప్రదించింది. తొలుత రూ.వెయ్యి పంపిస్తే రూ.2వేలు ఇచ్చారు. ఆ తర్వాత రూ.5వేలకు రూ.10వేలు పంపించారు. రూ.పదివేలకు రూ.20వేలు చెల్లించారు. ఆ తర్వాత పెద్దమొత్తంలో రూ.7.15లక్షలు చెల్లించడంతో ఆ సొమ్ము తీసుకున్న ఆ సంస్థ బిచాణా ఎత్తేసింది. బాధితురాలు లబోదిబోఅంటూ రామగుండం కమిషనరేట్ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు.

గోదావరిఖని: వృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జిల్లాలో సైబర్‌క్రైం మోసాలు పెద్దఎత్తున చోటుచేసుకుంటున్నాయి. ఫోన్‌పే, గూగుల్‌పే, వాట్సప్ పే, పేటీఎం తదితర డిజిటల్ పేమెంట్ల ద్వారా ప్రజలు లావాదేవీలు జరుపుతున్నారు. తక్కువ ధరకే నాణ్యమైన గృహోపకరణాలు, నిత్యావసరాలు ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఇలా నగదు రహిత లావాదేవీలు పెరిగిపోతున్నాయి. ఇదే అదనుగా తీసుకున్న సైబర్ మాఫియా రెచ్చిపోతోంది. పలు మార్గాల్లో ఖాతాదారుల సొమ్మును తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటోంది. ప్రజలను బురిడీ కొట్టించి రూ.లక్షల్లో స్వాహా చేస్తోంది. రూ.10వేల నుంచి రూ.లక్షల్లో మోసపోతున్న ఘటనలు రోజూ వెలుగు చూస్తున్నాయి. దీనిపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా కేంద్రాలు, కమిషనరేట్ కార్యాలయాల్లో ప్రత్యేక సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్లు ఇటీవల ప్రారంభించింది. ఇందులో రామగుండంపోలీస్ కమిషనరేట్ కూడా ఉంది.

సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్ ప్రారంభం

- రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సైబర్‌క్రైం ఠాణాను ఈనెల 2న ప్రారంభించారు.
- రాష్ట్రస్థాయిలోని సైబర్ సెక్యూరిటీ బ్యూరో దీనిని సమన్వయం చేస్తోంది.
- కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు ఏసీపీ ఆధ్వర్యంలో దీనికి అంకురార్పణ చేశారు.
- రూ.లక్షలోపు నష్టపోతే స్థానిక ఠాణాలోనే ఫిర్యాదు చేయాలి.
- రూ.లక్షకుపైగా సైబర్‌క్రైం ద్వారా నష్టపోతే నేరుగా సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలి.
- అంతేకాదు.. సైబర్‌మోసాలపై సైబర్‌క్రైం పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.
- నేరగాళ్ల బారిన పడిన వారికి సాయం అందించడంతోపాటు మళ్లీ మోసపోకుండా కాపాడేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్ అధికారులు..

సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్ ప్రారంభించిన సీపీ శ్రీనివాస్.. ఏసీపీ స్థాయి అధికారి వెంకటరమణను నియమించారు. సీఐగా కృష్ణమూర్తి, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లకు సైబర్ క్రైం విధులు అప్పగించారు. ఫిర్యాదులను బట్టి ఠాణా సేవలను మరింత విస్తరించాలని యోచిస్తున్నారు.

బాధితులు ఇలా ఫిర్యాదు చేయండి

- సైబర్‌క్రైం బాధితులు వెంటనే 1903 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలి.
- (CYBERCRIME.GOV.INలో) వెబ్‌సైట్ లాగిన్ అయి, ఫిర్యాదు చేయాలి.
- మోసపోయిన నిమిషంలోనే ఫిర్యాదు చేస్తే డైమండ్ అవర్‌గా పరిగణిస్తారు.
- గంటలోగా ఫిర్యాదు చేస్తే గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారు.
- ఇలా చేస్తే బాధితులకు వందశాతం న్యాయం చేస్తారు.

అప్రమత్తంగా ఉండాలి



వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో వచ్చే అపరిచిత లింక్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సంబంధంలేని పోస్టింగ్‌లు, లింక్‌లపై క్లిక్ చేయవద్దు. ఓటీపీ, బ్యాంకు వివరాలు వెల్లడించవద్దు. సైబర్ క్రైం మోసానికి గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. బాధితులకు న్యాయం జరిగేలా సైబర్‌క్రైం విభాగం చర్యలు తీసుకుంటుంది.
– వెంకటరమణ, సైబర్‌క్రైం ఏసీపీ, రామగుండం

మూడేళ్ల కనిష్టానికి 'కడెం'


అడుగంటిన కడెం ప్రాజెక్ట్

- 2.778 టీఎంసీలకు పడిపోయిన నీటిమట్టం
- గతేడాది 681.350 అడుగులు
- ప్రస్తుతం 675.975 అడుగులు

కడెం: నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లోని 68 వేల ఎకరాలకు సాగునీరందించే కడెం జలాశయం నీటి మట్టం మూడేళ్ల కనిష్టానికి పడిపోయింది. పదేళ్ల కాలంలో ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరడం ఇది మూడోసారి. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 7.603 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.778 టీఎంసీలకు పడిపోయింది. ఖరీఫ్‌లో నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లోని కడెం, దస్తురాబాద్, జన్నారం, దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లో సుమారు 68,150 ఎకరాలకు సాగు నీరందించింది. తర్వాత గత ఏడాది కంటే పది అడుగుల నీటిమట్టం తగ్గడంతో ఇరిగేషన్ అధికారులు యాసంగికి నీరివ్వలేమని క్రాప్ హాలిడే ప్రకటించారు. గత ఏడాది ఏప్రిల్ 12న నీటి మట్టం 681.350 అడుగులు ఉండగా, ఈ ఏడాది 674.975 అడుగులుగా ఉంది.

కడెం ప్రాజెక్టు వివరాలు..

పూర్తి నీటిమట్టం	700 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	674.975 అడుగులు
వానాకాలం ఆయకట్టు	68 వేల ఎకరాలు
యాసంగి ఆయకట్టు	25 వేల ఎకరాలు

పదేళ్లలో మూడోసారి..

గత పదేళ్ల కాలంలో కడెం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరుకోవడం ఇది మూడోసారి. గతంలో 2019లో, తర్వాత 2021లో నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరింది. తాజాగా ఈ ఏడాది కూడా డెడ్ స్టోరేజీకి నీటిమట్టం పడిపోయింది.

నీళ్లన్నీ గోదావరిపాలు..

గత ఏడాది వర్షాకాల సీజన్‌లో కడెం ప్రాజెక్టులోకి 60.369 టీఎంసీల వరద వచ్చింది. ఆయకట్టు కాలువలకు 7.242 టీఎంసీలు మాత్రమే విడుదల చేశారు. మిగతా 50.435 టీఎంసీల నీరు నిల్వ సామర్థ్యం లేకపోవడంతో గోదారి పాలయ్యాయి. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా, ప్రాజెక్టులో చాలా వరకు పూడిక పేరుకుపోయింది. దీంతో నీటి నిల్వ సామర్థ్యం 5.6 టీఎంసీలకు పరిమితమైంది. వర్షాకాలంలో ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉన్నా నిల్వ చేసే పరిస్థితి లేకపోవడంతో వరద నీటిని గోదావరి నదిలోకి వదలాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

నీటి మట్టం తగ్గుతోంది



కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా తగ్గుతోంది. ప్రాజెక్టు సీల్ లెవెల్ 675 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 674.975 అడుగులుగా ఉంది. 2019, 2021లో డెడ్ స్టోరేజీకి చేరగా, ఆ తర్వాత ఈ ఏడాది నీటిమట్టం ఇంతగా తగ్గింది.
– బోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్ట్

భగీరథకు కష్టమే

కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, జన్నారం మండలాల్లోని సుమారు 34 వేల నల్లా కనెక్షన్లకు నల్లా నీళ్లు కడెం ప్రాజెక్టు నుంచే సరఫరా అవుతాయి. ప్రతీరోజు మిషన్ భగీరథకు 9 క్యూసెక్కుల నీరు అవసరం. ప్రాజెక్టు నీటిమట్టం డెడ్ స్టోరేజీలోకి వెళ్లడంతో మిషన్ భగీరథ ఇంటెక్ వెల్‌కు నీరందని పరిస్థితి రానుంది. రోజురోజుకూ నీటిమట్టం తగ్గుతుండడంతో రాబోయే రోజుల్లో ఐదు మండలాలకు తాగునీరందడం కూడా కష్టమే.

గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్

కైలాస్‌నగర్: ఆర్టీసీ ప్రయాణికులు గమ్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే బస్సుల వివరాలు సులభంగా తెలుసుకోవచ్చని సంస్థ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. ఆదిలాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఈ యాప్ వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. పలువురి ప్రయాణికుల మొబైల్ ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్ చేసి ఎలా వినియోగించాలో సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రవేశపెట్టిన ప్రతీ కార్యక్రమాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని ప్రయాణికులకు ఎప్పటికప్పుడు చేరవేస్తూ ఉంటుందని అన్నారు. అందులో భాగమే ఈ గమ్యం యాప్ అన్నారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్లు ప్రణీత్, ప్రవీణ్‌కుమార్, డిపో మేనేజర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా నాణ్యత?



ఇది బేల మండలంలోని గూడ నుంచి మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇటీవల నిర్మించిన తారు రోడ్డు. ఏడాది కూడా గడువక ముందే ఇలా పగుళ్లు తేలి అధ్వానంగా మారింది. కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడం, అధికారులు పర్యవేక్షించకపోవడంతో రహదారి ఇలా గుంతలు పడి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

శివ.. శివ

వేములవాడ: రాజన్నను శుక్రవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తడి బట్టలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణ భక్తుల రద్దీతో కిటకిటలాడింది. బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 13-4-2024






స్ట్రాంగ్‌గా ఉంటేనే మనుగడ



సాధారణంగా ఇళ్లలో ఆడవాళ్లే వంటలు చేస్తారు. వృత్తిపరంగా చూస్తే మగ చెఫ్‌లే ఎక్కువ కనిపిస్తారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న చెఫ్ నిఖితా ఉమేష్‌ను అడిగితే... "నేను చెఫ్‌గా ఈ వృత్తిని ఎంచుకోవాలనుకున్నప్పుడు 'గిన్నెలు కడగడానికి వెళుతున్నావా' అని వ్యంగ్యంగా అన్నవాళ్లే ఇప్పుడు నా వంటలు రుచి చూసి చూసి తమ అభిప్రాయాన్ని మార్చుకున్నారు" అని వివరించారు. మాస్టర్ చెఫ్ ఇండియా (తెలుగు) జ్యూరీ ప్యానెల్‌లో స్థానం దక్కించుకున్న నిఖిత ఉమేష్ ఎన్నో విషయాలు ఇలా మన ముందుంచారు.

''చదువుకునే రోజుల్లో టీవీలో మాస్టర్ చెఫ్ ఆస్ట్రేలియా చూసేదాన్ని. ఇంట్లో రకరకాల వంటలు ప్రాక్టీస్ చేసేదాన్ని. ఆ ఆసక్తితోనే హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్స్ చేశాను. దుబాయ్, సింగపూర్‌లలో శిక్షణ కోసం రెండేళ్లపాటు పనిచేశాను. పేస్ట్రీ ప్రొఫెషనల్ అండ్ మాస్టర్ చాకోలేటియర్‌గా హైదరాబాద్‌లో ఏడేళ్లు పని చేశాను. అలా హైదరాబాద్ పేస్ట్రీ చెఫ్‌గా, క్యుజిన్ డిజైనర్‌గా పేరొచ్చింది. ఏడాది క్రితం హైదరాబాద్‌లో మావారితో కలిసి మూడు పేస్ట్రీ బ్రాంచ్‌లు ఏర్పాటు చేశాను. ఏ రంగమైనా మనల్ని మనం నిత్యం నిరూపించుకుంటూనే ఉండాలి. అందులోనూ ఆహారం విషయానికి వస్తే మరీ ప్రత్యేకం. ఇంట్లో తిన్నవారు ఆ వంట రుచి చెప్పేంతవరకు వంట వండినవారు ఒక తెలియని ఒత్తిడిని పీలవుతుంటారు. అలాగే, మేం ప్రతి రోజూ మా పాకశాస్త్ర ప్రావీణ్యంతో ఎంతోమందికి చేరవవుతుంటాం. కాబట్టి, ఈ రంగంలోనూ ఒత్తిడి ఉంటుంది. నైపుణ్యంతోపాటు రుచిగా అందించాలనే భావన కూడా మమ్మల్ని గెలిపిస్తుంటుంది.

వర్క్ బాగుంటేనే...

ఐటీసీ హోటల్స్‌లో చెఫ్‌గా వర్క్ చేసినప్పుడు నా వయసు 22 ఏళ్లే. టీమ్‌లో పద్దెనిమిది మంది చెఫ్స్ ఉండేవారు. అందరూ మగవాళ్లే. అందులో సీనియర్స్ కూడా ఉండేవారు. నా వర్క్ బాగుంటేనే వారందరూ నన్ను గౌరవిస్తారు. ఈ విషయంలో ఎప్పుడూ నేను అలర్ట్‌గా ఉండేదాన్ని. వారికి తగిన సూచనలు ఇస్తూ ఏడేళ్లు పనిచేశాను. ఈ వర్క్‌లో శారీరక శ్రమతో పాటు టైమ్‌కు సంబంధించిన సమస్యలు కూడా ఉంటాయి. ఎక్కువ గంటలు పని చేయాల్సి ఉంటుంది కాబట్టి కుటుంబం కూడా సపోర్ట్‌గా ఉండాల్సి ఉంటుంది. నిజానికి ఇళ్లలో వంటలు చేసే వాళ్లు ఆడవాళ్లే కానీ. హోటల్స్‌లో వృత్తిపరంగా చెఫ్‌లుగా ఉన్న మహిళల శాతం మాత్రం తక్కువగానే ఉంది.

కొత్తగా నేర్చుకుంటూ..

నేను బెంగళూరులో పుట్టి పెరిగాను. అమ్మ ప్రభ డిఫెన్స్‌లో సీనియర్ అడ్మిన్ ఆఫీసర్, నాన్న ఉమేష్ ఎల్ఐసీ రిటైర్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్. నేను కన్నడ అమ్మాయిని కాబట్టి తెలుగు రాదు. మాస్టర్ చెఫ్ ఇండియా అవకాశం వచ్చాక తెలుగు నేర్చుకున్నాను. అందుకు ఆన్‌లైన్ క్లాసెస్ తీసుకున్నాను. చెఫ్ కమ్యూనిటీ నుంచి ఎవరో నన్ను రికమండ్ చేసి ఉంటారు. ఆ విధంగా నాకు జ్యూరీలో సభ్యురాలిగా ఉండే అవకాశం లభించింది. పనిలో చూపించే శ్రద్ధ, తపన మనల్ని విజయమార్గంలో తప్పక నడిపిస్తుంది'' అని వివరించారు ఈ మాస్టర్ చెఫ్. ఆమె అనుభవ పాఠాలు మరికొందరికి విజయ సోపానాలు అవుతాయి కదా...

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్

శిరోజాలకు జీవ కళ...



ఈ కాలం జుట్టుకు నూనె పెడితే జిడ్డుగా ఉంటుందని, పెట్టకుండా ఉంటే వెంట్రుకలకు జీవం లేదని ఇబ్బంది పడుతుంటారు. ఈ సమస్యకు విరుగుడుగా..

- అర కప్పు ఆలివ్ ఆయిల్ (మీ జుట్టుకు తగినంత) వేడి చేయాలి. చల్లారాక వేళ్లతో అద్దుకొని, జుట్టు కుదుళ్లకు పట్టించాలి. దువ్వెనతో కుదుళ్ల దగ్గర నుంచి కిందవరకు దువ్వాలి. ఆ తర్వాత షవర్ క్యాప్ లేదా టవల్‌ను తలకు చుట్టాలి. గంట సేపు ఇలాగే ఉంచి, ఆ తర్వాత ఘాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. కొబ్బరి నూనెతోనూ ఇలాగే చేయవచ్చు.
- పొడిబారిన మాడు దురదగా కూడా పెడుతుంటుంది. ఈ సమస్యకు విరుగుడుగా అరకప్పు ఆలివ్ ఆయిల్‌లో 2 టీ స్పూన్ల తేనె కలిపి మాడుకు పట్టించాలి. వేడినీళ్లలో ముంచిన టవల్‌ని గట్టిగా పిండి, దానిని తలకు చుట్టాలి. (భరించగలిగేంతటి వేడి మాత్రమే ఉండాలి) 15 నిమిషాల తర్వాత హెర్బల్ షాంపూతో తలస్నానం చేయాలి.
- అర కప్పు వేడి చేసిన ఆలివ్‌ను తలకు పట్టించి, గంట తర్వాత తలస్నానం చేయాలి. చివరలో 3–4 టీ స్పూన్ల యాపిల్ సైడర్ వెనిగర్ కలిపిన మగ్గు నీళ్లతో తలంతా తడపాలి. పది నిమిషాల తర్వాత మంచి నీళ్లతో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల కురులు, మాడుపైన చర్మం మృదువుగా మారుతుంది. చుండ్రు సమస్య కూడా తగ్గుతుంది.

● పుస్తకాల హోటల్!

అన్నాన్ని చదివించి అక్షరాలను తినిపిస్తుంది

''మా హోటల్‌కి తినడానికే వస్తారు, కాని తినడానికి వచ్చిన సంగతిని ఇట్టే మర్చిపోతారు. మేము భోజనం తెచ్చి వేడిగా వడ్డిస్తుంటే వాళ్ల చేతులు మాత్రం పేజీలు తిప్పడంలోనే నిమగ్నమై ఉంటాయి. వాళ్ల కళ్లు అక్షరాల వెంట పరుగులు తీస్తుంటాయి. వాళ్ల నాసికలు పదార్థాల ఘుమఘుమలను పసిగట్టే స్పృహలో ఉండవు'' అంటారు 74 ఏళ్ల భీమాబాయ్ జోంధాలే. తన పుస్తకాల హోటల్ ద్వారా నాసిక్ వాసులందరికీ అజ్జి (నానమ్మ) అయ్యారామె. నాసిక్‌కి సమీపంలోని ఓజర్‌లో ఆమె నడుపుతున్న హోటల్ పేరు 'అజ్జిచ్య పుస్తకంచ హోటల్ (గ్రాండ్ మదర్స్ హోటల్ విత్ బుక్స్). ఇందులో మరాఠీ, హిందీ, ఇంగ్లిష్ భాషల పుస్తకాలు... మొత్తం ఐదు వేలున్నాయి. పుస్తకాలను తినిపించే ఈ బామ్మకు చదవడం అంటే చాలా ఇష్టం. కానీ ఆమె తన హోటల్‌లో ఉన్న ఏ ఒక్క పుస్తకాన్నీ చదవలేదు. హోటల్‌కి వచ్చిన వాళ్లు పుస్తకాలు చదువుతుంటే చూసి మురిసిపోతుంది. వాళ్లకు వేడివేడిగా వండి పెడుతుంది. పదార్థాలు చల్లారిపోకముందే తినండి అని అభిమానంగా గుర్తు చేస్తుంది. ఆ రోజు హోటల్‌కి వచ్చిన వాళ్ల పుట్టినరోజు లేదా పెళ్లిరోజు వంటి ప్రత్యేకతలుంటే ఇంటికి వెళ్లేటప్పుడు వారికి అభినందనలు తెలుపుతూ ఒక పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చి పంపిస్తుంది అజ్జి. ఇంతకీ భీమాబాయ్ అజ్జి ఇలా ఎందుకు చేస్తోందంటే...



● భీమాబాయ్ జోంధా

దూరమైన పుస్తకం!

భీమాబాయ్‌కి చిన్నప్పటి నుంచి చదువుకోవడం ఇష్టం. క్లాసు పుస్తకాలను ఇష్టంగా సర్దుకునేది. పెద్ద చదువులు చదవాలని ఉండేదామెకు. కానీ ఆరవ తరగతిలో ఉండగానే పెళ్లి చేసి మహారాష్ట్ర, నాసిక్ పట్టణానికి సమీపంలో ఓ కుగ్రామానికి పంపించారు తల్లిదండ్రులు. అత్తగారిల్లు అంటూ ఒక ప్రదేశం ఉంది, కానీ అక్కడ ఎలా బతకాలో తెలియదు. ఊహ తెలిసేటప్పటికే ఇద్దరు పిల్లలు పుట్టారు. భర్త మద్యానికి బానిస అనే వాస్తవాన్ని జీర్ణించుకోవడం కష్టమైందామెకు. పొలంలో పనులు చేసుకుంటూ బతుకీడ్చడానికి సిద్ధమైంది. కానీ అతడు ఏ పనీ చేయకపోగా తాగుడు కోసం తమ కుటుంబానికి ఉన్న పొలాన్ని కూడా అమ్మేయడం మొదలుపెట్టాడు. ఇంట్లో వాళ్ల కడుపు నింపడానికి ఇతరుల పొలంలో కూలి పనికి వెళ్లాల్సి వచ్చింది. కూతురిని రోజంతా ఇంట్లో వదల్లేక తనతోపాటు పొలానికి తీసుకువెళ్లేది. ఇలాగే కొనసాగితే పిల్లల భవిష్యత్తు కూడా అంధకారమవుతుందని భయపడింది. అప్పుడు... అంటే 2008లో తీసుకుందామె కఠినమైన నిర్ణయం. కుటుంబాన్ని నాసిక్‌కి మార్చింది. కొడుకు ప్రవీణ్ ఆమెకు సహాయంగా పేపర్ వేయడం వంటి చిన్న చిన్న పనులు చేసుకుంటూ తన చదువుకు కావల్సిన డబ్బు సమకూర్చుకునేవాడు. కూతురి సహాయంతో భీమాబాయ్ చిన్న టీ స్టాల్ తెరిచింది. ప్రవీణ్ ఒక ప్రచురణ సంస్థలో ఉద్యోగంలో చేరడం, తర్వాత కొంతకాలానికి సొంతంగా సంస్థను ప్రారంభించడంతో వారి జీవితానికి ఒకింత స్థిరత్వం వచ్చింది. అయితే... ఇక్కడ నుంచి వారి జీవితం మరో మలుపు తీసుకుంది.



● పుస్తకాలుండే నానమ్మగారి హోటల్

టీ గ్లాసు నుంచి టిఫిన్ ప్లేట్ వరకు!

టీ స్టాల్‌తో వచ్చిన లాభాలను ఇంటి ఖర్చులకు పోగా మిగిలిన వాటిని దాచుకునే స్థితికి వచ్చింది కుటుంబం. టీ స్టాల్‌ను విస్తరించి చిన్న హోటల్ చేయాలనే ఆలోచన వచ్చింది. భీమాబాయ్ కొడుకు ప్రవీణ్ ప్రచురణ సంస్థను మూసేసి హోటల్ కోసం పని చేయాలని నిర్ణయించుకున్నాడు. అలా మొదలైంది అజ్జి హోటల్. ఆ హోటల్‌లో పుస్తకాలు పెట్టాలనే ఆలోచన మాత్రం అజ్జిదే. హోటల్‌కి వచ్చిన వాళ్లు తాము ఆర్డర్ చేసిన పదార్థాలు వచ్చే వరకు స్మార్ట్ ఫోన్‌లో మునిగిపోతున్నారు. పరిసరాలను మర్చిపోతున్నారు. వాళ్ల వేళ్లు స్మార్ట్ ఫోన్‌ను స్క్రోల్ చేయడానికే పుట్టినట్లు ఉంది. ఈ అనారోగ్యకరమైన తీరుకు స్వస్తి పలకాలంటే మరొక వ్యాపకాన్ని అలవాటు చేయాలనుకుందామె. తన బాల్యంలో చదువుకున్న వాళ్లంతా మంచి మంచి పుస్తకాలు చదువుతూ ఉంటే వారిని మైమరిచి చూసేది. అలాంటిది ఇప్పుడు చదువుకున్న వాళ్లందరూ పుస్తకాన్ని వదిలేసి ఫోన్‌కి అంకితమైపోతున్నారు. ఇదేం బాగోలేదనుకుంది. ప్రచురణ సంస్థలో మిగిలిపోయిన పాతిక పుస్తకాలతో ఒక బుక్ షెల్ఫ్‌ను టేబుళ్లకు దగ్గరగా పెట్టింది. ఆహారం ఆర్డర్ తీసుకున్న వెంటనే సర్వర్ 'ఆహారం వచ్చేలోపు పుస్తకం చదువుకోమని, ఏ పుస్తకం కావాలని' అడగడంతో మొదలైంది ఓ నిశ్శబ్ద విప్లవం. ఇప్పుడు అజ్జి హోటల్‌కి వచ్చిన వాళ్లు పుస్తకాలు చదువుకుని, భోజనం చేసి సంతృప్తికరమైన జ్ఞాపకాలతో ఇంటిబాట పడుతున్నారు. మరో విషయం... అజ్జి ఇక్కడితో సంతృప్తి చెందలేదు. పుస్తకాలను హోటల్ నుంచి హాస్పిటల్‌కు కూడా విస్తరించింది. 'డాక్టర్‌లు పేషెంట్‌లకు మందులిస్తారు. అవి దేహానికి స్వస్థత చేకూరుస్తాయి. నేనిచ్చే పుస్తకాలు వారి మనసును సాంత్వన పరుస్తాయి', దాంతో త్వరగా కోలుకుంటారని చెబుతోంది బామ్మ భీమాబాయ్.

పల్లవించిన రక్షణ



● స్కూల్ పిల్లలతో పల్లవి ఘోష్

'బాలికల అక్రమ రవాణా' ఈ హెడ్డింగ్‌తో వార్తలు కనిపిస్తూనే ఉంటాయి. 'అయ్యో' అనుకుని మరో వార్తలోకి వెళ్లిపోవడం కూడా చాలా మామూలుగా జరిగిపోతూనే ఉంటుంది. మన కళ్ల ముందు ఉండే అమ్మాయిని ఎవరో అపహరించుకుని వెళ్లారని తెలిస్తే మనసంతా పిండేసినట్లవుతుంది. రోజులపాటు బాధపడతాం. కానీ ఏమీ చేయం. అక్రమాల మీద గళమెత్తలేకపోయినప్పటికీ కనీసం నోరు తెరిచి మనకు తెలిసిన విషయాన్ని చెబితే ఆ సమాచారం దర్యాప్తుకు దోహదమవుతుందని తెలిసినా పోలీసు ముందు పెదవి విప్పడానికి భయం. కానీ, అస్సాంకు చెందిన పల్లవి ఘోష్ అలా చూసి ఊరుకోలేదు. పన్నెండేళ్ల వయసులో ఆమె కళ్ల ముందు జరిగిన ఓ సంఘటన ఆమెను కదిలించింది. సమాజానికి అంకితమయ్యేలా ఆమెను ప్రభావితం చేసింది.

అప్పుడు పల్లవి ఘోష్‌కు పన్నెండేళ్లు. ఆమె నివసిస్తున్న గ్రామానికి సమీపంలో ఉన్న మరో చిన్న గ్రామానికి చెందిన బాలికను దుండగులు అపహరించుకు వెళ్లడం ఆమె కంట పడింది. పెద్దగా అరుస్తూ పెద్దవాళ్లను అప్రమత్తం చేయడం ద్వారా ఆ బాలికను రక్షించగలిగింది పల్లవి. ట్రాఫికింగ్‌ని స్వయంగా చూడడం ఆమెకది తొలిసారి. కానీ బాలికలు, మహిళల అక్రమ రవాణా పట్ల అస్పష్టంగానైనా కొంత అవగాహన ఉందామెకి. అక్రమ రవాణాను నిరోధించాలని ఆ వయసులోనే నిర్ణయించుకుంది పల్లవి. వయసు పెరిగేకొద్దీ ఆమెలో ట్రాఫికింగ్ పట్ల స్పష్టమైన కార్యాచరణ రూపుదిద్దుకుంది. 'ఇంపాక్ట్ అండ్ డైలాగ్ ఫౌండేషన్' స్థాపించి బాలికలు, మహిళల కోసం పని చేయడం మొదలుపెట్టింది.

వేదిక మీద ప్రసంగం చాలదు!

''బాలికలకు పొంచి ఉన్న ప్రమాదం గురించి వివరించి చెప్పడానికి, ఆ బారిన పడకుండా కాపాడడానికి వేదికల మీద ఎన్ని ప్రసంగాలు చేసినా వాటితో అనుకున్న లక్ష్యం నెరవేరట్లేదని కొద్దికాలంలోనే తెలిసింది. ఇలా ప్రసంగాలతో కనీసం ఆలోచననైనా రేకెత్తించగలుగుతున్నానా అనే సందేహం కూడా కలిగింది. అప్పటి నుంచి నేరుగా ఇంటింటికీ వెళ్లి తలుపు కొట్టడం మొదలుపెట్టాను. వాళ్ల ఉద్ధరణ కోసం నిజంగా చేయాల్సిన పని ఏమిటనేది అప్పుడు తెలిసింది. మహిళలు గతంలోకి వెళ్లి తమకు జరిగిన అన్యాయాన్ని, జరగబోయి తప్పించుకున్న దురాగతాలను ఏకరువు పెట్టారు. ప్రమాదాలు ఎన్ని రకాలుగా చుట్టుముడతాయనే విషయాన్ని వారికి విడమరిచి చెప్పడంతో పాటు ప్రమాదాన్ని శంకించినప్పుడు రక్షణ కోసం ఏమి చేయాలో వివరించాను. కొన్ని ఇళ్ల నుంచి అప్పటికే మాయమైపోయిన బాలికల అన్వేషణ కోసం పోలీస్ శాఖను ఆశ్రయించాను. అలాగే సమాజాన్ని చైతన్యవంతం చేసే క్రమంలో కానిస్టేబుళ్లను భాగస్వాములను చేశాను. వారిని దగ్గరగా చూడడం, వారు చెప్పే ధైర్యవచనాలను వినడం ద్వారా బాలికలు తమకు ప్రమాదం ఎదురైనప్పుడు నిర్భయంగా పోలీసుల సహాయాన్ని కోరగలుగుతారు. ఇలా ఎన్నో ప్రయత్నాల ద్వారా అక్రమ రవాణా పట్ల బాలికల్లో చైతన్యం తీసుకువచ్చాను. అపహరణకు గురైన పదివేలకు పైగా బాలికలను తిరిగి వారి ఇళ్లకు చేర్చగలిగాను. అంతటితో సరిపోదని ఆ తర్వాత తెలిసింది. రక్షించిన బాలికలకు ఉపాధి కూడా కల్పించాలి. ఆ పని చేయలేకపోతే ట్రాఫికింగ్ మాఫియా పని పేరుతో ఆ బాలికలను తిరిగి తమ గుప్పెట్లోకి తీసుకుపోతుంది. అందుకోసం మా ఫౌండేషన్ ద్వారా వారికి పనుల్లో శిక్షణ ఇచ్చి పని కల్పించడం కూడా మొదలు పెట్టాను. పది వేలకు పైగా బాలికలను కాపాడడంతోపాటు 75 వేల మందిలో చైతన్యం తీసుకురాగలిగాను. వారి భవిష్యత్తు అంధకారంలోకి తోసేసే ముఠాల నుంచి వారికి జాగ్రత్తలు తెలియచేశాను. కానీ మాఫియా ముఠాలను కూకటి వేళ్లతో పెకలించి వేయడం అనే పనిని ప్రభుత్వాలు చేయాలి. అప్పుడే ఈ భూతం తిరిగి నిద్రలేవకుండా ఉంటుంది'' అని వివరించింది పల్లవి ఘోష్.



● పల్లవి ఘోష్

చీర... నా రెండో గుర్తింపు

అప్పటివరకు గృహిణిగానే కాలం వెళ్లబుచ్చింది వినీ టాండన్ కెనీ. 53 ఏళ్ల వయసులో చీరకట్టు ద్వారా బిజినెస్ ఉమెన్‌గా మారింది. నేటి తరం అమ్మాయిలకు చీరకట్టు నేర్పించడానికి గోవాలో ప్రత్యేకంగా 'శారీ స్పీక్' స్టూడియోను ఏర్పాటు ద్వారా చేనేతకారులను ప్రోత్సహిస్తోంది. సోషల్ మీడియా ద్వారా 'శారీ గ్రూప్' ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలను ప్రభావితం చేస్తోంది. 'చీర నా రెండో గుర్తింపు' అంటున్న వినీ గురించి ...

వినీ టాండన్ కెనీ ని పలకరిస్తే చాలు చీరల పట్ల తనకున్న ప్రేమను ఎంతో ఆనందంగా వ్యక్తపరుస్తుంది. 'శారీ స్పీక్' స్టూడియో వ్యవస్థాపకురాలుగా ఆమె ప్రయాణం నేటితరానికి కొత్త పాఠం.

భార్య.. తల్లి... కోడలు.. శారీ ఇన్‌ఫ్లుయెన్సర్, కామిక్ కంటెంట్ సృష్టికర్త కూడా... ఇన్ని పాత్రలను చిరునవ్వుతో పోషించవచ్చునన డానికి వినీనే ఉదాహరణ. 'నా కుటుంబమే నాకు బలం. ఉత్సాహం. మా కుటుంబ సభ్యులే నా ఫొటోలు, వీడియోలు తీస్తూ ఉంటారు. ఫేస్‌బుక్ గ్రూప్ 'శారీ స్పీక్'ని క్రియేట్ చేసి రేపటికి ఏడేళ్లు పూర్తవుతాయి. ఈ గ్రూప్ కారణంగా చాలామంది మహిళల ఆలోచనల్లో చీర గురించిన నిర్వచనమే మారిపోయింది.

ఝాశీ నుంచి మొదలైన ప్రయాణం... నేను పుట్టి పెరిగింది ఉత్తర్‌ప్రదేశ్‌లోని హర్దోయ్‌లో. మా నాన్నగారు మెరైన్ ఇంజనీర్ అవడంతో ఆయన ఉద్యోగరీత్యా వివిధ నగరాల్లో నివసించాం. నాన్నగారికి గోవాలో పోస్టింగ్ వచ్చినప్పుడు అక్కడ ప్రసాద్ కెనీతో నా పెళ్లి జరిగింది. అలా నేను గోవాలోనే ఉండిపోయాను. ఇద్దరు అబ్బాయిల పెంపకంలో ఎప్పుడూ తీరికలేకుండా ఉండేదాన్ని. పిల్లలు పెద్దవాళ్లై కాలేజీలకు వెళుతున్నప్పుడు నాలో ఏదో వెలితి ఏర్పడింది. ఏం చేయాలో అర్థం కాలేదు. అప్పుడు నా ఆసక్తుల వైపు దృష్టి సారించాను. మొదట సినిమా అభిమానుల కోసం 'మూవీ స్పీక్' పేరుతో ఫేస్‌బుక్ గ్రూప్‌ను క్రియేట్ చేశాను. ఆ తర్వాత వివిధ రకాల కళలు, కవులు .. మొదలైన గ్రూప్‌లను సృష్టించాను. అదే సమయంలో 'శారీ స్పీక్' బృందం కూడా ఏర్పాటయింది.

అలా మొదలైంది... మా అమ్మ, అత్తగారు సౌకర్యం కోసం చీర నుంచి సల్వార్ కమీజ్‌కు మారినప్పుడు నాకెందుకో మనసు చివుక్కుమంది. ఈ విధంగా ఆలోచిస్తే అందరూ చీర కట్టుకోవడం మానేస్తారని అనిపించేది. దీంతో నేను చీర కట్టుకోవడం మొదలుపెట్టాను. నన్ను చీరలో చూసి, నా చుట్టూ ఉన్న ఆడవాళ్లు కూడా చీరలవైపు మొగ్గు చూపేవారు. చీరకట్టు ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసేదాన్ని. నాకు మంచి స్పందన రావడంతో వాళ్లూ పోస్ట్ చేయడం మొదలుపెట్టారు.

చేనేత కారులే నా బ్రాండ్... మా చిన్నబ్బాయి సొంతంగా ఏదైనా బిజినెస్ స్టార్ట్ చేయమన్నప్పుడు శారీ ఐడియా గురించి చెప్పాను. స్టూడియో ఏర్పాటుకు తనే మద్దతుగా నిలిచాడు. దీంతో 53 ఏళ్ల వయసులో శారీ స్టూడియోతో వ్యాపారవేత్తను అయ్యాను. నా సొంత బ్రాండ్ అంటూ ఏమీ లేదు. దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికుల నుంచి చేనేత చీరలను కొనుగోలు చేసి, సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాను. నా స్టూడియోలో 95 శాతం చేనేత చీరలే ఉంటాయి. ఇప్పుడు చీరలను ఇష్టపడే మహిళలు వాటిని కొనడానికి నా స్టూడియోకు రావడం మొదలుపెట్టారు. కొందరు చీర కట్టుకోవడం తమకు చేత కాదని, ఇంకొందరూ తమకు అసౌకర్యం అని చెబుతుంటారు. చీర కట్టుకోవడానికి ఐదు నిమిషాలు చాలు. ఇక అసౌకర్యం ఎందుకో నాకు అర్థం కాదు. ఈ సమస్యను పరిష్కరించడానికి నా స్టూడియోలో చీరకట్టుకు సులువైన టెక్నిక్స్ ఇస్తుంటాను.





శారీ స్పీక్ స్టోరీలు... చీరకట్టు గురించి మాత్రమే కాదు వారి ఆనందం, అలాగే తమ మానసిక వేదనల నుంచి బయటపడే విధానాల గురించి చెప్పినప్పుడు వాటినీ సోషల్ మీడియా వేదికగా పంచుతుంటాను. బెంగళూరుకు చెందిన ఉషా అగర్వాల్ అనే మహిళ తన తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయింది. కొన్ని రోజులకు నా పోస్ట్‌లను చూసి తనూ ప్రతి రోజూ కొత్త చీర కట్టుకొని, వాటిని పోస్ట్ చేసింది. ఆ మార్పుతో తన బాధ నుంచి కొద్ది రోజుల్లోనే బయటపడగలిగింది. ఆమె శారీ స్పీక్‌కి కృతజ్ఞతలు తెలిపింది.

వెయ్యిమందిలో... ప్యాంటు నుండి సల్వార్ డ్రెస్సుల వరకు అన్నీ ధరిస్తాను. కానీ, నాకు అపారమైన నమ్మకాన్ని ఇచ్చేది శారీనే. చీర కట్టుకోగానే నా ముఖంలో చిరునవ్వు వచ్చేస్తుంది. నాతో చీర మాట్లాడుతున్నట్టే అనిపిస్తుంది. కిందటేడాది భారతీయ నేత కార్మికులకు సహాయం చేయడానికి యూకే రాయల్ ఆస్కాట్ హార్స్ రేస్‌లో సుమారు వెయ్యిమంది వరకు చీరలు ధరించారు. వారిలో నేనూ ఉన్నాను. మేం తమ దేశంలో చీర ధరించాలని నిర్ణయించుకున్నందుకు బ్రిటిషర్లు మా వేషధారణను చూసి ఎంతో ఆనందించామని చెప్పారు. అప్పుడు నాకు చాలా సంతోషమనిపించింది.

లక్షా డెబ్బై వేల మంది సభ్యులు... శారీ స్పీక్ ఫేస్‌బుక్ అకౌంట్‌కి ప్రపంచం నలుమూలల నుండి లక్షా డెబ్బై వేల మంది సభ్యులు గా ఉన్నారు. ఈ గ్రూపులో మహిళలు మాత్రమే సభ్యులు. ఈ గ్రూప్ చీరలను మాత్రమే ప్రమోట్ చేస్తుంది.

ఇన్నేళ్లుగా చీర నన్ను బిజీగా ఉంచింది. నిన్ను చూడగానే చీరలు కట్టుకోవడం మొదలు పెట్టామంటూ చాలా మంది మహిళలు నాకు మెసేజ్ చేస్తుంటారు. మీ వల్లే మాకు ప్రమోషన్ వచ్చిందని, మా అమ్మకాలు పెరిగాయని చేనేత కార్మికులు అంటున్నారు. ఇదంతా వింటే మరింత పనిచేయాలనే ధైర్యం వస్తుంది. ఈ నెల 14న మా గ్రూప్ ఎనిమిదో వార్షికోత్సవాన్ని జరపుకుంటున్నాం. ఈ సందర్భంగా మీరూ చీరలో ఆనందంగా విహరించండి' అంటున్నారు వినీ టాండన్.

అడిక్షన్ నుంచి స్మార్ట్‌గా బయట పడదాం...



ప్రస్తుతం ట్రెండ్ ఎలా ఉందంటే.... నిద్ర లేచింది మొదలు మళ్లీ పడుకోబోయే వరకు ఎవరైనా సరే... ఎవరితో ఎక్కువ సమయం గడుపుతున్నారంటే... నిస్సందేహంగా అది స్మార్ట్ ఫోన్‌తోనే అనే సమాధానం వస్తుంది. ఎందుకంటే రకరకాల ఆర్థిక లావాదేవీల నుంచి వివిధ రకాల వాణిజ్య, వ్యాపార కార్యకలాపాల దాకా ; ఆధ్యాత్మిక కార్యక్రమాల నుంచి వినోద కాలక్షేపం వరకు..ఆఖరుకు సెల్‌ఫోన్ వల్ల కలిగే దుష్ప్రభావాలను కూడా సెల్‌ఫోన్ ద్వారానే తెలుసుకోవడం అనివార్యం అవుతోందంటే ఆశ్చర్యం లేదు. అయితే దీని నుంచి బయట పడేదెలా? అందుకు తోడ్పడేందుకే ఈ చిట్కాలు కొన్ని.

సెల్ ఫోన్ అడిక్షన్ తగ్గించుకోవాలంటే మనం రోజుకి ఒక నాలుగైదు గంటలు సెల్ ఫోన్ చూస్తుంటే రెండు గంటలకు తగ్గించుకోవాలి అంటే రోజురోజుకి కొద్దిగా తగ్గిస్తూ వస్తే సరిపోతుంది. మన మనసును అదుపు చేసుకోవాలి.

నో ఫోన్ డే!

వారంలో ఒక రోజు కచ్చితంగా ఫోన్ వాడకుండా పక్కన పెట్టేస్తానని నిర్ణయం తీసుకోండి. శని ఆదివారాల్లో ఏదో ఒక రోజును ఫోన్ లెస్ డే లేదా నో ఫోన్ డే గా ప్రకటించుకోండి. దాని బయట ఉన్న ప్రపంచాన్ని ఆస్వాదించేందుకు ప్రయత్నించండి. మనం ఎక్కువ ఖాళీగా ఉంటే ఎక్కువగా ఫోన్‌ని చూసేందుకు ప్రయత్నిస్తూ ఉంటాం. బదులుగా ఏదో ఒక పుస్తకం చదవాలని లక్ష్యాన్ని నిర్దేశించుకోండి. అప్పుడు ఖాళీ ఉన్నప్పుడల్లా ఆ పుస్తకాన్ని చదివేందుకే ఆసక్తి చూపుతాం.

నో ఫోన్ జోన్ రూమ్

పడక గదిలోకి ఫోన్‌ని అసలు తెచ్చుకోకుండా ఉండాలని మీకు మీరే నిబంధన విధించుకోండి. బెడ్‌రూంలో ఎక్కువగా ఫోన్‌ని చూడటం వల్ల ముఖ్యంగా నిద్రలేమి సమస్యలు ఎక్కువ అవుతున్నాయని అధ్యయనాల్లో వెల్లడయ్యింది కాబట్టి బెడ్ రూంని నో ఫోన్ జోన్‌గా మార్చుకోండి.

దూరంగా ఉంచడం

ఫోన్‌ని ఎప్పుడూ కనిపించే విధంగా ఎదురుగా పెట్టుకోకండి. బదులుగా దాన్ని ఏదో ఒక డ్రా లో పెట్టి ఉంచుకోండి. ఎదురుగా ఫోన్ కనిపించేసరికి ఎక్కువగా దాని మీదకే దృష్టి వెళ్లిపోతుంది. దాంట్లోనే ఏదైనా చూడాలని అనిపిస్తుంది. అందుకనే ఫోన్‌ని సాధ్యమైనంత వరకు కనిపించకుండా పెట్టుకోండి.

నో...టిఫికేషన్స్

ఫోన్‌లో అన్ని యాప్ నోటిఫికేషన్లను టర్న్ ఆఫ్ చేసుకోండి. లేదంటే ఏవో ఒక నోటిఫికేషన్లు వస్తూ మనల్ని ఫోన్ చూసేలా ప్రేరేపిస్తూంటాయి. ఫోన్‌లో మనం ఎక్కువగా చూసే యాప్‌లను లోపల ఫోల్డర్లలో ఎక్కడో ఉంచుకుంటే మనం ఫోన్ వాడే సమయం తగ్గుతుంది.



ఎందుకు... ఏమిటి?

ఫోన్‌ని వాడే ప్రతి సారీ మనం ఇప్పుడు దీన్ని ఎందుకు తీశాం? అవసరం ఏమిటి? అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోండి. ఆ పని అయిపోగానే దాన్ని ఆపేయండి.

చకచకా...

- ప్రతి పనికీ సెల్ ఫోన్ మీదే ఆధారపడకుండా ఉండటం
- ఆరోగ్యకరమైన సరిహద్దులను ఏర్పరచుకోవడం
- స్క్రీన్ సమయానికి పరిమితులను సెట్ చేసుకోవడం
- సామాజిక, కుటుంబ సంబంధాలను బలపరచుకోవడం
- జిటల్ వెల్ బీయింగ్ ద్వారా మనం ఎంత సేపు వాడుతున్నాం అన్నది చూసుకుని సెల్ ఫోన్ వాడకం రోజుకి ఒకటి రెండు గంటలు మించకుండా చూసుకోవాలి.

లైఫ్@360

వేసవిలో ఆరోగ్యంగా ఎలా ఉండాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం ఎందుకంటే సూర్యరశ్మిలోని అతి నీలలోహిత కిరణాల వల్ల చర్మం కందిపోవడం మొదలవుతుంది. క్రమేణా నల్లబడుతుంది. అంతేకాదు, తీవ్రమైన ఎండ మన శరీరాన్ని వివిధ రకాలుగాప్రభావితం చేస్తుంది. అందువల్ల వేసవిలో ఆరోగ్యాన్ని ముఖ్యంగా చర్మాన్ని రక్షించుకోవడానికి తీసుకోవలసిన కొన్ని ముందు జాగ్రత్తలు, ఆరోగ్య చిట్కాలను తెలుసుకుందాం..

ఎండల్లోనూ హాయ్ హాయ్

ఎండ వేడికి విపరీతంగా చెమట పట్టడం సహజం. దాంతో ఒంటి మీద చిన్న చిన్న గుల్లల్లా వస్తాయి. వీటికే చెమట కాయలు లేదా చెమట గుల్లలని పేరు. కొంతమందికి శరీరమంతా దద్దుర్లు వస్తాయి అయితే కొన్ని చర్యలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండడం తోపాటు మెరిసే చర్మంతో ఫిట్‌గా ఉండవచ్చునంటున్నారు వైద్యనిపుణులు.

మీ చర్మ రకాన్ని బట్టి... సంరక్షణ చిట్కాలు...

వేసవిలో సరైన చర్మ సంరక్షణ దినచర్యకు కట్టుబడి ఉండటం వల్ల మీ చర్మాన్ని హానికరమైన ᵤᵥకిరణాల నుండి కాపాడుతుంది.

- **సన్‌స్క్రీన్ జెల్:** సూర్యుడి ᵤᵥకిరణాల నుండి చర్మాన్ని రక్షించేవాటిలో సన్‌స్క్రీన్ జెల్ ముఖ్యమైనది. అందువల్ల, అన్ని చర్మ రకాలకు సన్‌స్క్రీన్ జెల్‌ను అప్లై చేయడం వల్ల వేసవిలో మండే ఎండలు చర్మాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేయకుండా అవుతాయి.
- **ఆయిల్ స్కిన్ కోసం సాలిసిలిక్ యాసిడ్ క్లెన్సర్**

వేసవిలో శరీరం వేడికి ప్రతిస్పందనగా సెబమ్ లేదా నూనెను అధికంగా ఉత్పత్తి చేస్తుంది. ఈ నూనె వల్ల చర్మంపై చిన్న చిన్న నల్లటి చుక్కలు లేదా బ్లాక్‌హెడ్స్‌కు దారితీసే రంధ్రాలను మూసుకుపోతుంది. సాలిసిలిక్ యాసిడ్‌తో సరైన క్లెన్సర్‌ని ఉపయోగించడం వల్ల జిడ్డుగల చర్మానికి సరైన వేసవి చర్మ సంరక్షణ లభిస్తుంది. సాలిసిలిక్ యాసిడ్ చర్మ రంధ్రాలను మూసుకుపోకుండా చేయడంలో సహాయపడుతుంది. అంతేకాదు... చర్మం నుంచి అదనపు నూనె, ధూళి, దుమ్మును తొలగిస్తుంది, మచ్చలను తొలగిస్తుంది. ఇది చర్మం ఇతర పోషకాలను బాగా గ్రహించేలా చేస్తుంది.

- **పొడి చర్మం కోసం:** చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది – మాయిశ్చరైజ్ చేస్తుంది. హైలురోనిక్ యాసిడ్‌తో కూడిన తేలికపాటి మాయిశ్చరైజర్ పొడి చర్మానికి అనువైనది. జెల్ లేదా స్పష్టమైన మాయిశ్చరైజర్లు ఎక్కువగా వేసవిలో పొడి చర్మానికి అనువైనవి. అలాగే, అవి తేమను బంధించే ఎక్కువ ఎమోలియెంట్‌లను కలిగి ఉంటాయి, చర్మాన్ని ఎక్కువ సేపు హైడ్రేట్‌గా ఉంచుతాయి.
- **అన్ని చర్మరకాల కోసం**

స్పెక్ట్రమ్ సన్‌స్క్రీన్ వృద్ధాప్య, చర్మ క్యాన్సర్‌కు కారణమయే కిరణాలను అడ్డుకుంటుంది. అందువల్ల, ఇల్లు లేదా ఆఫీసు నుండి బయటకు వెళ్లేటప్పుడు సన్‌స్క్రీన్ అ చేయడం అన్ని చర్మరకాల వారికి తప్పనిసరి. అలాగే, ఆరుబయట మేఘావృతమైనా లేదా ఎండగా ఉండేటటువంటి ప్రతిరోజూ దీన్ని వర్తించండి.

- **క్లెన్సింగ్ చేసుకోవడం**

బీట్‌రూట్, టమోటా, పచ్చిపాలు, సెనగపిండి, బొప్పాయి గుజ్జు, మామిడిపండు గుజ్జు, మెత్తగా మెదిపిన అరటిపండు వంటి సహజసిద్ధమైన వాటితో ముఖాన్ని క్లెన్సింగ్ చేసుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

- **నలుగు పెట్టుకోవడం లేదా అభ్యంగన స్నానం**

పూర్వం పెద్దవాళ్లు వారానికి ఒకసారి తప్పనిసరిగా ఒంటికి నలుగు పెట్టుకుని స్నానం చేసేవారు. ఇప్పుడు అంత తీరిక, ఓపిక ఉండట్లేదు కానీ, ఎప్పుడైనా సరే, చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే వారానికి ఒకటి లేదా రెండుసార్లు ఒంటికి నువ్వులనూనె రాసుకుని, సెనగపిండి లేదా నలుగు పిండి అంటే మార్కెట్‌లో దొరికే బాత్ పౌడర్‌తో ఒంటికి నలుగు పెట్టుకుని స్నానం చేయడం వల్ల చర్మం ఆరోగ్యంగా... తాజాగా నిగనిగలాడుతుంది.

ఫిట్‌గా ఉండటానికి చిట్కాలు...

- **యాక్టివ్‌గా ఉండటం:** వేసవి అనే కాదు, ఎప్పుడయినా సరే, వ్యాయామం చేయడం ఆరోగ్యానికి కీలకం. అయితే, వేసవిలో వ్యాయామం కాసింత కష్టంగానే అనిపిస్తుంది. బయటకు వెళ్లి ఎక్సర్‌సైజులు చేయడం కష్టంగా అనిపిస్తే, సైకిల్ తొక్కవచ్చు, హైకింగ్ చేయవచ్చు లేదా ఈతకు వెళ్లవచ్చు.. ఫిట్‌నెస్ యాక్టివిటీ వల్ల వేసవి వేడిని తట్టుకుని యాక్టివ్‌గా ఉంటారు.
- **పోషకాలతో కూడిన ఆహారం:** పాలకూర, బచ్చలికూర, గ్రీన్ బీన్స్, కాలే మరియు ఇతర ఆకు పచ్చ కూరగాయలు వంటి పోషకమైన ఆహారాలు కాల్షియం, మెగ్నీషియం మరియు ఐరన్ వంటి ముఖ్యమైన పోషకాలను కలిగి ఉంటాయి. అలాగే వేసవిలో శరీరానికి కావల్సిన నీటి శాతం కూడా ఇందులో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, వాటిని రోజువారీ డైట్‌లో చేర్చుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.
- **తేమగా ఉండేలా చూసుకోవడం:** శరీరాన్ని హైడ్రేట్ చేయడం వేసవి-సీజన్ చర్మ సంరక్షణ చిట్కాలలో అగ్రస్థానంలో ఉంది . మీ శరీరం చెమట ద్వారా నీటిని కోల్పోతుంది. ఇది నీటిని వేగంగా కోల్పోతే, నిర్జలీకరణం సంభవిస్తుంది. ఈ ప్రమాదం జరగకుండా ఉండాలంటే రోజూ తగినన్ని మంచి నీళ్లు, కొబ్బరినీళ్లు, మజ్జిగ, బార్లీ నీళ్లు, రాగిజావ వంటి వాటిని తీసుకోవడం చాలా మంచిది.
- **తగిన దుస్తులు:** వేసవిలో చర్మానికి అతుక్కుపోయేలా ఉండే ముదురు రంగు డెనిమ్ దుస్తులకు బదులు లేత రంగు, వదులుగా ఉండే దుస్తులు ధరించడం చాలా మంచిది. బిగుతుగా ఉండే దుస్తులు చర్మం ద్వారా శరీరంలోని వేడిని బయటకు వెళ్లకుండా చేస్తాయి కాబట్టి శరీరం వేడెక్కి దద్దుర్లు వచ్చి చికాకు కలిగించవచ్చు. అందువల్ల, ఎండ బాగా తగిలే శరీర భాగాలను కప్పి ఉంచే లేత రంగు దుస్తులను ధరించండి.
- **ఎండలో తిరగకుండా...**

వీలైతే ఆరుబయట గడిపే సమయాన్ని నియంత్రించండి. ఉదాహరణకు, సూర్య కిరణాలు తీవ్రంగా ఉన్నప్పుడు ఉదయం 10 మధ్యాహ్నం 3 గంటల మధ్య ఇంట్లోనే ఉండటానికి ప్రయత్నించండి.

- **కెఫిన్, ఆల్కహాల్‌కు దూరంగా**

ఆల్కహాల్, కెఫిన్ వాడకం వల్ల ఎక్కువ సార్లు మూత్రవిసర్జన చేయాల్సి వస్తుంది. చెమట అధికంగా పడుతుంది. నీటిని ఎక్కువగా కోల్పోవడం వల్ల తలనొప్పి, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు పెరుగుతాయి. అందువల్ల, వేసవిలో వాటికి దూరంగా ఉండటం... ఇక్కడ కెఫిన్ అంటే కాఫీ, టీలే కాదు.. కూల్ డ్రింక్స్ కూడా అని గ్రహించండి.

- **చల్లని వాతావరణం**

చల్లని వాతావరణంలో లేదా నీడలో గడపడం వల్ల మీ శరీరం చల్లగా ఉంటుంది. డీహైడ్రేషన్‌ను నివారిస్తుంది. అందువల్ల, వీలయినంత వరకు నీడలో లేదా చల్లని వాతావరణంలో ఉండటం మంచిది.

- పుచ్చకాయ, స్వీట్‌కార్న్, మామిడి, దోస, నిమ్మరసం, బెర్రీలు, పెరుగు, కొబ్బరి నీరు, మజ్జిగ తీసుకోవడం మంచిది.

హెల్త్ టిప్స్



కిస్మిస్‌లలో జింక్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు ఎంతగానో మేలు చేస్తాయి. రాత్రిపూట కొన్ని కిస్మిస్‌లను తిని గోరువెచ్చటి నీరు తాగితే మరుసటి రోజు ఉదయం విరేచనం సాఫీగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. దీంతో పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. అలా కాకపోతే రాత్రి పూట కిస్మిస్‌లను నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం కూడా తినవచ్చు. ఎలా తిన్నా సమస్య నుంచి బయట పడతారు.

బాదంపప్పులో ప్రోటీన్లు, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ, కాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. అందువల్ల బాదంపప్పును రోజూ తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇందుకు గాను బాదంపప్పును రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే వాటిని పొట్టు తీసి తినాలి. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోవడంతోపాటు మలబద్ధకం తగ్గుతుంది. పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.



జామ పండ్లలో విటమిన్లు, మినరల్స్ అనేకం ఉంటాయి. ఇవి దంతాలు, చిగుళ్ల సమస్యలు, జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. జామ పండ్లను తినడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మలబద్ధకం ఉండదు. అలాగే పైల్స్ కూడా తగ్గిపోతాయి. రోజూ రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రకు ముందు ఒక జామ పండును తింటే ప్రయోజనం కలుగుతుంది. దీంతో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.



సినిమా

కాన్స్ చిత్రోత్సవంలో భారతీయ చిత్రాలు



● 'ఆల్ వీ ఇమాజిన్...' పోస్టర్



● 'సంతోష్' పోస్టర్

● 30 ఏళ్లకు ప్రతిష్టాత్మక 'పామ్ డ ఓర్' విభాగంలో భారతీయ చిత్రం

భారతీయ దర్శకురాలు పాయల్ కపాడియా తెరకెక్కించిన 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ లైట్' చిత్రం చరిత్ర సృష్టించింది. కాన్స్ చలన చిత్రోత్సవంలో ప్రధాన విభాగంగా భావించే 'పామ్ డ ఓర్' అవార్డు పోటీలో నిలిచింది ఈ మలయాళ చిత్రం. ముంబైకి చెందిన పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన ఈ చిత్రం 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'పామ్ డ ఓర్' అవార్డు కోసం పోటీలో నిలిచినట్లు నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఇక ఈ ఏడాది కాన్స్ చిత్రోత్సవం మే 15 నుంచి 25 వరకు జరగనుంది. ఈ సందర్భంగా ఈ ఫెస్టివల్‌కు సంబంధించిన అవార్డులు, స్క్రీనింగ్ కానున్న సినిమాల జాబితాను ప్రకటించారు నిర్వాహకులు. కాన్స్‌లో అత్యధిక బహుమతిని అందించే 'పామ్ డ ఓర్' విభాగంలో భారతీయ చిత్రం 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ లైట్'తో పాటు అమెరికన్ ఫిల్మ్ 'అనోర', యూకే ఫిల్మ్ 'ఓహ్.. కెనడా', ఫ్రెంచ్ ఫిల్మ్ 'బీటింగ్ హార్ట్స్', పోర్చుగల్ ఫిల్మ్ 'గ్రాండ్ టూర్' వంటి దాదాపు 20 చిత్రాలు నిలిచాయి. ఇక 'అన్‌సర్టైన్ రిగార్డ్' విభాగంలో బ్రిటిష్ ఇండియన్ దర్శకురాలు సంధ్యా సూరి దర్శకత్వం వహించిన 'సంతోష్', బల్గేరియన్ దర్శకుడు కోన్‌స్టాటిన్ బోజనోవ్ దర్శకత్వంలో భారతీయ నటీనటులు భాగమైన 'ది షేమ్‌లెస్' చిత్రాలతో పాటు చైనా ఫిల్మ్ 'బ్లాక్‌డాగ్', 'సెప్టెంబర్ సేస్', జపాన్ ఫిల్మ్ 'మై సన్‌షైన్' వంటి 15 చిత్రాలు పోటీ పడుతున్నాయి. ఇక 'అవుట్ ఆఫ్ కాంపిటిషన్' విభాగంలో 'ఫూరియోషియా: ది మ్యాడ్‌మాక్స్ సాగ', 'రూమర్స్'తో పాటు మరో మూడు చిత్రాలు ఉన్నాయి. మిడ్‌నైట్ స్క్రీనింగ్ విభాగంలో 'ది సఫర్'తో కలిసి నాలుగు చిత్రాలు, కాన్స్ ప్రీమియర్‌లో 'ఇట్స్ నాట్ మీ'తో పాటు ఆరు చిత్రాలు, స్పెషల్ స్క్రీనింగ్ విభాగంలో 'ది బ్యూటీ ఆఫ్ ఘాజా'తో కలిపి ఐదు చిత్రాలు ప్రదర్శితం కానున్నాయి.



● సంధ్యా సూరి



● పాయల్ కపాడియా

మూడు దశాబ్దాల తర్వాత...

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత 'పామ్ డ ఓర్' విభాగంలో భారతీయ చిత్రం 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ లైట్' పోటీ పడుతోంది. ఈ విభాగంలో 1994లో మలయాళ చిత్రం 'స్వాహం' నామినేషన్‌ను దక్కించుకున్నా, అవార్డు గెల్చుకోలేకపోయింది. ఈ సినిమాకు షాజీ నీలకంఠన్ కరుణ్ దర్శకత్వం వహించారు. అలాగే ఇదే విభాగంలో అవార్డు గెలుచుకున్న ఏకైక భారతీయ చిత్రం 'నీచా నగర్'. 1946లో విడుదలైన ఈ హిందీ సినిమాకు చేతన్ ఆనంద్ దర్శకుడు. 'నీచా నగర్' చిత్రం తర్వాత 'అమర్ భూపాలి', 'ఆవారా' వంటి చిత్రాలు 'పామ్ డ ఓర్'కు నామినేషన్ దక్కించుకున్నా అవార్డు గెల్చుకోలేకపోయాయి. 30 ఏళ్లకు ఈ విభాగంలో పోటీ పడుతున్న భారతీయ చిత్రం 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ లైట్'కు అవార్డు వస్తుందా? అనేది చూడాలి. ఈసారి 'పామ్ డ ఓర్' విభాగంలో విజేతను నిర్ణయించే జ్యూరీ అధ్యక్షురాలిగా అమెరికన్ నటి గ్రెటా గెర్విక్ వ్యవహరిస్తున్నారు.

ఆల్ వీ ఇమాజిన్... కథేంటంటే...

కేరళకు చెందిన ఇద్దరు నర్సులు ప్రభ, అనులు ముంబైలో పని చేస్తుంటారు. ఈ ఇద్దరూ వారి వారి రిలేషన్‌షిప్స్‌లో ఇబ్బందులు పడుతుంటారు. అలా ఈ ఇద్దరూ ఓ రోడ్ ట్రిప్‌కు వెళ్లినప్పుడు ఏం జరిగింది? అన్నదే ఈ చిత్రం కథాంశమని సమాచారం. ఈ మలయాళ చిత్రానికి రచయిత-దర్శకురాలు, ఎడిటర్ పాయల్ కపాడియా దర్శకత్వం వహించారు. ఇక పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన తొలి ఫీచర్ ఫిల్మ్ కూడా ఇదే కావడం విశేషం. గతంలో పాయల్ దర్శకత్వం వహించిన డాక్యుమెంటరీ ఫిల్మ్ 'ఆఫ్టర్‌నూన్ క్లౌడ్స్' 2015లో కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ స్క్రీనింగ్‌కు ఎంపిక అయింది. అలాగే పాయల్ దర్శకత్వంలో వచ్చిన మరో డాక్యుమెంటరీ ఫిల్మ్ 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్' 2021లో జరిగిన కాన్స్ ఫెస్టివల్‌లో 'గోల్డెన్ ఐ' అవార్డును గెలుచుకుంది. మరి.. ఈసారి కూడా పాయల్ అవార్డును గెలుస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

సంతోష్ కథేంటంటే...

బ్రిటిష్ ఇండియన్ ఫిల్మ్ మేకర్ సంధ్యా సూరికి దర్శకురాలిగా 'సంతోష్' తొలి చిత్రం. ఉత్తర భారతదేశంలోని ఓ గ్రామం నేపథ్యంలో ఈ చిత్రకథ ఉంటుంది. వితంతువు సంతోష్‌కి తన భర్త చేసే పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం దక్కుతుంది. బలహీన వర్గానికి చెందిన ఓ అమ్మాయిపై జరిగిన అత్యాచారం, ఆ పై హత్యకు సంబంధించిన కేసుని ఛేదించే దర్యాప్తు బృందంలో సంతోష్ భాగం అవుతుంది. ఈ కేసుని ఆమె ఎలా హ్యాండిల్ చేసింది? అనేది కథాంశం. మరి.. ఈ చిత్రం కూడా అవార్డు దక్కించుకుంటుందా? చూడాలి.

భజే వాయు వేగం



● కార్తికేయ

కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'భజే వాయు వేగం' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ చిత్రానికి ప్రశాంత్ రెడ్డి దర్శకుడు. ఐశ్వర్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో 'హ్యాపీ డేస్' ఫేమ్ రాహుల్ టైసన్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. యువీ క్రియేషన్స్ సమర్పణలో యువీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై 'భజే వాయు వేగం' రూపొందుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేసి, అభినందనలు తెలిపారు. ''ఫ్రెష్ కంటెంట్‌తో ప్రేక్షకులను ఎంగేజ్ చేసేలా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అన్నారు మేకర్స్.

థ్రిల్లింగ్ శబ్దం



● ఆది

హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'శబ్దం'. ఈ సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ మూవీలో సిమ్రాన్, లైలా లీడ్ రోల్స్‌లో నటించగా, 7జీ శివ నిర్మించారు. తెలుగు-తమిళ భాషల్లో రూపొందిన ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా 'శబ్దం' టీజర్‌ను హీరో వెంకటేశ్ షేర్ చేశారు. ''ఆది పినిశెట్టి- అరివళగన్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'వైశాలి' విజయం సాధించింది. ఇప్పుడు 'శబ్దం' వస్తోంది. ఈ సినిమాలోని చాలా సన్నివేశాలను పర్వతాలు, పర్యాటక ప్రదేశాల్లో చిత్రీకరించాం. అలాగే 120 ఏళ్ల క్రితం నాటి లైబ్రరీని కూడా నిర్మించాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

శబరిలో డ్యాన్స్ చేశాను

- వరలక్ష్మీ శరత్‌కుమార్



''తెలుగులో నేను చేసిన తొలి లేడీ ఓరియంటెడ్ చిత్రం 'శబరి'. ఇది థ్రిల్లర్ మూవీ. తన బిడ్డను కాపాడుకోవడం కోసం ఓ తల్లి ఏం చేసింది? అనేది ఈ చిత్రకథ. చాలా రోజుల తర్వాత ఈ మూవీలో డ్యాన్స్ చేశాను'' అని వరలక్ష్మీ శరత్‌కుమార్ అన్నారు. ఆమె లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకత్వంలో మహర్షి కూండ్ల సమర్పణలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో మే 3న ఈ సినిమా విడుదలవుతోంది. ఐదు భాషల ట్రైలర్స్ విడుదల వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. నటుడు వరుణ్ సందేశ్ తెలుగు ట్రైలర్‌ని, నిర్మాత మహేంద్రనాథ్ తమిళ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ''నిర్మాత గురించి ఆలోచించే నటి వరలక్ష్మి. 'శబరి' నా తొలి సినిమా. ఆదరించాలి'' అన్నారు మహేంద్రనాథ్ కూండ్ల.

రామాయణంకి ఎంతైనా కష్టపడతాను

- యశ్



● నమిత్ మల్హోత్రా, యశ్

''నమిత్, నేను కలిసి రామాయణంపై మూవీ చేస్తే బాగుంటుందని చాలా సార్లు అనుకున్నాం. కానీ, అంత పెద్ద సబ్జెక్టు తియ్యాలంటే అది మామూలు విషయం కాదు.. బడ్జెట్స్ కూడా సరిపోవు.. అందుకే నేను కూడా కో ప్రొడ్యూస్ చెయ్యాలనుకున్నాను. ఈ 'రామాయణం' కోసం ఎంతైనా కష్టపడతాను'' అన్నారు 'కేజీఎఫ్' ఫేమ్ హీరో యశ్. ఆయన నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, నిర్మాత నమిత్ మల్హోత్రా నిర్మాణ సంస్థ ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ కలిసి రామాయణం నేపథ్యంలో ఓ సినిమా నిర్మించనున్నాయి. ఈ చిత్రానికి నితీష్ తివారి దర్శకుడు. నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ– ''మన దేశ ప్రగతి అయిన రామాయణాన్ని తీయడంలో న్యాయం చేయగలను అనిపిస్తోంది'' అన్నారు. కాగా నితీష్ తివారి దర్శకత్వంలో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి 'రామాయణ్' చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రానికే నమిత్ మల్హోత్రా, యశ్ నిర్మాతలనే టాక్ వినిపిస్తోంది.

క్రైమ్ కామెడీ షురూ



● రాశీ సింగ్, రాజ్ తరుణ్

రాజ్ తరుణ్ హీరోగా కొత్త సినిమా ఆరంభమైంది. రమేశ్ కడుముల దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో రాశీ సింగ్ హీరోయిన్. గోవిందరాజు సమర్పణలో మురళీధర్ రెడ్డి, కేబీటీఎస్ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమానికి దర్శకులు ప్రవీణ్ సత్తార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, మారుతి క్లాప్ ఇవ్వగా, నక్కిన త్రినాథరావు తొలి సీన్‌కి దర్శకత్వం వహించారు. ''క్రైమ్ కామెడీగా ఈ మూవీ రూపొందనుంది. అక్టోబరులో సినిమా రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు రమేశ్ కడుముల, కేబీటీఎస్ శ్రీనివాస్. ''చాలా మంచి కథ ఇది'' అన్నారు రాజ్ తరుణ్. ఈ చిత్రానికి కెమెరా: ఆదిత్య జవ్వాడి, సంగీతం: శేఖర్ చంద్ర.

కిడ్నాప్ చేయడం ఓ కళ!



● శ్రద్ధా దాస్

సునీల్, శ్రద్ధాదాస్, చైతన్యారావు, మాళవికా సతీశన్ ప్రధాన పాత్రల్లో సంతోష్ కంభంపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'పారిజాత పర్వం'. 'కిడ్నాప్ ఈజ్ ఏన్ ఆర్ట్' (కిడ్నాప్ చేయడం ఓ కళ) అన్నది ట్యాగ్ లైన్. మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 19న రిలీజవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని యాంకర్ సుమ కనకాల రిలీజ్ చేశారు. ''పారిజాత పర్వం' క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్'' అని యూనిట్ పేర్కొంది.

మూకీ కావ్య



● కవిత

కవితా రాజ్‌పుత్, జమున, అంజలి, మధు ముఖ్య తారలుగా మధులింగాల దర్శకత్వం వహించిన చిత్రం 'కావ్య రాజ్'. గజగౌని దయానంద్ గౌడ్ నిర్మాత. ఈ చిత్రం ట్రైలర్‌ని ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ రిలీజ్ చేశారు. ''తెలంగాణ తొలి మూకీ చిత్రం 'కావ్య రాజ్'. కరీంనగర్‌కు చెందిన నటుడు, నిర్మాత, దర్శకుడు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, తెలంగాణ రాష్ట్రం నుండి హిందీ చిత్ర పరిశ్రమను ఏలిన పైడి జైరాజ్‌గారికి ఈ సినిమాను అంకితమిస్తున్నాను'' అన్నారు గజగౌని దయానంద్.

వినోదం.. సందేశం



● గణేశ్, ఆయూషి

గణేశ్, ఆయూషి పటేల్ జంటగా, పోసాని కృష్ణమురళి కీలక పాత్రలో నటించిన చిత్రం 'కల్లు కాంపౌండ్ 1995'. ప్రవీణ్ జెట్టి దర్శకత్వంలో బుర్రా మల్లేష్ గౌడ్ (బొట్టు), హారిక జెట్టి, పిట్ల విజయలక్ష్మి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ని దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఆవిష్కరించి... ''వాస్తవ ఘటన ఆధారంగా తీసిన ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''వినోదం, సందేశంతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది'' అన్నారు ప్రవీణ్ జెట్టి.

సాక్షి **బిజినెస్**
శనివారం
13-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	793	74,245
నిఫ్టీ ▽	234	22,519

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,167	▽	277
డోజోన్స్	37,984	▽	475
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,996	△	72
డాక్స్	17,930	▽	24
షాంఘై	3,019	▽	15
నికాయ్	39,524	△	81

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	73,174
బంగారం (99.5 స్వచ్ఛత)	72,881
వెండి (కేజీ)	83,819

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.04	84.05
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.22	106.77
€	యూరో	ఎస్‌బీఐ	89.38	91.74
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.64	55.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.98	55.90
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.51	64.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.32	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.47

మార్చిలో రిటైల్ ధరలు డౌన్

5 నెలల కనిష్టానికి సీపీఐ



న్యూఢిల్లీ: ఆహారోత్పత్తుల ధరలు నెమ్మదించడంతో మార్చిలో రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) ఐదు నెలల కనిష్టానికి తగ్గింది. 4.85%గా నమోదైంది. తద్వా రా రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించుకున్న 4% లక్ష్యం దిశగా దిగి వస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడైంది. వీటి ప్రకారం గతేడాది మార్చిలో ద్రవ్యోల్బణం 5.66 శాతంగా ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో 5.09 శాతంగా ఉంది. చివరిసారిగా 2023 అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.87% స్థాయిలో నమోదైంది. ఎన్‌ఎస్‌వో డేటా ప్రకారం ఆహారోత్పత్తుల ధరల పెరుగుదల 8.66% (ఫిబ్రవరి) నుంచి మార్చిలో 8.52 శాతానికి దిగి వచ్చింది. గుడ్లు, సుగంధ ద్రవ్యాలు, పప్పు దినుసులు తదితర రేట్లు నెలవారీగా కొంత తగ్గాయి.


4 నెలల గరిష్టానికి ఐఐపీ..

మైనింగ్ రంగం ఊతంతో పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) వృద్ధి ఫిబ్రవరిలో మరింత పుంజుకుంది. నాలుగు నెలల గరిష్ట స్థాయి 5.7 శాతంగా నమోదైంది. గతేడాది ఫిబ్రవరిలో ఇది 6 శాతంగా ఉంది. చివరిసారిగా అక్టోబర్‌లో అత్యధికంగా 11.9 శాతంగా ఉన్న ఐఐపీ వృద్ధి నవంబర్‌లో 2.5 శాతానికి పరిమితమైంది. ఆ తర్వాత డిసెంబర్‌లో 4.2 శాతం, జనవరిలో 4.1 శాతంగా నమోదైంది. 2023-24 ఏప్రిల్-ఫిబ్రవరి మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి 5.6 శాతం నుంచి 5.9 శాతానికి చేరింది. తాజా డేటా ప్రకారం ఫిబ్రవరిలో మైనింగ్ ఉత్పత్తి వృద్ధి 4.8 శాతం నుంచి 8 శాతానికి చేరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	411-00
చిత్తూరు	468-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	396-00
విజయవాడ	396-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	385-00
వరంగల్	387-00
రిటైల్ ధర	4.45

మరోసారి టీసీఎస్



- క్యూ4లో నికర లాభం రూ. 12,434 కోట్లు
- 2023-24 లాభం రూ. 45,908 కోట్లు
- షేరుకి రూ. 28 డివిడెండ్

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవలకు దేశంలో నంబర్ వన్.. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) మరోసారి పటిష్ట ఫలితాలు సాధించింది. మార్చితో ముగిసిన గతేడాది (2023-24)తోపాటు చివరి త్రైమాసికంలోనూ ప్రోత్సాహకర పనితీరు ప్రదర్శించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ4 (జనవరి-మార్చి)లో రూ. 12,434 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో సాధించిన రూ. 11,392 కోట్లతో పోలిస్తే 9 శాతం అధికం. త్రైమాసిక ప్రాతిపదికన(రూ. 11,058 కోట్లు) సైతం 12 శాతంపైగా వృద్ధి నమోదైంది. ఇందుకు మెరుగుపడిన మార్జిన్లు, దేశీ బిజినెస్‌లో వృద్ధి దోహదపడ్డాయి. మొత్తం ఆదాయం వార్షికంగా 3.5 శాతం పుంజుకుని రూ. 61,237 కోట్లను తాకింది. అంతక్రితం రూ. 59,162 కోట్ల టర్నోవర్ సాధించింది. కంపెనీ బోర్డు షేరుకి రూ. 28 చొప్పున వాటాదారులకు మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

పూర్తి ఏడాదిలో..

గత ఆర్థిక సంవత్సరానికి టీసీఎస్ 9 శాతం అధికంగా రూ. 45,908 కోట్ల నికర లాభం ప్రకటించింది. నిర్వహణ లాభ మార్జిన్లు 1.5 శాతం బలపడి 26 శాతాన్ని తాకాయి. మొత్తం ఆదాయం 7% వృద్ధితో రూ. 2,40,893 కోట్లయ్యింది. టర్నోవర్‌లో అతిపెద్ద మార్కెట్ ఉత్తర అమెరికా వాటా 2.3% తగ్గి 50 శాతానికి పరిమితమైంది. 24.6% నిర్వహణ మార్జిన్లు సాధించింది. దేశీ బిజినెస్ 38% ఎగసింది. దీంతో మొత్తం ఆదాయంలో దేశీ వాటా 5% నుంచి 6.7 శాతానికి బలపడింది. 40ఏళ్లపాటు బాధ్యతలు నిర్వహించిన సీవోవో ఎన్.గణపతి సుబ్రమణ్యం వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్నట్లు కంపెనీ సీఈవో కృతివాసన్ పేర్కొన్నారు. అయితే కొత్త సీవోవోగా ఎవరినీ ఎంపిక చేయబోమని, సీనియర్లకు బాధ్యతలు పంపిణీ చేస్తామని తెలియజేశారు. ఉద్యోగులకు 4.7% వార్షిక వేతన పెంపును చేపట్టనున్నట్లు హెచ్‌ఆర్ చీఫ్ మిలింద్ లక్కడ్ వెల్లడించారు. అత్యుత్తమ పనితీరు చూపినవారికి రెండంకెలలో పెంపు ఉంటుందని తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ 0.5% పెరిగి రూ. 4,005 వద్ద ముగిసింది.



సీవోవో గణపతితో సీఈవో కృతివాసన్(ఎడమ)

అనిశ్చితిలోనూ


లాభాల మార్జిన్, ఆర్డర్ బుక్ సమర్థవంత ఎగ్జిక్యూషన్, పటిష్ట బిజినెస్ మోడల్ కంపెనీ విలువను తెలియజేస్తున్నాయి. ప్రపంచ అనిశ్చితిలోనూ కీలకమైన, ప్రాధాన్యతగల అంశాలలో మెరుగైన సేవలను అందించాం. విభిన్న ఆఫరింగ్స్, కొత్తతరహా సామర్థ్యాలు, నాయకత్వ సలహాల ద్వారా కస్టమర్లకు మద్దతిచ్చాం.- కె.కృతివాసన్, సీఈవో, ఎండీ, టీసీఎస్

ఇతర విశేషాలు

- క్యూ4లో కంపెనీ చరిత్రలోనే గరిష్టస్థాయిలో 13.2 బిలియన్ డాలర్ల ఆర్డర్లు పొందింది.
- క్యూ4లో యూకే బీమా దిగ్గజం అవైవాతో 15 ఏళ్ల కాలానికి మెగా డీల్‌ను సాధించింది.
- వరుసగా మూడు త్రైమాసికాలలో మొత్తం 13,249 మంది సిబ్బంది తగ్గారు.
- పూర్తి ఏడాదికి 42.7 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ కుదుర్చుకుంది.
- ఉద్యోగ వలసల (అట్రిషన్) రేటు 13.3 శాతం నుంచి 12.5 శాతానికి దిగివచ్చింది.
- క్యూ4లో సుమారు 2,000 మంది తగ్గడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 6,01,546కు చేరింది.
- 2004లో టీసీఎస్ లిస్టింగ్ తదుపరి గతేడాదిలోనే తొలిసారి ఉద్యోగుల సంఖ్యలో కోతపడింది.

రికార్డుల ర్యాలీకి బ్రేక్

- తెరపైకి ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా ఆందోళనలు
- వారాంతాన వెల్లువెత్తిన విక్రయాలు
- 75 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి నష్టం 234 పాయింట్లు
- రూ.2.52 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు ఒక శాతానికి పైగా పతనమయ్యాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం భారీగా పెరగడంతో ఈ జూన్‌లోనూ ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై సందేహాలు తలెత్తాయి. ఫిబ్రవరి పారిశ్రామికోత్పత్తి, మార్చి ద్రవ్యోల్బణ డేటాతో పాటు ఐటీ దిగ్గజం టీసీఎస్ క్యూ4 ఆర్థిక ఫలితాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఈక్విటీ మార్కెట్ జీవితకాల గరిష్టం వద్ద ట్రేడవుతుండటంతో అధిక వాల్యుయేషన్ల ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో ఇన్వెస్టర్లు పలు రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. సెన్సెక్స్ 793 పాయింట్లు నష్టపోయి 74,245 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 234 పాయింట్లు పతనమై 22,519 వద్ద నిలిచింది. సూచీలు ఉదయం స్వల్ప నష్టాలతో మొదలయ్యాయి. అమ్మేవారు తప్ప కొనేవారు లేకపోవడంతో మరింత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 849 పాయింట్లు క్షీణించి 74,189 వద్ద, నిఫ్టీ 250 పాయింట్లు క్షీణించి 22,504 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అన్ని రంగాల్లోనూ విక్రయాలు వెల్లువెత్తాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.8,027 కోట్ల ఈక్విటీలు అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.6,341 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు అరశాతం నుంచి ఒకశాతం మేర నష్టపోయాయి.

- రంగాల వారీగా ఆయిల్అండ్‌గ్యాస్ 1.28%, యుటిలిటీ 1.02%, రియల్టీ, కమోడిటీ, ఫైనాన్స్ సూచీలు 1% చొప్పున నష్టపోయాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.60%, 0.50% చొప్పున నష్టపోయాయి.
- రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ షేరు 13% పతనమై రూ.198 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 20% క్షీణించి రూ.182 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు(డీఏఎంఈపీఎల్) అనుకూలంగా గతంలో వచ్చిన రూ.8,000 కోట్ల ఆర్బిట్రేషన్ అవార్డును సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఈ షేరు రెండోరోజూ లోయర్ సర్క్యూట్ తాకింది.
- నష్టాల మార్కెట్లోనూ భారతీ హెక్సాకామ్ లిస్టింగ్ విజయవంతమైంది. ఇష్యూ ధర (రూ.570)తో పోలిస్తే బీఎస్‌ఈలో 32% ప్రీమియంతో రూ.755 వద్ద మొదలైంది. నష్టాల మార్కెట్లో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో 54% బలపడి రూ.880 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 43% లాభంతో రూ.814 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.40,687 కోట్లుగా నమోదైంది.
- సెన్సెక్స్ 793 పాయింట్ల పతనంతో బీఎస్‌ఈలో రూ.2.52 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.399 లక్షల కోట్లకు దిగివచ్చింది.

వొడాఫోన్ భారీ ఎఫ్‌పీవో

- రూ. 18,000 కోట్ల సమీకరణ
- 18 నుంచి ఇష్యూ ప్రారంభం



న్యూఢిల్లీ: ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్న టెలికం సంస్థ వొడాఫోన్-ఐడియా (వీఐ) భారీ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో)కి తెరతీయనుంది. దీని ద్వారా రూ. 18,000 కోట్లు సమీకరించనుంది. ఏప్రిల్ 18-22 మధ్య ఎఫ్‌పీవో ఉండనుంది. ఇందుకోసం షేరు ధర రూ. 10-11 శ్రేణిలో ఉంటుంది. ఇటీవల ప్రమోటరు సంస్థకు ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపునకు సంబంధించి నిర్ణయించిన రూ. 14.87 రేటుతో పోలిస్తే ఇది సుమారు 26 శాతం తక్కువ. కనీసం 1,298 షేర్లకు బిడ్ చేయాల్సి ఉంటుంది. ఎఫ్‌పీవో ద్వారా సేకరించిన నిధులను 4జీ నెట్‌వర్క్ విస్తరణ, 5జీ నెట్‌వర్క్‌ల ఏర్పాటుతో పాటు పన్నులు, బాకీలు చెల్లించడానికి వొడాఫోన్ ఐడియా వినియోగించుకోనుంది. 2020లో యస్ బ్యాంక్ రూ. 15,000 కోట్ల ఫాలో ఆన్ తర్వాత ఇదే అతి పెద్ద ఎఫ్‌పీవో కానుంది. బ్రిటన్ టెలికం సంస్థ వొడాఫోన్ గ్రూప్ భారత్‌లో తన వ్యాపారాన్ని ఐడియా సెల్యులార్‌తో విలీనం చేయడం ద్వారా 2018లో వొడాఫోన్ ఐడియా ఏర్పడింది. ప్రస్తుతం రూ. 2.1 లక్షల కోట్ల రుణ భారంతో మనుగడ కోసం సతమతమవుతోంది. శుక్రవారం వొడాఫోన్-ఐడియా షేరు రూ. 12.96 వద్ద క్లోజయ్యింది.

జీక్యూజీ, ఎస్‌బీఐ ఎంఎఫ్ ఆసక్తి..

ఈ ఎఫ్‌పీవోలో దాదాపు 800 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 6,500 కోట్లు) వరకు ఇన్వెస్ట్ చేయాలని జీక్యూజీ పార్ట్‌నర్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మ్యూచువల్ ఫండ్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్‌ఆర్‌ఐ రాజీవ్ జైన్ సారథ్యంలోని అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ జీక్యూజీ పార్ట్‌నర్స్ 500 మిలియన్ డాలర్లు, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ 200-300 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

రూ.50 వేల కోట్ల టర్నోవర్‌ను దాటిన మలబార్

హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ రూ.50 వేల కోట్లను మించి రికార్డు వార్షిక టర్నోవర్ సాధించిందని సంస్థ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ తెలిపారు. సోమాజిగూడ మలబార్ షోరూమ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ''గ్లోబల్ ర్యాంకింగ్ ఆఫ్ లగ్జరీ ప్రోడక్ట్స్‌లో మలబార్ గ్రూప్ 19వ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరం రూ.51,218 కోట్ల వార్షిక రిటైల్ గ్లోబల్ టర్నోవర్ సాధించింది'' అన్నారు. వ్యాపార విస్తరణకు ప్రణాళికల్లో భాగంగా దేశ, విదేశాల్లో వచ్చే ఏడాదిలో 100 కొత్త షోరూములు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తద్వారా అదనంగా 7 వేల మందికి ఉపాధి కల్పిస్తామని అహమ్మద్ పేర్కొన్నారు.

MALABAR GOLD & DIAMONDS

సాక్షి స్పోర్ట్స్



భారత్‌ను గెలిపించిన అంకిత-ప్రార్థన జోడీ

చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా జోన్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టుకు మూడో విజయం లభించింది. దక్షిణ కొరియాతో శుక్రవారం జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-1తో గెలిచింది. తొలి మ్యాచ్‌లో రుతుజా భోస్లే 6-2, 6-2తో సోహున్ పార్క్‌పై నెగ్గి భారత్‌కు 1-0తో ఆధిక్యం అందించింది. రెండో మ్యాచ్‌లో అంకిత రైనా 2-6, 3-6తో సుజియోంగ్ జాంగ్ చేతిలో ఓడిపోవడంతో స్కోరు 1-1తో సమమైంది. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్‌లో అంకిత -ప్రార్థన తొంబారే ద్వయం 6-4, 6-4తో దబిన్ కిమ్-సోహున్ పార్క్ జంటను ఓడించి భారత్‌కు విజయాన్ని ఖరారు చేసింది. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో ప్రస్తుతం చైనా టాప్ ర్యాంక్‌లో, భారత్ రెండో ర్యాంక్‌లో ఉన్నాయి. నేడు జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్‌తో భారత్, కొరియాతో చైనా పోటీపడతాయి. టాప్-2లో నిలిచిన జట్లు వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధిస్తాయి.



ఫ్రేజర్

లక్నో జోరుకు బ్రేక్

- 6 వికెట్ల తేడాతో ఢిల్లీ గెలుపు
- కుల్దీప్ మాయాజాలం
- ఫ్రేజర్, పంత్ మెరుపులు

లక్నో: ఐపీఎల్‌లో హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ బ్రేక్ వేసింది. ముందుగా బౌలర్లు, లక్ష్యఛేదనలో బ్యాటర్లు బాధ్యత కనబరచడంతో పంత్ బృందం 6 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట లక్నో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. ఆయుశ్ బదోని (35 బంతుల్లో 55 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో రాణించాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 3, పేసర్ ఖలీల్ అహ్మద్ 2 వికెట్లు తీశారు. తర్వాత ఢిల్లీ 18.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి గెలిచింది. తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న ఆస్ట్రేలియా యువతార జేక్ ఫ్రేజర్ మెగర్క్ (35 బంతుల్లో 55; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), రిషభ్ పంత్ (24 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగి ఢిల్లీ గెలుపుతో కీలకపాత్ర పోషించారు.

ఆదుకున్న బదోని

ఆరంభంలో ధాటిగా ఆడిన లక్నో జట్టు పవర్‌ప్లేలో 57/2 స్కోరు చేశాక కుల్దీప్ ఉచ్చులో పడింది. వరుస బంతుల్లో స్టొయినిస్ (8), పూరన్ (0)లను కుల్దీప్ అవుట్ చేశాడు. ఆ తర్వాత రాహుల్ (22 బంతుల్లో 39, 5 ఫోర్లు, 1 సిక్స్), దీపక్ హుడా (10), కృనాల్ పాండ్యా (3)ల వైఫల్యంతో 94 పరుగులకే 7 వికెట్లను కోల్పోయింది. ఈ దశలో ఆయుశ్ బదోని... అర్షద్ (16 బంతుల్లో 20 నాటౌట్)తో కలిసి 8వ వికెట్‌కు 73 పరుగులు జోడించాడు.

సిక్సర్లతో అలరించి...

ఢిల్లీ జట్టు ఆరంభంలోనే వార్నర్ (8), పృథ్వీషా (22 బంతుల్లో 32; 6 ఫోర్లు)లను కోల్పోయింది. అయితే ఫ్రేజర్, రిషభ్ పంత్ లక్నో బౌలర్ల భరతం పట్టి ఢిల్లీని లక్ష్యంవైపు నడిపించారు. కృనాల్ 13వ ఓవర్లో ఫ్రేజర్ మూడు వరుస సిక్స్‌లు బాదడంతో ఆ ఓవర్లో 21 పరుగులు వచ్చాయి. 31 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయ్యింది. జట్టు స్కోరు 140 వద్ద ఫ్రేజర్‌ను నవీనుల్ పెవిలియన్ చేర్చగా మూడో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరుసటి ఓవర్లోనే పంత్‌ను బిష్ణోయ్ అవుట్ చేయగా, మిగతా లాంఛనాన్ని స్టబ్స్ (15 నాటౌట్), హోప్ (11 నాటౌట్) పూర్తి చేశారు.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఖలీల్ 19; రాహుల్ (సి) పంత్ (బి) కుల్దీప్ 39; పడిక్కల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఖలీల్ 3; స్టొయినిస్ (సి) ఇషాంత్ (బి) కుల్దీప్ 8; పూరన్ (బి) కుల్దీప్ 0; హుడా (సి) వార్నర్ (బి) ఇషాంత్ 10, బదోని (నాటౌట్) 55; కృనాల్ (సి) పంత్ (బి) ముకేశ్ 3; అర్షద్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 167. వికెట్ల పతనం** : 1-28; 2-41, 3-66, 4-66, 5-77, 6-89, 7-94. **బౌలింగ్:** ఖలీల్ 4-0- 41-2, ఇషాంత్ 4-0-36-1, ముకేశ్ 4-0-41-1, అక్షర్ 4-0-26-0, కుల్దీప్ 4-0-20-3. **ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్:** పృథ్వీషా (సి) పూరన్ (బి) బిష్ణోయ్ 32; వార్నర్ (బి) యశ్ 8; ఫ్రేజర్ (సి) అర్షద్ (బి) నవీనుల్ 55; పంత్ (స్టంప్డ్) రాహుల్ (బి) బిష్ణోయ్ 41; స్టబ్స్ (నాటౌట్) 15; హోప్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (18.1 ఓవర్లలో 4 వికెట్లకు)** 170. **వికెట్ల పతనం:** 1-24, 2- 63, 3-140, 4-146. **బౌలింగ్:** అర్షద్ 3.1-0 -34-0, నవీనుల్ 3-0-24-1, యశ్ ఠాకూర్ 4-0-31-1, కృనాల్ 3-0-45-0, రవి బిష్ణోయ్ 4-0-25-2, స్టొయినిస్ 1-0-10-0.

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × రాజస్తాన్
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	5	4	1	8	0.871
కోల్‌కతా	4	3	1	6	1.528
చెన్నై	5	3	2	6	0.666
లక్నో	5	3	2	6	0.436
హైదరాబాద్	5	3	2	6	0.344
గుజరాత్	6	3	3	6	-0.637
ముంబై	5	2	3	4	-0.073
పంజాబ్	5	2	3	4	-0.196
ఢిల్లీ	6	2	4	4	-0.975
బెంగళూరు	6	1	5	2	-1.124

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

కాంస్య పతక బౌట్‌లలో ఆకాశ్, అనిరుధ్ ఓటమి



బిష్కెక్ (కిర్గిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల రెండో రోజు భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లు ఒక్క పతకం కూడా గెలవలేకపోయారు. ఇద్దరు రెజ్లర్లు ఆకాశ్ దహియా (61 కేజీలు), అనిరుధ్ కుమార్ (125 కేజీలు) కాంస్య పతక బౌట్‌లలో ఓడిపోయారు. ఆకాశ్ 7-18 పాయింట్ల తేడాతో ఎంఖ్‌బోల్డ్ ఎంఖ్‌బట్ (మంగోలియా) చేతిలో... అనిరుధ్ 2-8 పాయింట్ల తేడాతో షామిల్ షరిపోవ్ (బహ్రెయిన్) చేతిలో ఓటమి పాలయ్యారు. భారత ఇతర రెజ్లర్లు యశ్ తుషీర్ (74 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో, సందీప్ సింగ్ మాన్ (86 కేజీలు), వినయ్ (92 కేజీలు) క్వాలిఫయింగ్ రౌండ్ బౌట్‌లలో పరాజయం పాలయ్యారు. ఇదే టోర్నీలో నేటి నుంచి మహిళల ఫ్రీస్టయిల్ బౌట్‌లు మొదలవుతాయి. శనివారం ఐదు వెయిట్ కేటగిరీల్లో (శివాని పవార్-50 కేజీలు; తమన్నా-55 కేజీలు; పుష్పా యాదవ్-59 కేజీలు; రాధిక-68 కేజీలు; ప్రియా-76 కేజీలు) బౌట్‌లు జరుగుతాయి.

చెఫ్ డి మిషన్‌గా వైదొలగిన మేరీకోమ్



న్యూఢిల్లీ: ఆరుసార్లు ప్రపంచ చాంపియన్, భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ పారిస్ ఒలింపిక్స్‌లో చెఫ్ డి మిషన్‌గా వ్యవహరించలేనని తన బాధ్యతల నుంచి వైదొలగింది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉషకు ఆమె లేఖ రాసింది. 'దేశానికి సేవ చేయడాన్ని నేనెప్పుడు గౌరవంగా భావిస్తాను. మానసికంగానూ సిద్ధంగా ఉంటా. కానీ... వ్యక్తిగత కారణాల వల్ల ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో గురుతర బాధ్యతలు నిర్వర్తించలేకపోతున్నాను. అందుకే ఆ పదవికి రాజీనామా చేస్తున్నా' అని 41 ఏళ్ల ఈ మణిపూర్ మహిళా బాక్సర్ లేఖలో వివరించింది. దీనిపై స్పందించిన పీటీ ఉష... మేరీకోమ్ పదవి నుంచి తప్పుకోవడం బాధాకరమే అయినా... ఆమె నిర్ణయాన్ని, వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తామని తెలిపారు. మేరీ స్థానంలో మరొకరిని నియమిస్తామని ఉష చెప్పారు. పారిస్ ఒలింపిక్స్ ఈ ఏడాది జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి.

సత్యన్-మనిక జోడీకి నిరాశ

హవిరోవ్ (చెక్ రిపబ్లిక్): ప్రపంచ మిక్స్‌డ్ డబుల్స్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నీలో సత్యన్ జ్ఞానశేఖరన్-మనిక బత్రా (భారత్) జోడీ నిరాశ పరిచింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 18వ స్థానంలో ఉన్న సత్యన్-మనిక ద్వయం శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో 9-11, 9-11, 9-11, 11-7, 8-11తో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 153వ స్థానంలో ఉన్న చూంగ్ జావెన్-లిన్ కరెన్ (మలేసియా) జంట చేతిలో ఓడిపోయింది. ఈ ఓటమితో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత జోడీకి పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కే అవకాశాలు ఆవిరయ్యాయి. చివరి అవకాశమైన వరల్డ్ ర్యాంకింగ్ ఆధారంగా కూడా సత్యన్-మనిక జోడీకి పారిస్ ఒలింపిక్స్ బెర్త్ లభించే అవకాశాలు కనిపించడంలేదు.



హంపి గేమ్ 'డ్రా'

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఏడో రౌండ్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్స్ కోనేరు హంపి, వైశాలిలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ప్రపంచ మాజీ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్ అనా ముజిచుక్ (ఉక్రెయిన్)తో జరిగిన గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి హంపి 40 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. లె టింగ్జీ (చైనా)తో జరిగిన గేమ్‌లో తమిళనాడు అమ్మాయి వైశాలి 36 ఎత్తుల్లో ఓడిపోయింది. ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్స్ ప్రజ్ఞానంద, విదిత్ తమ గేమ్‌లను 'డ్రా'గా ముగించగా... దొమ్మరాజు గుకేశ్‌కు ఓటమి ఎదురైంది. ప్రజ్ఞానంద-ఫాబియానో కరువానా (అమెరికా) గేమ్ 41 ఎత్తుల్లో... విదిత్-నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్) గేమ్ 51 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి. అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌లో గుకేశ్ 40 ఎత్తుల్లో ఓడిపోయాడు. ఏడో రౌండ్ తర్వాత హంపి, వైశాలి 2.5 పాయింట్లతో ఉమ్మడిగా ఐదో ర్యాంక్‌లో ఉన్నారు. ఓపెన్ విభాగంలో గుకేశ్, ప్రజ్ఞానంద 4 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో ఉన్నారు.



రిటైర్మెంట్ ఆలోచన లేదు

2027 వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్నా ● భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్య



న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ఇంకొన్నాళ్లు కొనసాగిస్తానని... వీడ్కోలు తీసుకునే ఆలోచన లేదని... 2027 వన్డే ప్రపంచకప్ కూడా ఆడాలనే ప్రణాళికలు ఉన్నాయని భారత కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ఒకే ఒక్క చెడ్డ రోజు భారత జట్టుకు టైటిల్ దూరం చేసిందని చెప్పాడు. 'యూ ట్యూబ్' చాట్ షోలో అతను పంచుకున్న విషయాలు అతని మాటల్లోనే... 'అసలు రిటైర్మెంట్ పలకాలనే ఆలోచనే లేదిపుడు. కానీ జీవితం ఎక్కడికి తీసుకెళుతుందో ఎవరికి తెలుసు. ఇప్పుడైతే నేను బాగా ఆడుతున్నా. ఇంకొన్నేళ్లు ఆటలో కొనసాగాలని గట్టిగా కోరుకుంటున్నా. ప్రపంచకప్ గెలవాలనే కసితోనే ఉన్నాను. నా దృష్టిలో వన్డే ప్రపంచకప్పే అసలైన ప్రపంచకప్. మేమంతా 50 ఓవర్ల వరల్డ్‌కప్‌లు చూసే పెరిగాం. వచ్చే ఏడాది ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఉంది. లార్డ్స్ (ఇంగ్లండ్)లో జరిగే తుదిపోరుకు మేం అర్హత సాధిస్తామనే ఆశిస్తున్నా'నని వివరించాడు. జూన్‌లో వెస్టిండీస్, అమెరికాల్లో జరిగే టి20 ప్రపంచకప్‌లో టీమిండియాకు రోహితే సారథ్యం వహించనున్నాడు.

మళ్లీ ఓడిన భారత్



పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత పురుషుల హాకీ జట్టు ఖాతాలో వరుసగా నాలుగో పరాజయం చేరింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో టీమిండియా 1-3 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (12వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. ఆస్ట్రేలియా జట్టుకు జెరెమి హేవార్డ్ (19వ, 47వ ని.లో) రెండు గోల్స్, జేక్ వెల్చ్ (54వ ని.లో) ఒక గోల్ అందించారు. ఈ సిరీస్‌లో చివరిదైన ఐదో మ్యాచ్ నేడు జరుగుతుంది.



నాడు నీళ్లు నేడు రాళ్లు

గార్ల (మహబూబాబాద్ జిల్లా): మహబూబాబాద్ జిల్లా గార్ల మండల సమీపంలోని పాకాల ఏరు వర్షాకాలంలో చెక్‌డ్యాం పైనుంచి పొంగిపొర్లింది. నేడు ఎండిపోయి బండలు తేలి వెలవెలబోతోంది. మరికొద్దిరోజుల్లో గార్ల మండలానికి తాగునీటి ఎద్దడి ప్రమాదం పొంచి ఉందని అధికారులు ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తున్న పాకాల ఏరు

ప్రస్తుతం ఎండిపోయి రాళ్లు తేలి కనిపిస్తున్న పాకాల ఏరు



క్లుప్తంగా...

బక్రీద్‌కు 'తోఫా'!

కోడ్ నేపథ్యంలో రంజాన్‌కు పంపిణీ నిలిపివేత

సాక్షి, హైదరాబాద్: రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు పంపిణీ చేయాల్సిన తోఫాను బక్రీద్ సమయంలో ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. రంజాన్ నేపథ్యంలో ముస్లింలకు ఇచ్చే గిఫ్ట్‌ప్యాక్ (వస్త్రాలు)ల కోసం 4.50 లక్షల కిట్లు ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ తోఫా పంపిణీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ఎన్నికల సంఘానికి గత నెలలోనే లేఖ రాసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనతో కూడిన లేఖ గతనెల 23న తెలంగాణ ఎన్నికల కమిషన్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘానికి వెళ్లింది. కానీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనుమతిని నిరాకరిస్తున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సంజయ్‌కుమార్ గత నెల 30నే తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారికి లిఖిత పూర్వకంగా స్పష్టం చేశారు. దీంతో రంజాన్ తోఫా పంపిణీతోపాటు జిల్లా కేంద్రాల్లో ఇఫ్తార్ పార్టీల నిర్వహణను ప్రభుత్వం నిలిపివేసింది. ఈ నేపథ్యంలో ఆ తోఫాను ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బక్రీద్ సందర్భంగా ఇచ్చే యోచనలో సీఎం రేవంత్ ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలంటున్నాయి.

మల్లన్న సేవలో సీఎస్ శాంతికుమారి



తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో ఆలయ అధికారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వార్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన ఆమెకు రాజగోపురం వద్ద ఈవో డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం సీఎస్ శాంతికుమారి మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్దనున్న ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగా, ఈవో స్వామి వారి జ్ఞాపిక, శేషవస్త్రాలు, ప్రసాదాలతో సత్కరించారు.

ఐఆర్ఎఫ్ఎం డీజీగా అపర్ణ గార్గ్



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఐఆర్ఎఫ్ఎం) డైరెక్టర్ జనరల్‌గా ఐఆర్ఏఎస్ అధికారిణి అపర్ణ గార్గ్ బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్ 1987 బ్యాచ్‌కు చెందిన ఆమె ఇప్పటివరకు బెంగళూరులోని రైల్ వీల్ ఫ్యాక్టరీ ప్రధాన ఆర్థిక సలహాదారుగా వ్యవహరించారు. అంతకు ముందు మైసూరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా, దక్షిణ రైల్వే, పశ్చిమ రైల్వే, నైరుతి రైల్వేలలో 35 ఏళ్ల పాటు పలు హోదాల్లో పనిచేశారు. హైదరాబాద్ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సహా పలు విదేశీ సంస్థల్లో శిక్షణ పొందారు.

ఆ ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలి

- ఎస్సీ గురుకులాల్లో నైట్ స్టడీ సర్క్యులర్‌పై టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో ఉపాధ్యాయులకు రాత్రి విధులు కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ బాలరాజు, ఎస్ దయాకర్‌లు సొసైటీ కార్యదర్శిని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రాత్రిపూట మొత్తం మేల్కొని నైట్ స్టే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు మరుసటి రోజు ఏవిధంగా విధులు చేపడతారని వారు ప్రశ్నించారు. ఉపాధ్యాయులు రాత్రి విధులు నిర్వర్తించడం వల్ల వారి ఆరోగ్యంపై ప్రభావం చూపడంతో పాటు విద్యార్థులకు మరింత నష్టం జరుగుతుందని వివరించారు.

ఆమే సూత్రధారి.. పాత్రధారి

కవిత కస్టడీ పిటిషన్‌లో సీబీఐ ఆరోపణలు ● భూ కొనుగోలు డీల్ ద్వారా ఈ విషయం వెల్లడైంది

- లిక్కర్ స్కామ్‌లో ఆమె బెదిరింపులకు పాల్పడ్డారు
- ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలన్న దర్యాప్తు సంస్థ
- కవితను అన్యాయంగా అరెస్టు చేశారన్న ఆమె న్యాయవాది
- మూడు రోజులు కస్టడీకి అనుమతించిన న్యాయమూర్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఒకానొక సమయంలో బెదిరింపులకు కూడా పాల్పడ్డారంటూ సీబీఐ సంచలన ఆరోపణలు చేసింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన శరత్‌చంద్రారెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డిలను కవిత భయపెట్టినట్లు కోర్టుకు తెలిపింది. కుంభకోణంలో కవితను సూత్రధారి, పాత్రధారిగా పేర్కొంది. మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి కవితను ఐదు రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరింది. సీబీఐ వాదనలతో ఏకీభవించిన రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా మూడు రోజులపాటు కవితను సీబీఐ కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు తిరిగి కవితను కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు.

విజయ్‌నాయర్‌కు హవాలా రూపంలో డబ్బులు

లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఈడీ కేసులో తీహార్ జైలులో ఉన్న కవితను శుక్రవారం అధికారులు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ఐదు రోజుల పాటు కవిత కస్టడీ కోరుతూ సీబీఐ, సీబీఐ అరెస్టును సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను న్యాయమూర్తి విచారించారు. ఈడీ తరఫు న్యాయవాది పంకజ్ వాదనలు వినిపిస్తూ.. 'లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన దర్యాప్తులో అనేక సంచలన విషయాలు బహిర్గతమయ్యాయి. ఈ కేసులో ఒక నిందితుడైన విజయ్ నాయర్ (కేజ్రీవాల్ అనుచరుడు)కు రూ.90 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు మరో నిందితుడైన దినేష్ అరోరా ద్వారా హవాలా రూపంలో చెల్లించారు. ఈ నేరపూరిత కుట్రకు అనుగుణంగా ఇండో స్పిరిట్స్‌లో 65 శాతం వాటా, రూ.29.29 కోట్లను సౌత్‌గ్రూపులోని నిందితులకు బదిలీ చేశారు. గోవా ఎన్నికల సమయంలో ఆప్ ఎన్నికల ప్రచారం నిమిత్తం రూ.44.45 కోట్లు వినియోగించారు. కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబు ఫోన్ వాట్సాప్ చాట్‌లు, భూ కొనుగోలు ముసుగులో సొమ్ము లావాదేవీలు బహిర్గతం అయ్యాయి. ఆమ్ ఆద్మీ పార్టీకి రూ.100 కోట్లు వసూలు చేసి ఇవ్వడానికి పన్నిన నేరపూరిత కుట్రలో కల్వకుంట్ల కవిత కీలక పాత్రధారిగా ఉన్నట్లు సదరు భూ కొనుగోలు డీల్ ద్వారా వెల్లడైంది..' అని చెప్పారు.



కవితను తరలిస్తున్న సీబీఐ అధికారులు

కవితతో మద్యం వ్యాపారి భేటీ

దక్షిణాదికి చెందిన ఓ మద్యం వ్యాపారి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను కలిశారని వెల్లడైంది. ఢిల్లీలో మద్యం వ్యాపారం చేయడానికి తనకు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రిని వ్యాపారి కోరగా.. ఎమ్మెల్సీ కవిత సంప్రదిస్తారని కేజ్రీవాల్ చెప్పినట్లు వెలుగులోకి వచ్చింది. తర్వాత సదరు వ్యాపారి కవితతో ఆమె నివాసంలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలోనే ఆమ్ ఆద్మీ పార్టీకి రూ.100 కోట్లు సమకూర్చాల్సి ఉందని, దాంట్లో రూ.50 కోట్లు సదరు వ్యాపారి అందజేయాల్సి ఉంటుందని, తద్వారా మీరు వ్యాపార భాగస్వామి అవుతారని కవిత ఆయనకు తెలిపారు. అనంతరం బుచ్చిబాబు డిమాండ్ మేరకు తన కుమారుడి ద్వారా కవిత అనుచరులకు రూ.25 కోట్లు వ్యాపారి చెల్లించారు. ఈ చెల్లింపులకు గానూ వ్యాపారి కుమారుడికి ఇండో స్పిరిట్స్‌లో 32.5 శాతం వాటా దక్కింది. విజయ్‌నాయర్‌కు రూ.90 కోట్ల నుంచి రూ.100 కోట్లు చెల్లించినట్లుగా మరో నిందితుడు అభిషేక్ బోయినపల్లి తనకు చెప్పాడని అప్రూవర్ దినేష్ అరోరా తన వాంగ్మూలంలో వెల్లడించాడు. అభిషేక్ బోయినపల్లి ఆదేశాల మేరకు హవాలా మార్గంలో గోవాకు భారీగా నగదు బదిలీ చేసినట్లు అప్పటి కవిత పీఏ అశోక్ కౌశిక్ చెప్పాడు. కౌశిక్ ద్వారా రూ.25 కోట్లు బదిలీ అయినట్లు రికార్డులు నిర్ధారించాయి. ఇండో స్పిరిట్స్‌లో తన ప్రాక్సీ అరుణ్ పిళ్లై ద్వారా కవిత భాగస్వామ్యం కలిగి ఉన్నట్టు బుచ్చిబాబు ఫోను ద్వారా వెల్లడైంది..' అని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు.

భూ కొనుగోలు డీల్ ముసుగులో రూ.14 కోట్లు!

భూ కొనుగోలు డీల్ ముసుగులో శరత్‌చంద్రారెడ్డికి చెందిన సంస్థల ఖాతాల నుంచి కల్వకుంట్ల కవితకు రూ.14 కోట్లు చేరాయి. నగదు బదిలీ ఒప్పందం అయితే జరిగింది కానీ అసలు భూమి బదిలీ కాలేదు. డిమాండ్ చేసిన మొత్తాన్ని చెల్లించడానికి శరత్‌చంద్రారెడ్డి ఆసక్తి చూపకపోవడంతో ఢిల్లీ, తెలంగాణలో వ్యాపారాలు దెబ్బతీస్తానని కవిత బెదిరించినట్లు వెల్లడైంది. పలువురు స్టేట్‌మెంట్ల ఆధారంగా కేసులో ప్రధాన కుట్రదారుల్లో కవిత ఒకరిగా తేలింది. దీంతో ఆమెను నిందితురాలిగా పరిగణనలోకి తీసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. తదనంతర పరిణామాల్లో కవితను మార్చి 15న ఈడీ అరెస్టు చేసింది. తర్వాత కోర్టు అనుమతితో కవితను ఈ నెల 6న తీహార్ జైలులో విచారించాం. కుంభకోణంలో తన పాత్ర గురించి అడిగిన ప్రశ్నలకు ఆమె సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేదు. ఐదు రోజులు కస్టడీకి ఇస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి..' అని పంకజ్ చెప్పారు.

న్యాయ ప్రక్రియను ఉల్లంఘించారు: కవిత న్యాయవాది

కవిత అరెస్టు విషయంలో న్యాయ ప్రక్రియను ఉల్లంఘించారని కవిత తరఫు సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి తెలిపారు. ఇప్పటికే కస్టడీలో ఉన్న కవితను అరెస్టు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సాక్షుల వాంగ్మూలాలు, ఇతరత్రా రూపంలో ఇప్పటికే తమ వద్ద ఉన్న అంశాలతో అన్యాయంగా అరెస్టు చేశారని ఆరోపించారు. దర్యాప్తు సంస్థ చూపిన కస్టడీ కారణాలు చట్ట విరుద్ధంగా ఉన్నాయన్నారు. కవిత విషయంలో ప్రాథమిక హక్కులు ఉల్లంఘించిన నేపథ్యంలో సీబీఐ పిటిషన్ కొట్టివేయాలని కోరారు.

కవిత పిటిషన్ కొట్టివేత

ఇరు పక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి కావేరి బవేజా.. తొలుత సీబీఐ పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేశారు. మధ్యాహ్నం కవిత దాఖలు చేసిన సవాల్ పిటిషన్‌ను విచారించారు. కవిత పిటిషన్‌ను కొట్టివేస్తూ 22 పేజీలతో కూడిన ఆదేశాలు జారీ చేశారు. 'వాస్తవాలు, కేసు పరిస్థితులు, వాదనలు పరిశీలించాక కవితను ఈ నెల 15 వరకూ సీబీఐ కస్టడీకి అనుమతిస్తున్నా. సీబీఐ అరెస్టును రద్దు చేయాలని కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నా. అయితే సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సీసీ టీవీ పర్యవేక్షణలో కవితను విచారించాలి. ప్రతిరోజూ సాయంత్రం 6– 7 గంటల మధ్య అరగంట సేపు తన న్యాయవాది మోహిత్‌రావుతో మాట్లాడే అవకాశం కవితకు ఇవ్వాలి. భర్త అనిల్‌కుమార్, సోదరుడు కల్వకుంట్ల తారక రామారావు, పీఏ శరత్‌చంద్రలు ఆ సమయంలోనే 15 నిమిషాలు మాట్లాడొచ్చు. నిందితురాలికి ఇంటి భోజనం, జపమాల, దుస్తులు, మెట్రస్, బెడ్ షీట్లు, తువ్వాళ్లు, దిండులను సీబీఐ అధికారులు అనుమతించాలి. ఆమె కోరిన పుస్తకాలు అనుమతించాలి..' అని న్యాయమూర్తి తన ఆదేశాల్లో స్పష్టం చేశారు.

ప్రతి నియోజకవర్గంలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- యువతకు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్ అందజేత
- 30లక్షలమంది యువతకు ఉపాధి అవకాశాలు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ నోడల్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు నెలకొల్పనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి శివారులోని జలాల్‌పూర్ గ్రామంలో ఉన్న రామానంద తీర్థ గ్రామీణ సంస్థను చిన్నారెడ్డి సందర్శించారు. శిక్షణా కార్యక్రమాలు, ప్రయోగశాలలు, తరగతి గదులు, విద్యార్థుల హాస్టల్ గదులను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి ఆ సంస్థ డైరెక్టర్ లక్ష్మీ సహా సిబ్బందితో సమావేశమయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీగా రామానంద తీర్థ సంస్థను అప్ గ్రేడ్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం యువతీ యువకులకు గొప్ప వరమని పేర్కొన్నారు. త్వరలో ప్రభుత్వ పరంగా 30 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్ కూడా యువతకు ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు.

'ఉద్యోగుల వయో పరిమితి వార్తల్లో వాస్తవం లేదు'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వయో పరిమితిని 61 ఏళ్లుగా లేదా 33 సంవత్సరాల సర్వీసు అంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని రాష్ట్ర ప్రభుత్వ అధికార వర్గాలు తెలిపాయి. ఈ అంశంపై ప్రభుత్వ స్థాయిలో ఏవిధమైన ప్రతిపాదన కానీ, ఫైల్ నిర్వహణ గానీ లేదని స్పష్టం చేశాయి. ఈ విధమైన ఊహాజనిత వార్తలు రాయడం, దీన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయడం సరైంది కాదని పేర్కొన్నాయి. ఇలాంటి అవాస్తవ వార్తలు ప్రచురించే, ప్రచారం చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకునే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని శుక్రవారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

అద్వానీకి భారతరత్నపై గవర్నర్ దత్తాత్రేయ హర్షం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఉప ప్రధానమంత్రి ఎల్‌కే అద్వానీ భారతరత్న అందుకోవడంపై హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు శుక్రవారం ఢిల్లీలోని ఎల్‌కే అద్వానీ నివాసానికి వెళ్లిన దత్తాత్రేయ.. ఆయన్ను సత్కరించారు. ఉప ప్రధానిగా అద్వానీ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా ప్రస్తావించారు.

నేడు, రేపు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

- 15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం
- ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలు
- సోమవారం నుంచి పెరగనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు



సాక్షి, హైదరాబాద్: వేసవి తాపం నుంచి కాస్త చల్లబడ్డ రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. సౌరాష్ట్ర ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం.. మధ్య మహారాష్ట్ర, ఉత్తర లోతట్టు కర్ణాటక మీదుగా దక్షిణ కర్ణాటకకు విస్తరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించింది. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సూర్యాపేట్, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. సోమవారం నుంచి రాష్ట్రంలో పొడివాతావరణం ఉంటుందని వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం, కొన్నిప్రాంతాల్లో అంతకంటే తక్కువగా నమోదవుతున్నాయి. కాగా, సోమవారం నుంచి గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. నల్లగొండలో గరిష్ట ఉష్ణోగ్రత 40.0 డిగ్రీల సెల్సియస్, అలాగే ఆదిలాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 21.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీల మేర తక్కువగా నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నల్లగొండ	40.0	24.2
మెదక్	39.2	22.8
ఖమ్మం	39.0	25.6
భద్రాచలం	38.0	26.0
మహబూబ్‌నగర్	37.8	25.6
నిజామాబాద్	37.3	25.0
రామగుండం	36.8	24.7
ఆదిలాబాద్	36.3	21.7
హనుమకొండ	36.0	24.5
హైదరాబాద్	34.6	24.9
దుండిగల్	34.0	25.1
హకీంపేట్	34.0	23.7

శారదా పీఠంలో గర్భన్యాసం



గర్భన్యాసం చేస్తున్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

- పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, ఎన్‌సీఎల్‌టీ న్యాయమూర్తి బద్రీనాథ్
- విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి వెల్లడి

మణికొండ (హైదరాబాద్): హైదరాబాద్ నగర శివారు కోకాపేటలో నిర్మాణంలో ఉన్న విశాఖ శారదా పీఠం వారి శారదా స్వరూప రాజశ్యామలా అమ్మవారి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా గర్భన్యాసం (పేఠా స్థాపన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గర్భన్యాసం కార్యక్రమం ఆగమ శాస్త్రం, శిల్ప శాస్త్రంలోనూ విశిష్టత కలిగి ఉందన్నారు. పూర్వీకులు నిర్మించిన దేవాలయాలు శక్తిమంతంగా దేదీప్యమానంగా వెలుగొందడానికి కారణం దైవశక్తితో పాటు ఈ గర్భన్యాసం ప్రక్రియ మూల కారణమన్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు పూర్తి అయి రాష్ట్రానికే ఓ దివ్యక్షేత్రంగా వెలుగొందుతుందని తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్మించిన జగద్గురు సన్నిధిని ప్రారంభించారు. వాస్తు హోమాలు, పూర్ణాహుతి, గోపూజ అనంతరం నూతన ఆశ్రమ ప్రవేశం చేశారు. నూతన ఆశ్రమంలో శారదా స్వరూప చంద్రమౌళీశ్వరస్వామి ఆరాధన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, ఎన్‌సీఎల్‌టీ న్యాయమూర్తి బద్రీనాథ్‌లతో పాటు భక్తులు పాల్గొన్నారు.

త్వరలోనే 'సూపర్ పవర్' నేషన్‌గా భారత్



- ఇందుకు దేశ యువత కీలక పాత్ర పోషించాలి
- 2027కి అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా దేశం
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.వి.వేణుగోపాల్

హఫీజ్‌పేట్: ప్రపంచంలో 'సూపర్ పవర్' నేషన్‌గా త్వరలోనే భారతదేశం రూపుదిద్దుకోవడం ఖాయమని రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ అభిప్రాయ పడ్డారు. చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నానక్‌రాంగూడలోని ఓ హోటల్‌లో 'సీబీఐటీఎంయూఎన్-2024, మోడల్ యునైటెడ్ నేషన్స్' పేరిట నిర్వహించిన కార్యక్రమాలను శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ వేణుగోపాల్ మాట్లాడుతూ భారత్ సూపర్‌పవర్ నేషన్‌గా మారడంలో యువత కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతన ఆలోచనలు, ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించి దేశం మరింత ముందుకు సాగేలా తమవంతు కృషి చేయాలన్నారు. సూపర్ పవర్‌గా మారడమే కాకుండా ఐక్యరాజ్యసమితిలో భారత దేశానికి శాశ్వత సభ్యత్వం కల్పించాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశ ఆర్థిక పరిస్థితి మెరుగ్గానే ఉందని, 2027 నాటికి ప్రపంచంలోనే భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర మాజీ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల మాట్లాడుతూ చదువుతోపాటు నాయకత్వ లక్షణాలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. సీబీఐటీ ప్రిన్సిపల్ నర్సింహులు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు అంతర్జాతీయ అంశాలపై కూడా అవగాహన ఉండాలనే ఉద్దేశంతోనే 'సీబీఐటీఎంయూఎన్‌ను, మోడల్ యునైటెడ్ నేషన్స్‌ను నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సీబీఐటీ లైబ్రేరియన్ శ్రీకాంత్‌రెడ్డి, సీబీఐటీఎంయూఎన్ కోఆర్డినేటర్ డాక్టర్ షగుఫ్తాపర్వీన్, సెక్రెటరీ జనరల్ విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

పెంపుడు శునకానికి ఘనంగా అంత్యక్రియలు

చిన్న, పెద్ద కర్మలు కూడా నిర్వహించనున్న ఓ జంతు ప్రేమికుడు



ఊరేగింపు నిర్వహిస్తున్న మల్లారెడ్డి బంధువులు

కోదాడ (సూర్యాపేట జిల్లా): మనిషి చనిపోతే అంత్యక్రియలు ఎలా నిర్వహిస్తారో చనిపోయిన పెంపుడు శునకానికి కూడా అదేవిధంగా కర్మకాండలు నిర్వహించారు ఓ జంతు ప్రేమికుడు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని నయానగర్‌కు చెందిన భూసాని మల్లారెడ్డి, ఈశ్వరమ్మ దంపతులకు పిల్లలు లేకపోవడంతో పదిహేనేళ్ల క్రితం ఓ శునకాన్ని తెచ్చుకున్నారు. శుక్రవారం ఆ శునకం చనిపోవడంతో ఆయన బ్యాండ్ మేళాన్ని ఏర్పాటు చేసి మరీ అంత్యక్రియలు పూర్తి చేశారు ఆ దంపతులు. ఇక ఆ శునకానికి చిన్న, పెద్ద కర్మ కాండలు కూడా నిర్వహిస్తామని మల్లారెడ్డి దంపతులు చెబుతున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.